# కీర్తనల గ్రంథ పరిచయము

## (మొదటి భాగము)

ప్రథమ, ద్వితీయ స్కంధములు

1-72 కీర్తనలు

రచయిత

**టి.పి. వరప్రసాద రెడ్డి**

ప్రచురణ

**టి. పి. వరప్రసాద రెడ్డి**

**షాలోమ్ చర్చి,**

**జె.యన్.టి.యు. పోస్టాఫీస్**

**అనంతపురము - 515 002**

✆ : 9440285883, 9440669494

**Keerthanala Grandha Parichayam (Part - 1)**

**1-72 Psalms**

***Bro. T.P. Vara Prasada Reddy***

© All Rights Reserved with publishers
Any part of this book not to be copied

1st Edition - 09-09-2016

Price : Rs. 60 /-

copies available at:

1. **Logos Book Centre,** 10/1, Arandulpet, Guntur - 522 002
Phone: (0863) 2336927; Cell: 9866296843
2. **T.P. Varaprasada Reddy**, Shalom Church, J.N.T.U. Post
Ananthapur - 515 002, Cell: 9440285883

3, **Morea Pradhana Mandiram**
1088, 3rd Phase, J.P.H.B. Colony,
Hyderabad - 72, Cell: 7396202017

4. **T. Rathna Reddy,** Manager, Mutthoot Finance,
Giddaluru, Prakasam Dt. Cell: 94900000729
5. **Jeevan Jyothi Press & Publishers**
N.H.S. Road, Narsapur - 534 275, Tel: 08814-274607

Printed & Published by
***T.P. Varaprasada Reddy***
Shalam Church
J.N.T.U.C. Post Office
ANANTAPUR - 515 002
Andhra Pradesh, India,
✆ : 9440285883, 9440669494

# కీర్తనల గ్రంథము

వ్రాయబడిన కాలము : క్రీ.పూ. 1440 – 540 – సుమారు 900 సంవత్సరములు

కీర్తనల గ్రంథము ప్రార్థన, స్తుతులతో కూడిన పాటలు గల గ్రంథము. అద్దములో సహజ ముఖమును చూసుకొని దిద్దుకొనునట్లు, వాక్యమగు అద్దములో మన జీవితములను దిద్దుకొనాలి. కీర్తనల గ్రంథమును చదువునప్పుడు అద్దములో మన ముఖముపై ఉన్న మరకలను తీసివేసుకొని అలంకరించుకొనునట్లు, కీర్తనల గ్రంథములో మన జీవితములో తీసివేసికొనవలసినవి, అలంకరించుకొనవలసినవి ఉన్నవని, వాటిని దేవుడు చూపునని గుర్తింపుతో ధ్యానించాలి. అద్దము చూచి ముక్కు, నోరు, ముఖముపై ఉన్నవాటిని దిద్దుకున్నట్లు వాక్యమను అద్దము మన ప్రాణాత్మ, దేహములలో ఉన్న మరకలను అనగా పాపములను చూపగా వాటిని దిద్దుకొని, వాక్యములో ఉన్న ఆలంకరణ చేత ప్రాణాత్మ, దేహాలను అలంకరించుకోవాలి. శ్రమలలో, దుఃఖములలో సంతోషించుట ఎట్లో నేర్చుకొని దేవునికి మన శరీరములను పరిశుద్ధముగా ఉండునట్లు సమర్పించుకోవాలి. కీర్తనల గ్రంథ ధ్యానము మన జీవితమును క్రమపరచునని గుర్తింతము. ధర్మశాస్త్రము దివారాత్రము ధ్యానించుటలో ఆనందము, ధన్యత ఉన్నది. ధ్యానించి మనము ధన్యులమగుదుము. స్తుతి, స్తోత్రము, సన్నుతి, కీర్తించుట అను పదములు సుమారు 250 పర్యాయములు కనిపించును. అందువలన దీనిని స్తుతుల గ్రంథము అన్నారు. ఆశ్రయించుట, శరణుజొచ్చుట అను హెబ్రీ పదమగు khaw - saw 70 పర్యాయాలు కీర్తనల గ్రంథములో కలదు. కనుక కీర్తన గ్రంథములో శరణుజొచ్చి మొరపెట్టుట కూడా ముఖ్య అంశము. మొరకు దేవుడు జవాబివ్వగా మనము స్తుతించుదుము.

కీర్తనల గ్రంథమును నాలుగు విధములుగా విభజించవచ్చును.

**A. కీర్తనలు వ్రాసినవారు:** 1) దావీదు 73 + 3 కీర్తనలు, 2) కోరహు కుమారులు 12 కీర్తనలు, 3) ఆసాపు (50,73–83) 12 కీర్తనలు, 4) సొలొమోను (72,127) 2 కీర్తనలు, 5) మోషే (90) 1 కీర్తన, 6) ఏతాను (89) 1 కీర్తన, 7) అనాథ కీర్తనలు – 46 (దావీదు?) మొత్తము 150.

**B. కీర్తనలు అంశములు:** 1) స్తుతి కీర్తనలు – 60, 2) ప్రార్థనా కీర్తనలు – 40, 3) యాత్రా కీర్తనలు – 15, 4) మెస్సీయ కీర్తనలు – 15 + (7), 5) రారాజు రాజ్యపాలన – 8 (7), 6) దుష్టులు – నీతిమంతులు –8, 7) పరిశుద్ధ గ్రంథము– 4. మొత్తము 150.

**C. కీర్తనల గ్రంథములోని ఐదు స్కంథములు** (41+31+17+17+44 – 150).

ఈ ఐదు స్కంథములను ధర్మశాస్త్ర గ్రంథమందలి ఐదు పుస్తకములతో పోల్చవచ్చును.

**ప్రథమ స్కంథము:** 41 కీర్తనలు (1+13+13+13+1= 41కీర్తనలు) ఆదికాండము

**అంశము:** పాపియైన మానవునిపై దేవుడు అనుగ్రహించిన ఆశీర్వాదములు (1). కాని మానవుడు దేవునిపై తిరుగుబాటు చేసి పడిపోయి – శత్రువు అయ్యాడు (2–14) క్రీస్తు ద్వారా నిత్యరక్షణ, ఆశీర్వాదము ఏర్పరచబడినది (15–27, 28–40). ముగింపులో శాశ్వత స్తుతి (41).

**ద్వితీయ స్కంథము:** 42–72 కీర్తనలు (2+7+5+17=31 కీర్తనలు) నిర్గమకాండము

**అంశము:** శ్రమనుబట్టి ఇశ్రాయేలీయులు దేవునికి మొర్రపెట్టగా (42–43) దేవుడు రక్షించాడు (43–50). ఆత్మీయ జీవితములో వెనుకబడుట, శత్రువుతో పోరాటము, తరచూ ఓటమిని (51–57) రుచించారు. దేవుడు విమోచన కార్యము సమాప్తిచేసి పాలన చేయును (58–72).

**తృతీయ స్కంథము:** 73–89 కీర్తనలు (11+6=17 కీర్తనలు ) లేవీయకాండము

**అంశము:** విమోచింపబడినవారు దేవునితో, మానవులతో ఉండవలసిన పవిత్ర సంబంధము (73–83) దేవుని యెడల కలిగి ఉండవలసిన విధులను (84–89) గూర్చినవి.

**చతుర్థ స్కంథము:** 90–106 కీర్తనలు (5+6+6=17 కీర్తనలు) సంఖ్యాకాండము

**అంశము:** భూమి మీద అవసరతలు (90–94), ఆశించినవి (95–100), అనుభవించు విశ్రాంతి (101–106).

**పంచమ స్కంథము:** 107–150 కీర్తనలు (13+5+3+6+6=44) ద్వితీయోపదేశ కాండము

**అంశము:** స్తుతులు–వాక్యము యొక్క ప్రాముఖ్యత (107–119), యెరూషలేము యాత్ర (120–134), చివరలో స్తుతులు (135–137), ప్రార్థన (138–143), స్తుతితో (144–150) ముగింపు.

| స్కంథాలు | ప్రథమ | ద్వితీయ | తృతీయ | చతుర్థ | పంచమ |
|---|---|---|---|---|---|
| అధ్యా. | 1-41 | 42-72 | 73-89 | 90-106 | 107-150 |
| కీర్తనలు | 41 | 31 | 17 | 17 | 44 |
| యేసు ప్రభువు YAHWEH | 272 | 30 | 44 | 111 | 228 |
| దేవుడు ELOHIM | 15 | 164 | 43 | 0 | 0 |
| వ్రాసిన ముఖ్యులు | దావీదు 39+2+41 | దావీదు (18+3+21) కోరహు (8) సొలొమోను(1) ఆసాపు (1) | ఆసాపు (11) కోరహు (4) దావీదు (1) ఏతాను (1) | దావీదు (2+14?) మోషే (8) అనాథ కీర్తనలు (14?) | దావీదు (15+28+43) సొలొమోను(1) అనాథ కీర్తనలు (28?) |
| సమకూర్పు | దావీదు | దావీదు | హిజ్కియా | ఎజ్రా? నెహెమ్యా? | ఎజ్రా నెహెమ్యా? |
| అంశము | మానవుడు ఆది | ఇశ్రాయేలీయులు నిర్గమ | మందిరము లేవీయ | మోషే సంఖ్యా | శాసనము, దేశము, ద్వితీ |
| స్తుతి | శాశ్వతము | నిత్యము | నిత్యము | యుగములన్నిట | సకల ప్రాణులు |

కీర్తనల గ్రంథములోని ప్రతి స్కంథము యొక్క ముగింపులో ఆమేన్ అని ఉన్నది.

**ప్రథమ స్కంథము 1-41** కీర్తనలు 41:13వ. ఇశ్రాయేలు దేవుడైన యెహోవా శాశ్వతకాలము నుండి శాశ్వతకాలము వరకు స్తుతింపబడును గాక, ఆమేన్, ఆమేన్. **ద్వితీయ స్కంథము 42-72** కీర్తనలు - 72:19వ. ఆయన మహిమగల నామము నిత్యము స్తుతింపబడును గాక. సర్వభూమియు ఆయన మహిమతో నిండియుండును గాక, ఆమేన్, ఆమేన్. 20వ. యెష్షయి కుమారుడగు దావీదు ప్రార్థనలు ముగిసెను. (కనుక మొదటి రెండు స్కంథములు దావీదుగారి కాలమున సమకూర్చబడినవి). **తృతీయ స్కంథము 73-89** కీర్తనలు. 89:52వ. యెహోవా నిత్యము స్తుతినొందును గాక ఆమేన్, ఆమేన్.

2దిన 29:30. దావీదును ఆసాపును రచించిన (కుమారులైనా, వంశీకులైనా కావచ్చును) శ్లోకములను ఎత్తి యెహోవాను స్తుతించుడని రాజైన హిజ్కియా ఆజ్ఞాపింపగా . . . అన్నందున హిజ్కియా రాజు ఆజ్ఞ ప్రకారము సమకూర్చబడినవి).

**చతుర్థ స్కంధము 90-106** కీర్తనలు 106:48వ. ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా యుగములన్నిటను స్తుతినొందును గాక. ప్రజలందరు ఆమేన్ అందురుగాక (చతుర్థ స్కంధము ఎజ్రా కాలములో మందిరము అలంకరింపబడిన సందర్భమున సమకూర్చబడినదని తలంతురు).

**పంచమ స్కంధము - 107-150.** కీర్తనలు 150:6వ. సకల ప్రాణులు యెహోవాను స్తుతించుదురు గాక. యెహోవాను స్తుతించుడి. (పంచమ స్కంధము నెహెమ్యా కాలములో పట్టణ ప్రాకారము ప్రతిష్ఠించబడినపుడు సమకూర్చబడినవని తలంతురు).

గీతము లేక గానము snir అనగా సంతోషంతో పాడదగినవి అని అర్థము. 17 కీర్తనలు ఉన్నాయి. 7, 30, 40-49, 65-68, 75, 76, 80, 87, 92, 96, 100

**అనుపద గీతము:** Mictam అనగా అపాయము నుండి ఆశ్చర్యకరముగా తప్పించబడినవాడు చేసిన గానము. 16, 56-59 = 8 కీర్తనలు ఉన్నాయి.

శీర్షికలో ఏమియు లేనివి (36) : 1, 2, 10, 33, 71, 91, 93 - 97, 99, 102, 104-107, 111-119, 135-137, 146-150 వరకు.

**జతలుగా ఉన్న కీర్తనలు** - ఉదా : 1) 14-53 అధ్యా., 2) 60వ కీర్తన + 57వ కీర్తన. ఈ రెండూ 107 కీర్తనలో ఉంటాయి. 3) 40వ కీర్తనలోని 13-17 వచనములు 70వ కీర్తనగా ఉన్నాయి.

**హెబ్రీ భాష అక్షరాల వరుస కలవి :**

19, 10, 12, 25, 111, 112, 119, 145 కీర్తనలు.

**ఉదయకాలపు స్తుతి / ప్రార్థన / ధ్యానము :**

1) 5 (3వ.) 2) 22 (2వ), 3) 55 (17వ), 4) 59 (16వ), 5) 88 (13వ), 6) 90 (14వ), 7) 92 (3వ), 8) 103 (2వ), 9) 110 (5వ), 10) 119 (147, 148వ), 11) 150 (6వ), 12) 143 (8వ).

**రాత్రికాల స్తుతి / ప్రార్థన / ధ్యానము:**

1) 4 (4వ), 2) 6 (6వ), 3) 16 (7వ), 4) 17 (3వ), 5) 22 (2వ), 6) 42 (3వ), 7) 63 (4వ), 8) 77 (6వ), 9) 88 (1వ), 10) 92 (2వ), 11) 119 (55వ, 148వ), 12)131 (1వ).

**ధ్యానపు కీర్తనలు :** 6, 13, 32, 38, 51, 131, 143

**వివిధ కాలములకు చెందినవి :**

1) ఇబ్బంది కాలములు (40) : 3. 4. 5. 6, 7, 11-14, 17, 22, 25-28, 31, 34, 35, 39, 40, 63-69, 61-64, 69-70, 109, 140, 143.

## కీర్తనల గ్రంథమునందలి ముప్పది ధన్యతలు

1. 1:2 – యెహోవా ధర్మశాస్త్రమునందు ఆనందించుచు దివారాత్రము దానిని ధ్యానించువాడు ధన్యుడు.
2. 2:12 – ఆయన కోపము త్వరగా రగులుకొనును. కుమారుని ముద్దుపెట్టుకొనుడి, లేనియెడల ఆయన కోపించును. ఆయనను ఆశ్రయించువారందరును ధన్యులు.
3. 32:1 – తన అతిక్రములకు పరిహారము నొందినవాడు తన పాపమునకు ప్రాయశ్చిత్తము నొందినవాడు ధన్యుడు.
4. 32:2 – యెహోవా చేత నిర్దోషి అని యెంచబడినవాడు ఆత్మలో కపటము లేనివాడు ధన్యుడు.
5. 33:12 – యెహోవా తమకు దేవుడుగా గల జనులు ధన్యులు.
6. ఆయన తనకు స్వాస్థ్యముగా ఏర్పరచుకొను జనులు ధన్యులు.
7. 34:8 – యెహోవా ఉత్తముడని రుచి చూచి తెలిసికొనుడు, ఆయనను ఆశ్రయించు నరుడు ధన్యుడు.
8. 40:4 – గర్విష్ఠులను లక్ష్యపెట్టక యెహోవాను నమ్ముకొనువాడు ధన్యుడు.
9. 41:1 – బీదలను కటాక్షించువాడు ధన్యుడు; ఆపత్కాలమందు యెహోవా వానిని తప్పించును.
10. 41:2 – యెహోవా వానిని కాపాడి బ్రదికించును, భూమి మీద వాడు ధన్యుడగును.
11. 65:4 – నీ ఆవరణములలో నివసించునట్లు నీవు ఏర్పరచుకొని చేర్చుకొనువాడు ధన్యుడు.
12. 72:17 – అతని నామము సూర్యుడున్నంతకాలము చిగుర్చుచుండును. అతనినిబట్టి మనుష్యులు దీవింపబడుదురు, అన్యజనులందురను అతడు ధన్యుడని చెప్పుకొందురు.
13. 73:28 – నాకైతే దేవుని పొందు ధన్యకరము.
14. 84:4 – నీ మందిరమునందు నివసించువాడు ధన్యులు, వారు నిత్యము నిన్ను స్తుతించుదురు.
15. 84:5 – నీ వలన బలమునొందు మనుష్యులు ధన్యులు.
16. 84:12 – సైన్యములకధిపతియగు యెహోవా, నీయందు నమ్మికయుంచువారు ధన్యులు.
17. 89:15 – శృంగధ్వనులనెరుగు ప్రజలు ధన్యులు.
18. 94:12 – యెహోవా, నీవు శిక్షించువాడు నీ ధర్మశాస్త్రమునుబట్టి నీకు బోధించు వాడు ధన్యుడు.

19. 106:3 – న్యాయమునను సరించువారు ఎల్లవేళల నీతిననుసరించి నడుచుకొనువారు ధన్యులు.
20. 112:1 – యెహోవాయందు భయభక్తులు గలవాడు ఆయన ఆజ్ఞలనుబట్టి అధికముగా ఆనందించువాడు ధన్యుడు.
21. 119:1 – యెహోవా ధర్మశాస్త్రము ననుసరించి నిర్దోషముగా నడుచుకొనువారు ధన్యులు.
22. 119:2 – ఆయన శాసనములను గైకొనుచు పూర్ణహృదయముతో ఆయనను వెదుకువారు ధన్యులు.
23. 127:5 – వారితో తన అంబులపొది నింపుకొనినవాడు ధన్యుడు.
24. 128:1 – యెహోవాయందు భయభక్తులు కలిగి ఆయన త్రోవలయందు నడుచువారందరు ధన్యులు.
25. 128:2 – నిశ్చయముగా నీవు నీ చేతుల కష్టార్జితమును అనుభవించెదవు నీవు ధన్యుడవు.
26. 137:8 – బబులోను కుమారీ, నీకు ప్రతీకారము చేయువాడు ధన్యుడు.
27. 137:9 – నీ పసిపిల్లలను పట్టుకొని వారిని బండకు వేసి కొట్టువాడు ధన్యుడు.
28. 144:15 – ఇట్టి స్థితిగలవారు ధన్యులు.
29. యెహోవా తమకు దేవుడుగా గల జనులు ధన్యులు.
30. 146:5 – ఎవనికి యాకోబు దేవుడు సహాయుడగునో ఎవడు తన దేవుడైన యెహోవా మీద ఆశపెట్టుకొనునో వాడు ధన్యుడు.

**గమనిక:** యూదుల నెలలకు 29, లేక 30 దినములు. కనుక ప్రతి దినమునకు ఒక ధన్యత ఈ గ్రంథము చదువుట ద్వారా కలుగును అని గుర్తించుదము.

## దేవుని సమాజములో కీర్తనలు పాడుట – యెహోవాను స్తుతించుడి

## కీర్తనల గ్రంథ ముఖ్య ఉద్దేశము

*"యథార్థవంతుల సభలోను సమాజములోను పూర్ణహృదయముతో నేను యెహోవాకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించెదను"* – కీర్తన 111:1

*"యెహోవాను స్తుతించుడి. యెహోవాకు క్రొత్త కీర్తన పాడుడి. భక్తులు కూడుకొని సమాజములో ఆయనకు స్తోత్రగీతము పాడుడి"* – కీర్తన 149:1

*"యెహోవాకు నామమునకు చెందవలసిన ప్రభావమును ఆయనకు ఆరోపించుడి, ప్రతిష్ఠితములగు ఆభరణములను ధరించుకొని ఆయన యెదుట సాగిలపడుడి"* – కీర్తన 29:2

కీర్తనల గ్రంథమును హెబ్రీ భాషలో సెపర్ టెహిలిం అనిరి. స్తుతుల గ్రంథము అని దీని భావము. గ్రీకు బైబిలులో సామోస్ అనిరి. వాయిద్యముల మీద పాడదగినది అని దీని భావము (A SONG ON AN INSTRUMENT) ఇంగ్లీషు బైబిలులో PSALMS అనిరి. గ్రీకు బైబిలులోని సామోస్ అను పదము క్రొత్త నిబంధములో 7 పర్యాయములు కలదు. 1) లూకా 20:42; 2) లూకా 24:44; 3) అపో.కా. 1:20; 4) అపో.కా. 13:33; 5) 1కొరింథీ 14:26; 6) ఎఫెసీ 5:19; 7) కొలస్సీ 3:16. కనుక క్రొత్త నిబంధనలో కూడా వాయిద్యములతో పాటలు పాడుటను గూర్చిన ప్రస్తావన ఉన్నదని గుర్తించాలి. సెలా అను పదము 71 పర్యాయములు కనిపించును. సెలా అనగా ఆగి ఆలోచించాలి. కనుక సెలా అను పదము కనిపించిన తరువాత ఆగాలి. అనగా ఒక అంశము అక్కడికి ముగించినదని తలంచవచ్చును.

ఇశ్రాయేలు ప్రజలు మందిరములో ఆరాధించుటకు, 1) ప్రజల గతకాల చరిత్ర, 2) ప్రస్తుత స్థితిగతులు, 3) భావికాల నిరీక్షణ, ధ్యానించుకొనుటకు సహాయకరమైనవి.

1దిన 16:37 – మందసము ముందర నిత్యమును కావలసిన అనుదిన సేవ జరుపుటకై దావీదు అచ్చట యెహోవా నిబంధన మందసము మీద ఆసాపును అతని సహోదురులను నియమించెను.

1దిన 16:4,5 – అతడు యెహోవా మందసము ఎదుట సేవ చేయుచు, ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవాను ప్రసిద్ధి చేయుటకును, వందించుటకును ఆయనకు స్తోత్రములు చెల్లించుటకు లేవీయులలో కొందరిని నియమించెను.

వారిలో ఆసాపు అధిపతి. జెకర్యా అతని తరువాతివాడు, యెహీయేలు, షెమీరామోతు, యెహీయేలు, మత్తిత్యా, ఏలీయాబు, బెనాయా, ఓబేదెదోము, యెహీయేలు అనువారు స్వరమండలములను, సితారాలను వాయించుటకై నియమింపబడిరి. ఆసాపు తాళములను వాయించువాడు.

1దిన 25:1 – దావీదును సైన్యాధిపతులును ఆసాపు, హేమాను, యెదూతూను అనువారి కుమారులలో కొందరిని ప్రత్యేకపరచి, సితారాలను స్వరమండలములను తాళములను వాయించుచు ప్రకటించునట్లుగా నియమించిరి. ఆసాపు కుమారులలో రాజాజ్ఞ ప్రకారముగా ప్రకటించుచు, ఆసాపు చేతిక్రిందనుండు ఆసాపు కుమారులైన జక్కూరు యోసేపు నెతన్యా అషర్యేలా అనువారు.

2దిన 29:30 – దావీదును ఆసాపును రచించిన (కుమారులైన, వంశీకులైన కావచ్చును) శ్లోకములను ఎత్తి యెహోవాను స్తుతించుడని రాజైన హిజ్కియా ఆజ్ఞాపించాడు.

# కీర్తనల గ్రంథ పరిచయము

**అయిదు స్కంథములు 1-150 కీర్తనలు**

దావీదు - 76, ఆసాపు - 12, కోరహు కుమారులు - 12, సొలొమోను - 2, మోషే - 1, అనాథ - 46 (కోరహు కుమారులు లేదా ఆసాపు అను కీర్తనలు వారి వంశము వారెవరైనా వ్రాసియుండవచ్చును. కీర్తనల గ్రంథమునందు 30 ధన్యతలు కలవు.

**ప్రథమ, ద్వితీయ స్కంథములు 1-72 కీర్తనలు**

(దావీదు -62, ఆసాపు - 1, కోరహు కుమారులు - 8, సొలొమోను - 1)

ప్రతి కీర్తన ప్రారంభమందు అంశముపైన చూపబడిన సంఖ్యల విభజన

ఆ కీర్తన యందలి వచనముల విభజన అని గుర్తించండి.

**ప్రథమ స్కంథ పరిచయము 1-41 కీర్తనలు**

(1+13+13+13+1=41 కీర్తనలు)

దావీదు - 39+2?=41. సమకూర్చినవారు : దావీదు

**పథమ స్కంథమునందు 10 ధన్యతలు కలవు.**

**అంశము**

1) పాపియైన మానవునికి దేవుడు అనుగ్రహించిన ఆశీర్వాదము (1)
2) మానవుడు దేవునిపై తిరుగుబాటుచేసి పడిపోయి దుష్టుడు – శత్రువు అయ్యాడు (2-14)
3) క్రీస్తు ద్వారా నిత్యరక్షణ (అనుదిన జీవిత రక్షణ), ఆశీర్వాదము ఏర్పరచబడినది (15 కీర్తన పీఠిక) 15-27), (28-40).

ముగింపులో శాశ్వత స్తుతి (41)

**1దిన 16:37 -** అప్పుడు మందసము ముందర నిత్యమును కావలసిన అనుదిన సేవ జరుపుటకై దావీదు అచ్చట యెహోవా నిబంధన మందసము మీద ఆసాపును అతని సహోదరులను నియమించెను.

**కీర్తన 72:19 -** యెష్షయి కుమారుడగు దావీదు ప్రార్థనలు ముగిసెను అన్నందున మొదటి రెండు స్కంథములు సమకూర్చినది దావీదు కావచ్చును. లేదా రెండవ స్కంథము రాజుల కాలములో సమకూర్చబడి ఉండవచ్చును. లేదా ఇందులోని కొన్ని కీర్తనలు కూడా తరువాత చేర్చబడియుండవచ్చును.

## 1వ కీర్తన (3+3 = 6 వ.)

**అంశం : నీతిమంతుల మార్గము (1-3వ.) - దుష్టుల మార్గము (4-6వ.)**

**1-3వ. నీతిమంతుల మార్గము:**

**1వ.** క్రీస్తు యేసు కలువరిలో కార్చిన రక్తము ద్వారా నీతిమంతులుగా తీర్చబడేవారు జీవించవలసిన విధము చెప్పబడినది. మనము కూర్చుండుట, లేదా నడచుట, లేదా నిలుచుటలోనే మన అనుదిన చర్య ఉండును. ముందుగా చేయకూడనివి: 1) దుష్టుల ఆలోచన చొప్పున - నడువక, 2) పాపుల మార్గమున - నిలువక, 3) అపహాసకులు కూర్చుండుచోట కూర్చుండక జాగ్రత్త పడాలి.

**2వ.** యెహోవా ధర్మశాస్త్రమునందు ఆనందించుచు దివారాత్రము దానిని ధ్యానించువాడు ధన్యుడు.

**ద్వితీ 6:6-9వ.** లో నేడు నేను నీకాజ్ఞాపించు ఈ మాటలు నీ హృదయములో ఉండవలెను, నీ యింట 1) కూర్చుండునప్పుడు, త్రోవను, 2) నడుచునప్పుడు, 3) పండుకొనునప్పుడు, లేచునప్పుడు దేవుని వాక్యమును గూర్చి మాటలాడవలెను; సూచనగా వాటిని నీ చేతికి కట్టుకొనవలెను. అవి నీ కన్నుల నడుమ బాసికమువలె ఉండవలెను. నీ యింటి ద్వారబంధముల మీద, నీ గవునుల మీద వాటిని వ్రాయవలెను. కనుక దేవుని వాక్యము హృదయములో, చేతిలో, కన్నుల మధ్య, యింటి ద్వారబంధముల మీద, గవునుల మీద ఉండాలి.

**3వ.** వాక్య సమృద్ధిలో మనము మునిగినపుడు నీటికాలువల యోరను నాటబడినదై ఆకువాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలె నుండి, మనము చేయునదంతయు సఫలమగును. ఆకువాడక అనగా ఆత్మీయుల మధ్య భక్తిలో తగ్గిపోయినవారు అని అర్థము.

**ఎఫెసీ 2:8-10వ. 8వ.** మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు; ఇది మీ వలన కలిగిన కాదు, దేవుని వరమే. **9వ.** అది క్రియల వలన కలిగినది కాదు. గనుక ఎవడును అతిశయపడ వీలులేదు. **10వ.** వాటియందు మనము నడుచుకొనవలెని దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలు చేయుటకై, మనము క్రీస్తుయేసునందు సృష్టింపబడినవారమై ఆయన చేసిన పనియై యున్నాము.

**కొలస్సీ 1:9-10వ.** ఈ సంగతి వినిన నాటనుండి మేమును మీ నిమిత్తము ప్రార్థన చేయుట మానక, మీరు సంపూర్ణ జ్ఞానమును ఆత్మ సంబంధమైన వివేకము గలవారను, ఆయన చిత్తమును పూర్ణముగా గ్రహించినవారునై ప్రతి సత్కార్యములో సఫలులు అగునట్లు ప్రార్థించుచున్నాను.

**మత్తయి 21:18-20వ.** ఉదయమందు పట్టణమునకు మరల వెళ్లుచుండగా ఆయన ఆకలిగొనెను. అప్పుడు త్రోవప్రక్కను ఉన్న యొక అంజూరపు చెట్టును చూచి, దాని యొద్దకు రాగా, 1) దానియందు ఆకలు తప్ప మరేమియు కనబడలేదు గనుక దానిని

చూచి 2) ఇకమీదట ఎన్నటికిని? నీవు కాపుకాయకుండెను. శిష్యులది చూచి ఆశ్చర్యపడి, 3) అంజూరపు చెట్టు ఎంత త్వరగా ఎండిపోయెనని చెప్పుకొనిరి. 4) (ఆకు వాడనివారు) అతడు చేయునందయు సఫలమగును. నీ జీవితములో అన్ని సఫలమా? కొన్ని అయినా సఫలమా? ఒక్కటైనా సఫలమా? ఏమి లేదా? ఎందుకు?

**లూకా 13:6-9వ.** ఇదిగో మూడేండ్లనుండి నేను ఈ అంజూరపు చెట్టున పండ్లు వెదక వచ్చుచున్నాను గాని యేమియు దొరకలేదు; దీనిని నరికివేయుము; దీనివలన ఈ భూమి ఏల వ్యర్థమైపోవలెనని ద్రాక్ష తోటమాలితో చెప్పెను. **8వ.** అయితే వాడు అయ్యా, నేను దాని చుట్టు త్రవ్వి యెరువు వేయుమట్టుకు ఈ సంవత్సరము కూడ ఉండనిమ్ము. అది ఫలించినసరి, లేనియెడల **9వ.** నరికించివేయుమని అతనితో చెప్పెను.

**4-6వ. దుష్టుల అంతము - నీతిమంతుల అంతము :**

**4వ.** దుష్టులు ఆలాగున నుండక గాలి చెదరగొట్టు పొట్టువలె నుందురు. (దుష్టులును దేవుని మరచు జనులందరును పాతాళమునకు దిగిపోవుదురు) దుష్టుల మార్గము నాశనమగు పాతాళమనబడు నరకమునకు నడుపును.

**5-6వ. నీతిమంతుల సభ - న్యాయవిమర్శ:** కాబట్టి న్యాయవిమర్శలో దుష్టులు, నీతిమంతుల సభలో పాపులును నిలువరు. నీతిమంతుల మార్గము యెహోవాకు తెలియును.

**2కొరింథీ 5:10.** ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున, అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మనమందరమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును. ఇది బహుమానములిచ్చు తీర్పే కాని శిక్షించునది కాదు.

## 2వ కీర్తన (3+3+3+3 = 12 వ.)

**అంశం :** ఈ కీర్తనలో 1-3వ. లో ప్రజల అల్లరి పలుకులకు జవాబుగా 4-6వ.లో తండ్రియైన దేవుని పలుకులు. 7-9వ. లో ప్రభువైన యేసు పలుకులు, 10-12వ.లో పరిశుద్ధాత్మ పలుకులు చూపుతున్నాడు.

ఈ కీర్తనలోని రెండవ వచనము అపొ.కా. 4:26 లో దావీదు వ్రాసాడని చెప్పబడినందున ఈ కీర్తన అంతయు దావీదు వ్రాసెనని నిశ్చయించగలము. దావీదు వ్రాసినను రాజుగా తనను అనేక శత్రువుల ఎదిరించినను, యెహోవాచే అభిషేకించబడినందున అందరిని జయించాడు. దావీదు కుమారుడుగా యుగాంతమందు క్రీస్తు చేయు పాలన ఈ కీర్తనలో ఉన్నందున దీనిని మెస్సీయ కీర్తనగా తలంచుదుము. 6వ వచనమందు, నేను నా పరిశుద్ధ పర్వతమైన సీయోను మీద నా రాజును ఆసీనునిగా చేసియున్నాను అన్నందున దావీదు 2సమూ 7:7 లో యెబుసీయుల నుండి దావీదు పురమను యెరూషలేమునందలి భాగమును జయించిన సందర్భమున వ్రాయబడినది.

**1-3వ. ప్రజల అల్లరి పలుకులు:** అన్యజనులు ఏల అల్లరి రేపుచున్నారు? జనములు ఏల వ్యర్థమైన దానిని తలంచుచున్నవి? భూరాజులు యెహోవాకు ఆయన అభిషిక్తునికి

విరోధముగా నిలువబడుచున్నారు. ఏలికలు ఏకీభవించి ఆలోచన చేయుచున్నారు. రాజుగా, యాజకుడుగా, ప్రవక్తగా అభిషేకించబడినవాడు దావీదు, తరువాత యేసు ప్రభువే. కనుక దావీదు రాజుకు, రారాజైన క్రీస్తుకు వ్యతిరేకముగా ప్రజలు, రాజులు లేచుట ఇక్కడ చెప్పబడినది. క్రీస్తు పుట్టినపుడు హేరోదు చంప ప్రయత్నించాడు. సేవా జీవితములో క్రీస్తును యూదులు అనేక పర్యాయాలు చంప తలంచిరి. క్రీస్తు వేయి ఏండ్లు పాలన చేయబోవు రారాజైనందున క్రీస్తునకు వ్యతిరేకముగా ప్రజలు, భూమి మీద నున్న రాజులు అల్లరి రేపుచు చంప ప్రయత్నించుట వ్యర్థమని చెప్పుచున్నాడు.

**4-6వ. ప్రభువు ప్రచంచ కోపము:** ఏడేండ్ల శ్రమల కాల చివరలో ప్రజలు, రాజులు వ్యర్థముగా అల్లరి రేపుచు, క్రీస్తును చంప ప్రయత్నించుదురు. తండ్రియైన దేవుడు అపహాస్యముగా నవ్వుచు, ఉగ్రుడై తన ప్రచండ కోపమును వారిపై కుమ్మరించి వారిని తల్లడిల్లచేసి వారిని సంహరించును. క్రీస్తు చివరిగా సీయోను మీద రాజుగా ఆశీనుడై వేయి ఏండ్లు పాలన చేయును.

**7-9వ. ప్రభువైన యేసు పలుకులు: 7వ.** ప్రభువైన యేసు తండ్రి తనకు చెప్పిన కట్టడను వివరించుచున్నాడు. నీవు నా కుమారుడవు, నేడు నేను నిన్ను కంటిని అనుట అపొ.కా. 13:32-33 లో దేవుడు యేసును మృతులలో నుండి లేపుటగా చెప్పబడినది. **8వ.** నన్ను అడుగుము అనుట పునురుత్థానుడైన క్రీస్తు రోమా 8:34 ప్రకారము తండ్రి కుడిపార్శ్వమున ప్రార్థన చేయుటయే. **కీర్తన 127:3వ** ప్రకారము కుమారులు యెహోవా అనుగ్రహించు స్వాస్థ్యము కనుక భూదిగంతముల వరకు ఉన్న జనములను స్వాస్థ్యముగాను, సొత్తుగాను ఇచ్చుట భూదిగంతములలో ఉన్న అన్యులకు సువార్త ప్రకటన ద్వారా రక్షించి కుమారులుగా స్వీకరించుటయే. **9వ.** ఇనుప దండముతో నీవు వారిని నలిపి, కుండను పగులగొట్టినట్టు వారిని ముక్కచెక్కలుగా పగులగొట్టుట. **ప్రకటన 19:15** ప్రకారము ఏడేండ్ల శ్రమల కాల చివర శత్రువులందరిని ఇనుపదండముతో సంహరించి వేయి ఏండ్ల పాలనలో ఏలుటయే.

**10-12వ. పరిశుద్ధాత్మ పలుకులు: 10వ.** 1) వివేకులైయుండుడి. భూపతులారా, 2) బోధనొందుడి. **11వ.** భయభక్తులు కలిగి, 3) యెహోవాను సేవించుడి. గడగడ వణకుచు, 4) సంతోషించుడి. **12వ.** ఆయన కోపము త్వరగా రగులుకొనును. కుమారుని 5) ముద్దుపెట్టుకొనుడి; ముద్దు కౌగలింపుతో కూడినది. అనగా మానవుడు దేవునిపై ఆనుకొని, పూర్తిగా ఆశ్రయించి ఆధారపడుట.

**అపొ.కా. 16:13.** ప్రభువైన యేసునందు విశ్వాసముంచి, రక్షణ పొందుట. ఆయనను ఆశ్రయించువారందరు ధన్యులు, లేనియెడల ఆయన కోపించును. అప్పుడు మీరు త్రోవతప్పి నశించెదరు, అనగా రక్షించబడినవారు ధన్యులు, లేనివారు దారితప్పినవారై నాశనమునకు అనగా నరకమునకు పోవుదురు అని భావము.

**కీర్తన 2:3-4వ.** భూరాజులు యెహోవాకు విరోధముగా నిలువబడుచున్నారు. ఆకాశమందు ఆసీనుడగువాడు నవ్వుచున్నాడు.

**కీర్తన 37:12-13వ.** భక్తిహీనులు నీతిమంతుల చూచి పండ్లు కొరుకుదురు, వారి కాలము వచ్చుట ప్రభువు చూచి ఆయన నవ్వుచున్నాడు.

**కీర్తన 59:8వ.** యెహోవా, నీవు వారిని చూచి నవ్వుదువు. అన్యజనులందరిని నీవు అపహసించుదువు.

**సామెతలు 1:26వ.** కాబట్టి మీకు అపాయము కలుగునప్పుడు నేను నవ్వెదను.

**దేవుడు తన ప్రజలయందు ఆనందించి నవ్విన సందర్భము బైబిలులో కనబడదు.**

**3 - 4 - 5 - 6 - ప్రార్థనా కీర్తనలు** (అబ్షాలోము దావీదును బాధించిన సందర్భమున ఈ కీర్తనలు వ్రాసి యుండవచ్చును).

3వ కీర్తన - సాయంకాలపు ప్రార్థనా కీర్తన

4వ కీర్తన - రాత్రికాలపు ప్రార్థనా కీర్తన

5వ కీర్తన - ఉదయకాలపు ప్రార్థనా కీర్తన

6వ కీర్తన - రాత్రికాలపు ప్రార్థనా కీర్తన

## 3వ కీర్తన (2+2+2+2 = 8 వ.)

**అంశం :** ఇది బాధింపబడి సాయంకాలమున దావీదు చేసిన ప్రార్థన. కుమారుడైన అబ్షాలోము తన అనుచరులతో దావీదును తరిమినపుడు చేసిన ప్రార్థన. పీఠికలో వ్రాయబడినట్లు అబ్షాలోమను తన కుమారుని యొద్దనుండి పారిపోయినప్పటి వివరములు 2సమూ 15-17 అధ్యాయములలో ఉన్నవి.

**1-2వ. దావీదు శ్రమలు: 1వ.** యెహోవా, నన్ను బాధించువారు ఎంతో విస్తరించియున్నారు. నా మీదికి లేచువారు అనేకులు అనగా ఆ అనేకులలో కుమారుడగు అబ్షాలోము ఒకడు. దావీదుగారి కంటే క్రీస్తు మీదకు లేచినవారు మరి అనేకులు. **కీర్తనలు 34:19.** నీతిమంతునికి కలుగు ఆపదలు అనేకములు; వాటి అన్నిటిలో నుండి యెహోవా వారిని విడిపించును, అన్నట్లు దేవుడు విడిపించును. **2వ.** దేవుని వలన అతనికి రక్షణ యేమియు దొరకదని దావీదునుగూర్చి అనేకులు చెప్పుకొనుచున్నారు, కాని **సామెతలు 10:30వ.** నీతిమంతుడు ఎన్నడును కదలింపబడడు. **సామెతలు 11:8వ.** నీతిమంతుడు బాధనుండి తప్పింపబడును. **సామెతలు 12:13వ.** నీతిమంతుడు ఆపదను తప్పించుకొనును. **సామెతలు 14:32వ.** ప్రకారము నీతిమంతునికి ఆశ్రయము కలుగును. **సామెతలు 18:10వ.** యెహోవా నామము బలమైన దుర్గము. నీతిమంతుడు అందులోనికి పరుగెత్తి సురక్షితముగా నుండును. శ్రమలలో దేవుడు నీతిమంతులకు సహాయము చేయునని గుర్తించుదము.

**3-4వ. దేవుని కార్యములు: 1వ.** యెహోవా, నీవే నాకు కేడెముగాను, నీవే నాకు అతిశయాస్పదముగాను నా తల ఎత్తువాడవుగాను ఉన్నావు. **కీర్తనలు 18:1-2** లో, యెహోవా నా బలము, నా శైలము, నా కోట, నన్ను రక్షించువాడు, నా కేడెము, నా రక్షణశృంగము, నా ఉన్నత స్థలము, నా దేవుడు, ఆ ఆశ్రయదుర్గము మొదలగు అభయమిచ్చు పదములు కొన్ని వందలుగా అనేకములు కలవు. **4వ.** ఎలుగెత్తి యెహోవాకు మొఱ్ఱపెట్టు నప్పుడు ఆయన తన పరిశుద్ధ పర్వతము నుండి ఉత్తరమిచ్చునను విశ్వాసము కలిగి యున్నాడు. అలాగే ప్రార్థించి అబ్షాలోము బారి నుండి తప్పించబడ్డాడు.

**5-6వ. దావీదు నిర్ణయము: 5వ.** యెహోవా నాకు ఆధారము, కావున నేను పండుకొని నిద్రపోయి మేలుకొందును అనుట కుమారునిచేత తరుమబడి చెప్పులు లేకుండా కొండపై పరిగెత్తినవాడు దేవుని మీద కలిగిన విశ్వాసమును బట్టి పండుకొని నిద్రపోవుదును అంటున్నాడు. **6వ.** పదివేలమంది దండెత్తి నా మీదికి వచ్చి మోహరించినను నేను భయపడను అనుట ఆశ్చర్యమే.

**7-8వ. దేవుడు శత్రువులను శిక్షించి తన బిడ్డలను రక్షించుట: 7వ.** యెహోవా, లేమ్ము. నా దేవా నన్ను రక్షింపుమని ప్రార్థించాడు (**2సమూ 18:14-15వ**). శత్రువులనందరిని కొట్టువాడు ఆయనే కనుక అబ్షాలోమును దేవుడే కొట్టించి చంపాడు. **8వ.** ప్రకారము యెహోవా తనను రక్షించి తన ప్రజల మీదికి ఆశీర్వాదము వచ్చునట్లు చేశాడు.

## 4వ కీర్తన (2+2+2+2 = 8 వ.)

**అంశం : ప్రార్థనా కీర్తన, నరుల వ్యర్థత - పడకలమీద ఉండగా అంటున్నందున ఇది రాత్రికాల ప్రార్థన**

**1-2వ. నీతికి ఆధారమగు దేవుడు: 1వ.** నా నీతికి ఆధారమగు దేవా, నేను మొఱ్ఱపెట్టునప్పుడు నాకుత్తరమిమ్ము అనుటలో దావీదు తాను నీతిమంతుడు కాదని ఎరుగును. **కీర్తన 51:5.** నేను పాపములో పుట్టినవాడను పాపములోనే నా తల్లి నన్ను గర్భమున ధరించెను అన్నాడు. **రోమా 3:23-24వ.** ఏ భేదమును లేదు; అందరును పాపముచేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు. కాబట్టి నమ్మువారు ఆయన కృపచేతనే, క్రీస్తుయేసునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు. కనుక దేవుని నీతిమీద ఆధారపడుచున్నాడు. ఇరుకులో నాకు విశాలత కలుగజేసినవాడు, కరుణించి ప్రార్థన నంగీకరించువాడు దేవుడేనని గుర్తించి ప్రార్థించు చున్నాడు. **2వ.** నరులారా, ఎంతకాలము నా గౌరవమును అవమానముగా మార్చెదరు? ఎంతకాలము వ్యర్థమైనదానిని ప్రేమించెదరు? ఎంతకాలము అబద్ధమైనవాటిని వెదకెదరు? దావీదును గౌరవించవలసిన కుమారుడు అబ్షాలోము, దావీదు అక్కయగు సెరూయా కుమారుడు అనగా మేనల్లుడు. యోవాబు, సైన్యాధిపతియైనను అదోనియా పక్షము చేరి రాజును గౌరవహీనునిగా చేశారు. వీరందరూ వ్యర్థమైన దానిని ప్రేమించి అబ్షాలోముకు వ్యర్థమైన ఆలోచన చెప్పుచున్నారు.

**3-4వ. దేవునిచేత ఏర్పరచబడినవారు: 3వ.** యెహోవా తన భక్తులను తనకు ఏర్పరచుకొనుచున్నాడని తెలిసికొనుడి. **కీర్తన 34:6** ప్రకారము దీనుడు మొఱ్ఱపెట్టగా యెహోవా ఆలకించెను. అతని శ్రమలన్నిటిలో నుండి అతని రక్షించెను అను విశ్వాసముతో నేను యెహోవాకు మొఱ్ఱపెట్టగా ఆయన ఆలకించునని చెప్పగలుగుచున్నాడు. **4వ.** భయమునొంది పాపము చేయక, పడకల మీద నుండి హృదయములలో ధ్యానము చేసికొని ఊరకుండవలెనని చెప్పుచున్నాడు.

**5-6వ. దేవుడు చేసిన మేలులకై నీతియుక్తమైన బలులు అర్పించుట: 5వ.** నీతియుక్తమైన బలులు అర్పించుదు అనగా దేవుని స్తుతించుటయే. **6వ.** మాకు మేలు చూపువాడెవడని పలుకుచు అనేకులు సహాయముకై ఇతరులవైపు చూతురు. కనుక యెహోవా దేవా, నీ సన్నిధికాంతి మా మీద ప్రకాశింపజేయుము అని ప్రార్థించుచున్నాడు.

**7-8వ. సంతోషముతో, నెమ్మదితో నిద్ర: 7వ.** అన్యులకు ధాన్య ద్రాక్షారసములు విస్తరించిన నాటి సంతోషముకంటే అధిక సంతోషము దేవుడు తన బిడ్డల హృదయములో పుట్టించాడు కనుక సంతోషముగా ఉండవచ్చును. **హబక్కూకు 3:17-18** లో చెప్పినట్లు అంజూరపు చెట్లు పూయకుండినను ద్రాక్షచెట్లు ఫలింపకపోయినను ఒలీవ చెట్లు కాపు లేకయుండినను చేనిలోని పైరు పంటకు రాకపోయినను గొఱ్ఱెలు దొడ్డిలో లేకపోయినను సాలలో పశువులు లేకపోయినను నేను యెహోవాయందు ఆనందించెదను. నా రక్షణకర్తయైన నా దేవునియందు నేను సంతోషించెదను అని చెప్పుదుము గాక. **8వ.** యెహోవా, నెమ్మదితో పండుకొని నిద్రపోవుదును, నేను ఒంటరిగా నుండినను నీవే నన్ను సురక్షితముగా నివసింపజేయుదువు. **ప్రసంగి 5:12.** కష్టజీవులు కొద్దిగా తినినను ఎక్కువగా తినినను సుఖనిద్ర నొందుదురు. **కీర్తన 139:10వ.** లో, నీ చేయి నన్ను నడిపించును, నీ కుడిచేయి నన్ను పట్టుకొనును అను విశ్వాసముతో సురక్షితముగా, నెమ్మదితో పండుకొని నిద్రపోవుదునని చెప్పుచున్నాడు.

## 5వ కీర్తన (3+3+2+4 = 12 వ.)

**అంశం : ఉదయకాల ప్రార్థన (1-6వ) - యథార్థమైన ఆరాధన (7-12వ.)**

**1-6వ. ప్రార్థన - స్తుతి కొరకైన సిద్ధపాటు**

**1-3వ. ప్రార్థనచేయు విధము:** యెహోవా రాజని, దేవుడని అనగా సర్వాధికారియని గుర్తించి తన సమస్యలన్నీ తీర్చుటకు శక్తిమంతుడను విశ్వాసముతో ప్రార్థించుచున్నాడు. ఉదయమున మన కంఠస్వరము వినబడునట్లు ఉదయమున ప్రార్థన, ఆర్తధ్వని, ధ్యానము దేవుని సన్నిధిని సిద్ధము చేసి దేవుడు వినువరకు కాచియుండాలని దావీదు ఆలాగు చేయుట నుండి గమనింతము. నా మాట చెవినిబెట్టి లక్ష్యముంచుమని దేవుని బ్రతిమాలుచున్నాడు. కనుక ప్రతి ఉదయమున ఎన్ని పనులున్నను మన ప్రార్థన, స్తుతి, ధ్యానము సిద్ధపరచి ఆయనకు అందించి ముందుకు సాగాలి.

**4-6వ. పరిశుద్ధ దేవుని జ్ఞాపకము చేసికొనుట:** యెహోవా దుష్టత్వము, చెడుతనము, డంబములు, పాపములు, అబద్ధములను, నరహత్యలను అసహ్యించుకొనును. అట్టివారు యెహోవాకు అసహ్యులు. **నిర్గమ 15:11** ప్రకారము యెహోవా, పరిశుద్ధతను బట్టి మహనీయుడు, అద్భుతములు చేయువాడు, వేల్పులలో ఆయనవంటి వాడెవడును లేనందున, స్తుతి కీర్తనలను బట్టి పూజ్యుడు. **హబక్కూకు 1:13** ప్రకారము ఆయన కనుదృష్టి దుష్టత్వము చూడలేనంత నిష్కళంకమైనది. అట్టి దేవుడు మన ఉదయకాల స్తుతి, ధ్యానమునకు పాత్రుడు.

**7-12వ. మందిరములో దేవుని ప్రార్థించుట - స్తుతించుట**

**7-8వ. ప్రార్థన- ఆరాధన - ఆదరణ:** దేవుని అత్యధికమైన కృపనుబట్టి మందిరములో ప్రవేశించి, దేవునిపట్ల భయభక్తులు కలిగి పరిశుద్ధాలయము దిక్కు చూచి నమస్కరించెదను అని చెప్పుచున్నాడు. **ఎఫెసీ 2:8** ప్రకారము కృపచేతనే మనము రక్షించబడినందున, **2కొరింథీ 12:9** ప్రకారము మనకు చాలిన కృప ఆయన యొద్ద ఉన్నందున దేవుని కృపనుబట్టి శత్రువుల నుండి విడుదల కొరకు ప్రార్థన చేయుచున్నాడు. **8వ.** తన కొరకు పొంచియున్నవారినిబట్టి దేవుని నీత్యానుసారముగా నడిపింపుమని, దేవుని మార్గమును స్పష్టముగా కనపరచుమని ప్రార్థించుచున్నాడు.

**9-12వ. యథార్థముగా ఆరాధించువారిని దేవుడు దీవించును:**

**9-10వ.** శత్రువులగువారు యథార్థత లేనివారని, వారి అంతరంగము నాశనకరమైన గుంట అని, వారి కంఠము తెరచిన సమాధి అని, వారు నాలుకతో ఇచ్చకములాడుదురని, దేవుని మీద తిరుగబడుచున్నారని చెప్పుచున్నాడు.

**11-12వ.** తానైతే నీతిమంతుడుగా నుండి దేవుని ఆశ్రయించినందున దేవుడు తనను కాపాడునని తాను ఉల్లసించుచుందురని చెప్పుచున్నాడు. దేవునిచేత కాపాడబడి నిత్యము ఆనంద ధ్వని చేతునని చెప్పుచున్నాడు.

## 6వ కీర్తన (3+4+3 = 10 వ.)

**అంశం : రాత్రికాల ప్రార్థనా కీర్తన - పశ్చాత్తాప కీర్తన.** దేవుడు కోపముచేత, ఉగ్రతతో గద్దించి, క్రమపరచుటకై శత్రువును పంపి శత్రువు ద్వారా శిక్షించినపుడు కరుణించుమని శత్రువులందరు సిగ్గుపడి వెనుకకు మళ్ళునట్లు చేయుమని చేసిన ప్రార్థన. పీఠికలో అష్టమ శృతి అనగా పెద్ద శృతి మీద పాడుట. బైబిలులో అనేక దీవెనలు దేవుడు దావీదుకు ఇచ్చాడు. కాని చేసిన తప్పులకు కఠినముగా శిక్షించాడు. దేవుడు శిక్షించిన పిదప చేసిన మేలుపై దావీదు పాడుచు స్తుతించుట గమనించాలి. **యెషయా 43:7.** నా మహిమ నిమిత్తము నేను సృజించినవారిని నా నామము పెట్టబడిన వారినందరిని తప్పించుము. లోకములో అనేక మతములున్నను తమ దేవుని పేరుతో పిలువబడువారు ఒక్క క్రైస్తవులే. క్రీస్తువారు క్రైస్తవులు. మనము సృజించినబడినది దేవుని మహిమ కొరకే. కనుక అన్ని పరిస్థితులలో దేవుణ్ణి స్తుతించాలి. కనుక శిక్షనుండి తప్పించిన విధమును వివరించుచు

దావీదు దేవుని గొప్పగా స్తుతించాడు. **13,32,38,51,130,143** . . . కూడా పశ్చాత్తాప కీర్తనలే.

**1-3వ. ప్రాణాత్మ దేహాలపై కరుణ కొరకు మొరపెట్టుట:** నా యెముకలు అదురుచున్నవి, నా ప్రాణము బహుగా అదరుచున్నది, నేను కృశించియున్నాను. నన్ను కరుణించుము అనుటనుబట్టి ప్రాణాత్మ దేహాలతో కృశించాడని గుర్తించాలి. నీవు ఎంతవరకు కరుణింపకయుందువు? నన్ను బాగుచేయుము, మరణమైనవారికి నిన్ను గూర్చిన జ్ఞాపకము లేదు అనుటలో కృశించిన తనను దేవుడు కరుణించదేమో, తాను మరణింతునేమో అను అనుమానములో నున్నాడు. **కీర్తన 118:16-18** లో, యెహోవా నన్ను కఠినముగా శిక్షించెను గాని ఆయన నన్ను మరణమునకు అప్పగింపలేదు. నేను చావను, సజీవుడనై యెహోవా క్రియలు వివరించెదను. ఎప్పుడైనను దేవుని శిక్ష క్రమశిక్షయే కాని మరణము కొరకు కాదు. **కీర్తన 50:15,** ఆపత్కాలమున నీవు నన్ను గూర్చి మొఱ్ఱపెట్టుము, నేను నిన్ను విడిపించెదను. నీవు నన్ను మహిమపరచెదవు అన్నట్లు ఆపదలు, శిక్షలు క్రమపరచుటకై. మనలను క్రమపరచిన యెహోవా క్రియలను మనము వివరించగా తనకు మహిమ కలిగించుకొనును.

**4-7వ. ప్రార్థనలో కన్నీటితో కన్నులు గుంటపడుట: 4వ.** ఆత్మరక్షణ కృపనుబట్టియే కలుగును. శ్రమలలో విడుదల కూడా కృపనుబట్టియే కలుగును. రక్షించబడినవారు పాతాళమునకు వెళ్ళుట అనగా **లూకా 16:19-31** లో గమనించగా, నమ్మిన లాజరు పాతాళములో నున్నాడు కాని ధనవంతుదున్న అగ్ని మంటలలో కాదు. అబ్రాహాము రొమ్ములో నెమ్మదిగా ఉన్నాడు. కనుక క్రీస్తు మరణమునకు ముందు నమ్మినవారు పాతాళములో నెమ్మదిగా ఉండు స్థలమునకు వెళ్ళుదురు. పాతాళములో కాక భూమి మీదనే దేవుని చేత శ్రమలలో నుండి విడిపించబడి దేవుని స్తుతించాలని ఆశించుచున్నాడు. ప్రతిరాత్రి కన్నీరు విడుచుచు నా పరుపు తేలజేయుచున్నాను. నా కన్నీళ్ళచేత నా పడక కొట్టుకొని పోవుచున్నది అనుట దావీదు ప్రార్థన యొక్క తీవ్రతను తెలుపుచున్నది. అటువంటి భారభరితమైన ప్రార్థన మనము చేయుదము గాక.

**8-10వ. ప్రార్థన, విన్నపము, రోదనకు జవాబు:** యెహోవా నా విన్నపము, నా ప్రార్థన, నా రోదన విని నంగీకరించునను విశ్వాసము కలిగియున్నాడు. కనుక తన శత్రువులందరు ఆకస్మికముగా సిగ్గుపడి వెనుకకు మళ్ళుదురను నిరీక్షణ కలిగి ఈ కీర్తన ద్వారా దేవుని స్తుతించుచున్నాడు.

## 7వ కీర్తన (2+3+2+3+3+3+1 = 17 వ.)

**సంధర్భం, అంశం :** బెన్యామీనీయుడైన కూషు చెప్పిన మాటల విషయమై ఈ కీర్తన వ్రాశాడు. కూషు చెప్పిన మాటల విషయమై ప్రార్థించాడు. జయము పొందాడు. దేవుని స్తుతించాడు. **2సమూ 16:5** లో షిమి అనువాడు దావీదుపైకి సింహమువలె లేచి

రాళ్ళురువ్వి శపించినట్లు చూతుము. ఇద్దరు కూడా బెన్యామీనీయులని వ్రాయబడినందున ఈ షిమియే బహుశా ఆ కూషు అయి యుండవచ్చును.

**1-5వ. తరుమువాని నుండి తప్పించుమని ప్రార్థన:**

**1-2వ.** దావీదును తరుముచు సింహమువలె ముక్కలుగా చీల్చివేయుటకు ఎదురుచూచు వారున్నారు. సింహము వంటివారి ద్వారా అపాయములు వచ్చుటను గూర్చి కీర్తనలు గ్రంథములో ఆరు సందర్భములున్నవి. **1) కీర్తన 10:9వ. గు**హలో సింహమువలె చాటైన స్థలములలో పొంచియుండేవారు. మనము ఎక్కడకు పోతున్నామో, ఏమి చేస్తున్నామో చాటుగా ఉండి గమనించుచుండు వారిలో విశ్వాసులు కూడా ఉందురు. అవిశ్వాసులు అలాగుండరు. కాని విశ్వాసులు ఆ రీతిగా ఉండకూడదు. **2) కీర్తన 17:12వ.** వారు చీల్చుటకు ఆతురపడు సింహమువలె చాటైన స్థలములో పొంచు కొదమసింహము వలె ఉన్నారు. అటువంటి వారి నుండి దావీదు తప్పించబడ్డాడు. భక్తుడైన పౌలు కూడా **2తిమోతి 4:16-18** నేను మొదట సమాధానము చెప్పినప్పుడు ఎవడును నా పక్షముగా నిలువలేదు, అందరు నన్ను విడిచిపోయిరి; అది వారికి నేరముగా ఎంచబడకుండును గాక. **17వ.** అయితే నా ద్వారా సువార్త పూర్ణముగా ప్రకటింపబడు నిమిత్తమును, అన్యజనులందరును దాని విను నిమిత్తమును, ప్రభువు నా ప్రక్క నిలిచి నన్ను బలపరచెను గనుక నేను సింహము నోట నుండి తప్పించబడితిని. **18వ.** ప్రభువు ప్రతి దుష్కార్యము నుండి నన్ను తప్పించి తన పరలోక రాజ్యమునకు చేరునట్లు నన్ను రక్షించును. యుగయుగములు ఆయనకు మహిమ కలుగునుగాక, ఆమేన్ అని పౌలు అన్నాడు. **3) కీర్తన 35:17వ.** నా ప్రాణమును సింహముల నోటనుండి విడిపింపుము అని ప్రార్థించాడు. **4) కీర్తన 57:4వ.** నా ప్రాణము సింహముల మధ్యనున్నది. కోపోద్రేకుల మధ్య నేను పండుకొనుచున్నాను. **5) కీర్తన 58:6వ.** దేవా, వారి నోటి పండ్లను విరుగగొట్టుము, కొదమ సింహముల కోరలను ఊడగొట్టుము అని ప్రార్థించాడు. **6) కీర్తన 22:13వ.** చీల్చుచును గర్జించును నుండి సింహమువలె వారు నోళ్లు తెరుచుచున్నారు. ఈ కీర్తనలో ప్రభువు పైకి సింహములవలె నోళ్లు తెరిచిన వారున్నారు. దావీదు కాని, పౌలు కాని, ప్రభువు కాని అలాంటి సందర్భములో ప్రార్థించారు. సింహము సాతానుకు గురుతు. **కీర్తన 91:13వ.** నీవు సింహములను నాగుపాములను త్రొక్కెదవు, కొదమ సింహములను భుజంగములను అణగద్రొక్కెదవు అని ఉన్నందున సాతాను అను సింహము నుండి, శత్రువుల నుండి దేవుడే తప్పించును అను నిరీక్షణతో ముందుకు సాగుదము.

**3-5వ.** దేవా, నా చేత పాపము జరిగినయెడల నాతో సమాధానముగా నుండిన వానికి నేను కీడుచేసిన యెడల శత్రువు నన్ను తరిమి పట్టుకొననిమ్ము అని దావీదు అను మాటనుబట్టి తాను నిర్దోషిగా ఉన్నాను, శత్రువు రేగుచున్నాడు. **2సమూ 16:5-8వ.** లో రాజైన దావీదు బహురీము దాపునకు వచ్చినప్పుడు సౌలు కుటుంబికుడగు గెరా కుమారుడైన షిమీ అనునొకడు అచ్చట నుండి బయలుదేరి వచ్చెను; అతని వెంట నడుచుచు దావీదును శపించుచు జనులందరును బలాఢ్యులందరును దావీదు ఇరుపార్శ్వముల నుండగా

రాజైన దావీదు మీదను అతని సేవకులందరి మీదను రాళ్ళు రువ్వుచు దుర్మార్గుడా ఛీపో, ఛీపో, నీ వేలవలెనని నీవు వెళ్ళగొట్టిన సౌలు ఇంటివారు హత్యను యెహోవా నీ మీదికి రప్పించి, యెహోవా నీ కుమారుడైన అబ్షాలోము చేతికి రాజ్యమును అప్పగించియున్నాడు; నీవు నరహంతకుడవు గనుకనే నీ మోసములో నీవు చిక్కుబడియున్నావని చెప్పి రాజును అబద్ధముగా, అన్యాయముగా శపించాడు. దావీదుకు సౌలు మరణమునకు ఏమి సంబంధము లేదు. అలాగే **2తిమోతి 2:9వ.** నేను నేరస్థుడనై యున్నట్లు ఆ సువార్త విషయమై సంకెళ్ళతో బంధింపబడి శ్రమపడుచున్నాను అను పౌలు అన్నాడు. కనుక నేరము చేయకపోయినను నేరస్థులముగా ఎంచబడగలము.

**6-10. న్యాయము తీర్చుమని ప్రార్థన: 6-7వ.** న్యాయవిధిని నీవు నియమించియున్నావు అని దావీదు పలుకుటలో దేవుని న్యాయపు తీర్పు ఉన్నదని గుర్తించాడు. **కీర్తన 34:17-19వ.** నీతిమంతులు మొఱ్ఱపెట్టగా యెహోవా ఆలకించును. వారి శ్రమలన్నిటిలో నుండి వారిని విడిపించును. నీతిమంతునికి కలుగు ఆపదలు అనేకములు. వాటి అన్నిటిలో నుండి యెహోవా వానిని విడిపించును. కనుక మనము నీతిమంతులముగా జీవించుచు ప్రార్థించువారమై యుండాలి.

**8-10వ. ప్రార్థన వినినందుకు నిరంతర రాజైన యెహోవాకు కృతజ్ఞత తెలుపుట:** నీతిగలవారిని, యథార్థ హృదయులను రక్షించు దేవుడే నా ప్రార్థనకు జవాబుగా నా కేడెమును మోయువాడైయున్నాడు అని నిరీక్షణతో చెప్పగలుగుచున్నాడు. అలాగే దేవుడు దావీదును అబ్షాలోము నుండి తప్పించాడు. **2సమూ 19:18-20వ.** అంతట గెరా కుమారుడగు షిమీ వచ్చి రాజు యొర్దాను నుండి దాటిపోగానే అతనికి సాష్టాంగపడి, నా యేలినవాడా, నేను చేసిన ద్రోహము నా మీద మోపకుము; నా యేలినవాడవును రాజువునగు నీవు యెరూషలేమును విడిచిన వేళ నీ దాసుడనగు నేను మూర్ఖించి చేసిన దోషమును జ్ఞాపకముంచుకొనకుము, మనస్సునందుంచుకొనకుము. నేను పాపము చేసితినని నాకు తెలిసినది.

**11-17వ. దేవుడు న్యాయము తీర్చునని స్తుతించుట: 11-13వ.** న్యాయమునుబట్టి ఆయన తీర్పు తీర్చును. ఆయన ప్రతి దినము కోపపడు దేవుడు. ఆయన తన ఖడ్గము పదునుపెట్టి మనలను **హెబ్రీ 12:7-11** ప్రకారము క్రమపరచును. ఇది క్రమశిక్షయేకాని నష్టపరచు శిక్ష కాదు. **14-16వ.** చేటును గర్భమున ధరించి, పాపమును కనుటకు ప్రసవవేదన పడి, అబద్ధమును కనువాడు తాను త్రవ్వి లోతుచేసిన గుంటలో తానే పడిపోవును. వాడు తలంచిన చేటు వాని నెత్తిమీదికి వచ్చును. సౌలు, అబ్షాలోము, షిమీల జీవితములో వారికి అదే జరిగినది. **17వ.** యెహోవా న్యాయము విధించువాడని దావీదు దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించి సర్వోన్నతుడైన యెహోవా నామమును కీర్తించాడు. దేవుడు సమస్త కీడుచేయువారి నుండి విడిపించగా దేవుని స్తుతించబద్ధులమైయున్నాము.

## **8వ కీర్తన** (2+2+2+2+1 = 9 వ.)

**అంశం : క్రీస్తు మానవత్వము, మహిమ (5వ.), శత్రుత్వము, పగ మాన్పుట (2వ.)**

**1-2వ. భూమ్యాకాశములలో బయలుపరచబడిన క్రీస్తు మహిమ, ప్రభావములు:**

**1వ.** యెహోవా మా ప్రభువా అను పదము అనేకసార్లు కనిపించును. యెహోవా అనగా యేసు. యెహోవా ప్రభువా అనగా యేసు ప్రభువా అని తలంచాలి. అందులకే ఈ కీర్తనను మెస్సీయా కీర్తనగా తలంచుచున్నాము. యేసు యొక్క మహిమ, ప్రభావములు ఈ కీర్తనలో వివరించబడినవి. ఆకాశములలో నీ మహిమను కనుపరచువాడా అనుటలో మనమెరిగిన ఒక ఆకాశమే కాక అనేక ఆకాశములు ఉన్నవని గుర్తించాలి. మనకు తెలిసిన ఒక ఆకాశమును గూర్చి కూడా మనకు సంపూర్ణ అవగాహన లేదు. మానవులు ఇంతవరకు చూచిన ఆకాశ భాగములో ముప్పది వేల కోట్ల, కోట్ల, కోట్ల నక్షత్రములున్నట్లు కనుగొనిరి. మానవులకు ఇంకనూ కనుపించని ఆకాశ విశాలములో ఇంకా ఎన్ని నక్షత్రములు ఉన్నవో మానవ శాస్త్రమునకు అందదు. మనకు అర్థము కాదు. ఇటువంటివి కాక అనేక ఆకాశములు, అనేక మహాకాశములు, అనేక పరమ ఆకాశములు ఉన్నవి. ఒక ఆకాశ విషయములే మానవ జ్ఞానమునకు అందనపుడు ఇన్ని ఆకాశములలోనున్న ఆయన మహిమ ఎంత గొప్పదో తలంచలేము. **2దిన 2:6.** ఆకాశములును మహాకాశములును ఆయనను పట్టజాలవు అని సొలొమోను రాజు చెప్పుచున్నాడు. ఒక్క సూర్యుని మహిమను (వెలుగును) మనము కన్నులతో చూడలేము. ఇంతటి మహిమను ప్రక్కనపెట్టి భూలోకమునకు వచ్చాడు కనుక మానవులు ఆయనను చూడగలిగిరి. భూమియందంతట నీ నామము ఎంత ప్రభావము గలది. **కీర్తన 57:5,11** లో, దేవా, ఆకాశము కంటె అత్యున్నతుడవుగ నిన్ను కనుపరచుకొనుము. నీ ప్రభావము సర్వభూమి మీద కనబడనిమ్ము. **మార్కు 5:28-30** లో, జనసమూహములలో ఆయన వెనుకకు వచ్చి ఆయన వస్త్రము ముట్టెను. వెంటనే ఆమె రక్తధార కట్టెను గనుక తన శరీరములోని ఆ బాధ నివారణయైనదని గ్రహించుకొనెను. వెంటనే యేసు తనలోనుండి ప్రభావము బయలువెళ్ళెనని తాను గ్రహించెను. ఆయన ప్రభావము భూమి మీద అనేక కార్యములను చేసెను కనుక భూమి మీద ఆయన ప్రభావము కనపడుచుండెను. **2వ. మత్తయి 21:7-16** లో, ఆ గాడిద మీద కూర్చుండెను. జనసమూహములలో ఆయనకు ముందు వెళ్ళుచుండినవారు వెనుక వచ్చుచుండినవారు దావీదు కుమారునికి జయము, ప్రభువు పేరట వచ్చువాడు స్తుతింపబడునుగాక, సర్వోన్నతమైన స్థలములలో జయము అని కేకలు వేయుచుండిరి. యేసు దేవాలయములో ప్రవేశించగా ప్రధాన యాజకులును శాస్త్రులును ఆయన చేసిన వింతలను, దావీదు కుమారునికి జయము అని దేవాలయములో కేకలు వేయుచున్న చిన్న పిల్లలను చూచి కోపముతో మండిపడి వీరు చెప్పుచున్నది వినుచున్నావా? అని ఆయనను అడిగిరి. అందుకు యేసు కోపము లేనివాడుగా (ప్రధాన యాజకులును శాస్త్రులును శత్రువులును, పగతీర్చుకొనువారుగా ఉండకూడదని) వినుచున్నాను; బాలుర యొక్కయు చంటిపిల్లల యొక్కయు నోట స్తోత్రము సిద్ధింపజేసితివి అను మాట మీరెన్నడును చదువలేదా? అని

వారితో చెప్పెను. ప్రభువుకు శత్రువులును, పగతీర్చుకొనువారును, విరోధులును అసూయతో పలికిన మాటలకు 8వ కీర్తనలోని మాటలను జ్ఞాపకము చేయుచున్నాడు.

**3-4వ. సృష్టికర్త - సృష్టి - మానవుడు : 3వ.** నీ చేతిపనియైన నీ ఆకాశములను నీవు కలుగజేసిన చంద్ర నక్షత్రములను నేను చూడగా నీవు మనుష్యుని జ్ఞాపకము చేసికొనుటకు, నీవు నరపుత్రుని దర్శించుటకు వాడేపాటివాడు? **2దిన 2:6.** ఆకాశములు మహాకాశములు ఆయనను పట్టజాలవు అని సొలొమోనురాజు అన్నాడు. అంత గొప్ప దేవుడు తనకంటె దూతలు తక్కువవారు, దూతలకంటె తక్కువవారు మానవులు. అటువంటి ఆది మానవుడైన ఆదామును, అతని సంతతిని జ్ఞాపకము చేసికొనుట గమనించదగినది. మానవుడుగా ఇంటిలో చిన్నవాడైనను దావీదును జ్ఞాపకము చేసికొనుట గమనించదగినది. **ఫిలిప్పీ 2:5-7.** క్రీస్తు యేసు దేవుని స్వరూపము కలిగినవాడైయుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపమును ధరించుకొని, తన్నుతానే రిక్తునిగా చేసికొనెను. మనము దేవుని స్వరూపము కలిగినవారమైనను (ఆది 1:27) దేవునితో సమానులము కాము. క్రీస్తు యేసు దేవుని స్వరూపము కలిగినవాడు, దేవునితో సమానుడైనను మానవులవలె జన్మించి మనవంటి స్వభావము ధరించుకొనుట ఎంత ఆశ్చర్యము! తండ్రియైన దేవుడు ఆయనను దేవదూతల కంటె కొంచెము (కొంతకాలము) తక్కువవాడుగా చేశాడు. మరణించి పునరుత్థానుడైన తరువాత తండ్రితో ఏకమయ్యాడు.

**5-6,7-8. మహిమా ప్రభావముతో కిరీటము ధరింపజేయుట - సమస్తమును మానవుల పాదముల క్రింద ఉంచుట:** ఆదాము సదాకాలము దేవదూతల కంటె తక్కువవాడైనను మహిమ ప్రభావములతో కిరీటము ధరింపజేశాడు. **రోమా 3:23-24** లో, ఏ భేదమును లేదు, అందరును పాపముచేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు. కాబట్టి నమ్మువారు ఆయన కృపచేతనే, క్రీస్తు యేసునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు. నీతిమంతులని తీర్చి పోగొట్టుకొనిన మహిమను మరల ఇచ్చాడు. **ఫిలిప్పీ 2:5-7.** క్రీసు యేసు దేవుని స్వరూపమును కలిగినవాడైయుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపమును ధరించుకొని, తన్నుతానే రిక్తునిగా చేసికొనెను. మరియు, ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి, మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై, తన్నుతాను తగ్గించుకొనెను. **హెబ్రీ 2:7-9.** నీవు దేవదూతల కంటె వానిని కొంచెము తక్కువవానిగా చేసితివి. మహిమా ప్రభావముతో వానికి కిరీటము ధరింపజేసితివి. నీ చేతి పనులమీద వానికధికారము అనుగ్రహించితివి. వాని పాదముల క్రింద సమస్తమును ఉంచితివి. ఆయన సమస్తమును లోపరచినప్పుడు వానికి లోపరచకుండ దేనిని విడిచిపెట్టలేదు. ప్రస్తుతమందు మనము సమస్తమును వానికి లోపరచబడుట ఇంకను చూడలేదు గాని దేవుని కృపవలన ఆయన ప్రతి మనుష్యుని

కొరకు మరణము అనుభవించునట్లు, దూతల కంటె కొంచెము తక్కువవాడుగా చేయబడిన యేసు మరణము పొందినందున, మహిమా ప్రభావములతో కిరీటము ధరించినవానిగా ఆయనను చూచుచున్నాము.

**9వ. దేవుని నామ ప్రభావము - భూమియందంతట ఆయన నామము ఎంతో ప్రభావము గలది: అపో.కా. 4:12.** మరి ఎవని వలను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము అనెను. ఆయన పుట్టుక సాటిలేనిది, ఆయన మానవత్వము సాటిలేనిది, ఆయన విధేయత సాటిలేనిది. ఆయన జీవించిన విధానము సాటిలేనిది, ఆయన సూచక క్రియలు సాటిలేనివి, ఆయన బోధించిన ఉపమానములు సాటిలేనివి, ఆయన మరణము సాటిలేనిది, ఆయన పునరుత్థానము సాటిలేనిది. ఆయన రెండవరాకడ సాటిలేనిది, ఆయన వాక్యము సాటిలేనిది, ఆయనకు మరెవరు సాటిరారు. యెహోవా మా ప్రభువా అనుటలో. **కీర్తన 33:12** ప్రకారము ఇట్టి యెహోవాను తనకు దేవుడుగా కలిగియుండుటయే ధన్యత.

## 9వ కీర్తన (6+6+4+4 = 20 వ.)

**అంశం : యెహోవా శాశ్వతముగా సింహాసనాసీనుడై నీతినిబట్టి లోకమునకు తీర్పుతీర్చును కనుక యెహోవాకు స్తుతి.**

**1-6వ. న్యాయమునుబట్టి దేవుడు శత్రువుపై విజయమిచ్చినందుకు స్తుతి: 1-2వ.** నా పూర్ణ హృదయముతో నేను యెహోవాను స్తుతించెదను. స్తుతిలో ముందుగా 1) యెహోవా, అద్భుత కార్యములన్నిటిని వివరించుట, 2) దేవుణ్ణి గూర్చి సంతోషించి హర్షించుట, 3) ఆయన నామమును కీర్తించుట, 4) స్తుతించుట ఉండును. వట్టిగా రొట్టె రసము తీసికొనుకుండ ఆయన మహోన్నతుడు గనుక ఆయన చేసిన మహోన్నతమైన విమోచన కార్యములు వివరించి ధ్యానించాలి. **1కొరింథీ 14:26వ.** లో ఆరాధించవలసిన విధము చెప్పబడినది. కూడివచ్చునప్పుడు ఒకడు ఒక కీర్తన పాడవలసియున్నాడు. మరియొకడు బోధింపవలసియున్నాడు; 3. ప్రవక్తలు ఇద్దరు ముగ్గురు మాటలాడవచ్చును; తక్కినవారు వివేచింపవలెను. 4. పరిశుద్ధుల సంఘములన్నిటిలో దేవుడు సమాధానమునకే కర్త కాని అల్లరికి కర్తకాదు. 5. స్త్రీలు సంఘములో మౌనముగా ఉండవలెను; వారు లోబడియుండ వలసినదే గాని, మాటలాడుటకు వారికి సెలవు లేదు. సంఘములో స్త్రీ మాటలాడుట అవమానము.

**7-12వ. తనను ఆశ్రయించినవారిని విడువక దుర్గముగా ఉన్నందున స్తుతి: 7-8వ.** యెహోవా శాశ్వతముగా సింహాసనాసీనుడై యుండి న్యాయము తీర్పు నీతినిబట్టి లోకమునకు తీర్పుతీర్చును. **9-10వ.** నలిగినవారికి తాను ఆపత్కాలములలో మహా దుర్గమగును. యెహోవాను ఆశ్రయించువారిని ఆయన విడిచిపెట్టక కాపాడును. కావున దేవుని

నామమెరిగినవారు దేవుణ్ణి నమ్ముకొందురు. **11-12వ.** వారి మొఱ్ఱను ఆయన మరువడు. కనుక యెహోవాను మరువక కీర్తించుచు, ఆయన క్రియలను ప్రజలలో ప్రచురము చేయాలి.

**13-16వ. దుష్టుల నుండి రక్షించినందుకు స్తుతి:** ద్వేషించువారు కలుగజేయు బాధను చూచి, యెహోవా ప్రత్యక్షమై తీర్పు తీర్చును. దుష్టులు తాము చేసికొనిన దానిలో చిక్కియున్నారు. కనుక దేవుని కీర్తి అంతటిని ప్రసిద్ధి చేయుటకు సీయోను కుమార్తె గుమ్మములలో రక్షణనుబట్టి హర్షించి స్తుతించాలి.

**17-20వ. దుష్టుల అంత్యకాల స్తుతి: 17-18వ.** దుష్టులును దేవుని మరచు జనులందరును పాతాళమునకు దిగిపోవుదురు. దరిద్రులు నిత్యము మరువబడరు. బాధపరచబడువారి నిరీక్షణాస్పదము ఎన్నటికిని నశించదు. **19-20వ.** తాము నరమాత్రులని జనులు తెలిసికొనునట్లు యెహోవా వారిని భయపెట్టుము అని ప్రార్థించాడు.

## 10వ కీర్తన (3+3+5+4+3 = 18 వ.)

**అంశం : (విశ్వాసమునకు కలుగు పరీక్షలో) దుష్టుల దౌర్జన్యము నుండి తప్పించుమని ప్రార్థన**

**1-3వ. దుష్టుల గర్వపు ప్రస్తావన: 1వ.** యెహోవా, నీవెందుకు దూరముగా నిలుచుచున్నావు? ఆపత్కాలములలో నీవెందుకు దాగియున్నావు? విశ్వాస జీవితములో మనము ఎదుర్కొనవలసిన కొన్ని కాలములను బైబిలులో గమనింతము. **1సమూ 20:21.** భూమి మీద బ్రతుకునంత కాలము అని, **2రాజులు 8:1.** క్షామకాలము అని, **కీర్తన 30:6** లో క్షేమకాలము అని, **న్యాయాధి 10:14.** శ్రమకాలము అని, **2సమూ 11:27** అంగలార్పు కాలము అని, **ప్రసంగి 9:12** లో అశుభ కాలము అని, **ప్రకటన 3:10** లో శోధన కాలము అని, **అపొ.కా. 3:1** లో ప్రార్థన కాలము అని, **రూతు 2:14** లో భోజన కాలము అని, **కీర్తన 35:16** లో విందుకాలము అని, **2దిన 26:5** లో యెహోవాను ఆశ్రయించుకాలము అని, **అపొ.కా. 17:30** లో అజ్ఞానకాలము అని, **అపొ.కా. 7:17** లో వాగ్దానకాలము అని చెప్పబడినది. కనుక మనము భూమి మీద బ్రతుకునంతకాలములో క్షామకాలము, శ్రమకాలము, అంగలార్చుకాలము, అశుభకాలము వచ్చును. శోధన కాలమును ప్రార్థనకాలముగా చేసికొని యెహోవాను ఆశ్రయించిన యెడల దేవుడు వర్ధిల్లజేసి మనలను కాపాడును. అజ్ఞానకాలములను దేవుడు చూచి చూడనట్లుగా ఉండెను కాని ఇప్పుడైతే అంతట అందరు మారుమనసును పొందాలని చెప్పుచున్నాడు. ఈ గ్రంథమును చదువు నీవు మారుమనసును పొందితివా, లేదా? దేవుడు అబ్రాహాముకు అనుగ్రహించిన వాగ్దానకాలములో మనమున్నామని గుర్తింతము. **2వ.** దుష్టులు గర్వించి, దీనులమగు మనలను వడిగా తరుము కాలమున మనము యెహోవాను ఆశ్రయించిన యెడల దేవుడు వర్ధిల్లజేసి మనలను కాపాడును. **కీర్తన 50:15.** ఆపత్కాలమున నీవు నన్ను గూర్చి మొఱ్ఱపెట్టుము. నేను నిన్ను విడిపించెదను, నీవు నన్ను మహిమపరచెదవు అన్నందున

విశ్వాసులమైన మనకు ఆపదలు శిక్షగా కాని, పరీక్షగా కాని కలుగవచ్చును. కానీ మనము మొరపెట్టు నిమిత్తమే కలుగునని నేర్చుకొందము. మనము మొఱ్ఱపెట్టగా దేవుడు మనలను విడిపించి తనను తాను మహిమపరచుకొనును. **3వ.** లోభులు యెహోవాను తిరస్కరించగా, దుష్టులు తమ మనోభిలాషను బట్టి అతిశయపడగా, వారు యోచించిన మోస క్రియలలో తామే చిక్కుకొందురు అనగా వారికి విడుదల ఉండదు అని దేవుడు చెప్పుచున్నాడు.

**4-6వ. దుష్టుల పొగరెక్కిన ఆలోచన: 4వ.** దుష్టులు పొగరెక్కి యెహోవా విచారణ చేయడనుకొందురు. దేవుడు లేడని వారెల్లప్పుడు యోచించుదురు. **5వ.** వారెల్లప్పుడు భయము మానుకొని ప్రవర్తింతురు. దేవుడు లేడని బుద్ధిహీనులు తమ హృదయములో అనుకొందురు. వారు చెడిపోయినవారు, అసహ్యకార్యములు చేయుదురు అని **కీర్తన 14:1; 53:1** లో చెప్పబడినది. నీ న్యాయవిధులు ఉన్నతమైనవై వారి దృష్టికి అందకుండును. వారు తమ శత్రువులనందరిని చూచి తిరస్కరింతురు. **6వ.** మేము కదల్చబడము, తరతరముల వరకు ఆపద చూడము అని వారు తమ హృదయములలో అనుకొందురు. కాని చివరకు వారు యోచించిన మోస క్రియలలో తామే చిక్కుకొందురని దేవుడు తెలుపుచున్నాడు.

**7-11వ. నిరపరాధుల పట్ల దుష్టుల వంచన చర్యలు: 7వ.** దుష్టుల నోరు శాపముతోను, కపటముతోను నిండియున్నది. వారి నాలుక క్రింద చేటను పాపమును ఉన్నవి. **రోమా 3:13** లో ఈ విషయములు చెప్పబడినవి. **8వ.** తామున్న పల్లెలయందలి మాటుచోటులలో పొంచియుందురు. చాటైన స్థలములలో నిరపరాధులను చంపుదురు. వారి కన్నులు నిరాధారులను పట్టుకొనవలెనని పొంచి చూచును. **9వ.** గుహలోని సింహమువలె వారు చాటైన స్థలములలో పొంచియుందురు. బాధపడువారిని పట్టుకొన పొంచియుందురు. బాధపడువారిని తన వలలోనికి లాగి పట్టుకొందురు. **10వ.** కాగా నిరపరాధులు నలిగి వంగుదురు. వారి బలాత్కారము వలన నిరాధారులు కొన్ని పర్యాయములు కూలుదురు. **11వ.** దేవుడు మరచిపోయెను, ఆయన విముఖుడై యెప్పుడును చూడకుండును అని వారి తమ హృదయములలో అనుకొందురు. కాని తగిన సమయములో దేవుడు కలుగజేసికొని దుష్టులకు తీర్పుతీర్చి బాధపడువారిని విడిపించును. **మత్తయి 11:28-29** లో ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి, నేను మీకు విశ్రాంతి కలుగజేతును. **29.** నేను సాత్వికుడను, దీనమనస్సు గలవాడను. నా యొద్ద నేర్చుకొనుడి. అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరకును అన్నందున దుష్టులు దేవుని ఆశ్రయించిన నెమ్మదిగా ఉండగలరు.

**12-15వ. దుష్టులకు ప్రతీకారము చేయుమని ప్రార్థన: 12వ.** యెహోవా లెమ్ము, దేవా, బాధపడువారిని మరువక నీ చెయ్యి యెత్తుము. **13వ.** దుష్టులు దేవుని తృణీకరించుట యేల? నీవు విచారణ చేయవని వారు తమ హృదయములలో అనుకొనుట యేల? **14వ.** నీవు దీనిని చూచియున్నావు గదా, వారికి ప్రతీకారము చేయుటకై నీవు చేటును, పగను కనిపెట్టి చూచుచున్నావు. నిరాధారులు తమ్మును నీకు అప్పగించుకొందురు.

తండ్రిలేనివారికి నీవే సహాయుడవై యున్నావు. **15వ.** దుష్టుల దుష్టత్వమును చూచి వానిని గూర్చి విచారణ చేయుమని చెప్పుచున్నాడు.

**16-18. ప్రార్థన వినినందుకు నిరంతర రాజైన యెహోవాకు కృతజ్ఞత తెలుపుట:** **16వ.** యెహోవా నిరంతరము రాజైయున్నాడు. ఆయన దేశములో నుండి దుష్టులగు అన్యజనులు నశించిపోయిరి. **17-18వ.** యెహోవా, ఇకను భయకారకులు కాకుండునట్లు బాధపడువారి కోరికను వినియున్నాడని తండ్రి లేనివారికి, నలిగినవారికి న్యాయము తీర్చుటకై నీతిమంతుల ప్రార్థనకు చెవియొగ్గి ఆలకించాడని చెప్పుచున్నాడు. నిరంత రాజైన యెహోవా మన కృతజ్ఞతా స్తుతులు పొందుటకు పాత్రుడు.

## 11వ కీర్తన (1+2+2+2 = 7 వ.)

**అంశం :** నీతిమంతులు, దుష్టులు పోల్చబడుట, విల్లెక్కుపెట్టు దుష్టుల నుండి విశ్వాసులగు నీతిమంతులను తప్పించుట. దావీదు దుష్టుడగు సౌలు తనను చంపవలెనని అనేక ప్రయత్నములు చేసిన సందర్భమున గాని, అబ్షాలోమను తన సొంత కుమారుడు తనను చంపుటకు ప్రయత్నము చేసిన సందర్భములో కాని ఈ కీర్తన వ్రాయియుండవచ్చును.

**1వ. యెహోవా శరణుజొచ్చుట: 1వ.** నీతిమంతులనగా క్రీస్తు యేసును రక్షకుడుగా అంగీకరించినవారు. దుష్టులు అనగా రక్షణ పొందనివారు. తన శరణుజొచ్చిన నీతిమంతుడగు దావీదును దుష్టుడగు సౌలు బారినుండి తప్పించుటకు పారిపోవుటకు దీర్ఘశాంతము గల దేవుడు కొన్నిసార్లు సెలవిచ్చును. ఆయన నరులను కన్నులారా చూచుచున్నందున దేవుని యెరుగని అన్యులు చేయు రీతిగా పక్షివలె, నీ కొండకు పారిపొమ్ము అని మీరు నాతో చెప్పుట యేల అని కీర్తనకారుడు బహుశా తనకు సలహా ఇచ్చు స్నేహితులను ప్రశ్నించుచున్నాడు.

**2-3వ. దుష్టులు యథార్థవంతులకు చేయు కీడు: 2వ.** దుష్టులు విల్లెక్కుపెట్టి యున్నారు. చీకటిలో యథార్థ హృదయుల మీద వేయుటకై తమ బాణములు నారియందు సంధించియున్నారు. **3వ.** మానవ జీవిత నైతిక పునాదులు కయీను హేబెలు వంటివారును ఏమియు చేయలేక మరణించి తమ రక్తము ద్వారా దేవునికి మొరపెట్టిరి. నీతిమంతులు కొద్దికాలము శ్రమలను అనుభవించిన తరువాత దేవుడు వారిని విడిపించును, లేదా హేబెలువలె హతసాక్షులగుటకు సెలవిచ్చును.

**4-5వ. దేవుడు దుష్టులను, నీతిమంతులను పరలోకములోనుండి పరిశీలించుట:** **4వ.** యెహోవా తన పరలోకములోని ఆలయములో సింహాసనమునందు ఆశీనుడగుట అనగా ఆయన అందరికి తీర్పుతీర్చు అధికారము గలవాడైయున్నాడని భావము. ఆయన నరులను కన్నులారా చూచుచున్నాడు. తన కనుదృష్టి చేత ఆయన వారిని పరిశీలించుచున్నాడు. **5వ.** యెహోవా నీతిమంతులను పరిశీలించును. దుష్టజనులను బలాత్కారాసక్తులును ఆయనకు అసహ్యులైనను తన దీర్ఘశాంతమునుబట్టి కొంతకాలము వారికి మారుమనసు పొంద అవకాశమిచ్చును.

**6-7వ. దేవుడు దుష్టులను నీతిమంతులను తీర్పుతీర్చుట: 6వ.** దేవుడిచ్చిన అవకాశమును దుష్టులు సద్వినియోగపరచుకొననందున వారికి శిక్షగా దుష్టుల మీద ఆయన ఉరులు కురిపించును. ఈ లోకము విడిచిన తరువాత నరకములో అగ్ని గంధకములును వడగాలియు వారికి పానీయ భాగమగును. **7వ.** యెహోవా నీతిమంతుడు, ఆయన నీతిని ప్రేమించువాడు. యథార్థవంతులు అనగా దేవుని చేత నీతిమంతులుగా తీర్చబడినవారు యుగయుగములు ఆయన ముఖదర్శనము చేసెదరు.

## 12వ కీర్తన (2+2+2+2 = 8 వ.)

**అంశం : భక్తి గలవారు, భక్తి లేనివారు - వాక్యము**

**1-2వ. భక్తిలేని విశ్వాసులు - వారి స్థితిగతులు: 1వ.** యెహోవా నన్ను రక్షింపుము, భక్తిగలవారు లేకపోయిరి. విశ్వాసులు నరులలో నుండకుండ గతించిపోయిరి. **లూకా 18:8వ.** లో అయినను మనుష్యకుమారుడు వచ్చునప్పుడు ఆయన భూమి మీద విశ్వాసముండ కనుగొనునా? అని ఈ విషయమే చెప్పబడినది. **2వ.** అందరు అనగా భక్తిగలవారు, భక్తిలేనివారు ఒకరితో నొకరు అబద్ధములాడుదురు. మోసకరమైన మనస్సు గలవారై ఇచ్చకములాడు పెదవులతో పలుకుదురు.

**3-4వ. భక్తి లేని ఇతరులు - వారి స్థితిగతులు: 3వ.** యెహోవాయందు భక్తిలేనివారి పెదవులు ఇచ్చకములాడుచుండును. **4వ.** మా నాలుకల చేత మేము సాధించెదము. మా పెదవులు మావి, మాకు ప్రభువు ఎవడని వారనుకొనుచునున్నందున వారు దేవుని ఎరుగనివారు. వారి ఇచ్చకములాడు పెదవులను అన్నిటిని బింకములాడు నాలుకలన్నిటిని తీర్పుతీర్చి దేవుడు కోసివేయును.

**5-6వ. దేవుడు ఆయన వాక్యము చేయు కార్యములు: 5వ.** భక్తిలేని ఇతరులచేత బాధపడువారు, దరిద్రులు వారికి చేయబడిన బలాత్కారమునుబట్టి, వారి నిట్టూర్పులను బట్టి దేవుడు లేచి వారిని శ్రమల నుండి విడిపించి రక్షణను కోరుకొనువారికి రక్షణ కలుగజేసెదను అని సెలవిచ్చుచున్నాడు. **6వ.** యెహోవా మాటలు పవిత్రమైనవి, అవి మట్టిమూసలో ఏడుమారులు కరగి ఊదిన వెండియంత పవిత్రములు. ఈ వచనము దేవుని వాక్య ప్రామాణికత్వమును, వాక్య విలువను సూచించుచున్నవి. వాక్యము యొక్క ఔన్నత్యము 1,19 మరియు 119 కీర్తనలలోను వివరించబడినది.

**7-8వ. యెహోవా కలుగజేయు రక్షణ: 7వ.** యెహోవా, నీవు దరిద్రులను కాపాడెదవు, ఈ తరమువారి చేతిలో నుండి వారిని నిత్యము రక్షించెదవు. **8వ.** నరులలో నీచవర్తన ప్రబలమైనప్పుడు దుష్టులు గర్విష్టులై నలుదిక్కుల తిరుగులాడినను ఈ తరమువారి చేతిలో నుండి రక్షణను కోరుకొనువారిని దేవుడు తానే నిత్యము రక్షింతునని సెలవిచ్చుచున్నాడు.

## **13వ కీర్తన** (2+2+1 = 5 వ.)

**సందర్భం, అంశం :** బహుశా సౌలు ద్వారా శ్రమలు కలిగినపుడు **1సమూ 27:1-2** లో ఏదో ఒక దినమున నేను సౌలుచేత నాశనమగుదును అను సందర్భములలో ఈ కీర్తన వ్రాసి యుండవచ్చును. శత్రువు ద్వారా శ్రమలలో కృంగినపుడు ప్రార్థన ద్వారా సహాయము దొరికినదని స్తుతించుట.

**1-2వ. దేవుణ్ణి ప్రశ్నించుట:** బైబిలు గ్రంథములో 3444 ప్రశ్నలు ఉన్నవి. పాత నిబంధనలో 2442, క్రొత్త నిబంధనలో 1020 ప్రశ్నలు కలవు. అందులోని ఐదు ప్రశ్నలు ఈ మొదటి వచనములోనే కలవు. **1వ.** లో ఎన్నాళ్ళవరకు, ఎంతకాలము, ఎంతవరకు . . . అను ఈ ప్రశ్నలు మనము శ్రమలను ఎదుర్కొను సమయములో మనకందరికి వచ్చును. మా కోడలు కాన్పు తరువాత రెండు కిడ్నీలు పదకొండు దినములు పనిచేయలేదు. డాక్టర్లు డయాలసిస్ (రక్తశుద్ధి) ఎంతకాలము చేయవలెనో చెప్పలేము అన్నారు. రెండు కిడ్నీలు పదకొండు దినములకే పనిచేసినవి. మానవమాత్రులము కనుక మా కొద్ది రోజులకే మాలో ఎన్నాళ్ళవరకు, ఎంతకాలము, ఎంతవరకు అను ఇదే ప్రశ్న ఎంతో కలత, ఎన్నో రకములైన సందేహములు. దావీదుకు ముఖ్య శత్రువు సౌలు. 1సమూ 13-31 అధ్యాయములలో దావీదు 30 సంవత్సరములకు రాజయ్యాడు. 15వ అధ్యాయములో యవనుడు అని ఉన్నందున సుమారు 13 సం॥ వయసు అని తలంచిన 30 అధ్యాయములలో 30 సంవత్సరములు 15 నుండి 30 సంవత్సరముల వయసు వరకు సౌలుచే తరుమబడినపుడు ఎన్నో సందేహములు కలుగుట సహజమే. దావీదు ఎంతవరకు నా మనస్సులో నేను చింతపడుదును? ఎంతవరకు నా హృదయములో చింత, హృదయములో పగలంత దుఃఖమువలన మానసిక వ్యాధి కలిగి కృంగుదల, అనుమానము వచ్చాయి. దేవునిచేత రాజుగా అభిషేకించబడినను 27-30 అధ్యాయములలో పరుమారులు తాను చనిపోతానేమో అని అనుమానించాడు. **1సమూ 27:1-2** లో ఏదో ఒక దినమున నేను సౌలుచేత నాశనమగుదును; నేను ఇశ్రాయేలీయుల నుండి ఫిలిష్తీయుల దేశములోనికి తప్పించుకొని పోవుదును; అప్పుడు సౌలుచేతిలోనుండి తప్పించుకొందునని అనుకొని లేచి తన యొద్దనున్న ఆరువందలమందితో కూడ ప్రయాణమై గాతు రాజునైన అకీషు నొద్దకు వచ్చెను. ఇటువంటి స్థితిలో చేయవలసిన ప్రార్థన ఒకటే. దావీదు అదే చేశాడు.

**3-4వ. దేవుణ్ణి ప్రార్థించుట: 3వ.** యెహోవా, నా దేవా, నా మీద దృష్టియుంచి నాకు ఉత్తరమిమ్ము అని ప్రార్థించుచున్నాడు. **4వ.** మనసులో క్రుంగుదలను బట్టి నేను మరణ నిద్ర నొందకుండ వాని గెలిచితినని నా శత్రువు చెప్పుకొనకుండ . . . అంటున్నాడు. తన దగ్గర కొంతకాలము నాలుగు వందలమంది, అటు పిమ్మట ఆరు వందలమంది మనుష్యులు ఉండిరి. బహుశా వీరి వద్ద సరియైన ఆయుధములు లేవు కాబోలు. సౌలురాజు కనుక తన యొద్ద ఉన్న 3999 మంది యొద్ద మంచి ఆయుధములు ఉండి యుండవచ్చును. నా కన్నులకు వెలుగిమ్ము అని ప్రార్థించుచున్నాడు. మనసులో క్రుంగుదలనుబట్టి కన్నులు

అనగా మనోనేత్రములకు వెలుగు అవసరము. **కీర్తన 119:130.** నీ వాక్యములు వెల్లడి అగుటతోటనే వెలుగు కలుగును. **కీర్తన 119:11.** నా హృదయములో నీ వాక్యము ఉంచుకొనియున్నాను. వెలుగైన వాక్యము అధైర్యమును తీసివేసి మనసుకు ధైర్యమును కలిగించగలదు. నా మీద దృష్టియుంచి నాకుత్తరమిమ్మని విశ్వాసముతో ప్రార్థించాడు. యెహోవా తన దేవుడు కనుక **కీర్తన 33:12** లో తాను వ్రాసిన యెహోవా తమకు దేవుడుగా గల జనులు ధన్యులు. ఆయన తనకు స్వాస్థ్యముగా ఏర్పరచుకొను జనులు ధన్యులను వాక్యమందు విశ్వాసముతో ముందుకు సాగుచున్నాడు. దేవుని యొద్దనుండి సహాయము దొరికినదని విశ్వాసముతో పాట పాడుచున్నాడు.

**5వ. దేవుని నుండి సహాయము దొరికినందుకు పాట పాడుట:** ఎన్నాళ్లవరకు, ఎంతకాలము, ఎంతవరకు, ఎంతవరకు . . . అనుకున్నప్పుడు పాట పాడలేము. దేవుడు కృపగలవాడని గుర్తించి దావీదు దేవుని కృపయందు నమ్మికయుంచియున్నాడు. తన రక్షణ విషయమై హృదయములో హర్షించుచున్నాడు. తనను పాపము నుండి, శాపము నుండి ఆత్మీయముగా కాపాడిన, రక్షించిన దేవుడు శత్రువు నుండి శరీర విషయమై కాపుదునను నిరీక్షణతో యెహోవా నాకు మహోపకారములు చేసియున్నాడని చెప్పగలుగుచున్నాడు. హృదయములోనున్న దుఃఖము సంతోషముగా మారగా మీలో ఎవనికైనను శ్రమ సంభవించెనా? అతడు ప్రార్థన చేయవలెను; ఎవనికైనను సంతోషము కలిగెనా? అతడు కీర్తనలు పాడవలెను అను **యాకోబు 5:13** ప్రకారము నేను ఆయనను కీర్తించెదను అంటున్నాడు. **కీర్తన 119:71.** నేను నీ కట్టడలను నేర్చుకొనునట్లు శ్రమనొందియుండుట నాకు మేలాయెను అన్నట్లు శ్రమలు మన మేలుకే కలుగును.

ఆ అనుభవము మీకు, నాకు రావలెనని దావీదు దీనిని పాటగా వ్రాసి, రాగము కట్టి పాటల పుస్తకములోని మొదటి స్కందములో చేర్చాడు. సౌలుకు రాజ్యము కాని, ప్రజల క్షేమము కాని, మందిరము కాని పట్టలేదు. అటువంటివారు ఈ దినములలో కూడా ఉన్నారు. మనకు శ్రమలు కలిగింతురు. మనకు అటువంటి పరిస్థితులు సంభవించినపుడు ఈ కీర్తన చదువుకొని హృదయములో హర్షించుచు కీర్తన పాడువారముగా ఉందుము గాక.

## 14వ కీర్తన (2+2+2+1 = 7 వ.) – 53వ కీర్తన (2+2+1+1 = 6 వ.)

### అంశం : చెడిపోయిన మానవుల నుండి నీతిమంతులను కాపాడి సంతోషింపజేయు దేవుడు

**సందర్భము: 7వ.**లో చెరలోని తన ప్రజలను రప్పించునపుడు యాకోబు హర్షించును అని ఉన్నది. ఇశ్రాయేలీయులు దావీదుకు ముందు ఐగుప్తుకు చెరకు వెళ్ళిరి. 400 ఏండ్లు చెరలో ఉండగా వారు దేవునివైపు తిరిగి, గొర్రెపిల్ల రక్తము ద్వారా విమోచించబడి నీతిమంతులుగా తీర్చబడిరి. వారి సంతాన పక్షమున దేవుడు కార్యము చేసెను. అలాగే చెడిపోయిన సౌలు నుండి తనను తప్పించిన విషయమును జ్ఞాపకమందుంచుకొన్నాడు.

పితరుల నుండి వినిన గతకాల పితరుల అనుభవాలు, తన జీవితకాల అనుభవాలు కలిపి దావీదు ఈ కీర్తనగా వ్రాశాడు. 53వ కీర్తన కూడా ఇదియే.

**1–2వ. చెడిపోయిన మానవుల క్రియలు – వారి అంతము:** నీతిమంతులైన ఇశ్రాయేలీయులు చెరలో ఉన్నప్పుడు ఐగుప్తు ప్రజలు దేవుడు లేడని అనుకుంటున్నారు. వారిని దేవుడు బుద్ధిహీనులు అంటున్నాడు. **నిర్గమ 5:1** లో మోషే ఫరోతో, మా దేవుడైన యెహోవా తన ప్రజలను పోనిమంటున్నాడు అనగా ఫరో యెహోవా ఎవడు? నేను ఆయనను ఎరుగను అన్నాడు. ఆనాటికి ఈనాటికి అట్టివారు ఉన్నారు. కనుక బుద్ధిహీనులైన ఐగుప్తీయులు దేవుడు లేడని తన హృదయములలో తలంచి ఇశ్రాయేలుతో కఠిన దాస్యము చేయించిరి. అసహ్య కార్యములు చేశారు. దేవుని ప్రజలకు మేలు చేయలేదు. వివేకము కలిగి దేవుని వెదకుదురేమోనని దేవుడు ఫరోను చాలా రోజులు ఓర్చుకొని చివరకు ఫరో కుమారుని చంపాడు. సింహాసనముపై ఉన్న వ్యక్తి మొదలు చిన్న పనివాని కుమారుని వరకు జ్యేష్ఠకుమారులందరూ చనిపోయిరి. తుదకు దేవుడే ఇశ్రాయేలుకు మేలుచేసి వారిని చెరనుండి విడిపించాడు.

**3–4వ. చెడిన మానవుడు నీతిమంతులను శ్రమపెట్టుట:** చెడినవారిలో రాజైన సౌలు ఒకడు. తన బిడ్డను దావీదుకు ఇచ్చి పెండ్లి చేశాడు. దావీదు రాజౌతాడని దేవుడు సౌలుకు చెప్పాడు. దావీదు రాజైతే తన కూతురు రాణి కదా. దేవునికి ప్రార్థన చేయక దారితొలగి, దేవుని మాటను నమ్మక తన కుమార్తెను మరొకరికిచ్చి పెండ్లి చేశాడు. ఎంతగా దారితప్పి తొలగిపోయాడో చూడగలము. మేలు చేయువాడొకడైనను లేక దావీదు పారిపోవలసి వచ్చింది. అనేక సంవత్సరములు ఎవరును దావీదుకు మేలు చేయలేదు. ఈ రీతిగా పాపములోనున్న సౌలుతో దేవుడు మాటలాడకపోవుట చూచి చివరి దినములలో సౌలు బహుగా భయపడ్డాడు. అలాగే చెడిన మనసు గల ఫరో ఇశ్రాయేలీయులను ముందుగా శ్రమ పెట్టి, తరువాత మోషే ద్వారా సూచక క్రియలు చేయగా బహుగా భయపడెను. ఈ రోజులలో అంతరిక్షమునకు పోవు తెలివి ఉన్నది. కాని అంతరంగములో తమ పాపము గ్రహించే తెలివి మానవులకు లేదు. విశ్వాసులైనను తమ జీవితములోని పాపమును గ్రహించి ప్రభువును ఆశ్రయించి ప్రార్థించితే విడుదల ఉన్నది, లేనియెడల క్రమశిక్షగా శిక్ష తప్పదు.

**5–6వ., 53:5వ. దేవుడు నీతిమంతులను కాపాడును:** బాధపడు దేవుని ప్రజల ఆలోచనను అన్యులు తృణీకరించుదురు కాని యెహోవా వారికి ఆశ్రయమై యుండి, వారి సంతాన పక్షమున కార్యము చేయును. ఐగుప్తులో బాధపడిన ఇశ్రాయేలీయులను అన్యులైన ఐగుప్తీయులు తృణీకరించిరి. కాని దేవుడు వారికి ఆశ్రయమై వారి సంతానమును విస్తరింపజేశాడు. ఫరో సైన్యమును, గుర్రములు రౌతులను ఎర్ర సముద్రములో ముంచి ఫరోను సిగ్గుపరిచాడు.

**7వ., 53:6వ. సీయోను నుండి రక్షణ కలుగగా ఇశ్రాయేలు సంతోషించుట:** ఇశ్రాయేలీయులకు ఐగుప్తీయుల నుండి విమోచన దేవుడే కలిగించాడు. వారందరూ హర్షించిరి. దావీదుకు గొల్యాతు నుండి రక్షణ దేవుడే కలిగించాడు. దేవుని యొక్క కాపుదలను బట్టి సౌలు బారినుండి తప్పించబడ్డాడు.

## 15వ కీర్తన (1+1+3 = 5 వ.)

**అంశం :** దేవుని గుడారములో (మందిరములో) సహవాసము చేయువారి ప్రవర్తన, మోషే కాలములో మొదటి నిర్మించబడిన ప్రత్యక్ష గుడారము మందిరమే. దావీదు కాలములోను ఈ గుడారమే మందిరము. కనుక దేవుని గుడారములో అనగా దేవుని మందిరములో సహవాసము చేయువారి ప్రవర్తన ఈ కీర్తనలో ప్రాముఖ్యమైన అంశము.

**1వ. ప్రశ్న; 2వ. జవాబు; 3-5వ. వివరము**

**1వ. ప్రశ్నలు:** 1) యెహోవా, నీ గుడారములో అతిథిగా ఉండదగినవాడెవడు? 2) నీ పరిశుద్ధ పర్వతము మీద నివసింపదగిన వాడెవడు?

1. దేవుని గుడారములో అనగా దేవుని మందిరములో సహవాసము చేయువారి ప్రవర్తన.

2. **యోహాను 14:1-3వ. 1వ.** మీ హృదయమును కలవరపడనియ్యకుడి; దేవునియందు విశ్వాసముంచుచున్నారు. నాయందును విశ్వాసముంచుడి. **2వ.** నా తండ్రి యింట అనేక నివాసములు కలవు. లేనియెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నాను. **3వ.** నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరు ఉండులాగున మరల వచ్చి నా యొద్ద నుండుటకు మిమ్మును తీసికొనిపోవుదును. ఈ భాగమునుబట్టి దేవుని పరిశుద్ధ పర్వతమగు పరలోకములో నుండబోవువారి ప్రవర్తన ఎలాగుండాలో చెప్పబడినదని తలంచవచ్చును.

**2వ. జవాబు: 1కొరింథీ 1:2వ.** దేవుని సంఘమునకు, అనగా క్రీస్తుయేసునందు పరిశుద్ధపరచబడినవారై పరిశుద్ధులుగా ఉండుటకు పిలువబడినవారు, కనుక పరిశుద్ధులుగా ఉండుటయే ప్రాముఖ్యమైన అంశము. అందున్న మూడు అంశములు ఇక్కడ చెప్పబడినవి. 1. యథార్థమైన ప్రవర్త కలిగినవాడు (He that walketh uprightly) 2. నీతిని అనుసరించి పనిచేయువాడు (worketh righteousness ) 3. హృదయపూర్వకముగా నిజము పలుకువాడే (**Words of Truth**) (speaketh truth in his heart)

1) యథార్థమైన ప్రవర్త, 2) నీతిఫలము – పని, 3) నిజము పలుకు (**WALK - WORK - WORD**).

1) యథార్థమైన ప్రవర్తన కలిగినవాడు (He that walketh uprightly): **యోబు 1:1, 1:8, యోబు 2:3.** ఊజు దేశమునందు యోబు అను ఒక మనుష్యుడుండెను. అతడు యథార్థవర్తనుడు, న్యాయవంతుడునై దేవునియందు భయభక్తులు కలిగి చెడుతనము విసర్జించినవాడు. **2:9** అతని భార్య వచ్చి, నీవు ఇంకను యథార్థతను వదలకయుందువా?

**యోబు 4:7.** ఏలీఫసు (దేవుని బలము కలవాడు), జ్ఞాపకము చేసికొనుము, నిరపరాధియైన యొకడు ఎప్పుడైన నశించెనా? యథార్థవర్తనులు ఎక్కడనైన నిర్మూలమైరా? **యోబు 8:6.** బిల్దదు (వాదించువాడు), నీవు పవిత్రుడవై యథార్థవంతుడవైన యెడల నిశ్చయముగా

ఆయన నీయందు శ్రద్ధ నిలిపి నీ నీతికి తగినట్టుగా నీ నివాసస్థలమును వర్ధిల్లజేయును. **యోబు 11:2.** జోఫర్ (కిచకిచలాడువాడు), ప్రవాహముగా బయలువెళ్లు మాటలు ప్రత్యుత్తరము చెప్పవలెను గదా. వదరుబోతు వ్యాజ్యెము న్యాయమని యెంచదగునా?

2) నీతితో (పనిచేయువాడు) ననుసరించువాడు (worketh righteousness): **హెబ్రీ 11:4.** విశ్వాసమునుబట్టి హేబెలు కయీనుకంటె శ్రేష్టమైన బలి దేవునికి అర్పించెను. దేవుడతని అర్పణలను గూర్చి సాక్ష్యమిచ్చినప్పుడు అతడు ఆ విశ్వాసమునుబట్టి నీతిమంతుడని సాక్ష్యము పొందెను. అతడు మృతినొందియు ఆ విశ్వాసము ద్వారా మాటలాడుచున్నాడు. **హెబ్రీ 11:7.** విశ్వాసమునుబట్టి నోవహు అదివరకు చూడని సంగతులను గూర్చి దేవునిచే హెచ్చరింపబడి భయభక్తులు గలవాడై అతడు లోకము మీద నేరస్థాపన చేసి విశ్వాసమునుబట్టి కలుగు నీతికి వారసుడాయెను. **ఆది 6:9.** నోవహు వంశావళి యిదే. నోవహు నీతిపరుడును, తన తరములో నిందారహితుడునై యుండెను. నోవహు దేవుడైన యెహోవాతో నడచినవాడు. **యోబు 12:4.** నా స్నేహితునికి అపహాస్యాస్పదముగా నుండవలసివచ్చెను. నీతి, యథార్థత గలవాడు అపహాస్యాస్పదముగా నుండవలసి వచ్చెను.

3) హృదయపూర్వకముగా నిజము పలుకువాడే (speaketh truth in his heart). **3వ.** అట్టివాడు నాలుకతో కొండెములాడడు. **కీర్తన 26:2.** యెహోవా, నన్ను పరిశీలించుము, నన్ను పరీక్షించుము. నా అంతరింద్రియములను నా హృదయమును పరిశోధించుము. **యోబు 42:7.** యోబు యెహోవా మీతో ఆలాగు చెప్పగా యోబువలె స్నేహితులు యుక్తమైనది పలుకలేదని యెహోవా అన్నాడు.

**3-5వ. వివరము:**

| | |
|---|---|
| **3వ.** 1) అట్టివాడు నాలుకతో కొండెములు ఆడడు | (పలుకు) నాలుక |
| 2) తన చెలికానికి కీడుచేయడు | (ప్రవర్తన) చేయి |
| 3) తన పొరుగువాని మీద నిందమోపడు | (పలుకు) నాలుక |
| **4వ.** 4) అతని దృష్టికి నీచుచు అసహ్యుడు | (ప్రవర్తన) కన్ను |
| 5) అతడు యెహోవాయందు భయభక్తులు గలవారిని సన్మానించును | (ప్రవర్తన) |
| 6) అతడు ప్రమాణము చేయగా నష్టము కలిగినను మాట తప్పడు | (పలుకు) నాలుక |
| **5వ.** 7) తన ద్రవ్యము వడ్డికి ఇయ్యడు | (పని) చేయి |
| 8) నిరపరాధిని చెరుపుటకై లంచము పుచ్చుకొనడు | (పని) చేయి |
| 9) ఈ ప్రకారము చేయువాడు ఎన్నడు కదల్చబడడు | (పని) చేయి |

నీచుడు - నిరపరాధి, పొరుగువాడు - చెలికాడు, యెహోవాయందు భయభక్తులు గలవాడు.

**నాలుక: యాకోబు 3:1-2.** ఎవడైనను మాటయందు తప్పనియెడల అట్టివాడు లోపము లేనివాడై, తన సర్వశరీరమును స్వాధీనమందుంచుకొన శక్తి గలవాడు. అలాగుననే నాలుక

కూడా చిన్న అవయవమైనను బహుగా అదిరిపడును. ఎంత కొంచెము నిప్పు ఎంత విస్తారమైన అడవిని తగులబెట్టును. నాలుక అగ్నియే, నాలుక మన అవయవములలో ఉంచబడిన పాప ప్రపంచమై సర్వశరీరమునకు మాలిన్యమును కలుగజేయుచు, ప్రకృతి చక్రమునకు చిచ్చుపెట్టును; యే నరుడును నాలుకను సాధుచేయ నేరడు; అది మరణకరమైన విషముతో నిండినది; అది నిరర్గళమైన దుష్టత్వమే. దీనితో తండ్రియైన ప్రభువును స్తుతింతుము, దీనితోనే దేవుని పోలికగా పుట్టిన మనుష్యులను శపింతుము.

**కన్ను: మత్తయి 6:22-23.** దేహమునకు దీపము కన్నే గనుక నీ కన్ను తేటగా ఉండిన యెడల నీ దేహమంతయు వెలుగుమయమై యుండును. నీ కన్ను చెడినదైతే నీ దేహ మంతయు చీకటిమయమే; నీలోనున్న వెలుగు చీకటియై యుండినయెడల ఆ చీకటి ఎంతో గొప్పది.

**చేయి: లూకా 23:34.** యేసు - తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు . . . పై విషయాలు గమనించి జాగ్రత్తగా ఉండువాడు ఎన్నడును కదల్చబడడు అని గమనింతము.

## 16వ కీర్తన (2+2+2+3+2 = 11 వ.)

**అంశం : ఆపదలో ప్రార్థన, ఆరాధన - దేవుని సహాయము, రక్షణనుబట్టి స్తుతి**

**అపో.కా. 2:25-27** లో ఈ కీర్తనలోని 8-10 వచనములున్నందున ఇది మెస్సీయ కీర్తన. మెస్సీయగా సిలువకు వెళ్ళునపుడు ఆయన చేసిన ప్రార్థన మనకు మాదిరి. మన తప్పులనుబట్టి శ్రమలు రావచ్చును. లేదా పరీక్షగా శ్రమలు రావచ్చును. దావీదుగారు వ్రాసిన 76 కీర్తనలలో సుమారు 40 కంటె ఎక్కువ కీర్తనలు ఆపద, శ్రమలలో ఉన్నపుడు వ్రాసినవి. దేవుని హృదయానుసారునికే ఇన్ని శ్రమలు కలిగిన మనకు **యోహాను 16:33** ప్రకారము కలుగునని గమనింతము. (లోకములో మీకు శ్రమ కలుగును; అయినను ధైర్యము తెచ్చుకొనుడి, నేను లోకమును జయించియున్నాననెను).

**1-2వ. ప్రార్థన: 1వ.** దేవా, నీ శరణుజొచ్చియున్నాను, నన్ను కాపాడుము. ప్రజలకు శ్రమలు వస్తే రాజును ఆశ్రయించుదురు. అటువంటి రాజుకు శ్రమలు వస్తే?. . . **ఆది 17:1.** అబ్రాము తొంబదివ తొమ్మిది యేండ్ల వాడైనప్పుడు యెహోవా అతనికి ప్రత్యక్షమై, నేను సర్వశక్తిగల దేవుడను అన్నాడు. కనుక రాజైనా, ప్రజలైనా దేవుని శరణుజొచ్చవలసినదే. యేసు కూడా సిలువలో, ఏలీ - సర్వశక్తుడైన దేవా అన్నాడు. **2వ.** నీవు ప్రభుడవు, నీకంటె నాకు క్షేమాధారామేదియు లేదని యెహోవాతో నేను మనవి చేయుదును. రక్షణ కొరకై **రోమా 10 :9** ప్రకారము, యెహోవాతో మనవి చేయాలి. యేసు ప్రభువవని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల, నీవు రక్షింపబడుదువు. ఏలయనగా నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును. రక్షించబడిన తరువాత ఓడలు బండ్లు, బండ్లు ఓడలు కాగలవను సామెతను జ్ఞాపకము చేసికొందము.

మన వనరులు, డబ్బు, ఆరోగ్యము మీద కాక, దేవుని మీదనే ఆధారపడాలి. రాజైన దావీదు కూడా కష్ట స్థితిలోనున్నట్లు **1దిన 22:14** లో అన్నాడు.

**3-4వ. సహవాసము (3వ. లో ఉండవలసిన సహవాసమును 4వ ఉండకూడని సహవాసము): 3వ.** నేనీలాగందును, భూమి మీదనున్న భక్తులే శ్రేష్ఠులు; వారు నాకు కేవలము ఇష్టులు. రక్షించబడిన తరువాత భక్తుల సహవాసము ప్రాముఖ్యమైనది. **అపో.కా. 2:42** ప్రకారము అపొస్తలుల బోధ, సహవాసము రొట్టె విరుచుట, ప్రార్థన చేయుటయందు ఎడతెగక యుండాలి. **4వ.** యెహోవాను విడిచి వేరొకని అనుసరించినవారికి శ్రమలు విస్తరించును. వారర్పించు రక్త పానీయార్పణములు నేనర్పింపను. వారి పేర్లు నా పెదవులనెత్తను. **2రాజులు 21:3-4.** మనష్షే తన తండ్రియైన హిజ్కియా పడగొట్టిన ఉన్నత స్థలములను తిరిగి కట్టించి, బయలుదేవతకు బలిపీఠములను కట్టించి, నక్షత్రాలకు మ్రొక్కి వాటిని పూజించుచుండెను. యెహోవా మందిరమునకున్న రెండు సాలలో ఆకాశ సమూహములకు అతడు బలిపీఠములను కట్టించెను. అతడు తన కుమారుని అగ్నిగుండము దాటించి, జ్యోతిష్యమును శకునములను వాడుకజేసి, యక్షిణిగాండ్రతోను, సోదెగాండ్రతోను సాగంత్యము చేసెను. ఈ ప్రకారము అతడు యెహోవా దృష్టికి బహుగా చెడుతనము జరిగించుచు ఆయనకు కోపము పుట్టించెను. చెడు నడత కనుపరచి, తాను పెట్టుకొనిన విగ్రహముల వలన యూదావారు పాపము చేయుటకు కారకుడాయెను. **19-22వ.** ఆమోను ఏలనారంభించి తన తండ్రియైన మనష్షే నడిచినట్లు యెహోవా దృష్టికి చెడునడత నడిచెను. దేవుడైన యెహోవాను విసర్జించి యెహోవా మార్గమందు నడువక తన తండ్రి పూజించిన విగ్రహములను తానును పూజించెను. దావీదు వలె యెహోవాను విడువక ఆయన మార్గములందు నడవాలి.

**5-6వ. విశ్వాసి స్వాస్థ్యము - యెహోవా నా స్వాస్థ్యభాగము:** 1) యెహోవా నా స్వాస్థ్యభాగము నీవే. **ఫిలిప్పీ 1:30.** క్రీస్తునందు విశ్వాసముంచుట మాత్రమేకాక ఆయన పక్షమున శ్రమపడుట మీకు అనుగ్రహించబడియున్నది. **కొలస్సీ 1:24 -** ఇప్పుడు మీ కొరకు నేను అనుభవించుచున్న శ్రమలయందు సంతోషించుచు, సంఘము అను ఆయన శరీరము కొరకు క్రీస్తు పడిన పాట్లలో కొదువైన వాటియందు నా వంతు నా శరీరమందు సంపూర్ణము చేయుచున్నాను. **మత్తయి 20:22** అందుకు యేసు, మీరేమి అడుగుచున్నారో అది మీకు తెలియదు. నేను త్రాగబోవు గిన్నెలోనిది మీరు త్రాగగలరా? అని అడుగగా యాకోబు, యోహానులు వారు త్రాగగలమనిరి. **23.** ఆయన, మీరు నా గిన్నెలోనిది త్రాగుదురు గాని నా కుడివైపున నా యెడమ వైపున కూర్చుండనిచ్చుట నా వశమున లేదు; నా తండ్రిచేత ఎవరికి సిద్ధపరచబడితే వారికే అది దొరుకునని చెప్పెను. 2) నా భాగమును - బహుమానమును (కిరీటమును) కాపాడుచున్నావు.

**6వ.** మనోహర స్థలములలో (సంఘము) నాకు పాలు (వాక్యము) ప్రార్తించెను. శ్రేష్టమైన స్వాస్థ్యము (పరలోకము) నాకు కలిగెను.

**7-11వ. స్తుతి అంశములు: 7-9వ. విశ్వాసి స్థితి, 10-11వ. విశ్వాసి నిత్యత్వము**
**7-9వ. విశ్వాసి స్థితి. 7వ.** ఆలోచనకర్త - నాకు ఆలోచనకర్తయైన యెహోవాను

స్తుతించెదను. రాత్రి గడియలలోన నా అంతరింద్రియము నాకు బోధించుచున్నది.

**8వ. విశ్వాసి గురి.** సదాకాలము యెహోవా యందున నా గురి **(ఫిలిప్పీ 3:14)** నిలుపుచున్నాను. ఆయన నా కుడిపార్శ్వమందు ఉన్నాడు గనుక నేను కదల్చబడను. **రోమా 8:34.** శిక్ష విధించువాడెవడు? చనిపోయిన క్రీస్తు యేసే. అంతేకాదు, మృతులలో నుండి లేచినవాడును దేవుని కుడిపార్శ్వమున ఉన్నవాడును మన కొరకు విజ్ఞాపనము కూడా చేయువాడును ఆయనే.

**9వ. విశ్వాసి భద్రత.** అందువలన నా హృదయము సంతోషించుచున్నది. నా ఆత్మ హర్షించుచున్నది. నా శరీరము కూడ సురక్షితముగా నివసించుచున్నది. **రోమా 8:23.** అంతేకాదు, ఆత్మ యొక్క ప్రథమ ఫలముల నొందిన మనము కూడ దత్తపుత్రత్వము కొరకు, అనగా మన దేహము యొక్క విమోచనము కొరకు కనిపెట్టుచు మనలో మనము మూలుగుచున్నాము.

**10-11వ. విశ్వాసి నిత్యత్వము:**

**10వ. విశ్వాసి పునరుత్థానము.** ఎందుకనగా నీవు నా ఆత్మను పాతాళములో విడిచిపెట్టవు. నీ పరిశుద్ధుని కుళ్లుపట్టనియ్యవు. రెప్పపాటులో మార్చబడి **(1కొరింథీ 15:52-54)** కొనిపోబడి సదాకాలము ప్రభువుతో నుందుము **(1థెస్స 4:15-17).**

**11వ. విశ్వాసి నిత్యత్వము.** జీవమార్గమును నీకు నాకు తెలియజేసెదవు. నీ సన్నిధిని సంపూర్ణ సంతోషము కలదు. నీ కుడిచేతిలో నిత్యము సుఖములు కలవు. **రోమా 8:37.** అయినను మనలను ప్రేమించిన వాని ద్వారా మనము వీటన్నిటిలో అత్యధిక విజయము పొందు చున్నాము. 38. మరణమైనను జీవమైనను దేవదూతలైనను ప్రధానులైనను ఉన్నవియైనను రాబోవునవియైనను అధికారులైనను ఎత్తయినను లోతైనను సృష్టింపబడిన మరి ఏదైనను, 39. మన ప్రభువైన క్రీస్తుయేసునందులి దేవుని ప్రేమ నుండి మనలను ఎడబాపనేరవని రూఢిగా నమ్ముచున్నాను.

## 17వ కీర్తన (3+3+3+3+3 = 15 వ.)

**అంశం, సందర్భము:** ఈ కీర్తనలో ఆత్మరక్షణ మాత్రమే కాక అనుదినము శరీరమును రక్షించుట కలదు. దేవుని బిడ్డల మీదికి లేచేవారు చాలామంది ఉంటారు. అప్పుడు దేవుని బిడ్డలు ఆయన శరణుజొచ్చేవారుగా ఉంటారు. మీరు, నేను ఆ పనే చేయాలి. సమస్యలు ఎదుర్కొన్నప్పుడు మనము దేవుని శరణుజొచ్చేవారుగా ఉండాలి. దేవుని శరణుజొచ్చినప్పుడు ఆయన తన కుడిచేత రక్షించేవాడు. కుడిచేయి బలానికి గుర్తు. అంటే ఆయన బలవంతుడైన దేవుడు. మన శత్రువుల నుండి రక్షించే దేవుడు. శరణుజొచ్చుట అనే పదము కీర్తనల గ్రంథములో 70 సార్లు వ్రాశాడు. మనమును ఆయన శరణుజొచ్చేవారముగా ఉండాలి. శరణుజొచ్చినట్లయితే మనము చేసే మేళ్ళు మనలను కాపాడు విధము 17వ కీర్తనలో ఉన్నాయి. ఆయన శరణుజొచ్చినప్పుడు దేవుడు విడిపిస్తాడు. జయాన్నిస్తాడు. మనము

ఆయనను స్తుతిస్తాము. అయితే దావీదు జవాబు రాకముందే విడిపించి జయమిస్తాడు అనే నమ్మకంతో స్తుతించేవాడు. అటువంటి గాఢమైన విశ్వాసము మనకుండాలి. 5వ వచనము ప్రాముఖ్యమైనది. ఆయన నామములో నమ్మకముంచాలి.

ఈ కీర్తన వ్రాసిన సందర్భము 11వ వచనములో తెలిసికొనగలము. మా అడుగుజాడలను గురుతుపట్టి వారిప్పుడు మమ్మును చుట్టుకొనియున్నారు. **1సమూ 23వ** అధ్యాయములో దావీదు ఫిలిష్తీయుల నుండి కెయీలావారిని రక్షించి కెయీలాలోనే ఉన్నాడు. సౌలు విని దావీదు ద్వారములు అడ్డుగడలు గల పట్టణములో ప్రవేశించి అందులో మూయబడి ఉన్నాడు. దేవుడు అతనిని నా చేతికి అప్పగించెననుకొనెను (7). సౌలు కెయీలాకు పోయి దావీదు అతని జనులను ముట్టడింపవలెనని జనులందరిని యుద్ధమునకు పిలిచెను (9). సౌలునకు ప్రజలు క్షేమము ఏమీ పట్టలేదు. దావీదును చంపాలని వెదుకుచున్నాడు. **1సమూ 13వ** అధ్యాయము నుండి 30వ అధ్యాయము వరకు తరుముతూనే ఉన్నాడు. కెయీలా దోచుకొనబడుతూ ఉంటే సౌలుకు పట్టలేదు. దావీదు కెయీలా కాపురస్థులను రక్షించాడు. అయినను వారు దావీదును సౌలుకు పట్టించడానికి ఇష్టపడ్డారు. ఎంత విచిత్రమైన జనమో చూడండి. దావీదు ప్రార్థించాడు. దేవుడు పారిపొమ్మంటే పారిపోయాడు. **1సమూ 24వ** అధ్యాయములో సౌలును దావీదుకు అప్పగించాడు. బాల్యకాలములో దేవుడు **1సమూ 15వ** అధ్యాయములో అభిషేకించినను, **31వ** అధ్యాయము వరకు 30 ఏండ్ల వయసు వరకు నెరవేర్పుకై దావీదు కనిపెట్టాడు.

**1-3వ. ప్రార్థన - దేవునిచేత పరిశోధింపబడుట:** ప్రార్థనలు దేవుని సన్నిధిలో తన జీవితాన్ని బట్టి దేవునిచేత పరిశోధింపబడుచున్నాడు. తన జీవితము పరిశోధించుకున్న తరువాత నాకు ఏ దురాలోచన కానరాలేదు అంటున్నాడు. నోటి మాటచేత నేను అతిక్రమింపను సౌలు రాజును ఎన్నిమాటలైన అనవచ్చు, అనలేదు. 5లో కాలు జారలేదు అంటున్నాడు. నోరు, హృదయము, కాలు అన్నీ బాగున్నాయి. ఈయన ప్రవర్తన బాగుంది. కనుక కాండక్ట్ ఎంతో ముఖ్యము. స్కూల్లో చేరేటప్పుడు, ఉద్యోగాల్లో చేరేటప్పుడు కాండక్ట్ అడుగుతారు. సౌలు పెట్టే శ్రమలనుబట్టి సౌలు ఎప్పుడు చస్తాడా అని అనుకోవాలి. అలా అనుకోలేదు. కనుక నోటిమాటను అతిక్రమింపకూడదు. నడకను స్థిరపరచుకోవాలి. ప్రతిరాత్రి దేవుని సన్నిధిలో దేవుని చేత పరిశోధింపబడి మన హృదయములో ఏ దురాలోచన కానరాలేదు అని దేవునిచేత చెప్పించుకుంటే ఎంత బాగుంటుంది. నోటితో, కాళ్లతో చేసే పనులు కనబడతాయి. హృదయ ఆలోచనలు కనబడవు. కనుక రెండు రకాలుగా మనము పరిశీలించబడాలి. ఏ లోపము లేదని నిశ్చయము చేసుకోవాలి. 13వ కీర్తన కూడా దావీదుగారే వ్రాశారు. నీవు నన్ను పరిశీలించి తెలుసుకొని యున్నావు అంటున్నాడు. నేను కూర్చుండుట, లేచుట, నా నడక, పడక పరిశీలించావు అంటున్నాడు. మన జీవితాన్ని ప్రభువు పరిశీలించినప్పుడు మనలోని ఏ లోపము లేకుండునట్లు పరిశీలించుదుము గాక.

**4-6వ. బలాత్కారుల నుండి తప్పించుకొనుటకు దేవుని నోటిమాట ప్రాముఖ్యమైనది:** రకరకాల బలాత్కారులు కనిపిస్తారు. దుష్టులు, ప్రాణశత్రువులు, హృదయ కాఠిన్యము

గలవారు, గర్వముగా మాటలాడువారు, లోకులు, సింహాలలాంటివారు ఉన్నారు. లోకులు అంటే అన్యులు. ఈ జీవిత కాలంలోనే తమ పాలు (14) అంటున్నాడు. అన్యులకు ఈ జీవితకాలం మట్టుకే అవసరము. పరలోకపు నిరీక్షణ ఉండదు. ఒక్క కీర్తనలోనే ఎన్ని రకాల మనుష్యులు ఉన్నారో చెబుతున్నాడు. ఇశ్రాయేలీయులు ఆత్మీయులుగా మనకు సాదృశ్యముగా ఉన్నారు. నమ్మితిమని చెప్పుకునే వారిలోనే ఎన్నో రకాలు. మీదికి లేచువారు, లయపరచు కోరువారు, శత్రువులు, మనము కూడా వారివలె ఉండగలము. కనుక విశ్వాసి లోకస్థుల మధ్య, విశ్వాసుల మధ్య ఎన్ని రకాలైన మనుష్యులను ఎదుర్కొవలసి వస్తుందో ఈ కీర్తనలో వ్రాస్తున్నాడు.

**7-9వ. శరణుజొచ్చిన వారిని రక్షించువాడు:** నీ శరణుజొచ్చితిని తండ్రి నాకు నీ కృప చూపుము అంటున్నాడు. **8వ**. లో కాపాడుము, కాపాడుము అంటున్నాడు. ఈ ప్రార్థనలో శత్రువులకు కీడు కలిగించుము అని ఒక్క మాట కూడా అనుటలేదు. **9వ.** లో (1) కనుపాపను కాపాడినట్లు కాపాడుము. మన దేవుడు కనుపాపను కాపాడినట్లు కాపాడతాడు. కనుపాపను రెప్పలు ఎలాగు కాపాడతాయో ఆలాగు మనలను కాపాడతాడు. (2) లయపరచుగోరు దుష్టుల నుండి కాపాడుము, (3) నా ప్రాణ శత్రువుల చేత చిక్కకుండా నీ రెక్కల క్రింద కాపాడుము. నన్ను కాపాడుము. నన్ను దాచుము అని ప్రార్థన చేస్తున్నాడు.

**10-12వ. హృదయము కఠినపరచుకొని గర్వముగా మాటలాడుట:** అడుగుజాడలు గుర్తుపట్టి అంటే దావీదు కెయీలాలో ఉన్నాడని గుర్తుపట్టి దావీదును బంధించమన్నాడు సౌలు. ఆనాడు ఆత్మీయతను పోగొట్టుకున్నాడు. ఈనాడు రక్షింపబడి సరిగా నడవలేని వారికి సౌలు గుర్తుగా ఉన్నాడు. విశ్వాసంలో వారి తోటివారితో కూడా సరిగా ఉండరు. హృదయాలు కఠినపరచుకున్నారు. ఒకసారి ఆలోచించుకుందాము. మన హృదయాలు కఠినముగా ఉన్నాయా? మృదువుగా ఉన్నాయా పరిశీలించుకుందాము. దేవుని వాక్యము సూర్యరశ్మితో పోల్చవచ్చు. సూర్యరశ్మిలో వెన్నను, బంకమట్టిని ఉంచితే వెన్న కరిగిపోతుంది. బంకమన్ను ఇంకా గట్టిపడుతుంది. కొంతమంది హృదయాలు దేవుని వాక్యము ఎన్నిసార్లు విన్నా మెత్తనపడవు. ఇంకా కఠినులై నోటితో గర్వముగా మాట్లాడుదురు. ఇశ్రాయేలీయులను పరిపాలించిన 19 మందిలో ఒక్కరు మంచివారు లేరు. యూదావారిని పరిపాలించిన 20 మందిలో నలుగురు చాలా మంచివారు. ఆశ్చర్యమేమంటే వాళ్ళు కూడా ఆఖరులో గర్వించారు. హిజ్కియా, ఉజ్జియా గర్వించినవాళ్ళే. యోషీయా గర్వించాడు. 8 మంది మంచివాళ్ళు ఉన్నారు. వారు కూడా గర్వించినవాళ్ళే. మన హృదయాలలో కూడా గర్వము ఉండగలదు. హృదయము నిండినదానినిబట్టి పెదవులు మాట్లాడుతూ ఉంటాయి. మన సంఘములలో కూడా గర్వించి సింహములవలె తమ కోరిక నెరవేర్చుకొనుటకు సహోదరులకు ఇబ్బంది కలిగింతురు.

**13-15వ. దుష్టుల చేతిలో నుండి వెంటనే రక్షించువాడు:** కెయీలా కాపురస్థులు తనను సౌలుకు పట్టిస్తారని తెలిసికొని దేవుని సెలవుతో దావీదు పారిపోయాడు. ఆ వర్తమానము కూడా సౌలుకు వచ్చింది. దావీదు రక్షింపబడ్డాడు. ఇది ఆత్మరక్షణ కాదు.

అనుదిన జీవితములో రక్షణ. దేవుడు మన అనుదిన జీవితములో రక్షించేవాడు. **13-14వ.** లో ఈ జీవితకాలములో దేవుడు ఇచ్చిన రక్షణ చెప్పబడినది. **15వ.** లో నిత్యకాలములో దేవుని రక్షణలో చెప్పబడింది. ఈ లోకుల కుమారులు నీ చేత తృప్తినొందుచున్నారు. నీవు సహాయము చేసిన ఈ మనుష్యులే నా మీద లేచుచున్నారు, కాపాడుము అంటున్నారు. కనుక ఈ జీవితకాలములో మనకు కీడుచేసే వారి నుండి రక్షిస్తాడు. దావీదు ఈ కాలానికే కాదు, రాబోవు కాలములో కూడా మంచి పునాది వేసుకున్నాడు. మనము కూడా ఆలాగు జీవించుదముగాక.

## 18వ కీర్తన (6+6+6+6+6+6+6+6+2 = 50 వ.)

**అంశం : దావీదు రాజైన దినమున దేవుని రక్షణ, గొప్పతనమును బట్టి స్తుతించుచున్నాడు.**

ఇది స్తుతికీర్తన. ప్రార్థన కీర్తన. మెస్సీయ కీర్తన కూడా. **18 వ కీర్తన, 2సమూ 22 అధ్యాయము** ఒకటిగానే ఉన్నాయి. రెండింటి పీఠిక ఒకటే. సౌలు చేతిలోనుండి, శత్రువుల చేతిలోనుండి తప్పించిన దినమున, అనగా సౌలు చనిపోయాడు. దావీదు రాజు అయ్యాడు. దావీదు రాజైన దినమున ఈ కీర్తన వ్రాశాడు అనుకోవచ్చు. ఆ మాటలు కూడా మనము చూస్తాము. నీవు నియమించిన రాజునకు (50) గొప్ప రక్షణ కలుగజేయువాడవు అంటున్నాడు. సౌలు చేతిలో నుండి రక్షించావు, శత్రువుల చేతిలోనుండి రక్షించాడు. దానికంటే ముందుగా ఆత్మీయంగా రక్షించావు. అందుకే రక్షణ అనే అంశము ఇందు ఇమిడిఉందని గ్రహించాలి. తన్ను రాజుగా చేసిన దినములో ఇంత పెద్ద కీర్తన వ్రాశాడు. దేవుణ్ణి స్తుతించాడు. మీరు, నేను కూడా ప్రమోషన్ పొంది స్తుతి కూడిక పెట్టగా వచ్చినవారు దేవుణ్ణి కాక మనలను స్తుతించుట జరుగును. 50వ వచనములతో దావీదు కీర్తన వ్రాశాడు, గానం చేశాడు, పుస్తకంలో చేర్చాడు. నాటినుండి నేటివరకు అనేకులను ఆదరించిన కీర్తనగా మనము చూస్తాము. ఈ కీర్తన పీఠికలో దాసుడైన దావీదు అన్నాడే కానీ రాజైన దావీదు అని అతిశయించలేదు. ఆ దినాలలో దాసుడు అనగా బానిస, స్వంత ఇష్టము లేనివాడు. ఇది మనకు మాదిరి. దేవుడు చేసిన మేలులు గ్రంథస్థము చేసిన ఆ గ్రంథాలు శాశ్వితముగా ఉంటాయి. ఇంటర్నెట్‌లో పెడితే ప్రపంచంలో దాని ఎవరైనా చూసుకుంటారు. దావీదుగారికి ఆ సౌకర్యం లేదు. కీర్తనల గ్రంథంలో చేరాడు. తన తరువాతివారు చదవగలిగారు. **1-24వ.లో విడుదల -** విడిపించుటకు వచ్చే దేవుడు ఏ రీతిగా విడిపిస్తాడో ఆ కారణాలతో చెబుతున్నాడు. కనుక సగము కీర్తనలు విడుదల ప్రాముఖ్యమైన అంశము. **25-42 వ.** వరకు దేవుని గొప్పతనము ప్రాముఖ్యమైన అంశముగా వివరించబడినది. **2** భాగాలు, మొదటి భాగము స్తుతినొందదగినవాడు, కీర్తనీయుడు. ఆఖరు భాగము నన్ను హెచ్చించాడు, రక్షించాడు అని చెబుతున్నాడు. మధ్యలో మొదటి మూడు భాగాలలో దేవుడు గొప్పవాడని, 7వ భాగములో ఆయన స్తుతినొందదగిన దేవుడని చెబుతున్నాడు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయన విడిపించిన దేవుడు, ఆయన గొప్పతనాన్నిబట్టి స్తోత్రించదగిన దేవుడు అనవచ్చును.

**1-6వ. యెహోవా స్తుతి కీర్తనీయుడు:** యెహోవా నా బలమా నేను నిన్ను ప్రేమించుచున్నాను. గ్రీకులో క్రొత్త నిబంధనలో క్రీస్తు ప్రేమను అగాపే పదముతో సూచించారు. అదే అర్థము ఉన్న హెబ్రీ పదము ఇక్కడ వ్రాయబడినది. అంటే దేవుడు మనలను ఏ రీతిగా ప్రేమిస్తున్నాడో అదే రీతిగా మనము దేవుని ప్రేమించాలి. దేవుడు ఎవరు? యెహోవాయే. ఆయన నా శైలము, నా కోట, నన్ను రక్షించువాడు, నా కేడెము, నా రక్షణ శృంగము, నా ఉన్నత దుర్గం. ఇలా ఏడు పేర్లు ఆయనకు పెట్టుచున్నాడు. దుర్గము అంటే కోట. పూర్వము రాజులు శత్రువుల నుండి కాపాడుకునేందుకు ఎత్తైన కోటలు కట్టుకునేవారు. ఇలాంటి దుర్గాలు, దావీదుగారికి మంచి కోటలు ఉన్నాయి. కానీ అవి నన్ను కాపాడతాయి అని చెప్పడం లేదు. యెహోవాయే నా ఉన్నత దుర్గము అంటున్నాడు. మనకు ఎన్ని గొప్పలున్నను యెహోవా మీదే మనము ఆధారపడాలి. దుర్గాలు గాని, కోటలు గాని మనతో ఉండవు. సదాకాలము యుగాంతము వరకు దేవుడు మనకు తోడుగా ఉంటాడు. కీర్తనీయుడైన యెహోవాకు నేను మొరపెట్టగా నా శత్రువుల చేతిలో నుండి నన్ను రక్షించును. గొప్ప విశ్వాసము అనుకున్నాము గాని ఆయనకు వచ్చిన ఆపదలలో మరణపాశములు, చనిపోవలసిన సమయాలు ఎన్నో వచ్చాయి. భక్తిహీనులు వరదవలె పొరలిరి. పాతాళపు పాశములు, మరణపు ఉరులు ఆవరించాయి. ఇలాంటి శ్రమలలో దావీదు మొరపెట్టాడు, ప్రార్థించాడు. ఆయన నా ప్రార్థన అంగీకరించాడు. నా ప్రార్థన విన్నాడు అంటున్నాడు. ప్రార్థన మన ఆత్మీయ ఆయుధము. రాజయ్యాడు ప్రార్థనను మరచిపోలేదు. తన ఆయుధాన్ని మరచిపోలేదు. మనకు ఉద్యోగము వస్తే ప్రార్థన ఉండదు. ఆదివారము కూడా, పని ఎక్కువైంది అంటాము, కాని రాజైన ఆయన ప్రార్థన మరచిపోలేదు. ఒకసారి నిద్రపోయి బత్షెబ విషయంలో ఓడిపోయాడు గాని ఎంత శత్రువుల దగ్గరైనా ప్రార్థనలో జయించాడు. మనము ప్రార్థనను పక్కనపెడితే పాడైపోతాము. **119వ కీర్తన** దావీదు వ్రాశాడని నమ్మేవాళ్ళున్నారు. అందులో దినమునకు ఏడుమారులు ప్రార్థించుచున్నాను అన్నాడు. **కీర్తన 55:17** లో దినమునకు ముమ్మారు ధ్యానిస్తూ మొరపెట్టుచున్నాడు అన్నాడు.

**7-12వ. తప్పించుటకు, విడిపించుటకు దిగివచ్చిన దేవుడు:** దావీదు ప్రార్థన చేస్తే విడిపించుటకై వచ్చుచున్న దేవుడు. ఆయన వచ్చుచుండగా భూమి కంపిస్తుంది. పర్వతముల పునాదులు కదులుతాయి. దావీదు ప్రార్థన చేస్తే తన భక్తుని వేదన చూసి దేవునికి కోపము వచ్చినది. నాసికారంధ్రములలో పొగ పుట్టింది. నిప్పు కణములు రాజబెట్టాయి. మేఘములను వంచి వస్తాడు. కెరూబుల మీద ఎగిరివచ్చాడు. గాలి రెక్కల మీద వస్తాడు. ఆయన సన్నిధికాంతి నుండి మేఘములను, వడగండ్లను, మండుచున్న నిప్పులును వస్తాయి. తన బిడ్డలు ప్రార్థన చేస్తే ఎటువంటి రోషముతో వస్తాడో చూడవచ్చు. అంటే ప్రార్థన ఎంత బలమైనదో చూడవచ్చు.

**13-18వ. దేవుడు విడిపించు విధము:** ఏ రీతిగా విడిపిస్తాడో ఈ భాగములో చెప్పబడింది. ఉరుములు, వడగండ్లు, నిప్పులతో శత్రువులను శిక్షించి తనను రక్షించాడని దావీదు

చెబుతున్నాడు. ఐగుప్తులో ఇశ్రాయేలీయులను విడిపించిన సందర్భము, శత్రువుల మీద ఉరుములు, వడగండ్లు కురిపించినట్లు చూస్తాము. దేవునికి కోపము వచ్చినప్పుడు ఆయన శిక్షించే విధము జ్ఞాపకమునకు తెస్తున్నాడు. కనుక మన ప్రార్థన ఎంత బలమైనదో జ్ఞాపకమునకు తెచ్చుకోవాలి. యెహోవా నీ గద్దింపునకు భూమి పునాదులు బయలుపడెను. ఎఱ్ఱ సముద్రములో జరిగిందిదే. దేవుడు గద్దించగా సముద్రము విడిపోయి భూమి అడుగుభాగము కనపడింది. మోషే నీ కర్రను ఎత్తి ఆ సముద్రము వైపు నీ చెయ్యి చాపి సముద్రమును పాయలుగా చేయమన్నాడు (**నిర్గమ 14:15**). చెయ్యి ఎత్తడము ప్రార్థనకు సూచన (**1తిమోతి 2:8**). మోషే ప్రార్థించగా ప్రవాహములు అడుగు భాగములు బయలుపడతాయి. ఉన్నత స్థలము నుండి చెయ్యిచాపి నన్ను పట్టుకొనెను. జలరాసులలో నుండి తీసెను. ఇశ్రాయేలీయులు దాటిపోయారు. ఐగుప్తీయుల రథములు, రౌతులు సమస్తము సముద్రము మునిగిపోయాయి. శవాలు తేలాయి. ప్రార్థనలో ఇంత శక్తి ఉంది.

**19-24వ. విడిపించుటకు గల కారణము:** విడిపించుటకు కారణములు చెబుతున్నాడు. నీతినిబట్టి నిర్దోషత్వాన్నిబట్టి విడిపిస్తాడు. మనము ప్రార్థన చేయునపుడు నిర్దోషులముగా ఉండాలి. మనలో నీతి ఉండాలి. నేను ఆయనకు ఇష్టుడను గనుక ఆయన నన్ను తప్పించెను అంటున్నాడు. కనుక మన జీవితము ఆయనకు ఇష్టముగా ఉండాలి. ఒక పని మనకు ఇష్టమైనను అది దేవునికి ఇష్టమో కాదో గ్రహించాలి. మనుషులకు కాక దేవునికి ఇష్టమైనది మనము చేయాలి. దావీదు చెబుతున్నాడు, (1) నేను ఆయనకు ఇష్టుడను గనుక, (2) నా నీతి బట్టి, (3) నా నిర్దోషత్వాన్నిబట్టి, (4) యెహోవా మార్గమును అనుసరించి నేను నడుచుకొనుచున్నాను కాబట్టి, (5) భక్తిహీనుడనై దేవుని విడిచినవాణ్ని కాను కాబట్టి, (6) ఆయన న్యాయవిధులను నేను లక్ష్యపెడుతున్నాను కాబట్టి, (7) ఆయన కట్టడలను నేను త్రోసివేయలేదు కాబట్టి, (8) దోషక్రియలు నేను చేయలేదు కాబట్టి, (9) ఆయన దృష్టికి నేను యథార్థవంతుడను కాబట్టి, (10) ఆయన దృష్టికి నేను నిర్దోషిని కాబట్టి, (11) నా చేతుల నిర్దోషమునుబట్టి అని ఈ కారణములను బట్టి నన్ను విడిపించాడని దావీదు చెబుతున్నాడు. మనలను దేవుడు విడిపించకపోతే మనము ఈ ప్రశ్నలు వేసుకోవాలి. ఈ గుణాలు మనలో ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలి. మన చేతుల నిర్దోషత్వమును చూచేవాడు. అందుకే **1తిమోతి 2:8** లో, పవిత్రమైన చేతులెత్తి ప్రార్థించమన్నాడు. మోషే చేతితో కర్ర ఎత్తినప్పుడు పవిత్రమైన చేతులెత్తాడు కాబట్టి ఎఱ్ఱ సముద్రము నుండి విడుదల కలిగింది.

**25-30వ. దేవుని గొప్పతనము:** ఈ భాగములో దేవుని గొప్పతనము వివరించబడింది. దయగల వారి యెడల దయ చూపిస్తాడు. యథార్థవంతుల యెడల యథార్థముగా ఉంటాడు. సద్భావము గలవారి యెడల సద్భావము చూపువాడు. మూర్ఖులకు వికటముగా ఉంటాడు. మనము మూర్ఖముగా కనబడితే మనయెడల వికటముగా ఉంటాడు. శ్రమపడి వారిని రక్షించే దేవుడు, గర్విష్ఠులకు విరోధిగా ఉంటాడు. అణచివేస్తాడు. మనలో ఏ కోశానా గర్వము ఉన్నా ఆయన విరోధిగా ఉంటాడు. మన దీపాన్ని వెలిగించేవాడు. మనలోని

చీకటిని వెలుగుగా చేసేవాడు. ఆయన సహాయము వలన యుద్ధాన్ని జయించాడు. నా సైన్యము కాదు, ఆయన సహాయమే అంటున్నాడు. నా దేవుని వలన ప్రాకారములను దాటాము అంటూ చివరిలో దేవుడు యథార్థవంతుడు, ఆయన వాక్యము నిర్మలమైనది, తన శరణుజొచ్చినవారికి దేవుడే కేడెము అని చెబుతున్నాడు. ఆయన మనకు దీపము, వెలుగై ఉన్నాడు. అంటే దీపము, వెలుగై ఉన్న వాక్యాన్ని మనకిచ్చాడు. అర్థరాత్రి ఒక చిన్న దీపము ఉంటే త్రోవలో చక్కగా వెళ్ళవచ్చు. ఈ గాఢాంధకార లోకములో దేవుని వాక్యము దీపముగా చేసికుంటే చక్కగా వెళ్ళవచ్చు. నీ శరణుజొచ్చిన వారందరికీ నీవు ఒక కేడెము.

**31-33వ. సాటిలేని గొప్ప దేవుడు:** సాటిలేని గొప్ప దేవుని గురించి చెప్పాడు. యెహోవా తప్ప దేవుడేడి? అవును, యెహోవా ఒక్కడే దేవుడు. యేసయ్య, పరిశుద్ధాత్ముడు ఆయనలో భాగమే. మన దేవుడు తప్ప ఆశ్రమ దుర్గమేది? మేము ఆసుపత్రిలో ఉన్నప్పుడు అక్కడున్నవారికి వాక్యము చెప్పాము. దేవుడు ఆపదమ్రొక్కులదేవుడు అని క్రైస్తవేతరులు అన్నారు. కనుక మన దేవుడు తప్ప ఆశ్రమదుర్గమే లేదు అనే సంగతి లోకము గుర్తిస్తుంది. నాకు బలము ధరింపజేయువాడు, నా కాళ్ళను జింక కాళ్ళుగా చేయువాడు కనుక ఈ దేవుడు మనము ఆశ్రయించడానికి తగిన దేవుడు అని మనము ఆశ్రయిస్తే నడిపించువాడని **31-33** వచనములు తెలియజేస్తూ ఉన్నవి.

**34-36వ. ఆయన ఆదుకునే దేవుడు:** నా చేతులకు యుద్ధము నేర్పువాడు. దావీదు చిన్న వయసులోనే యుద్ధశాలి. కానీ యుద్ధము ఎవరు నేర్పించారు, దేవుడే. నా బాహువులకు విల్లు ఎక్కుపెట్టజేయువాడు, జింక కాళ్ళుగా చేసినవాడు. జింక ఎంత ఎత్తయినా ఎగురుతుంది. ఆధ్యాత్మికంగా మనము ఎగరాలని భావన. కొన్నిసార్లు ఉద్యోగరీత్యా ఎత్తయిన స్థానాలలో కూర్చోబెడితే మన గొప్పతనము ఏమీ లేదు. ఆయన గొప్పతనమే. మన రక్షణ కేడెము నేర్పినవాడు ఆయనే, కాపాడువాడు ఆయనే. మోషేను దేవుడు గొప్పగా చేయడానికి కారణము సాత్వికమే. మోషే భూలోకమందరిలో మిక్కిలి సాత్వీకుడు. ఇటువంటి వాని మీద తిరుగుబాటు చేస్తారా అని కోపగించి మిర్యామును కుష్ఠురోగములో మొత్తినాడు. కనుక సాత్వికులను ఆయన కాపాడే దేవుడు. గాంధీగారు కూడా సాత్వికులు, ధన్యులు. వారు భూలోకమును స్వతంత్రించుకుంటారు అని నమ్మాడు. మోషేగారు సాత్వీకుడు కాబట్టే ఆ గొప్ప జనాంగాన్ని నడిపించే భాగ్యము దేవుడు ఇచ్చాడు. మనము కూడా సాత్వికులముగా ఉండాలి. దేవుడు మనలో కోరే గొప్ప గుణము సాత్వికము అని మరువవద్దు.

**37-42వ. శత్రువుకు ఓటమినిచ్చిన గొప్ప దేవుడు:** దావీదుకు జయమివ్వాలి అంటే ఆయన శత్రువులను ఓడించాలి. నా శత్రువులను తరిమి పట్టుకుంటావు,వారు నా పాదముల క్రింద పడుదురు, వారిని అణగద్రొక్కుదును, నా క్రింద వారిని అణచివేశావు, వారిని వెనుకకు మళ్లించి నిర్మూలము చేశావు, వారిని రక్షించువాడు లేదు. పిండిని పారబోయునట్లు పారబోశావు. ఇశ్రాయేలీయులు ఎర్రసముద్రములో తేలి శవాలైనప్పుడు, ప్రథమ సంతానము చనిపోయినప్పుడు, పిండివలె పారబోయబడ్డారు. తన బిడ్డలకు జయమియ్యాలంటే శత్రువులను ఈ రీతిగా ఓడింపజేసేవాడు. కనుక మనమును ఆయనను స్తుతించాలి.

**43-48వ. స్తుతినొందదగిన దేవుడు: 43-45వ.** వరకు నన్ను విడిపించాడు, అన్యజనుల మీద అధికారిగా చేశావు, అన్యజనులను నిస్త్రాణ గలవారిగా వణికేటట్లు చేశావు గనుక నిన్ను స్తుతిస్తాను అంటున్నాడు. ఎవరిని స్తుతించాలి? జీవముగల దేవుణ్ణి. నా ఆశ్రయ దుర్గమైనవాణ్ణి. నా రక్షణకర్తయైన దేవుణ్ణి స్తుతిస్తాను అంటున్నాడు. ఎందుకు స్తుతించాలి? నా నిమిత్తము ప్రతిదండన చేసినందుకు, జనములను నాకు లోబరచినందుకు, నా శత్రువుల చేతిలో నుండి విడిపించినందుకు, నా మీదికి లేచువారికంటే ఎత్తుగా నన్ను హెచ్చించినందుకు నేను స్తుతిస్తాను.

**49-50వ. అన్యజనులలో స్తుతినొందదగిన దేవుడు:** ఎక్కడ స్తుతించాలి? అన్యజనులలో నేను నిన్ను ఘనపరుస్తాను. ఆదివారము స్తుతించడానికి త్వరపడుటయే కాక లోకంలో కూడా ఆయనను ఘనపరిచే వారముగా ఉండాలి. ఎందుకు? నీవు నియమించిన రాజుకు గొప్ప రక్షణ కలుగజేశావు. 15 ఏండ్ల వయసు నుండి 30 ఏండ్ల వయసు వరకు గొప్ప రక్షణ కలుగజేశావు. దావీదుకును ఆయన సంతానమునకును నిత్యము కనికరము చూపువాడు. దావీదు తరువాత రాజులు ఆయన సంతానమే. రాబోతున్న రారాజైన యేసు కూడా ఆయన సంతానమే. అందువలన అన్యజనులలో ఆయనను స్తుతిస్తాను, గానము చేస్తాను అని కీర్తనను రచించి, రాగముకట్టి పాడి వినిపిస్తున్నాడు.

## 19వ కీర్తన (3+3+3+2+2+1 = 14 వ.)

**అంశం : దేవుని మహిమ, శక్తి వివరించబడినది**

**2కొరింథీ 4:4** ప్రకారము, మహిమ అనగా ప్రకాశము. ఈ కీర్తన ద్వారా దేవుడు ఎంతటి ప్రకాశము కలవాడో గుర్తించి ఆయనను స్తుతించాలి. ఇది సృష్టిని గురించిన కీర్తన. అలాగే దేవుని వాక్యమును గూర్చిన అంశములున్నందున ఇది వాక్యమును గూర్చిన కీర్తన. 1,12,19,119 అను నాలుగు కీర్తనలు వాక్యమును గురించినవే.

**1-3వ. ఆకాశముల మహిమ: 1వ.** ఆకాశములు దేవుని మహిమను, అంతరిక్షము ఆయన చేతిపనిని వివరించుచున్నవి. భాష, మాట, స్వరము లేని ఆకాశములు దేవుని మహిమను వివరించుచుండగా, భాష, మాటలు, స్వరము గల మనమెంతగా దేవుని మహిమను వివరించాలి. **నెహెమ్యా 9:6** లో నీవే ఆకాశములను మహాకాశములను భూమి సముద్రము అందున్న సమస్తమును సృజించావని ఉన్నది. **కీర్తన 143:4** లో పరమాకాశములారా అన్నాడు. భూమిపైనున్న మేఘమండలము మొదటి ఆకాశము కాగా, దానిపైనున్న నక్షత్రమండలమలు రెండవ ఆకాశము, పైనున్న పరదైసు మూడవ ఆకాశమని **(2కొరింథీ 12:14)** ఎరుగుదుము. అట్టియిన ఆకాశములు ఎన్నో, మహాకాశములు ఎన్నో, పరమాకాశములు ఎన్నో మన ఊహకు అందదు. విమానము ద్వారా మేఘమండలములో 10-13 కిలో మీటర్లు, శాటిలైట్ ద్వారా కొన్ని వేల కిలోమీటర్లు పైకి మానవులు వెళ్ళగలుగుతున్నారు. ఆకాశములో ఇంతవరకు 30,000 కోట్ల, కోట్ల,

కోట్ల నక్షత్రములు (సూర్యులు) ఉన్నాయని శాస్త్రజ్ఞులు గుర్తించారు. కనిపించని విశ్వములో ఇంకా ఎన్ని సూర్యులు ఉన్నారో మనము యెరుగము. వెలుగు వేగములో (ఒక సెకండ్‌కి 1,86,000 మైళ్ళు) కనిపించిన విశ్వమును చేరుటకు కోటి సంవత్సరాలు పట్టును. ఆదిమానవుడు ఆదాము పుట్టి ఇప్పటికే 6000 సంవత్సరాలు. వెలుగు వేగముతో ఆదాము పయనించినను కనిపించే విశ్వంతరాళమును చేరలేడు. కనుక ఇన్ని సూర్యులకు ప్రకాశము ఇచ్చిన దేవుడు ఎంత ప్రకాశము గలవాడో ఆకాశము గూర్చి తెలుసుకొనుట వలన కొంతగా అర్థమగును. ముందుగా చెప్పబడిన వివరముల ఆధారముగా 2వ వెలుగును గూర్చిన మానవుడు కొద్దిగా అర్థము చేసికొనగలడు. వెలుగును చీకటిని వేరుపరచాడని **ఆది 1:4** లో చెప్పబడినది. చీకటి ఏ రీతిగా కలిగినదో దేవుడు చెప్పలేదు. కనుక పగటికి పగలు చేయు బోధను కొద్దిగా అర్థము చేసుకోగలిగిన రాత్రి రాత్రి జ్ఞానము మానవులకు అర్థము కాదు. శాస్త్రజ్ఞులు చీకటిని గురించి ఏ ప్రయోగములు ఇంతవరకు చేయలేకపోవుచున్నారు.

**4-6వ. సూర్యుని మహిమ:** వాటి కొలనులు భూమియందంతట వ్యాపించి, వాటి ప్రకటనలు బయలువెళ్ళుచున్నవి. సూర్యుడు వెలుగు అనగా ప్రకాశమును భూమియందటికి చేర్చుచు భాష లేకపోయినను దేవుని మహిమ ఎంత గొప్పదో తెలియపరచుచున్నాడు. సూర్యుని చుట్టూ భూమి తిరుగుచున్నను, సూర్యుల గుంపగు పాలపుంత మరొక పాలపుంత చుట్టూ తిరుగుచున్నందున సూర్యులు తమ మార్గములందు పరుగెత్తుచున్నారని తలంచగలము. తమ మార్గమునుండి ఒక వెంట్రుక వాసి ప్రక్కకు సూర్యులు వెళ్ళిన విశ్వాంతరాలమంత క్షణములో లయము కాగలము. కానీ అవి దేవుడు నియమించిన మార్గములోనే వెళ్ళినట్లు విశ్వాసులమైన మనము దేవుడు నియమించిన మార్గములోనే వెళ్ళాలి. కనుక **రోమా 1:20** ప్రకారము ఆయన అదృశ్య లక్షణములు, శక్తి, సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన తేటపడును.

**7-9వ. దేవుని వాక్య మహిమ:** యెహోవా నియమించిన ధర్మశాస్త్రము యథార్థమైనది. అది ప్రాణమును తెప్పరిల్లజేయును. యెహోవా శాసనము నమ్మదగినది. అది బుద్ధిహీనులకు జ్ఞానము పుట్టించును. యెహోవా ఉపదేశములు నిర్దోషమైనవి. అవి హృదయమును సంతోషపరచును. యెహోవా ఏర్పరచిన ధర్మము నిర్మలమైనది. అది కన్నులకు వెలుగునిచ్చును. యెహోవా యందైన భయము పవిత్రమైనది. అది నిత్యము నిలుచును. యెహోవా న్యాయవిధులు సత్యమైనవి. అవి కేవలము న్యాయమైనది. ఇలా 12 అంశాలు నకు కనిపిస్తాయి. ధర్మశాస్త్రమును గూర్చి ఎక్కువగా 119 కీర్తనలో కనిపించును. దేవుని వాక్యము, మాటలు పవిత్రమైనవి. దీనిని మార్చడానికి ఎవరికీ అధికారము లేదు. ఆయన మాటల్లో ఎలాంటి అపవిత్రత లేదు. ఇది యెహోవా నియమించిన ధర్మశాస్త్రము. ఇందులో దేవుని శాసనములు, ఉపదేశములో ఉన్నాయి. ఎవరు వేటినైనా చేర్చినా, తీసివేసినా తెగులు కలుగునని ప్రకటన చివరలో వ్రాయబడినది. యెహోవా నియమించిన ధర్మశాస్త్రము యథార్థమైనది. ఈ ధర్మశాస్త్రము నమ్మదగినది. ఈ ఉపదేశములు నిర్దోషమైనది. ఈ ధర్మము నిర్మలమైనది. ఈ భయము పవిత్రమైనది. ఈ న్యాయవిధులు సత్యమైనవి. దేవుని

ధర్మశాస్త్రము యథార్థమైనది. యథార్థత తప్ప దీంట్లో ఏ మోసము గాని, ఏ మార్పు గానీ, ఏ చేర్పు గానీ లేదు. తన బిడ్డలు తప్పు చేశారా తప్పు వ్రాయించాడు. తాను ప్రేమించినవాళ్లే, తాను హెచ్చించిన వాళ్ళే తప్పు చేస్తే తప్పు అన్నాడు. వాళ్ళు మంచి చేస్తే మంచి అన్నాడు. కేవలము యథార్థత ఉంది. బైబిల్‌లో యెహోవా ఉపదేశములు హృదయాన్ని సంతోష పరుస్తాయి. ప్రాణానికి మేలు ఉంది, హృదయానికి మేలు ఉంది. యెహోవా ఏర్పరచిన ధర్మము కన్నులకు వెలుగిచ్చును. కన్నులకు కూడా మేలు ఉంటుంది. యెహోవా యందలి భయము నిత్యము నిలుచును. యెహోవా న్యాయవిధులు కేవలము న్యాయమైనవి. అన్యాయము లేదు. మద్రాసు హైకోర్టు ప్రారంభించి 150 సంవత్సరములు అయిన సందర్భముగా సభ ప్రధాని మాట్లాడుచు భారత దేశ న్యాయ చట్టము బైబిలు ఆధారముగా వ్రాయబడినది అన్నాడు.

**10-11వ. దేవుని వాక్య మాధుర్యము:** దేవుని వాక్యము బంగారుకంటే కోరదగినది. బంగారు కోరుకుంటారా, దేవుని వాక్యము కోరుకుంటారా అంటే బంగారు కోరుకుంటాము. కానీ బంగారు కంటే దేవుని వాక్యము కోరుకోవాలి. తేనెకంటే జుంటెతేనె ధారలకంటే మధురమైనది. మన జీవితాలకు అవసరమైనది. వాటివలన నీ సేవకుడు హెచ్చరిక నొందును. వాటిని గైకొనుట వలన గొప్ప లాభము కలుగును. మనము దేవుని కుమారులమే గాని ఆయన ఆజ్ఞలు నెరవేరవలసినపుడు సేవకులము. సేవకై ప్రత్యేకింపబడిన సువార్త సేవకులు, పెద్దలు ఉన్నను వారు మాత్రమే కాక, సేవకులమైన మనము అనగా విశ్వాసులందరు దేవుని వాక్యము వలన హెచ్చరిక పొందాలి. వాటిని గైకొనుటవలన గొప్ప లాభము కలుగును. లాభము కావాలని అందరూ అనుకుంటారు. వ్యక్తిగత జీవితంలో, కుటుంబ జీవితంలో, సంఘ జీవితంలో, ఉద్యోగ జీవితంలో లాభం కావాలి. ఎక్కడ ఉన్నను దేవుని వాక్యము మనము గైకొనినట్లయితే గొప్ప లాభము పొందగలము.

**12-13వ. తన పొరపాట్లు కనుగొనగలిగినవాడు:** ధర్మశాస్త్రము ద్వారా జీవితాలు దిద్దబడుతాయి. తన పొరపాట్లు కనుగొనాలి. నీవు వాక్యము చెప్పబోవుచున్నావు. నీ పొరపాటులు ఇవి దిద్దుకోమని బోధకులతో కూడా దేవుడు మాట్లాడుతాడు. వాక్యము వినేవారితో కూడా మాట్లాడుతాడు. మన జీవితంతో ఉండే పొరపాట్లు చూపిస్తాడు. పొరపాట్లే కాదు, నేను రహస్యముగా చేసిన తప్పులు కూడా చూపిస్తాడు. దురభిమాన పాపములో పడకుండా నీ సేవకుని ఆపుము. ఇక్కడ మూడు రకాల తొందరలు ఉన్నాయి. పొరపాట్లు రహస్యమైన తప్పులు, దురభిమాన పాపములు, దురభిమాన పాపముతో పడకుండా నీ సేవకుని ఆపుము, వాటిని నన్ను ఏలనియ్యకుము. ఇతరుల గురించి దురభిమానము అంటే చేయకపోయినా చేసి ఉంటారు అనుకుంటాము. ఇది దురభిమాన పాపము. ఇందులో పడకుండా ఆయన సేవకులమైన మనలను ఆపుతాడు. ఈ మూడు రకాల పాపాలను వాక్యము ద్వారా దిద్దుకొన్నప్పుడు మనము యథార్థవంతులమై అధిక ద్రోహము చేయకుండా నిందారహితులమగుదుము. ఈ కీర్తనలో దేవుని మహిమను తెలుపుతూ మనము యథార్థవంతులముగా, నిందారహితులముగా ఉండాలని చెప్పుచున్నాడు.

**14వ. ముగింపు:** యెహోవా నా ఆశ్రయదుర్గమా, నా విమోచకుడా, నా మాటలు, హృదయ ధ్యానము నీకు అంగీకారమగును గాక అన్నాడు. కనుక మన నోటిని, మనసును, హృదయమును, కన్నులను వాక్యము ద్వారా కాపాడుకోవాలి.

## 20 - 24 కీర్తనలు

**20-24 కీర్తనలు** దావీదు వ్రాసినవే. **20:1** లో, ఆపత్కాలమందు యెహోవా నీకు ఉత్తరమిచ్చును అని, **20:5** నీ ప్రార్థనలన్నియు యెహోవా సఫలపరచునని, **21:8** లో నీ హస్తము శత్రువులందరిని చిక్కించుకొనును అన్నందున్న దావీదు ప్రార్థనకు జవాబు వచ్చినదని గమనించాలి. దావీదు తన జీవితము అనేక (22లో) శ్రమల మధ్య ప్రార్థించగా శత్రువులపై విజమిచ్చాడు. (23) దేవుడు వారి మీదుగా (23లో) కాపరిగాను (24లో) తదుపరి రాజుగా చేసినాడని తలంచగలము. వీటిని మెస్సీయ కీర్తనలుగా ఆలోచించిన 22 లో యేసు సిలువలో ప్రార్థించగా (22:1-20వ.) జయము పొంది (22:21-31వ.) పరలోకమునకు ఆరోహణుడై 23 లో మనకు కాపరిగా ఉన్నాడు (23:1). 24లో ఈ లోకమునకు రెండవ రాకడలో రారాజుగా రానున్నాడని గమనించాలి (24:7). కనుక 20-21 కీర్తనలు, 22,23,24 కీర్తనలకు పీఠికగా తలంచగలము.

ఇంగ్లీషులో 22వ కీర్తన SUFFERINGS AND DEATH ON CROSS

23వ కీర్తన CARE OF THE LORD WITH CROOK

24వ కీర్తన SOVERIGN LORD COMING WITH CROWN

22వ కీర్తనలో ప్రభువు పొందబోవు శ్రమలు, జయమునకు 20-21 కీర్తనలు పీఠికలు. యేసు 24లో రాజు, 23లో కాపరి కాకమునుపు, 22లో శ్రమలు పొందినట్లు మనము కూడా శ్రమలు మధ్య శత్రువులగు 1) సాతాను, 2) శరీరము, 3) లోకమును ప్రార్థనలో శాంతిని పొందుచు జయించాలి. విశ్వాసమునకు కర్తయు కొనసాగించువాడైన యేసువైపు చూచుచు ఓపికతో పరుగెత్తాలి (హెబ్రీ **12**).

## 20వ కీర్తన (4+3+2 = 9 వ.)

**అంశం :** క్రీస్తు ద్వారా ఏర్పరచబడిన రక్షణ. ఆయన శత్రువులను జయించి రారాజుగా రాబోతున్నాడు. ఇతరులవలె గుఱ్ఱములు, రథములపై ఆధారపడక దేవుని మీదనే ఆధారపడుచున్నాడు. దావీదు కూడా గొల్యాతును జయించినపుడు సౌలు కవచముపై కాక యెహోవా నామముతోనే వెళ్ళి జయము పొందాడు. ప్రార్థించక (**2సమూ 11**) మిద్దెపైనున్నప్పుడు బత్షెబాతో పాపము చేసి నైతిక జీవితములో ఓడిపోయాడు.

**1-4వ. రాజు యొక్క జయము కొరకు ప్రార్థన: 1వ.** ఆపత్కాలమందు యెహోవా నీకు ఉత్తరమిచ్చును గాక. **2వ.** లో రాజుకుత్తరమిచ్చునని విశ్వాసముతో చెప్పుచున్నాడు.

మనము అటువంటి విశ్వాసము కలిగి జవాబు రాకముందే ప్రభువును స్తుతించాలి. యాకోబు దేవుడు ఉద్ధరించును. మోసగాడి దేవుడు అవును రక్షించబడినను మనము మోసగాండ్లమే. అటువంటి మనలను ఉద్ధరించు దేవుని మనము మన కూడికలన్నిటిలో మహిమపరచాలి.

**2వ.** పరిశుద్ధ స్థలము నుండి ఆయన నీకు సహాయము చేయునుగాక. ఆయన పరిశుద్ధతనుబట్టి మహనీయుడు (**నిర్గమ 15:11**) ఆయన మాటలే పరిశుద్ధ గ్రంథము. ఆయన నివాసమగు సీయోను ఆయన సంఘము, కనుక సంఘము పరిశుద్ధము. సంఘమందలి సజీవరాళ్ళగు విశ్వాసులు పరిశుద్ధులుగా ఉండాలి. పరిశుద్ధత కలిగిన మనము పరిశుద్ధ స్థలమగు సంఘము ఎదుట పాతాళలోక ద్వారములు నిలువలేవని గుర్తించాలి. (**మత్తయి 16:18**) కనుక మీలో ఎవడైనను రోగియాయెనా అతడు సంఘపు పెద్దలను పిలిపించవలెను. వారి ప్రార్థన స్వస్థపరచును (**యాకోబు 5:14**). **3వ.** ఆయన నీ నైవేద్యములన్నియు జ్ఞాపకము చేసికొనును గాక, నీ దహనబలులను అంగీకరించుగాక. **కీర్తన 141:2వ.** నేను చేతులెత్తుట సాయంకాలము నైవేద్యమువలె నీకు అంగీకారములగును గాక. **రోమా 12:1** లో చెప్పినట్లు పరిశుద్ధమైన సజీవ యాగముగా సమర్పించుకొనుటయే. 1) పరిశుద్ధముగాను, 2) దేవునికి అనుకూలమైనది గాను, 3) ఈ లోక మర్యాదను అనుసరించక, 4) ఉత్తమమైనది, 5) సంపూర్ణమైనదిగా, 6) శరీరములను సమర్పించు కోవాలి, 7) నూతనమగుట వలన రూపాంతరము పొందాలి, 8) తన్నుతాను ఎంచుకొన దగిన దానికంటే ఎక్కువగా ఎంచుకొనకూడదు. **రోమా 8:36వ.** లో ప్రతిదినము వధకు సిద్ధమైన గొఱ్ఱెలము అని చెప్పబడినది. బలి ఒకేసారి జరుగును కాని సజీవయాగముగా అనగా నిత్యము మనము చంపబడుతాము. నిజమైన సువార్త సేవకులు విరామము లేకుండా పనిచేయుట ద్వారా నిత్యము చంపబడుటయే. అట్టివారి సేవకు ఫలమున్నది. నిజమైన సేవ చేయువారి వ్యక్తిగత, కుటుంబ, సంఘ అక్కరలు తీర్చబడుట మన దహనబలులు అంగీకరించుటయే.

**4వ.** నీ కోరికను సిద్ధింపజేసి నీ ఆలోచన యావత్తు సఫలపరచును గాక. మనము సజీవ యాగముగా సమర్పించుకొన్నప్పుడు మన మన ఆలోచనలు దేవుడు యావత్తు సఫల పరచును.

**5-7వ. దేవుడు తన అభిషిక్తుని రక్షించునన్న విశ్వాసము కలిగియుండుట:** మీరు, నేను అభిషేకించబడినవారము. యేసయ్య అభిషేకించాడు. సిలువలో చనిపోయినా మృతులలో నుండి ఆయనను లేపాడు. రాజుగా అభిషేకింపబడిన దావీదుగారిని ఆపదల నుండి రక్షించి రాజుగా చేశాడు. ఆలాగు మిమ్మును, నన్ను ఆయన తన పని కొరకై అభిషేకించాడు. ఏ పని ఆయన మనకు అప్పగించాడో అదే అభిషేకము అని తెలిసికోండి. దేవుని తన అభిషిక్తుని రక్షిస్తాడు అనే నమ్మకాన్ని కలిగి ఉండాలి. యెహోవా నీ రక్షణను బట్టి నేను జయోత్సవము చేయుచున్నాను. మా దేవుని నామమునుబట్టి మా ధ్వజము ఎత్తుచున్నాము. జయోత్సవము అంటే ఆరాధించుట అని, ధ్వజము అంటే ఇంగ్లీషులో Banner అని ఉంది. సువార్త ప్రకటించుట అని. నీ ప్రార్థనలన్నీ యెహోవా సఫలపరచును

గాక. ఆయన్ను ఆరాధించినప్పుడు, ఆయన సువార్తను ప్రకటించునప్పుడు మన ప్రార్థనలన్నీ సఫలపరుస్తాడు. యెహోవా తన అభిషిక్తుని రక్షించునని నాకిప్పుడు తెలియును. అభిషిక్తుడైన దావీదును సమస్యలన్నిటి నుండి రక్షించాడు. ఎలా? రక్షణార్థమైన తన దక్షిణహస్త బలమును చూపును. ఆయన చేతులు బలము కలిగినవి. అబ్రాహాముతో నేను సర్వశక్తిగల దేవుణ్ణి అన్నాడు. తన పరిశుద్ధ ఆకాశము నుండి నాకు ఉత్తరమిచ్చువాడు. నీవు జవాబు అడుగు అని **7వ.** గూర్చి పీఠికలో చదివాము. సొలొమోను ఐగుప్తు గుర్రాలను తెప్పించాడు. దావీదు తెప్పించుకోలేదు. సొలొమోను ఈ లోకపు శక్తిని ఆశ్రయించాడు. దావీదు యెహోవా నామములో నమ్మకము కలిగి ఉన్నాడు. అందుకే దావీదు యుద్ధాలన్నిటిలో జయించాడు. ఏ నామమున రక్షణ లేదు. ఈ నామముననే రక్షణ. కనుక మనము ఆశ్రయించవలసినది ఈ నామమునే.

**8-9వ. జయమిచ్చు దేవుడు:** వారు కృంగి నేలమీద పడియున్నారు. మనము లేచి చక్కగా నిలుచుచున్నాము. శత్రువులను ఓడించి మనలని నిలిపినాడు. జయమిచ్చేవాడు యెహోవా రక్షించును. మేము మొరపెట్టునప్పుడు రాజు ఉత్తరమిచ్చును గాక. ఆయన రక్షించేవాడు, ఉత్తరమిచ్చేవాడు. ఇట్టి దేవుని కలిగి ఉన్నందుకై దేవునికి స్తోత్రము చెల్లిస్తూ ముందుకు సాగుదాము గాక.

## 21వ కీర్తన (2+2+2+1+3+2+1 = 13 వ.)

**అంశం : దేవుడు తన బిడ్డలను ఆశీర్వదించి (1-8వ.) భద్రతనిచ్చి (7వ.), శత్రువులను నాశనము చేయుటనుబట్టి (8-13 దేవునికి స్తుతి చెల్లించుట)**

**సందర్భము: 3వ.** లో అతని తలమీద అపరంజి కిరీటము నీవు ఉంచియున్నావు అన్నందున **5-6వ.** నీ రక్షణ వలన అతనికి గొప్ప మహిమ కలిగెను. గౌరవ ప్రభావములను నీవు అతనికి ధరింపజేసియున్నావు. నిత్యము ఆశీర్వాదకారకుడుగా నుండునట్లు నీవతని నియమించి యున్నావు అన్నందున దావీదును రాజుగా నియమించిన సందర్భమున ఈ కీర్తన వ్రాయబడినదని తలంచవచ్చును. ఈ కీర్తనలో దావీదుకంటే రాజైన మెస్సీయను ఆయన రాజ్య మహిమను ఎక్కువగా చూతుము.

**1-6వ. దేవుడు తన బిడ్డలకిచ్చిన ఆశీర్వాదము: 7వ. రాజు యొక్క భద్రత, 8-13వ. శత్రువుల నాశనమునుబట్టి దేవునికి స్తుతి**

**1-2వ. పీఠిక:** యెహోవా, రాజు నీ బలమునుబట్టి సంతోషించుచున్నాడు. ఒక విశ్వాసికి నిజమైన బలము సంతోషము దేవుని చేతనే కలుగునని దావీదు గొల్యాతు నుండి రక్షించబడి, గొల్యాతును చంపి, తాను ప్రజలందరిని సంతోషింపజేసినపుడు మనము నేర్చుకొనగలము. ఈ దేవుడు దావీదు ద్వారా దేశమును శత్రువు నుండి రక్షించుటనుబట్టి మనము ఎంతో హర్షించగలము. **కీర్తన 34:6వ.** ఈ దీనుడు మొఱ్ఱపెట్టగా యెహోవా ఆలకించెను, అతని శ్రమలన్నిటిలోనుండి అతని రక్షించి, **3-4వ.** లో వరమిమ్మని అడుగగా దేవుడు

వరమిచ్చాడు. కనుక విశ్వాసులైన మన పెదవులలో నుండి వచ్చిన ప్రార్థన మానక దేవుడు అంగీకరించునని నేర్చుకొనుచున్నాము. రాజు నీ బలమునుబట్టి సంతోషించుచున్నాడని మొదటి వచనములోను, సంతోషించుట యెహోవా యందు నమ్మిక యుంచుటనుబట్టియే అని గమనించాలి.

**3,4,5వ. రాజ్య, దేశ, ఆత్మీయ, ఆరోగ్య, ప్రాణ ఆశీర్వాదములు:** 1) దేవుడు దావీదుకు శ్రేయస్కరమైన ఆశీర్వాదములనిచ్చాడు. 2) తలమీద అపరంజి కిరీటము నీవు ఉంచియున్నావు, 3) ఆయుష్షునిమ్మని అడుగగా సంపూర్ణ ఆయుష్కాలమగు డెబ్బది సంవత్సరముల ఆయుస్సును అనుగ్రహించాడు, 4) సదాకాలము నిలుచు దీర్ఘాయువును దయచేశాడు. 5) గొప్ప మహిమ కలుగచేశాడు, 6) గౌరవ ప్రభావములను ధరింపజేశాడు, 7) నిత్యము ఆశీర్వాదకారకుడుగా నుండునట్లు నియమించాడు, 8) దేవుని సన్నిధిని సంతోషముతో నుల్లసింపజేశాడు.

**7వ. రాజు యొక్క భద్రత:** ఏలయనగా రాజు యెహోవాయందు నమ్మికయుంచుచున్నాడు. సర్వోన్నతుని కృపచేత అతడు కదలకుండ నిలుచును. ఈ క్రింది లేఖనములలో యెహోవాయందు నమ్మిక యుంచుట వలన కలుగు భద్రత చెప్పబడినది. 1) **కీర్తన 40:4** యెహోవాను నమ్ముకొనువాడు ధన్యుడు, 2) **కీర్తన 91:2** ఆయనే నాకు ఆశ్రయము నా కోట నేను నమ్ముకొను నా దేవుడని నేను యెహోవాను గూర్చి చెప్పుచున్నాను, 3) **కీర్తన 115:9-10** ఇశ్రాయేలీయులారా, యెహోవాను నమ్ముకొనుడి, ఆయన వారికి సహాయము వారికి కేడెము. అహరోను వంశస్థులారా, యెహోవాను నమ్ముకొనుడి. ఆయన వారికి సహాయము వారికి కేడెము. 4) **కీర్తన 118:8-9** మనుష్యులను నమ్ముకొనుట కంటె యెహోవాను ఆశ్రయించుట మేలు. రాజులను నమ్ముకొనుట కంటె యెహోవా ఆశ్రయించుట మేలు.

**8-13వ. శత్రువుల నాశనమునుబట్టి దేవునికి స్తుతి: 8-10వ.** శత్రువుల యొక్క నాశనము. నీ హస్తము నీ శత్రువులందరిని చిక్కించుకొనును. నీ దక్షిణ హస్తము నన్ను ద్వేషించువారిని చిక్కించుకొనును. నీవు ప్రత్యక్షమైనప్పుడు అను ఈ భాగము క్రీస్తు ప్రత్యక్షమగు సమయమునకు చెందినది. కనుక ఇది మెస్సీయగా క్రీస్తు ప్రత్యక్షమై రెండవ రాకడలో భూమి మీదకు వచ్చి ముందుగా **ప్రకటన 19అధ్యా.** చివరలో చెప్పబడినట్లు హర్మెగిద్దోను యుద్ధమందు శత్రువులగు క్రీస్తు విరోధిని, అబద్ధ ప్రవక్తను, వారిని అనుసరించినవారిని అగ్నిలో వేయగా వారు అగ్నిగుండము వలె అణగుదురు. తదుపరి **ప్రకటన 20అధ్యా.** లో చెప్పబడినట్లు వేయి ఏండ్ల పాలన చివరలో సాతానును, వాని అనుచరులను గోగు మాగోగు యుద్ధమందు అగ్నిలో వేయగా వారు అగ్ని గుండమువలె అగుదురు. తన కోపము వలన యెహోవా వారిని నిర్మూలము చేయును. అగ్ని వారిని దహించును. భూమి మీద నుండకుండ వారి గర్భఫలమును నీవు నరులలో నుండకుండ వారి సంతానమును నశింపజేసెదవు అని ఈ వాక్యభాగములు క్రీస్తు రెండవ రాకడను గూర్చిన ప్రవచన భాగములు.

**11-12వ. శత్రువుల యొక్క నాశనమునకు కారణము:** వారు నీకు కీడు చేయవలెనని ఉద్దేశించిరి. దురుపాయము పన్ని, కొనసాగింపలేకపోయిరి. నీవు వారిని వెనుకకు త్రిప్పివేసెదవు. నీ వింటినారులను బిగించి వారిని ముఖము మీద కొట్టుదువు అను వచన భాగములను క్రీస్తు రెండవ రాకడకు చెందినవే. అయినను దావీదు రాజుగా చేసిన యుద్ధములందు శత్రువులను దేవుడు సంహరించుటను గూర్చియు ఈ భాగములో చూడగలము.

**13వ. ముగింపు:** యెహోవా, నీ బలమునుబట్టి నిన్ను హెచ్చించుకొనుము అనగా దేవుడు తన బలమునుబట్టి రాజైన దావీదుకు ఇచ్చిన జయమును, మెస్సీయగా భూమి మీదకు వచ్చిన యేసు ప్రభువుకు ఇచ్చు జయమును సూచించుచున్నవి. మేము గానము చేయుచు నీ పరాక్రమమును కీర్తించెదము అనుట పై విషయములను ధ్యానించు విశ్వాసులగు దేవుని బిడ్డలు ఆయనను స్తుతించుటయే.

## 22,23,24 కీర్తనలు

| | కీర్తన | వచనము | కాలము | అంశము |
|---|---|---|---|---|
| 1 | 22 అధ్యా. మంచి కాపరి | **యోహాను 10:11వ.** నేను గొఱ్ఱెలకు మంచి కాపరిని; మంచి కాపరి గొఱ్ఱెల కొరకు తన ప్రాణము పెట్టును | గతము | గతములో ప్రజల కొరకు క్రీస్తు మరణము <u>సిలువ</u> <u>CROSS</u> |
| 2 | 23 అధ్యా. గొప్ప కాపరి | **హెబ్రీ 13:20-21వ.** గొఱ్ఱెల గొప్ప కాపరియైన యేసుక్రీస్తు ద్వారా తన దృష్టికి అనుకూలమైన దానిని మనలో జరిగించుచు ప్రతి మంచి విషయములోను తన చిత్తప్రకారము చేయుటకు మిమ్మును సిద్ధపరచును గాక. | ప్రస్తుతము | ప్రస్తుతము ప్రజలకు అనుగ్రహించు మంచివి. <u>కాపరి కర్ర</u> <u>CROOK</u> |
| 3 | 24 అధ్యా. ప్రధాన కాపరి | **1పేతురు 5:4వ.** ప్రధాన కాపరి ప్రత్యక్షమైనప్పుడు మీరు వాడబారని మహిమ కిరీటము పొందుదురు. | భవిష్యత్తు | భవిష్యత్తులో ప్రజల కొరకు రాజుగా వచ్చుట, <u>కిరీటము</u> <u>CROWN</u> |

## 22వ కీర్తన - మెస్సీయ కీర్తన (5+5+5+5+5+6 = 31 వ.)

**అంశం : దావీదు శ్రమలలో నుండి సిలువలో క్రీస్తు శ్రమలు తెలుపుట**

**పీఠిక :** అయ్యలేతే షహరు (వేకువ లేడి) అను రాగము – వేకువనే బలహీనముగానుండి ఉదయకాల సహాయము కొరకు కనిపెట్టుకొను దుప్పి, రాత్రి అంతయు దుష్ట సింహము యొక్క మోసక్రియలను బట్టి విశ్రమించలేక బలహీనమై వేకువజాము నుండి ఉదయకాలము కొరకు కనిపెట్టుకొనియుండు దుప్పివలె నున్న ప్రభువును చూపు కీర్తన.

**వచనాలు విభజన: 10-10-11 - 31వ.**

**1-10వ. శ్రమలు పొందిన ప్రభువు; 11-20వ. శ్రమల వివరము; 21-31వ. స్తుతింపబడు ప్రభువు (22వ)**

**1-10వ. శ్రమలు పొందిన ప్రభువు:**

**1-5వ. శ్రమలు, 6-10వ. ఒంటిగా శరీరములో శ్రమ పొందిన ప్రభువు (6వ.)**

**1-5వ. 1-2వ. శ్రమపడిన ప్రభువు. మత్తయి 27:46-49** లో ఇంచుమించు మూడు గంటలప్పుడు యేసు ఏలీ, ఏలీ లామా సబక్తానీ అని నా దేవా, నా దేవా నన్నెందుకు చెయ్యి విడిచితివని (సిలువలో ప్రభువు పలికిన నాలుగవ మాట) అర్థమిచ్చు పదములు పలుకగా ప్రజలు ఏలీయా అతని రక్షింపవచ్చునేమో చూతమనిరి. కాని తండ్రియైన దేవుడు యేసు యొక్క ఆర్తధ్వని వినక రక్షింపలేదు ( **హెబ్రీ 5:7; యెషయా 53:10**). **3వ.** ఇశ్రాయేలు అనగా ఈనాడు విశ్వాసులమైన మనము చేయు స్తోత్రముల మీద ఆసీనుడుగా నున్నాడు. **4-5వ.** విడుదల పొందిన పితరులు, విడుదల పొందని ప్రభువు (నన్ను రక్షింపక, నా ఆర్తధ్వని వినక విడనాతివి **1వ.**. విడుదల పొందిన పితరులు నీయందు నమ్మికయుంచి మొరపెట్టగా నీవు వారిని రక్షించితివి (మొరపెట్టి విడుదల పొందిరి) **5వ.** **6-10వ.** ఒంటిగా, పురుగుగా (తోలా అనగా ఎరుపు రంగునిచ్చు పురుగు) శ్రమ పొందిన ప్రభువు (**6వ.**). **7వ.** నన్ను చూచువారందరు పెదవులు విరిచి తల ఆడించుచు నన్ను అపహసించుచున్నారు. **మత్తయి 27:39-41.** ఆ మార్గమున వెళ్లుచుండినవారు తలలూపుచు, దేవాలయమును పడగొట్టి మూడు దినములలో కట్టువాడా, నిన్ను నీవే రక్షించుకొనుము; నీవు దేవుని కుమారుడవైతే సిలువ మీద నుండి దిగుమని చెప్పుచు ఆయనను దూషించిరి. శాస్త్రులును పెద్దలును ప్రధాన యాజకులు కూడా ఆయనను అపహసించిరి. సిలువలో పలికిన మాటలు 1) లూకా 23:34 తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము, 2) లూకా 23:43 నేడు నీవు నాతోకూడ పరదైసులో ఉందువు, 3) యోహాను 19:26 అమ్మా, ఇదిగో నీ కుమారుడు, 4) మత్తయి 27:46 ఇంచుమించు మూడు గంటలప్పుడు యేసు ఏలీ ఏలీ లామా సబక్తానీ అని బిగ్గరగా కేక వేసెను, 5) లూకా 23:46 యేసు గొప్ప శబ్దముతో కేకవేసి తండ్రీ, నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాననెను, 6) యోహాను 19:28 నేను దప్పిగొనుచున్నాను, 7) యోహాను 19:30 యేసు ఆ చిరక పుచ్చుకొని సమాప్తమైనదని చెప్పి తలవంచి ఆత్మను అప్పగించెను.

**యెషయా 53:8.** అన్యాయపు తీర్పు నొందినవాడై అతడు కొనిపోబడి జనుల యతిక్రమునుబట్టి మొత్తబడెను గదా. సజీవుల భూమిలోనుండి అతడు కొట్టివేయబడెను. అయినను అతని తరమువారిలో ఈ సంగతి ఆలోచించక ఆయనను అపహసించిరి. **9-10వ.** గర్భము నుండి తీసి నా తల్లి యొద్ద స్తన్యపాము చేయుచుండగా నీవే గదా నాకు నమ్మిక పుట్టించితివి అన్నట్లు తల్లులు తమ పిల్లలకు పాలిచ్చు సమయముననే హన్నా సమూయేలుకు నేర్పినట్లు, క్రీస్తునందు విశ్వాసముంచుటను గూర్చి తల్లులు పిల్లలకు నేర్పించాలి.

**11-20వ. శ్రమల వివరము**

**11-13వ. శ్రమలో ఇతరుల నుండి సహాయముకై మొర, 14-18వ. శరీరములో శ్రమలు, 19-21వ. శ్రమలో తనతో తన సహాయముకై మొర**

**11-13వ. శ్రమలో ఇతరుల నుండి సహాయముకై మొర: 11వ.** శ్రమ వచ్చియున్నది. సహాయము చేయువాడెవడును లేదు. నాకు దూరముగా నుండకుము. **12వ.** వృషభములు (యూదులు) అనేకములు నన్ను చుట్టుకొనియున్నవి. 1) బాషాను దేశపు బలమైన వృషభములు (శాస్త్రులు) నన్ను ఆవరించియున్నవి. **13వ.** చీల్చుచును గర్జించుచు నుండి 2) సింహము వలె (సాతాను) వాడు నోళ్లు తెరచుచున్నాడు. 3) కుక్కలు (అన్యులు) నన్ను చుట్టియున్నవి. 4) దుర్మార్గులగు రాణువవారు గుంపు కూడి నన్ను ఆవరించారు. **19వ.** యెహోవా దూరముగా నుండకుము. నా బలమా, త్వరపడి నాకు సహాయము చేయుము. **20వ.** ఖడ్గము నుండి నా ప్రాణమును 5) కుక్కల బలము నుండి నా ప్రాణమును తప్పింపుము. **21వ.** 6) సింహపు నోటనుండి (సాతాను), 7) గురుపోతుల కొమ్ములలో (ప్రధాన యాజకులు) నుండి నన్ను రక్షించి నాకు ఉత్తరమిచ్చియున్నావు.

**14-18వ. శరీరములో శ్రమలు (12 శ్రమలు): 14వ.** నేను నీళ్ళవలె పారబోయబడియున్నాను. 1) నా యెముకలు అన్నియు స్థానము తప్పియున్నవి (**కీర్తన 22:17 -**నా యెముకలన్నియు నేను లెక్కింపగలను) 2) నా హృదయము, 3) నా అంతరంగమందు మైనమువలె కరిగియున్నది. **15వ.** 4) నా బలము యెండిపోయి చిల్లపెంకువలె ఆయెను, 5) నా నాలుక, 6) నా దౌడను అంటుకొనియున్నది, **16వ.** నా పాదములను పొడిచియున్నారు. **17వ.** 7) నా యెముకలన్నియు నేను లెక్కింపగలను. **18వ.** 8) నా వస్త్రములు వారు పంచుకొనుచున్నారు, 9) నా అంగీ కొరకు చీట్లు వేయుచున్నారు. **యోహాను 19:23-24వ.** సైనికులు యేసును సిలువవేసి ఆయన వస్త్రములు తీసికొని, యొక్కొక్క సైనికునికి ఒక్కొక్క భాగము వచ్చునట్లు వాటిని నాలుగు భాగములు చేసిరి. ఆయన అంగీని కూడ తీసివేసి, ఆ అంగీ కుట్టులేక పైనుండి యావత్తు నేయబడినది గనుక వారు దానిని చింపక అది ఎవనికి వచ్చునో అని దాని కోసరము చీట్లు వేయుదమని చెప్పుకొనిరి. **19వ.** 10) నా బలమా, త్వరగా నాకు సహాయు చేయుము. **20వ.** ఖడ్గము నుండి 11) నా ప్రాణమును, కుక్కల బలము నుండి 12) నా ప్రాణమును తప్పింపుము (**హెబ్రీ 5:7వ.** శరీరధారియైయున్న దినములలో మహారోదనముతోను

కన్నీళ్ళతోను తన్ను మరణము నుండి రక్షింపగల వానికి ప్రార్థనలను యాచనలను సమర్పించి) (తమ ప్రాణము కాపాడుకొనలేక మంటిపాలగు వారందరు ఆయన సన్నిధిని మోకరించెదరు). **20వ.** ఖడ్గము నుండి నా ప్రాణమును కుక్కల బలము నుండి నా ప్రాణమును తప్పింపుము.

**21-31వ. స్తుతింపబడు ప్రభువు (22వ): 21వ.** సింహపు నోటనుండి నన్ను రక్షింపుము. గురుపోతుల కొమ్ములలో నుండి నన్ను రక్షించి నాకుత్తరమిచ్చియున్నావు. నీ నామము నా సహోదరులకు, మహా సమాజములో, భయభక్తులు గలవారికి, 1) సహోదరులకు ప్రచురపరచెదను, 2) సమాజము మధ్యమున నిన్ను స్తుతించెదను. **22వ.** 3) మహా సమాజములో నిన్ను గూర్చి నేను కీర్తన పాడెదను. **25వ.** 4) ఆయనయందు భయభక్తులు గలవారి యెదుట నా మ్రొక్కుబడులు చెల్లించెదను.

**22,23,24వ. ప్రభువునందు భయభక్తులు: 22వ.** నీ నామమును నా సహోదరులకు ప్రచురపరచెదను, సమాజ మధ్యమున నిన్ను స్తుతించెదను. **హెబ్రీ 2:12వ.** 1) స్తుతించుడి (**22వ.**) స్తుతించుడి (**23వ.**) 2) ఘనపరచుడి (**23వ.**), 4) కీర్తన పాడెదను (**25వ.**) , 5) ప్రచురపరచెదను (**24వ.**), 6) మ్రొక్కుబడులు చెల్లించెదను (**25వ.**).

**26-27వ. బ్రతికించిన ప్రభువు: 26వ.** దీనులు భోజనము చేసి తృప్తిపొందుదురు. మీ హృదయము తెప్పరిల్లి నిత్యము బ్రతుకుదురు.

**28-29వ. భద్రపరచిన ప్రభువు: 29వ.** భూమి మీద వర్ధిల్లుచున్న వారందరు ఆయన సన్నిధిని మోకరించెదరు.

**30-31వ. భజించబడు ప్రభువు: 30వ.** ఒక సంతతివారు ఆయనను సేవించెదరు. రాబోవు తరమునకు ప్రభువును గూర్చి వివరింతురు. **మత్తయి 28:19వ.** మీరు వెళ్ళి సువార్త ప్రకటించి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి. **1యోహాను 3:16వ.** ఆయన మన నిమిత్తము తన ప్రాణము పెట్టెను. గనుక దీని వలన ప్రేమ యెట్టిదని తెలిసికొనుచున్నాము. **కీర్తన 42:1-2వ.** దుప్పి నీటివాగుల కొరకు ఆశపడునట్లు దేవా, నీ కొరకు నా ప్రాణము ఆశపడుచున్నది. దేవుని కొరకు తృష్ణ, జీవము గల దేవుని కొరకు తృష్ణగొనుచున్నది. 1) దేవుని సన్నిధికి నేనెప్పుడు వచ్చెదను? 2) ఆయన సన్నిధిని నేనెప్పుడు కనబడెదను?

## 23వ కీర్తన (1+2+1+1+1 = 6 వ.)

**అంశం : కాపరియైన యెహోవా (యేసు) వలన కలిగిన మేలులు**

**1వ. యెహోవా నా కాపరి, నాకు లేమి కలుగదు:** దావీదు చిన్నప్పటినుండి గొర్రెల కాపరి. పెద్దవాడై 40 సంవత్సరములు ఇశ్రాయేలీయులకు రాజైన కాపరిగా ఉన్నాడు. కాని తనను కాపరిగా చెప్పుకొనక యెహోవా నా కాపరి అంటున్నాడు. **యోహాను 10:11-13** నేను గొర్రెలకు మంచి కాపరిని, మంచి కాపరి గొర్రెల కొరకు తన ప్రాణము

పెట్టును. తోడేలు రాగా తమ ప్రాణమును కాపాడుట కొరకు గొర్రెలను విడిచిపెట్టి పారిపోవువారున్నారు. తోడేలు ఆ గొర్రెలను పట్టి చెదరగొట్టును. దావీదు గొర్రెను సింహము నుండి తప్పించుటకు తన ప్రాణము లెక్కచేయలేదు. కాని కొన్నిసార్లు వాటిని కోసికొని తిన్నాడు. మంచి పాలన చేశాడు. కాని తానే కొద్దిమందిని ఊరియా వంటివారిని చంపించాడు. నేడు సంఘములలో కూడా గొర్రెలను తినువారున్నారు. గొర్రెలను గూర్చి లక్ష్యము చేయరు అన్నట్లు సంఘ క్షేమమును లక్ష్యపెట్టరు. సంఘములో డబ్బును తినువారు కూడా ఉందురు. **యెహె 34:11-25** వచనములలో కాపరి యొక్క గుణములు చెప్పబడ్డాయి. 1) నేను నేనే నా గొర్రెలను వెదకి వాటిని కనుగొందును, 2) తమ గొర్రెలు చెదరిపోయినప్పుడు కాపరులు వాటిని వెదకునట్లు నేను నా గొర్రెలను వెదకి, చీకటిగల మబ్బు దినమందు ఎక్కడెక్కడికి అవి చెదరిపోయెనో అక్కడినుండి నేను వాటిని రప్పించి వాటిని తోడుకొని వచ్చెదను, 3) వాటిని సమకూర్చి స్వదేశములోనికి వాటిని తెచ్చి పర్వతముల మీద వాగుల యొద్ద దేశమందున్న సకలమైన కాపురపు స్థలములందును మంచి మేతగల చోట వాటిని మేపెదను. 4) ఇశ్రాయేలు యొక్క ఉన్నత స్థలముల మీద వాటికి దొడ్డి యేర్పరచెదను, అక్కడ అవి మంచి దొడ్డిలో పండుకొనును, 5) ఇశ్రాయేలు పర్వతముల మీద బలమైన మేత గల స్థలమందు అవి మేయును, 6) నేనే నా గొర్రెలను మేపి పరుండపెట్టుదును, 7) తప్పిపోయిన దానిని నేను వెదకుదును, 8) తోలివేసిన దానిని మరల తోలుకొని వచ్చెదను, 9) గాయపడిన దానికి కట్టుకట్టుదును, 10) దుర్బలముగా ఉన్న దానిని బలపరచుదును, 11) అయితే క్రొవ్వినవాటికిని బలముగల వాటికిని శిక్షయును మేత పెట్టి లయపరచెదను, 12) నా మందా, మీ విషయమై దేవుడనైన యెహోవానగు నేను సెలవిచ్చునదేమనగా గొర్రెకును గొర్రెకును మధ్యను, గొర్రెకును, పొట్టేళ్ళకును మధ్యను, గొర్రెలకు మేకపోతులకువీ మధ్యను భేదము కనుగొని నేను తీర్పు తీర్చెదను, 13) నేను నేను క్రొవ్విన గొర్రెలకును చిక్కిపోయిన గొర్రెలకును మధ్య భేదము కనుగొని తీర్పు తీర్చుదును. **యెహె 34:18-19వ.** విశేషముగా మేతమేసి మిగిలినదానిని కాళ్ళతో త్రొక్కుట మీకు చాలదా? మీరు స్వచ్ఛమైన నీరు త్రాగి మిగిలిన దానిని కాళ్ళతో కలకలు చేయుట మీకు చాలదా? మీరు కాళ్ళతో త్రొక్కినదానిని నా గొర్రెలు మేయవలెనా? కాళ్లతో మీరు బురదగా కలిపినదానిని అవి త్రాగవలెనా? 14) మీరు భుజముతోను ప్రక్కతోను త్రోసి, కొమ్ములతో రోగము గల వాటినన్నిటిని పొడిచి చెదరగొట్టినను, అనగా యెహోవా ఆలాగు చెదరగొట్టువాడు కాడు. 15) నా గొర్రెలు ఇక దోపుడు కాకుండ గొర్రెకును గొర్రెకును మధ్య తీర్పు తీర్చి నేను వాటిని రక్షించెదను, 16) వాటిని మేపుటకై నేను నా సేవకుడైన దావీదును వాటిమీద కాపరిగా నియమించెదను, అతడు వాటికి కాపరిగా ఉండి వాటిని మేపును, 17) యెహోవానైన నేను వారికి దేవుడనై యుందును. 18) నా సేవకుడైన దావీదు వారిమధ్య అధిపతిగా ఉండును, 19) మరియు అవి అరణ్యములో నిర్భయముగా నివసించునట్లు, అడవిలో నిర్భయముగా పండుకొనునట్లు నేను వారితో సమాధానార్థ నిబంధన చేయుదును, 20) దుష్టమృగములు దేశములో

లేకుండ చేయుదును. దావీదు అని చెప్పబడిన దావీదు కుమారుడైన యేసు ఒక్కడే పైన చెప్పిన గుణములన్ని కలిగినవాడు కనుక **యోహాను 10:14** లో నేను గొర్రెల మంచి కాపరిని అని యేసు అంటున్నాడు. ఇశ్రాయేలీయులను పాలించిన దావీదులో ఈ గుణములన్ని లేవు గనుక మొదటి వచనములో నేను కాపరిని అనక యెహోవాయే (యేసే) నా కాపరి అంటున్నాడు. యేసు మంచి కాపరిగా ప్రాణము పెట్టాడు. గొప్ప కాపరిగా ప్రస్తుతము కాపాడుచున్నాడు. ప్రధాన కాపరిగా మరల వచ్చి బహుమానములు ఇచ్చువాడుగా ఉన్నాడు.

**2-3వ.** పచ్చికగల చోట్ల ఆయన నన్ను పరుండజేయుచున్నాడు శాంతికరమైన జలము యొద్ద నన్ను నడిపించుచున్నాడు. **యోహాను 10:8-11** లో గొర్రెలు పోవు ద్వారమును నేనే, నేనే ద్వారమును; నా ద్వారా ఎవడైన లోపల ప్రవేశించిన యెడల వాడు రక్షింపబడినవాడై లోపలికి పోవును, బయటికి వచ్చును, మేత మేయుచునుండును అన్నాడు. దావీదు కాని మరి ఇతర కాపరులు అందరు చనిపోయిరి. కనుక గొర్రెలకు సమృద్ధి జీవమును ఇవ్వలేరు. యేసు ఒక్కడే నిత్యము జీవించువాడు కనుక గొర్రెలకు సమృద్ధియైన జీవము కలుగజేయగలడు. **యెషయా 45:22** భూదిగంతముల నివాసులారా, నావైపు చూచి రక్షణ పొందుడి. దేవుడను నేనే, మరి ఏ దేవుడును లేడు. యేసు ఒక్కడే రక్షించువాడు, కాపాడువాడు. కనుక **యోహాను 10:11** లో నేను గొర్రెలకు మంచి కాపరిని; మంచి కాపరిగా గొర్రెవలె దారితప్పిన మన పాపమును క్షమించుట కొరకు తన ప్రాణము పెట్టెను. శాంతికరమైన జలముల యొద్ద నన్ను నడిపించుచున్నాడు అనగా శాంతినిచ్చువాడు ఆయనే. **యోహాను 14:27** లో శాంతి మీకనుగ్రహించి వెళ్ళుచున్నాను; నా శాంతినే మీకనుగ్రహించుచున్నాను, లోకమిచ్చునట్టుగా నేను మీ కనుగ్రహించుటలేదు అన్నాడు. అనగా లోకమిచ్చు శాంతి నిత్యము ఉండునది కాదు. ఆయనను నమ్మినవారి హృదయములో కలవరము, వెరచుట ఉండదు. ప్రాణమునకు ఆయన సేద దీర్చుచున్నాడు. తన నామమును బట్టి నీతిమార్గములలో నన్ను నడిపించుచున్నాడు. ఆయన చేత మనము నడిపించబడాలి.

**4వ.** గాఢాందకారపు లోయలో నేను సంచరించినను ఏ అపాయమునకు భయపడను. ఇంతవరకు మేత, నీళ్లు సమృద్ధిగా అనుభవించి ఇప్పుడు గాఢాంధకారము, పైగా లోయలోనికి వెళ్ళుట కష్టతరముగా నుండును. దేవుడు పైకి తీసికొని వెళ్ళినపుడు సంతోషముగా ఉండును. కాని ఇప్పుడు లోయ, పైగా అంధకారము. అంధకారములోనే ఆయన గుణమగు వెలుగు ఏమిటో మనము గ్రహించుటకై ఆయన తోడును గుర్తించుటకై, ఆయన ఆదరణను ఎరుగుటకై ఆలాగు అంధకారములో, పైగా గాఢమైన అంధకారములో నడిపించును. తన దుడ్డుకర్రతో శత్రువులను శిక్షించి, తన దండముతో మనలన క్రమశిక్షణ ద్వారా ఆదరించును అని మనము చెప్పగలము. అప్పుడు అనుభవపూర్వకముగా నీవు నాకు తోడైయుందువు అని సాక్ష్యమివ్వగలము.

**5వ.** నా శత్రువుల యెదుట నీవు నాకు భోజనము సిద్ధపరచుదువు. శత్రువులను శిక్షింతునని చూచితిమి. ఇప్పుడు శత్రువుల ఎదుట భోజనము పెట్టుట ఎంత ఆశ్చర్యము! నూనెతో నా

తల అంటుట, ఆయన మనకిచ్చిన ఆత్మాభిషేకమే. గిన్నె నిండి పొర్లుట సమృద్ధియైన అనుభవమును చూపును. **లూకా 15:17వ.** లో చిన్న కుమారునికి బుద్ధి వచ్చినప్పుడు వాడు నా తండ్రి యొద్ద ఎంతోమంది కూలివాండ్రకు అన్నము సమృద్ధిగా ఉన్నది, నేనైతే ఇక్కడ ఆకలికి చచ్చిపోవుచున్నాను అన్నాడు. దీని భావము కాపరితో నుండగా సమృద్ధి యుండునని, లేనియెడల ఆకలితో చచ్చిపోవుటయే.

**6వ.** నేను బ్రతుకు దినములన్నియు కృపాక్షేమములే (నిశ్చయముగా) నా వెంట వచ్చును. దీని భావము ఆపదల గుండా వెళ్ళినను దేవుని కృపనుబట్టి క్షేమమే మనవెంట వచ్చును. అందుకు కీర్తనకారుడు చిరకాలము యెహోవా మందిరములో నేను నివాసము చేసెదను అంటున్నాడు. దావీదు రాజైనను రాజ నగరులో కాక, రాజ దర్బారులో కాక దేవుని మందిరములో ఉండవలెనని కోరుకొనుట ఎంత ఆశ్చర్యము. మనము ఇటువంటి మనసు కలిగియున్నామో లేదో పరీక్షించుకోవాలి.

## 24వ కీర్తన (2+2+2+2+2 = 10 వ.)

**అంశం : యెహోవా పర్వతమునకు ఎక్కుట - నివసించుట**

**సందర్భము-పీఠిక:** ఇందులో నాలుగు ప్రశ్నలు ఉన్నవియ 1) యెహోవా పర్వతమునకు ఎక్కదగినవాడు ఎవడు? (**3వ.**) 2) ఆయన పరిశుద్ధ స్థలములో నిలువతగినవాడు ఎవడు? (**3వ.**) 3,4) మహిమగల ఈ రాజు ఎవరు? (**8,10వ.**). బలశౌర్యములు గల మన యేసయ్యయే. అందుకే ఈ కీర్తన మెస్సీయ కీర్తన. ఈ కీర్తన మహిమగల రాజు పరలోకములో ప్రవేశించుట అనగా యేసయ్య ఆరోహణ కూడా ఇందులో ఉన్నది. **22 అధ్యా.** లో గతములో ప్రాణము పెట్టిన ప్రభువు, **24 అధ్యా.** మహిమగల రాజుగా ఈ లోకమునకు రాబోవు ప్రభువు. మొదటి రాకడలో మహిమను ప్రక్కనపెట్టి మానవుడై ఈ లోకమునకు వచ్చిన దైవమానవుడు. మరణించి తిరిగి లేచి మహిమలో ప్రవేశించాడు. పరిశుద్ధ పర్వతమునకు ఎక్కాడు. వధించబడిన గొర్రెగా పరలోకములో ఉన్నాడు. గుమ్మములారా, మీ తలలు పైకి ఎత్తుడి. గుమ్మములు వాటంతట అవే పైకి లేచుచున్నవి.

**1-2వ. భూమి, దాని నివాసులు - సముద్రము - ప్రవాహ జలములు:** భూమియు దాని సంపూర్ణతయు లోకమును దాని నివాసులును యెహోవావే. **కీర్తన 19:1వ.** ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నది. అంతరిక్షము ఆయన చేతిపనిని ప్రచురపరచుచున్నది. **కీర్తన 115:15-16వ.** భూమ్యాకాశములను సృజించిన యెహోవా చేత మీరు ఆశీర్వదించబడినవారు. ఆకాశములు యెహోవా వశము. భూమిని ఆయన నరులకిచ్చియున్నాడు. భూనివాసులందరు భూమిని ఆయన నిమిత్తమై వాడాలి. మానవుడు సృష్టికర్తను మహిమపరచక సృష్టిని పూజించుచున్నారు. క్రైస్తవులు కూడా స్తుతి కూడిక ఏర్పాటుచేసి ప్రభువు కంటే కూడిక ఏర్పాటు చేసినవాళ్ళనే ఎక్కువగా పైకెత్తుతారు. మన చర్చిలోని కూడికలలో కూడా ప్రభువుకు మహిమ రావాలి. **2వ.** ఆయన సముద్రముల మీద పునాది వేశాడు. ఆదిలో ఆరిన నేలను భూమి అని, జలరాశికి సముద్రము అని

పేరు పెట్టాడు. మూడు భాగములు నీళ్ళు, ఒక భాగము భూమి. అప్పుడు భూమి నీళ్ళ మీద తేలినట్లు ఉండేది. అందుకే సముద్రము మీద పునాది అంటున్నాడు. తరువాత జలప్రళయము వచ్చినపుడు భూగోళ పరిస్థితి మారినది. భూమి ఖండాలుగా విడిపోయినది. ఇప్పటివరకు అలాగే ఉన్నది. కనుక ప్రవాహ జలముల మీద స్థిరపరచెదను అంటున్నాడు.

**3-4వ. యెహోవా పర్వతమునకు ఎక్కదగినవాడు:** యెహోవా పర్వతమునకు ఎక్కదగిన అర్హత ఏ మానవుడికీ లేదు. నిర్దోషమైన చేతులు, శుద్ధమైన హృదయము కలిగినవాడు యేసుప్రభువు ఒక్కడే. **హెబ్రీ 7:26** లో యేసు ఒక్కడే పవిత్రుడును, నిర్దోషియును, నిష్కల్మషుడును, పాపులలో చేరక ప్రత్యేకముగా ఉన్నవాడు. ఆకాశ మండలమ కంటె మిక్కిలి హెచ్చయినవాడు ఆయన ఒక్కడే. **రోమా 3:23-24వ.** ప్రకారము మనము అందరమూ జన్మతః పాపలము. ఏ భేదము లేదు; అందరును పాపముచేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు. ఆయన కృపచేతనే, క్రీస్తుయేసు నందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు. కనుక మనము ఉచితముగా తీర్చబడిన నీతిమంతులమే. కాని క్రియలనుబట్టి కాదు. మనము కూడా క్రియలను బట్టి నీతిమంతులముగా తీర్చబడాలని ప్రభువు కోరుచున్నాడు. **4వ.** లో మన నాలుగు అవయవములలో ఉండవలసిన గుణములు చెప్పుచున్నాడు. ముఖ్యమైన మన నాలుగు అవయవములలో ఉండవలసిన గుణముల చెప్పుచున్నాడు. వ్యర్థమైన దానియందు మనసు (తల) ఉండకూడదు. నోటితో కపట ప్రమాణము చేయకూడదు. చేతులు నిర్దోషముగా ఉండాలి. హృదయము శుద్ధముగా ఉండాలి. మనము ఉచితముగా తీర్చబడిన నీతిమంతులమైనందున మనలను ప్రభువు ఆ పర్వతము ఎక్కించును. కాబట్టి మన శరీర అవయవములను మనము జాగ్రత్తగా కాపాడుకోవాలి.

**5-6వ. యెహోవా వలన ఆశీర్వాదము: 5వ.** వాడు యెహోవా వలన ఆశీర్వాదము నొందును. తన రక్షకుడైన దేవుని వలన నీతిమత్వము నొందును. పైన చెప్పబడిన నాలుగు గుణములు గలవాడు యెహోవా దేవుని వలన రక్షణ అను ఆశీర్వాదము పొందును. **6వ.** మనము దేవుని నాశ్రయించువారముగా, దేవుని సన్నిధిని వెదకువారుగా ఉండాలని ఆయన చిత్తమును ఎప్పటికప్పుడు వెదకుచు ఉండాలని నేర్చుకొందము. (సెలా) అనగా ఇక్కడ ఆగి పై విషయములు మనము అనుసరించుచున్నామా అని ఆలోచించాలి. **అపొ.కా. 16:6వ.** లో ఆసియలో వాక్యము చెప్పకూడదని పరిశుద్ధాత్మ వారినాటంక పరిచాడు. కాని **19వ అధ్యా.** లో ఆసియాలో చెప్పమన్నాడు. కనుక మనము నిత్యము ఆయన సన్నిధిని ఆయన చిత్తము కొరకు వెదకాలి.

**7-8వ., 9-10వ. మహిమగల రాజు మహిమలో అనగా పరలోక ప్రవేశము: 7-8** వచనములు మరల **8-10** వచనములుగా చెప్పబడ్డాయి. గుమ్మములారా, మీ తలలు పైకెత్తుకొనుడి, మహిమగల రాజు ప్రవేశించునట్లు లేవనెత్తికొనుడి. మహిగల ఈ రాజు ఎవడు? బలశౌర్యములు గల మహిమగల రాజు అనగా మరణించి, బలముతో పునరుత్థానుడై, మహిమతో పరలోకమునకు వెళ్ళిన యేసే బలశౌర్యమలు గల యేసు

పాపులమైన మన మీద తన బలమును ప్రయోగించక మనము పాపము చేయుటకు కారకుడైన సాతాను, వాడి దూతల మీద చూపించాడు. పాపమును తీసివేయుటకు ఈ లోకములో ప్రత్యక్షమయ్యాడని **1యోహాను 3:5** లో చెప్పబడినది. మొదటి రాకడలో పాపమునకు ప్రాయశ్చిత్తము చేసాడు. రెండవ రాకడలో పాపము అనునది లేకుండా చేయును. కనుక ఆయన బలశౌర్యమును బట్టి మహిమగల రాజు ప్రవేశము కొరకై పరలోకపు తలుపులు రెండు రాకడలలోను తెరువబడునని గుర్తించుదము. **హెబ్రీ 4:14** ప్రకారము యేసు ఆకాశమండలముగుండా పరలోకమునకు వెళ్లినందున మనలను పరలోకమునకు తీసికొనిపోవు శక్తిగలవాడయ్యాడు.

## **౨౫వ కీర్తన** (7+8+7 = 3+4+4+4+4+3 = 22 వ.)

**అంశం : పాప క్షమాపణ పొంది, యథార్థత, నిర్దోషత్వము, యెహోవా యందు భయభక్తులు కలిగియుండిన బాధల నుండి దేవుడు విడిపించును.**

**పీఠిక :** ఈ కీర్తనలో 22 వచనములున్నందున హెబ్రీ భాషలోని అక్షరమాలతో ప్రతి వచనము ప్రారంభమగునని గమనించాలి. **7వ.** లో బాల్యకాలము అను మాట నవుర్ అని హెబ్రీ భాషలోని బైబిలులో కలదు. దీని భావము బాల్య యవన కాలము. **11వ.** లో నా పాపము ఘోరమైనది అని, **18వ.** లో పాపమును బట్టి వేదన, బాధలు వచ్చాయి, పాపములన్నిటిని క్షమించుము అంటున్నాడు. పాపమును కప్పుకొనక ఒప్పుకొంటున్నాడు. అక్షరమాల వరుస క్రమములో కీర్తనగా వ్రాసి రాగము కట్టి పాటలు పుస్తకములో చేర్చాడు. గత 3000 సంవత్సరాలుగా ఈ కీర్తన ప్రపంచమంతట పాడబడుచున్నది. ఇది పశ్చాత్తాప కీర్తన. **9,13,51** కూడా పశ్చాత్తాపపు కీర్తనలే.

**1-7వ. పాప క్షమాపణ కొరకు, రక్షణ కొరకు వేడుకొనుట, 8-15వ. యెహోవా యందు భయభక్తులు కలిగియుండుట, 16-22వ. పాపము నుండి, బాధల నుండి విడిపించు దేవుడు**

**1-3వ. పాప క్షమాపణ కొరకు ఆత్మను ఎత్తుకొనుట:** సిగ్గుపడనియ్యకుము, సిగ్గునొందదు, సిగ్గునొందుదురు అనుటబట్టి సిగ్గుపడువారిని గూర్చి చెబుతున్నాడు. పాపము చేయువారు సిగ్గు పడుదురు. నా దేవా, నీయందు నమ్మికయుంచియున్నాను. నన్ను సిగ్గుపడనియ్యకుము. దేవునియందు నమ్మికయుంచువారు సిగ్గుపడరు. రక్షణ కొరకు నమ్మినవారి ప్రాణాత్మ దేహములు విమోచించబడినందున సిగ్గుపడనివారుగా నుందురు. **3వ.** ప్రకారము నీ కొరకు కనిపెట్టుకొను వారిలో ఎవడును సిగ్గునొందదు. హేతువు లేకుండనే ద్రోహము చేయువారు సిగ్గునొందుదురు అను వచన ప్రకారము అనుదిన జీవితములో మనము ఎదుర్కొను శ్రమల నుండి విడిపించి శ్రమ కలిగించు శత్రువులను ఉత్సహింపనియ్యక మనలను దేవుడు కాపాడునని గుర్తింతము.

**4-7వ. పాపమును జ్ఞాపకము చేసికొనక తన కరుణను జ్ఞాపకము చేసికొను దేవుడు:** **7వ.** బాల్య, యవనకాల పాపములను నా అతిక్రమములను జ్ఞాపకము చేసికొనకుము

కాని యెహోవా నీ కృప, నీ దయనుబట్టి నన్ను జ్ఞాపకములో ఉంచుకొనుము అంటున్నాడు. ఎందుకనగా **తీతు 3:4-5** ప్రకారముమన రక్షకుడైన దేవుని యొక్క దయ, మానవుల యెడల ఆయనకున్న ప్రేమ ప్రత్యక్షమై మనము నీతిని అనుసరించి చేసిన క్రియల మూలముగా కాక, తన కనికరము చొప్పుననే పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారా, పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగజేయుట ద్వారా మనలను రక్షించెను. మనమాయన కృప వలన నీతిమంతులమని తీర్చబడితిమి. అందుకే **6వ.** లో, యెహోవా నీ కరుణ, కృప జ్ఞాపకము చేసికొనుము అంటున్నాడు. **మీకా 7:19** లో ఆయన తన జాలినిబట్టి మన పాపములన్నిటిని సముద్ర అగాధములో పడవేశాడు. **ప్రకటన21:1** సముద్ర లేకుండా చేస్తాడు. అందుకే ఆయన ఒక్కడికే ప్రపంచములో కృపామయుడు, దయామయుడు, కరుణామయుడు అను పేరులు ఉన్నవి. **5వ.** లో రక్షణకర్తయైన దేవుని ఉపదేశము కొరకు కనిపెట్టుచున్నానని చెప్పుచున్నాడు.

**8-11వ. పాపము యొక్క ఘోరత్వమును గుర్తించుట: 11వ.** యెహోవా, నా పాపము బహు ఘోరమైనది. నీ నామమును బట్టి దానిని క్షమింపుము అనుటలో పాపము యొక్క ఘోరత్వమును గుర్తించుట అవసరము. యేసు నామముయేసు పేరుకు రక్షకుడు అని అర్థము. ఆయన నామముననే రక్షణ దొరుకును. **10వ.** దేవుని నిబంధన, శాసనములను గైకొనువారి విషయములో యెహోవా త్రోవలన్నియు కృపా సత్యములైయున్నవి. **8-9వ.** యెహోవా ఉత్తముడును యథార్థవంతుడునై తన మార్గమును గూర్చి ఆయన పాపులకు ఉపదేశించును. ఆయన దీనులకు తన మార్గమును నేర్పును.

**12-15వ. యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట వలన కలుగు లాభములు: 12-13వ.** యెహోవాయందు భయభక్తులు గలవాడు 1) కోరుకొనవలసిన మార్గమును ఆయన వానికి బోధించును, 2) అతని ప్రాణము నెమ్మదిగా ఉండును, 3) అతని సంతానము భూమిని స్వతంత్రించుకొనును. **14-15వ.** 4) యెహోవా మర్మము, నిబంధన ఆయన యందు భయభక్తులు గలవారికి ఆయన తెలియజేయును, 5) తన కనుదృష్టి యెల్లప్పుడు యెహోవా వైపునకు తిరిగియున్న వారిని, ఆయన అపవాది వలలో నుండి విడిపించును.

**16-19వ. పాపము నుండి విడిపించబడుట: 16-17వ.** పాపములో కొనసాగువారికి బాధలు, హృదయవేదనలు అతి విస్తారములైనఇక్కట్లు కలుగును. వాటన్నిటి నుండి విడిపించబడాలని కోరుచున్నాడు. **18-19వ.** శత్రువులు అనేకులై క్రూర ద్వేషముతో ద్వేషించుచున్నారు అంటున్నాడు. విశ్వాసికి శరీరులెవరు శత్రువులు కారు, కానీ తన శరీరము, లోకము, సాతాను శత్రువులై యున్నారు. కనుక నా పాపములన్నిటిని క్షమించు, శత్రువుల నుండి విడిపించుమని ప్రార్థించాడు.

**20-22వ. ప్రాణమును విమోచించు దేవుడు:** శరణుజొచ్చినవారిని రక్షించునని, సిగ్గుపడనియ్యడని గుర్తించాలి. దేవుని కొరకు కనిపెట్టుకొని యథార్థత, నిర్దోషత్వము గల ఇశ్రాయేలీయులను వారి బాధలన్నిటిలో నుండి విమోచించునని గుర్తించి ప్రార్థించాలి.

## 26వ కీర్తన (6+6 = 12 వ.)

**అంశం : సమాజములో (సంఘములో) యెహోవా (యేసుక్రీస్తు)ను స్తుతించుట (ఆరాధించుట)**

**I. 1-6వ. స్తుతించుటకు సిద్ధపాటు: (i) 1-3వ. ప్రస్తుత ప్రవర్తనలో సిద్ధపాటు, (ii) 4-6వ. భవిష్యత్ ప్రవర్తనలో సిద్ధపాటు**

**II.7-12వ. స్తుతించుట: (i) 7-8వ. స్తుతించు విధానము (ii) 9-10వ. స్తుతికి అవసరత (iii) 11-12వ. స్తుతించుటకు అర్హత**

**పీఠిక:** యెహోవా బలిపీఠము చుట్టు ప్రదక్షణ చేయుదును, అచ్చట కృతజ్ఞతాస్తుతులు చెల్లించుదును అంటున్నాడు. బలిపీఠము మందిరమునకు గుర్తు. బలిపశువు మన ప్రభువైన యేసుకు (శరీరమునకు, రక్తమునకు) గుర్తు. ప్రదక్షణము మన మనసులు ప్రభువు కృప మీద ఉంచి సిలువ శ్రమలు ఆలోచించుటకు గుర్తు. ఇది స్తుతి (ఆరాధన) కీర్తన. ఈ తలంపులలో ధ్యానములోనికి వెళ్దాము.

**1-6వ. స్తుతించుటకు సిద్ధపాటు: 1-3వ. ప్రస్తుత ప్రవర్తనలో సిద్ధపాటు: 1-3వ.** యూదులకు శుక్రవారము సిద్ధపడు దినము. శనివారము సబ్బాతు. సబ్బాతుకై సిద్ధపడతారు. క్రైస్తవులమైన మనము ఆదివారము ఆరాధనకై శనివారము సిద్ధపడుట మంచిది. సిద్ధపాటు ఎలా? యథార్థవంతుడనై ప్రవర్తించుచున్నాను అని చెప్పగలగాలి. ఆయన పరిశుద్ధ పర్వతమున నివసింపదగినవాడెవడు? యథార్థ ప్రవర్తన కలిగి నీతిని అనుసరించువాడే (**కీర్తన 15:1,2**). ఇటువంటి ప్రవర్తన మనలో ఉన్నదా? అంటే తప్పులు, పొరపాట్లు ఉండవని కాదు. తప్పులను, పొరపాట్లను యథార్థముగా ఒప్పుకొంటున్నామా? వదులు కుంటున్నామా? (**1యోహాను 1:8-10; సామెతలు 28:13**). ఏమియు సందేహము లేకుండా యెహోవా యందు నమ్మిక యుంచామా? ఇది నిజమా అన్నప్పుడు హవ్వకు కలిగిన సందేహమే సమస్త పాపములకు మూలము (**ఆది 3:1**). సందేహపడవద్దు, యథార్థవంతుడనై ప్రవర్తించుచున్నాను (1) లో తన్ను తాను పరీక్షించుకున్నాడు. మనలను మనమే విమర్శించుకొనిన యెడల తీర్పు పొందము (**1కొరింథీ 11:30**). మనలను మనము విమర్శించుకొనినప్పుడు కొన్నింటిని తప్పులుగా అంగీకరించగలము. అయితే దేవుడు మనలను పరిశీలిస్తే, పరీక్షిస్తే, పరిశోధిస్తే మన తప్పులు, పొరపాట్లు బాగా అర్థమవుతాయి. అందుకే దేవా, పరిశీలించుము, పరీక్షించుము, పరిశోధించుము అంటున్నాడు. అంటే ఆత్మ సహాయంతో మనలను మనము పరిశీలించుకోవాలి. దేవుణ్ణి పరిశీలింపనివ్వాలి. కృప ద్వారానే రక్షింపబడి ఉన్నామనే సంగతి మన కన్నుల ఎదుట ఉండాలి. (**తీతు 3:5**). యేసే సత్యము, ఆయన వాక్యము సత్యము. ఆ వాక్య సత్యము ద్వారా మనము నడవాలి ( **కీర్తన 85:9,10**).

**4-6వ. భవిష్యత్ ప్రవర్తనలో సిద్ధపాటు:** పనికిమాలినవారు, వేషధారులు, దుష్టులు, భక్తిహీనులు లోకంలో ఉన్నారు. సంఘములో ఉన్నారు. వారితో సహవాసము చేయను

అని ప్రభువుతో చెప్పాలి. ఇప్పుడు ఎవరినైనా ప్రేమించాలి. వారి క్రియలంటే అసహ్యించుకోవాలి. మనము అలాంటివారిగా మారకుండా జాగ్రత్తపడాలి. ఆలాగు చేతులు కడుగుకోవాలి. మహమ్మదీయులు నమాజ్‌కు ముందు దావూద్ (దావీదు) చేసినట్లు చేతులు కడుగుకుంటారు. అది సులభమే. అయితే హృదయములోనుండి ఈ చెడ్డవాటిని కడుగుకొని ప్రభువును ఆరాధించాలి (బలిపీఠము చుట్టూ తిరగాలి).

**7-12వ. స్తుతించుట- 7-8వ. స్తుతించు విధానము:** దేవుని మందిరాన్ని దావీదు ఎంతో ప్రేమిస్తున్నాడు. మనము ఎంత ప్రేమిస్తున్నాము? ఆరాధనకు సమయానికి రావాలి. దేవుని దగ్గర మోకరించాలి. మనలను ప్రభువు ఆత్మతో పరిశీలించుకోవాలి. సిద్ధపడి ఆరాధించాలి. వర్ధిల్లిన కొలది కానుకలు అప్పగించాలి. ప్రభువును ప్రేమిస్తున్నామని ప్రాణమిత్తును అని పాట పాడుతూ ఏ పరిచర్యలో పాలుపొందకపోతే హృదయ అంతరింద్రియములను పరీక్షించు. దేవుడు ఉన్నాడు, మరువవద్దు. రక్తము అవసరమైతే ఆరోగ్యవంతుని నుండి ఒక బాటిల్ రక్తము తీసుకుంటారు. తర్వాత 28 రోజులకు తిరిగి కోలుకొన్న తరువాతే తీసుకొంటారు. మనలో 18 బాటిల్ల రక్తము ఉంటుంది. మరి 18 బాటిల్‌ల రక్తము ఒకసారి ఇస్తే ఏమవుతుంది? ఒక్క చుక్క రక్తము కూడా ఉంచుకొనకుండా మన కొరకు ధారపోసిన యేసుక్రీస్తుకు మనము ఏమి ఇస్తున్నాము? పేతురు మళ్ళీ చేపలు పట్టడానికి వెళ్ళాడు. రాత్రంతా చేపలు దొరకలేదు. ప్రభువు చెప్పినట్లు వల వేసి విస్తారంగా చేపలు పట్టారు. వాటితో పని లేకుండా ఒడ్డున రొట్టెలు, చేపలు ఉన్నాయి. కష్టపడితే చేపలు దొరకవచ్చు. దేవుడు ప్రేమిస్తే రొట్టెలు దొరుకుతాయి. పేతురును నన్ను ప్రేమిస్తున్నావా అన్నాడు. అవును ప్రభువా అన్నాడు. అయితే నా గొర్రెలను మేపు అన్నాడు. ప్రభువును ప్రేమిస్తే సంఘము కొరకు ఏదో ఒకటి చేయాలి.

**9-10వ. స్తుతికి అవసరత:** పాపులు, నరహంతకులు, దుష్కార్యములు చేయువారితో చేరవద్దు అంటున్నాడు. ఒక చేత్తో బైబిలు పట్టుకొని ఇంకో చేత్తో లంచము తీసుకుంటే అది దుష్కార్యము. వీటినుండి మన చేతులు కడుగుకొందుము గాక.

**11-12వ. స్తుతించుటకు అర్హత:** స్తుతించుటకు యథార్థతే అర్హత. ఇంకేమైనా దోషాలుంటే విమోచింపుము, కరుణించుము అని కోరాలి. సమభూమిలో మన పాదాలు ఉంచుకోవాలి. ఎత్తు పల్లాలు లేకుండా, ఒకరోజు అతి భక్తి, ఒకరోజు భక్తిహీనత లేకుండా నడుచుకోవాలి. సంఘములో యెహోవాను, యేసయ్యను ఆరాధించాలి.

## 27వ కీర్తన (3+3+4+4 = 16 వ.)

**అంశం : నా తల్లిదండ్రులు నన్ను వదిలినను యెహోవా నన్ను చేరదీయును**

**పీఠిక :** నా తల్లిదండ్రులు నన్ను వదిలినను యెహోవా నన్ను చేరదీయును (**10వ.**). కుటుంబీకులు నన్ను విడిచిన అని చెప్పాలంటే ఇశ్రాయేలీయులు తల్లిదండ్రులు నన్ను విడిచిన అని సామెతగా చెప్తారు. నేడు ఒకరిని ఒకరు విడిచిపెట్టేవారు ఎక్కువైనారు.

భార్యాభర్తలు వేరవుతున్నారు. ఇది పాశ్చాత్య దేశాలలో ఎక్కువ. తల్లిదండ్రులను విడిచిపెట్టి కుమారులు, బంధువులను పట్టించుకోని ప్రజలు ఎక్కువవుతున్నారు. ఎవరు విడిచినా యెహోవా నన్ను చేరదీయును అనేది ఎంత ధైర్యము పుట్టిస్తుంది. దావీదు తన కుమారుడైన అబ్షాలోము తరిమినప్పుడు ఈ కీర్తన వ్రాసి ఉంటాడని తలంచవచ్చు.

**1-3వ. రక్షణ:** యెహోవా నాకు రక్షణయు ప్రాణదుర్గమునై యున్నాడు గనుక నేను భయపడను, వెరవను, ధైర్యముగా ఉందుననిదావీదు చెబుతున్నాడు. ఇది అతిశయము కాదు. ప్రభువు ఇచ్చే ఆదరణతో మనము కడా అలాగు చెప్పగలగాలి. అయితే దేవునికి, సంఘ పెద్దలకు భయపడాలి. యెహోవా నాకు వెలుగు, దేవుడు వెలుగైయున్నాడు. ఆయనలో చీకటి ఎంతమాత్రము లేదు. నేను ఈ లోకమునకు వెలుగును, నన్ను వెంబడించువాడు చీకటిలో నడువడు అని ప్రభువు అన్నాడు (**యోహాను 8:12**), నీ వాక్యము వినుట తోడనే వెలుగు కలుగును. మానవునికి అవసరమైన ప్రతిదీ దేవుని వాక్యములో ఉన్నాయి. క్రైస్తవేతరులు కొందరు రేడియోలో, టీవీలో వాక్యము విని నమ్ముతున్నారు. వాక్యము శక్తివంతమైనది. నిజమైన వెలుగు ఉండెను, అది లోకములోనికి వచ్చును. ప్రతి మనుష్యుని వెలిగించుచున్నది. అందరు విశ్వసించునట్లు అతడు ఆ వెలుగును గూర్చి సాక్ష్యమిచ్చుచు వచ్చెను (**యోహాను 1:8-10**), అబద్ధపు వెలుగులు ఉన్నాయి. నిజమైన వెలుగు యేసయ్యనే. నీవు వెలిగింపబడి అందరు నీ ద్వారా వెలిగించబడాలని దేవుని కోరిక. ఇట్టి వెలుగైన దేవుణ్ణి దావీదు వెంబడించాడు. అందుకే ఎవరు విడిచిపెట్టినా యెహోవా నన్ను చేరదీస్తాడు అని చెప్పగలుగుతున్నాడు. యెహోవా నాకు రక్షణ, దేవుడు ప్రాణ, ఆత్మ, దేహమును రక్షింపగలవాడు. ఈ లోకములోని అపాయముల నుండి, అనారోగ్యము, సమస్యల నుండి మన ప్రాణము, శరీరమును రక్షించి చనిపోయిన తరువాత ఆత్మను నరకము నునిడి రక్షిస్తాడు. ఇంత గొప్ప రక్షణ నిర్లక్ష్యము చేయకూడదు. ఈ యుగసమాప్తి వరకు, సదాకాలము మనతో ఉండి రక్షిస్తాడు. ఇది దావీదు గ్రహించాడు. యెహోవా నా ప్రాణదుర్గము, రాజులు తమను రక్షించుకొనుటకు గొప్ప కోటలను, దుర్గాలను నిర్మించుకున్నారు. కొంతవరకు అవి వారిని రక్షించాయి. దావీదుకు కోటలు, దుర్గాలు ఉండేవి. కాని వాటికంటే ఎక్కువగా యెహోవాయే నా ప్రాణదుర్గము అంటున్నాడు. అందుకే నా మీదికి వచ్చు శత్రువులు తొట్రిల్లుతారు అంటున్నాడు. **2సమూ 8-18 అధ్యా.** దావీదు ఎన్ని యుద్ధాలు చేశాడు. ప్రతిదానిలో విజయమే. ఆ భాగాన్ని దావీదు విజయాలు అనవచ్చు. నైతికంగా కొన్నిచోట్ల ఓడిపోయినా, యుద్ధాలలో ఓడిపోలేదు. అందుకే ఎంత యుద్ధమైనను భయపడను, ధైర్యము కోల్పోను అంటున్నాడు.

**4-6వ. స్తుతి:** యెహోవా యొద్ద ఒక వరము అడిగితిని. కోరుచున్నాను వరము అడిగాడు. దేవుడు కోరుకోమన్నాడు. దావీదు కోరుతున్నాడు. తపస్సు చేస్తే దేవుడు ప్రత్యక్షమై నరుడా, నీ కోరిక ఏమి? అంటే ఏవేవో కోరినట్లు చిన్న కథలలో చెబుతారు. యెహోవా (యేసయ్య) తపస్సు లేకుండానే ప్రత్యక్షమయ్యే దేవుడు. ఆయనను నీవు ఏమి కోరుకుంటావు. దావీదు కోరిక చూడండి. దేవుని ప్రసన్నతను చూస్తూ ఆయనను ధ్యానిస్తూ జీవిత కాలము ఆయన మందిరములో నివసించాలని కోరుచున్నాడు.

ఇహలోక సంబంధమైనవి ఏవీ అడగలేదు. ఆయన ప్రసన్నత అంటే నన్ను దాస్తాడు, దుర్గము మీదికి ఎక్కిస్తాడు, శత్రువుల పైన హెచ్చించును. తల ఎత్తువాడు అని దావీదుకు తెలుసు. దేవుని రాజ్యమును, దేవుని నీతిని వెదకితే సమస్తము ఇవ్వబడతాయని దావీదు చెబుతున్నాడు. రాజు కాగానే మందసాన్ని యెరూషలేము తెచ్చుటకు ప్రయత్నించాడు. సౌలు 40 యేండ్లు పాలించినా, మందిరము, మందసము ధ్యాస లేదు. దేవుని మందిరము, మందసము కంటే దావీదుకు మక్కువ ఎక్కువ. అందుకే మందసము ముందు రాజునని మరచి నాట్యము చేశాడు. మనము మన హోదాను మరచి హృదయములో ఉల్లసించి స్తుతిస్తున్నామా, లేదా?

**7-10వ. ప్రార్థన:** కంఠధ్వని ఎత్తి ప్రార్థిస్తాను. కొందరు ప్రార్థిస్తే వారికి వినబడదు. ఎప్పుడు ఆమేన్ చెప్పాలో కూడా తెలియదు. మనము ఏది ప్రార్థిస్తున్నామో వినపడాలి. ప్రార్థనలో దేవుని సన్నిధిని వెదకాలి. నన్ను కోపముచేత తోలివేయకుము, నన్ను విడనాడకుము అంటున్నాడు. దేవుడు కోపగించుటకు వేరే కారణములు మనలో ఉన్నవి. కోపగించవద్దు, నీవు కోపగించితే నేను నిలువలేని అని మనము కోరుకోవాలి. అప్పుడు యెహోవా నన్ను చేరదీయును అని మనము చెప్పగలము. ఆ స్థాయిలో మనము ఉన్నామా?

**11-14వ. కనిపెట్టుట:** యెహోవా నీ మార్గము బోధింపుము, నడిపింపుము. బోధించేవాడు, నడిపించేవాడు ఆయనే. ఎవరు వాక్యము చెప్పినా ఆయనే బోధిస్తున్నాడు అనుకోవాలి. బోధించినట్లు నడిపించమని కోరాలి. బోధించే వారందరు నడిచేవారై ఉంటే ప్రపంచమంతా క్రైస్తవులుగా మారిపోయేది. అబద్ధ సాక్షులు, క్రూరత్వము వెల్లగక్కువారు ఎల్లప్పుడూ ఉంటారు. వారికి అప్పగించవద్దని కోరుకోవాలి. యెహోవా దయ పొందుదునన్న నమ్మకము దావీదుకు ఉంది. మనము దేవుని దయ పొందగలమన్న నమ్మకము కలిగి ఉండాలి. అప్పుడు హృదయము నిబ్బరముగ ఉంచుకొని దేవుని కొరకు కనిపెట్టుకొనగలము. ఆ ధైర్యము మనకు యేసయ్య కలుగజేయును గాక.

## 28వ కీర్తన (2+2+1+2+2 = 9 వ.)

**అంశం, సందర్భము: సౌలు మనుష్యులు దావీదుపై తిరుగుబాటు చేసినప్పుడు ప్రార్థించి జవాబు పొంది స్తుతించినది.**

**పీఠిక:** మొఱ్ఱ, మనవి, చేతులెత్తుట, విజ్ఞాపన అనే పదాలనుబట్టి దావీదు ప్రార్థిస్తున్నట్లు తెలుస్తుంది. ప్రార్థనలో జవాబు పొందినట్లు తెలుస్తుంది. సౌలు మనుష్యులు దావీదుపై తిరుగుబాటు చేసినప్పటి విజ్ఞాపన.

**1-2వ. ప్రార్థన, విజ్ఞాపన:** నీకు మొఱ్ఱపెట్టుచున్నాను అని మనవి ఆలకించకపోతే సమాధిలోనికి దిగువారివలె అవుతాను అంటున్నాడు. దావీదు ఎంతో ఆలోచనలో ఉన్నట్లు కనబడుచున్నది. ఆశ్రయదుర్గమా అంటున్నాడు. ఆపద కాలములో దుర్గాలు అవసరము. దేవుణ్ణే ఆశ్రయ దుర్గము చేసుకుంటున్నాడు. మన ఆపదలలోను మనకు ఆశ్రయదుర్గము

యేసయ్యే. నీ పరిశుద్ధాలయము వైపునకు నా చేతులు ఎత్తునప్పుడు నా విజ్ఞాపన ధ్వని ఆలకింపుము. దావీదు కాలములో ఆలయము లేదు. కానీ ఈయన మనసులో ఆలయము ఉంది. అలాగే మనము కూడా పవిత్రమైన చేతులెత్తి ప్రార్థించుదుము గాక.

**3-4వ. భక్తిహీనులను ప్రార్థనలో జ్ఞాపకము చేసికొనుట:** భక్తిహీనులు, పాపము చేయువారు సంఘములోన బయట ఇరుచోట్లా ఉన్నారు. సౌలు విశ్వాసి అయినా భక్తిహీనుడు అయ్యాడు. దుష్టాలోచన హృదయములో ఉంచుకున్నాడు. దావీదుకు ఉరిగా ఉండునట్లు మీకాలును ఇచ్చాడు. ఇటువంటి వారిని దేవుడు లాగివేస్తాడు. దురాలోచన దుష్క్రియలకు దారితీస్తుంది. సౌలు తన కుమార్తెను దావీదుకు ఇచ్చి చంపాలనుకున్నాడు. చేతకాలేదు. నాకు చేసిన పనినిబట్టి ప్రతీకారము చేయుమని దావీదు ప్రార్థిస్తున్నాడు. క్రీస్తు తర్వాత ఆ ప్రార్థన చేయకూడదు. కానీ దేవుడు నేనే ప్రతిఫలము ఇస్తాను అంటున్నాడు.

**5వ. భక్తిహీనుల స్థితి:** భక్తిహీనులు యెహోవా కార్యములను లక్ష్యపెట్టరు. దేవుని హస్తకృత్యములను లక్ష్యపెట్టరు. కావున ఆయన వారిని వృద్ధిపరచడు. నిర్మూలము చేస్తాడు. సౌలు తన 40 యేండ్ల పాలనలో ఆలయము, మందసము, ప్రత్యక్ష గుడారముల ధ్యాస లేదు. (ఈయన కాపరైనా కాపుకాయని కాపరే). ఎంతసేపు దావీదు మీద కోపమే. ఇటువంటి సంఘకాపరులు ఉన్నారు జాగ్రత్త. అదే దావీదు జీవితములో ఆలయము, మందసము, ప్రత్యక్ష గుడారములపై మక్కువ గలవాడు. ఈ కాపరి ఎన్ని శ్రమలు వచ్చినా కాపాడు తున్నాడు. అందుకే **2సమూ 3:1** లో సౌలు కుటుంబికులకు (సంఘానికి) దావీదు కుటుంబికులకు (సంఘానికి) బహు యుద్ధము జరుగగా దావీదు అంతకంతకు ప్రబలెను. సౌలు కుటుంబము అంతకంతకు నీరసిల్లెను. దావీదు విజ్ఞాపన ధ్వని ఈ కార్యము నెరవేర్చింది. ప్రకటన గ్రంథములో 7 సంఘాలు ఉన్నవి. రెండింటిలో మాత్రమే తప్పులు లేవు. కొన్నింటిలో కొన్ని తప్పులు ఉన్నాయి. ఒక సంఘములో అన్నీ తప్పులే. మన సంఘాలు ఎట్లున్నాయి? పౌలు సంఘములన్నిటిని గూర్చి చింత నాకుంది (**2కొరింథీ 11:28**) అంటున్నాడు. కనీసం మనమున్న సంఘములను గూర్చి చింత మనకున్నదా? ఇశ్రాయేలు, యూదా సమాజములలో భ్రష్టత్వము సంభవించింది. ఇశ్రాయేలు అష్షూరు చెరకు వెళ్ళినను యూదా బుద్ధి తెచ్చుకోలేదు. కాబట్టి బబులోను చెరకు వెళ్ళింది. సంఘములు చెరలో చిక్కినప్పుడు దావీదు దేవునికి మొర్రపెట్టుచున్నాడు. దానియేలు 86 యేండ్లవాడు. అయినప్పటికీ దేశ ప్రధానమంత్రి పదవిని నిర్వహిస్తూ దినమునకు ముమ్మారు మోకాళ్ళూని మొరపెట్టుచున్నాడు. వారు నిరీక్షణతో మొరపెట్టారు. మనము అదే పనిచేయాలి.

**6-7వ. స్తుతి:** మన విజ్ఞాపన దేవుడు ఆలకిస్తాడు. దురాలోచనలు, దుష్టక్రియలు ఉండి ప్రార్థన చేయకూడదు. నీతిమంతుని విజ్ఞాపన బలమైనది. ఆయనయందు నమ్మికయుంచిన సహాయము కలుగుతుంది. మన హృదయము సంతోషిస్తుంది.

**8-9వ. ప్రార్థనతో ముగింపు:** సంఘపెద్దలు సరిగా లేరు, సహోదరులు మంచిగా ఉన్నారు. అట్టివారికి దేవుడే ఆశ్రయము. ఆయనే రక్షణ దుర్గము. నీ జనులను (సహోదరులను)

రక్షింపుము. నీ స్వాస్థ్యము (సంఘము) ను ఆశీర్వదించుము అని దావీదు ప్రార్థన. కాపరులు చెడిపోయారు, పెద్దల పొరపాట్ల వలన సంఘము, సహోదరులు పాడుకాకుండా వారికి కాపరియై వారిని కాపాడుము స్వామీ అని దావీదులాగా ప్రార్థించాలి.

## 29వ కీర్తన (2+2+2+3+2 = 11 వ.)

**అంశం : యెహోవా స్వరము ఆయనకు చెందవలసిన స్తుతి ప్రభావము (పర్ణశాల పండుగ సందర్భము)**

**పీఠిక :** దైవపుత్రులారా, అంటూ కీర్తన ప్రారంభమవుతుంది. అంటే ఈ కీర్తన దేవుని కుమారులకు చెందుతుంది. అంటే దయ్యపు కుమారులు కూడా ఉన్నారా? అవును, మీరు తండ్రి యొక్క అపవాది సంబంధులు అని ఇశ్రాయేలీయులతో ప్రభువు అన్నాడు. ఫాక్స్‌గారు పరలోకమందున్న మా తండ్రీ అని ప్రార్థన చేస్తున్నారు. నిజంగా పరలోకమందున్న తండ్రికి కుమారులేనా. అలా లేనప్పుడు నరకమందున్న మా తండ్రీ అని ప్రార్థన చేయమనేవాడు. మన తండ్రి ఏ లోకమువాడో మనము ఆలోచించాలి. పరలోకమందున్న తండ్రికి కుమారులయ్యారా? ఎలా కావాలి? తన్ను (యేసయ్యను) ఎందరంగీకరించిరో వారందరికీ అనగా యేసు నామమందు విశ్వాసముంచిరో వారికందరికీ దేవుని పిల్లలు (కుమారులు) అగుటకు అధికారము అనుగ్రహించెను (**యోహాను 1:12**). యేసయ్యను నమ్మినవారే దైవపుత్రులు, ఏమని నమ్మాలి? యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని దేవుడు మృతులలో నుండి యేసును లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల నీవు రక్షింపబడుదువు. హృదయములో విశ్వసించిన నీతి కలుగుతుంది. నోటితో ఒప్పుకొనిన రక్షణ కలుగుతుంది. యేసయ్య మన పాపముల కొరకు చనిపోయాడని, తిరిగి లేచాడని నమ్మాలి, నోటితో ఒప్పుకోవాలి. అప్పుడు రక్షణ పొందుతాము. నీవు ఎప్పుడు రక్షింపబడ్డావు? ఎప్పుడు నమ్మావు? చాలామంది సరైన జవాబు చెప్పలేరు. నన్ను అడిగితే 1964 సంవత్సరము, ఆగస్టు 24న రక్షింపబడ్డాను అని చెప్పగలను. అలాంటి అనుభవము లేకుంటే ఈ దినము హృదయపూర్వకముగా నమ్మి ఒప్పుకొని తేదీ వ్రాసి పెట్టుకొనండి.

**1-2వ. యెహోవాకు ఆరోపించుట (చెల్లించుట):** ప్రభావ మహాత్మ్యములను యెహోవాకు ఆరోపించండి. పాత నిబంధన యెహోవాయే క్రొత్త నిబంధన యేసయ్య. ఆయన ప్రభావము గలవాడు. ఆయన ప్రభావము 12 యేండ్ల రక్తస్రావరోగిని క్షణంలో బాగుపరచింది. ఇంకా గ్రుడ్డివారిని, కుంటివారిని, సకల రకాల రోగులను బాగుపరిచాడు. ఆయన మహాత్మ్యము గలవాడు. ఒక్క క్షణములో పాపి పాపాన్ని క్షమించి పరలోకములో చేర్చేవాడు. సమస్త మహిమ, ఘనత, ఆయన నామానికే చెందాలి. ప్రతిష్ఠిత ఆభరణములు అంటే రక్షణ వస్త్రాలు, నీతివస్త్రాలు ధరించుకొని ఆయనను ఆరాధించండి.

**3-4వ. యెహోవా స్వరము - జలములు:** జలముల మీద ఆయన స్వరము వినబడుచున్నది. జలములు అంటే జనములు, మహా జలములు అంటే మహా జన

సమూహములు అని. వెళ్లండి సర్వసృష్టికి (సమస్త జనములకు) సువార్త స్వరము వినిపించుచున్నాడు. ఆయన స్వరాన్ని వినిపింపజేస్తున్నామా? తిని నిద్రపోతున్నామా? మీ ద్వారా ఎన్ని గ్రామాల్లో సువార్త వినబడింది? ఏ ఏ పట్టణములలో సువార్త ప్రకటింపబడింది?

**5-6వ. యెహోవా స్వరము - వృక్షములు:** దేవదారు వృక్షములు అంటే గొప్పవారు అని. వారికి సువార్త స్వరము వినిపించండి. లెబనోను దేవదారు వృక్షములను ముక్కలుగా విరవండి అంటే ఘనమైనవారికి సువార్త ప్రకటించి వారి హృదయాలను బద్దలు చేయండి. సంఘానికి తీసుకొని రండి. వెళ్ళి విరుగగొట్టుట సులువే. వాటిని మందిరమనకు మోసికొని రావడం చాలా కష్టము. అయినా తెండి. మందిరము కట్టండి, వారిని దూడలవలె గంతులు వేయునట్లు చేయండి. వారు రక్షణార్థమై హృదయములో ఉల్లసించి స్తుతించునట్లు చేయండి. మనము కాదు చేసేది ఆయనే చేస్తాడు. మనము దేవునికి సహకరించాలి.

**7-9వ. యెహోవా స్వరము - అగ్నిజ్వాలలు, అరణ్యము, ఆలయము:** యెహోవా స్వరము అగ్నిజ్వాలలను ప్రజ్వలింపజేయును. అగ్నిజ్వాలలు పరిశుద్ధాత్మకు సూచన. ప్రజ్వలించుట ఆత్మ నింపుదలకు సూచన. పరిశుద్ధాత్మతో నింపబడి అరణ్యము (లోకము)ను కదలించాలి. ఆకులు రాలి, పాత జీవితము పోయి క్రొత్త జీవితము రావాలి. ఆయన ఆలయములో చేర్చబడిన వారందరు ఆయనకే ప్రభావము, ఘనత, మహిమ ఆరోపించాలి.

**10-11వ. యెహోవా రాజైన తన ప్రజలకు బలము, సమాధానము, ఆశీర్వాదము నిచ్చు దేవుడు:** ప్రళయ జలముల మీద ఆసీనుడు. ప్రళయము త్వరలో రానుంది. ప్రభువును నమ్మావా లేదా? నమ్మి రక్షింపబడండి. లేకుంటే నరకము తప్పదు. ప్రభువు రారాజుగా వచ్చి భూలోకమును పరిపాలిస్తాడు. యుగ యుగములు రాజుగా ఉంటాడు. నమ్మినవారికి బలము అనుగ్రహిస్తాడు. సమాధానము కలుగజేస్తాడు. ఈ లోకములోను, పరలోకములోను ఆశీర్వాదిస్తాడు.

## ౩౦వ కీర్తన (3+3+3+3 = 12 వ.)

**అంశం : మందిర స్థల ప్రతిష్ఠ కాలమున ప్రార్థన స్తుతి**

**పీఠిక :** గృహ ప్రతిష్టాపన గానము అని పైన ఉంది. ఇంగ్లీష్‌లో దేవుని మందిర ప్రతిష్టాపన గానము అని ఉంది. దావీదు కాలములో మందిరము లేదు. స్థలము ప్రతిష్ఠింపబడినది. ఆదాము మొదలుకొని దావీదు వరకు బలిపీఠములే గాని మందిరము లేదు. నీవు నన్ను స్వస్థపరచితివి గోతిలోకి దిగకుండా బ్రతికించితివి అంటున్నాడు. దావీదు ప్రాణాపాయములో ఉన్నాడు. దేవుడు బాగుపరిచాడు. దావీదు తప్పులు చేశాడు. శిక్షలు వచ్చాయి. ఒప్పుకొని శిక్షల నుండి తప్పించుకున్నాడు. **2సమూ 24 అధ్యా.** లో దేవునికి కోపము పుట్టునట్లు జనసంఖ్య చేయించాడు. కొన్నిసార్లు దేవుడే జనసంఖ్య చేయమన్నాడు. ఇక్కడ దేవుడు ఒప్పుకోలేదు. అందుకే దావీదు చేసిన పని వలన గొప్ప పాపము కట్టుకొంటిని **2సమూ 24:10** అంటున్నాడు. జనసంఖ్య చేయడం గొప్ప పాపమా? అవును, దేవుని సెలవు

లేకుండా ఏమిచేసినా గొప్ప పాపమే. శిక్షగా 3 ఏండ్లు కరువులు, శత్రువులతో యుద్ధము, 3 రోజులు యెహోవా తెగులు, ఏది కావాలో దేవుడు కోరుకోమన్నాడు (**2సమూ 24:14**). దావీదు తెలివైనవాడు గనుక దేవుడు మహా కృప గలవాడు గనుక దేవుని చేతిలోనే పడతాడు అన్నాడు. దేవుని దూత ఒక దినములో 70,000 మందిని చంపాడు. యెహోవా సంతాపము చెంది ఆపమన్నాడు. దేవుని బహు వాత్సల్యమును తెలిసినవాడు గనుక దావీదు ఈ శిక్షను కోరాడు. ఆ సమయములో దావీదుకు కూడా తెగులు సోకినట్లు ఉంది. గోనెపట్ట ధరించి అంగలార్పుతో విలపించాడు. అరౌనా కళ్ళములో దేవుడు బలిపీఠము కట్టమన్నాడు. మందిర స్థలమనకు ప్రతిష్ఠ చేస్తూ ఈ కీర్తన వ్రాసి గానం చేశాడని వేదాంతుల భావన. ఆ స్థలములోనే సొలొమోను మందిరము కట్టాడు.

**1-3వ. యెహోవాను కొనియాడుట:** యెహోవా నా దేవా, నేను నీకు మొఱ్ఱపెట్టగా స్వస్థపరచినందుకు, నన్ను ఉద్ధరించినందుకు నిన్ను కొనియాడుచున్నాను. పాతాళము నుండి నా ప్రాణమును గోతిలోనికి దిగకుండా బ్రతికించితివి. దావీదు జనములను లెక్కించి పాపము చేశాడు. అందులో నావారు ఇంతమంది అను అతిశయము దాగి ఉంది. నాశనమునకు ముందు గర్వము నడచును. సాతాను చేసిన మొదటి పాపము గర్వమే. తప్పు తెలుసుకొని శిక్షను కూడా ఒప్పుకున్నాడు. పాప క్షమాపణ దొరికినది కాని కొంత నష్టము జరుగుతుంది అని మరచిపోకూడదు.

**4-6వ. యెహోవా భక్తులను కీర్తించమనుట:** యెహోవా భక్తులారా, ఆయనను కీర్తించుడి. తెగులు నుండి కాపాడిన ప్రభువును తానే కాకుండా ఇశ్రాయేలీయులలోని యెహోవా భక్తులను కూడి కీర్తించమంటున్నాడు. పాపపు తెగులు నుండి కాపాడిన మన యేసయ్యను సంఘముగా స్తుతించుదుము గాక. కనుక కోపము కంటే దయనే ఎక్కువగా చూపించే దేవుడు. మూడు రోజులు తెగులు ఉంటే ఇశ్రాయేలీయులు అందరు చనిపోయేవారు. దేవుడే సంతాపము పొంది కీడు చాలు అన్నాడు. మనము చేసే పొరపాట్ల మీద కోపము వస్తుంది. కానీ ఎక్కువ శిక్షించలేదు. దావీదు మొఱ్ఱపెట్టాడు, కరుణించాడు. మన పరిస్థితి ఏదైనా మొరపెట్టి తప్పులు ఒప్పుకుంటే క్షమించి దయ చూపేవాడు. నేను ఎన్నడు కదలను అని నా క్షేమకాలమున దావీదు అనుకొన్నాడు. ఇది మనకున్న అతిశయము. మన అతిశయాన్ని తగ్గించడానికి కూడా దేవుడు ఆపదలు పంపుతాడు. కనుక నిత్యమ భయము కలిగి జీవించుదుము గాక.

**7-9వ. యెహోవాను బతిమాలుట:** నా పర్వతము (జీవితమును) స్థిరపరచితివి. నా తప్పిదము వల్ల నీవు ముఖము దాచుకొంటివి. అయితే నేను కలతచెందాను స్వామీ, నీకు మొఱ్ఱపెట్టుచున్నాను, బతిమాలుకుంటున్నాను. నేను చనిపోతే ఏమి లాభము స్వామీ. నా సమాధిలో మన్ను స్తుతిస్తుందా? నీ సత్యమును గూర్చి వివరిస్తుందా? నన్ను బ్రతికిస్తే నిన్ను స్తుతిస్తాను, నీ సత్యమును గూర్చి వివరిస్తాను స్వామీ అన్నాడు. సమాధిలోనికి వెళ్లవలసిన పరిస్థితిలో ఆయనను బ్రతిమాలితే దయ లభిస్తుందని మరువవద్దు.

**10-12వ. యెహోవాను స్తుతించుట:** నా అంగలార్పును నాట్యంగా మార్చావు. నా గోనెపట్ట విడిపించి సంతోష వస్త్రము ధరింపజేశావు. కనుక నేను మౌనముగా ఉండక నిన్ను కీర్తిస్తాను అంటున్నాడు. మనము కూడా ఆపదమ్రొక్కులు మ్రొక్కుతాము. దేవుడు కనికరిస్తారు, దేవుణ్ణి మర్చిపోతాము. అలా దావీదు చేయలేదు. యెహోవా, నా దేవా నిత్యము నేను నిన్ను స్తుతిస్తాను అంటున్నాడు. ఆదివారము మాత్రమే కాదు, నిత్యము. మన చదువులు, పనులు ఎట్లు? నిత్యము స్తుతిస్తుండగా అవి జరుగుతూనే ఉంటాయి.

## 31వ కీర్తన (3+3+3+3+3+3+3+3 = 24 వ.)

**అంశం : నీ యందు భయభక్తులు గలవారి నిమిత్తము నీవు దాచియుంచిన మేలు ఎంతో గొప్పది**

**సందర్భము:** ఎవరికైనా సంతోషము కలిగిన వాడు కీర్తనలు పాడవలెను. సంతోషము వచ్చిందంటే అంతకుముందు దుఃఖము కలిగి ఉండాలి. దావీదు సుమారు 120 కీర్తనలు వ్రాశాడని వేదాంతుల అభిప్రాయము. 120 సార్లు దుఃఖము పోయి సంతోషము కలిగినందున వ్రాశాడు అనుకోవచ్చు. 40 కీర్తనలలో పైనగానీ, మధ్యగానీ ఆపదలో ఉన్నాడని చెప్పబడింది (**కీర్తన 31:9**). ప్రాకారము గల పట్టణములో యెహోవా తన కృపను ఆశ్చర్యకరముగా నాకు చూపియున్నాడు. ఫిలిష్తీయులు కెయిలా మీద యుద్ధము చేసి కల్లముల మీద ధాన్యమును దోచుకొనుచున్నారని దావీదు విని వారిని రక్షించాడు (**1సమూ 23:1-5**). కెయీలాలో దావీదు ఉన్నాడని సౌలు విని చంపాలనుకున్నాడు. కెయీలా వాసులు కూడా తనను పట్టిస్తారని దావీదు దేవుని దగ్గర విచారణ చేసి తెలుసుకొని పారిపోయాడు. ఆ సందర్భముగా ఈ కీర్తన వ్రాశాడని తలంచవలెను. సౌలుకు దావీదును చంపడంలో ఉన్న శ్రద్ధ పరిపాలనలో లేదు. చాలామంది దైవసేవకులకు సంఘ క్షేమము మీద శ్రద్ధ లేదు. కెయీలా వాసులను రక్షించాడన్న కృతజ్ఞత కూడా లేక దావీదును పట్టించాలనుకున్నాడు. నేడు చాలామంది కృతజ్ఞత లేనివారుగా ఉన్నారు. మనమెట్లున్నాము?

**1-4వ. శరణుజొచ్చిన వారికి ఆశ్రయము:** దేవా, నా శరణు నీవే. మనుష్యులు రాజు శరణు కోరుతారు. ఇక్కడ రాజు దేవుని శరణు కోరుచున్నాడు. రాజులను నమ్ముకొనుట కంటే యెహోవాను ఆశ్రయించుట మేలు. దావీదు నన్ను సిగ్గుపడనియ్యకుము, నీ నీతినిబట్టి నన్ను రక్షింపుమ, విడిపించుము. నాకు ఆశ్రయ శైలముగా ప్రాకారము గల యిల్లుగా ఉండుము. నా కొండ, నా కోట నీవే. నీ నామమునుబట్టి త్రోవచూపి నన్ను నడిపించుము. శత్రువుల వల నుండి తప్పించుము అని మొరపెట్టుచున్నాడు. మనకు శరీరము, లోకము, సాతాను వాని దూతలు శత్రువులు. ఏ శత్రువు చేతనైనా చిక్కినవారికి ఇది చక్కని మాదిరికరమైన ప్రార్థన.

**5-8వ. విమోచించు సత్యదేవుని నమ్ముకొనుట:** సత్యదేవా, (అసత్యదేవతలు ఎంతోమంది ఉన్నారు) నన్ను విమోచించువాడవు నీవే. నీవు నా బాధ కనిపెట్టావు. ఎన్ని బాధలున్నా నీ కృపనుబట్టి ఆనందముతో సంతోషిస్తాను. సాధ్యమా? నమ్మితే సాధ్యమే! అడిగినవి పొందితినని నమ్మితే అవి వస్తాయి (**మత్తయి 21:22**).

**9-12వ. ఇరుకును బట్టి ప్రాణ, దేహబలము క్షీణించుట:** ప్రాకారము గల పట్టణములో బంధించబడ్డాను. విచారముతో నా ప్రాణాత్మ దేహాలు కన్నులు క్షీణించుచున్నవి. బ్రదుకు దుఃఖమయము, నిట్టూర్పులతో గతిస్తూ ఉంది. ఎముకలు క్షీణించిపోవుచున్నవి. అయినను నా ప్రార్థన వినే దేవుడు ఉన్నాడు కనుక శత్రువులకు దొరకను. చనిపోయిన వానివలే ఉన్న స్థితి నుండి దావీదును తప్పించాడు. మనలను కూడా తప్పిస్తాడు. ధైర్యము తెచ్చుకుందాము.

**13-16వ. విశ్వాసము ద్వారా కృపచేత రక్షణ:** అనేకులు దురాలోచనలు చేస్తున్నారు. ప్రాణాన్ని తీయుటకు యోచిస్తున్నారు. నలుదిక్కులా నాకు భీతి కలుగుచున్నది. అయినా యెహోవా, నీవే నా దేవుడవని నమ్ముచున్నాను. నా భవిష్యత్తు నీ చేతిలో ఉన్నది. తరుము శత్రువుల చేతిలోనుండి నన్ను రక్షింపుము. నీ ముఖ కాంతి ప్రకాశింపజేసి నీ కృపచేత నన్ను రక్షించుము. ఈ కీర్తన అంతా శ్రమలలో ఉన్నవారికి మాదిరి ప్రార్థన.

**17-20వ. ఎంతో గొప్ప మేలును సిద్ధపరచిన దేవుడు:** నీకు మొఱ్ఱపెట్టాను, సిగ్గుపడనియ్యకుము. భక్తిహీనులు సిగ్గుపడతారు. వారికి పాతాళమే గతి. అబద్ధాలు చెప్పేవారు, గర్వమును, అసహ్యమును అగుపరిచేవారున్నారు. నీతిమంతుల మీద కఠోరమైన మాటలు పలుకుతారు. అయితే వారి పెదవులు దేవుడు మూస్తాడు. దేవునియందు భయభక్తులు గలవారి నిమిత్తము దేవుడు దాచిన మేలు ఎంతో గొప్పది. ఏ మేలు దాచాడు, సమస్తము మేలు. **రోమా 8:28.** జీవితంలో కష్టాలు, నష్టాలు ఉన్నాయి. ప్లస్‌లు మైనస్‌లు ఉంటాయి. ఆఖరుకు జవాబు వస్తుంది. కాబట్టి విశ్వాసి జీవితము మేలుతోనే ముగుస్తుంది. కొందరైతే శ్రేష్టమైన పునరుత్థానము పొందగోరి విడుదల పొందక యాతన పెట్టబడితిరి (**హెబ్రీ 11:35**). ఈ లోకంలో విడుదలలేక మరణించినా అది మేలే. యేసుక్రీస్తు ప్రభువు దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని బాగ్యమని ఎంచుకొనక సిలువ మరణము (యాతన పెట్టబడి) పొందునంతగా తగ్గించుకొనెను. మరణముతో యేసుక్రీస్తు జీవితము అంతము కాలేదు. దేవుడు మృతులలో నుండి లేపి అధికముగా హెచ్చించాడు (**ఫిలిప్పీ 2:5-11**). కనుక విడుదలలేక మరణించినా విశ్వాసికి మేలే. మనుష్యుల కపటోపాయములలో పడకుండా, కలహాలు లేకుండా దేవునియందు భయభక్తులు గలవారిని ఆయన కాపాడుచున్నాడు. ఆయన నామమునకే స్తుతి కలుగునుగాక. భయభక్తులతో ఆయనను సేవించుదుము గాక.

**21-24వ. మనకు కలిగిన మేలుకై దేవునికి స్తుతి:** నాశనమైనాను అనుకొంటిని, నేను మొఱ్ఱపెట్టగా, విజ్ఞాపన చేయగా విని కాపాడావు. కాబట్టి ఎటువంటి పరిస్థితులలో ఉన్నా ప్రార్థన చేయడమే మనము చేయవలసినది. అయితే గర్వముగా ప్రవర్తించువారికి ప్రతికారము ఉంది. ఏదో ఒక స్థాయిలో మనకు గర్వము ఉంటుంది. అయితే ఆయన సాత్వికుడు, దీనమనస్సు గలవాడు. ఆయన కాడి ఎత్తుకొని నేర్చుకొందము గాక (**మత్తయి 11:29,30**). ధైర్యము వహించి దేవుని కొరకు కనిపెట్టుకుని ఉందుము గాక (**కీర్తన 40:1**).

## 32వ కీర్తన (4+3+4 = 11 వ.)

**అంశం : నీవు నన్ను రక్షించెదవు**

**పీఠిక :** నా దాగుచోటు నీవే. నా శ్రమలో నుండి నీవు నన్ను రక్షించెదవు, నా, నీవు, నన్ను . . . ఇవి వ్యక్తిగతముగా దేవునితో సంబంధాలు తెలిపే పదాలు. నీవు, నేను అన్నట్లు దేవునితో సంబంధము కలిగి ఉండాలి. రక్షణ నీకు ఒక్కనికి సంబంధించినది. తల్లిదండ్రులు క్రైస్తవులు. పుట్టుకతో క్రైస్తవులు అనే మాటలు రక్షణకు పనికిరావు. పుట్టుకతో పాపులే గాని క్రైస్తవులు కాదు. క్రీస్తును అంగీకరించి, రక్షింపబడితే క్రైస్తవులు రక్షింపబడిన తర్వాత కూడా శ్రమలు ఉంటాయి. శోధనలు ఉంటాయి. వీటన్నిటికీ దాగుచోటు యెహోవానే, యేసుక్రీస్తే.

**1-4వ. పాప పరిహార రక్షణ అవసరమే:** అతిక్రమములకు పరిహారము, పాపమునకు ప్రాయశ్చిత్తము, నిర్దోషి అని ఎంచబడుట, రక్షణ ఇవన్నీ ఒకే అర్థము గల మాటలే. ఒక మాట అర్థమైతే అన్నీ అర్థమైనట్లే. అతిక్రమము అంటే క్రమము తప్పడము. ఆదాము హవ్వలు దేవుడు వద్దన్న పండు తిని క్రమము తప్పారు. దేవుని ఆజ్ఞను అతిక్రమించారు. దీనికే పాపము, దోషము, దుర్మార్గము, భక్తిహీనత అని పేరు. ఆనాటి నుండి ఆదాము ద్వారా దేవుని ఆజ్ఞను అతిక్రమించే స్వభావము (పాపము) మనకు వచ్చింది. దీనికి పరిహారము జరగకపోతే ఈ లోకములో ఎముకలు క్షీణిస్తాయి. దేవుని చెయ్యి మనమీద బరువుగా ఉంటుంది. ఎలాగోలా జీవించి చనిపోతే నిత్యాగ్ని గుండములోనికి వెళ్ళాలి. అందుకే మానవునికి రక్షణ అవసరత ఉంది. ప్రయాసపడి భారము మోసుకొనుచున్న సమస్త జనులారా నా యొద్దకు రండి, నేను మీకు విశ్రాంతిని (రక్షణ) కలుగజేస్తాను (**మత్తయి 11:28**). ప్రభువు దగ్గరకు రాకుంటే ఎన్ని ఉన్నా నెమ్మది సున్నా. యేసయ్య ఉంటే ఏమీ లేకున్నా అంతా నెమ్మదే. యేసు ప్రభువు మన పాపములకు ప్రాయశ్చిత్తమై ఉండుటకు వచ్చాడు (**1యోహాను 4:10**). సిలువలో మన పాపములకు శిక్ష ననుభవించాడు, చనిపోయాడు, సమాధి అయ్యాడు, తిరిగి లేచాడు. నెమ్మది, పాప పరిహారము, నెమ్మది ఇస్తాను అంటున్నాడు. వచ్చి పాప పరిహారము పొందాలి. అటువంటివాడు ధన్యుడు. 1 కీర్తన తర్వాత ఈ 32వ కీర్తనలోనే చెప్పబడింది.

**5-7వ. పాప పరిహారము (రక్షణ):** రక్షణ, నెమ్మది, పాప పరిహారము, ప్రాయశ్చిత్తము, విశ్రాంతి (ఇవన్నీ ఒక్కటే) ఎలా పొందాలి. నా దోషమును కప్పుకొనక ఒప్పుకొందునని అనుకొంటిని. ఇంతే చేయవలసినది. నీకు దోషముందని తెలుసుకొని యెహోవా ఎదుట ఒప్పుకుంటే చాలు. యెహోవా అంటే యేసుక్రీస్తే. యేసుక్రీస్తు ఎదుట ఒప్పుకుంటాను అనుకోవాలి. ఆయన పాప దోషములను పరిహరిస్తాడు. బాల్యము నుండి ఇంతవరకు ఉన్న జ్ఞాపకమునకు వచ్చి ప్రతి పాపమును ఒప్పుకోండి. రక్షణ దొరుకుతుంది. ఈ మాటల ద్వారా దేవుడు నిన్ను దర్శిస్తూ ఉన్నాడు. నీ పాపములను ఒప్పుకుంటే పరిహరించి భక్తునిగా చేసుకుంటాడు. అప్పుడు నీకు ప్రార్థన చేయడం అలవాటు అవుతుంది. విస్తార

జలప్రవాములు (ఏ కీడు) నీ మీదికి రాదు. వచ్చినా ప్రభువ నీ దాగుచోటు. అనుదినము నిన్ను రక్షిస్తాడు.

**8-11వ. పాప పరిహారము పొందినవారి ఆశీర్వాదము:** ఈ ఆశీర్వాదాలు నిన్ను వెంబడిస్తాయి: 1) ఉపదేశము చేస్తాడు. జీవిత కాలమంతటికీ అవసరమైన ఉపదేశము దొరుకుతుంది. 2) నడువవలసిన మార్గములను బోధిస్తాడు. 3) నీ మీద దృష్టి ఉంచుతాడు. 4) బుద్ధి కలిగిస్తాడు. 5) నోటికి దుర్భాషలు రాకుండా కళ్ళెము పెడతాడు. 6) కృప దొరుకుతుంది. 7) సంతోషము, ఆనందము దొరుకుతుంది. 8) పిచ్చి పాటలకు బదులు దేవుని పాటలు పాడతావు. 9) ఆలోచన చెబుతాడు. 10) వేదనలు తప్పుతాయి.

## 33వ కీర్తన (3+3+3+3+3+4+3 = 22 వ.)

**అంశం : దేవుని కార్యములనుబట్టి, కాపుదలనుబట్టి స్తుతి**

**అంశం :** ఇది ఎవరు వ్రాశారో పీఠికలో లేదు. కీర్తన గ్రంథములు సూత్రమేమంటే దానికి ముందు ఎవరి పేరు ఉందో వారే ఈ కీర్తన వ్రాశారు అనుకోవాలి. కొన్ని తర్జుమాలలో ఒక రెండు కీర్తనలు కలిసి ఉంటాయి. తర్వాత విభజించారు. కనుక ఈ కీర్తన దావీదు వ్రాశాడని గ్రహించాలి.

**1-3వ. యెహోవాను ఆనంద గానముతో స్తుతించుట:** నీతిమంతులు ఆనంద గానము చేయాలి. నీతిమంతుడు లేడు ఒక్కడును లేడు. క్రీస్తుయేసును నమ్మువారు ఉచితముగా నీతిమంతులు అవుతున్నారు (**రోమా 3:11,24**). పాత నిబంధనలో యెహోవాను నమ్ముకొనుటే నీతి. యెహోవాను నమ్ముకున్నవారే నీతిమంతులు (**ఆది 15:6**). పాత నిబంధన యెహోవా కొత్త నిబంధన యేసు ఒక్కరే. నీతిమంతులయ్యారా లేదా? నీతిమంతులు యెహోవానుబట్టి ఆనంద గానము చెయ్యాలి. అందరు కలిసి పాడాలి. స్వరమెట్లున్నా బాగా పాడేవారితో గొంత కలపాలి. యథార్థవంతులు (నీతిమంతులు) స్తుతి చేయడం శోభాయమానంగా ఉంటుంది. పది తంతుల స్వరమండలము (గొప్ప వాయిద్యము) తో ఇంపుగా వాయిస్తూ క్రొత్త కీర్తన పాడాలి. క్రొత్త కీర్తన వ్రాసేవారు, సంగీతము కొట్టేవారు, గానము చేసేవారు ఎంతో ధన్యులు.

(ఈ మూడు పనులు దావీదుగారు ఒక్కరే చేసేవారు). సువార్త వాక్య పరిచర్యలు ఈ లోకంలో కలగలిసిపోతాయి. గాన పరిచర్య పరలోకం వరకు సాగుతుంది. మధురమైన సంగీతము ఇంపైన గాత్రము పరిశుద్ధుల హృదయాలలో ఉత్సాహం నింపుతుంది.

**4-6వ., 7-9వ. యెహోవా కార్యములు:** యెహోవా వాక్యము యథార్థమైనది. నీ నామమంతటి కంటే నీవిచ్చిన వాక్యమును గొప్పచేసి ఉన్నావు (**కీర్తన 138:2**). ఆయన వాక్యము గొప్పది, నమ్మదగినది. ఆకాశమును నిర్మించినది ప్రపంచములను **హెబ్రీ11:3**లో నిర్మించినది సర్వసమూహములను కలుగజేసినది, సముద్ర జలములను, అగాధ జలములను కలుగజేసినది ఆయనే. ఆయన మాట (వాక్యము) సెలవియ్యగా సమస్తమును కలిగాయి. భూలోక నివాసులందరూ ఆయనకు భయపడాలి. భక్తి నిలపాలి, లేకుంటే పాతళమే.

**10-12వ. యెహోవా భక్తులు కానివారి ఆలోచన:** అన్యజనులు (భక్తిహీనులు) ఆలోచనలు వ్యర్థమవుతాయి, నిష్ఫలమవుతాయి. యెహోవా (యేసుక్రీస్తు) ఆలోచన (రక్షణ ప్రణాళిక) సదాకాలము నిలుస్తుంది. ఆయన సంకల్పము, యేసు క్రీస్తు ద్వారా పరలోకం చేరు కుమారులుగా చేయుట ( **ఎఫెసీ 1:4-6**). తరతరములు ఉంటుంది. కాబట్టి యేసుక్రీస్తు దేవుడుగా గల జనులు ధన్యులు. ఆయన బిడ్డలైన జనులు ధన్యులు. ఈ ధన్యత దొరికిందా?

**13-19వ. యెహోవా కాపుదల:** యెహోవా ఆకాశము (తన నివాసము) నుండి నరులందరిని (భూలోక నివాసుల వైపు) కనిపెట్టుచు దృష్టించుచున్నాడు. నీ పిల్లలను పార్కులో సంతోషముతో ఆడుకుంటూ ఉండగా ఎటువంటి ప్రమాదము రాకుండా ఎలా నీవు కనిపెట్టుతావో అంతకంటే ఎక్కువగా మనలను దృష్టించుచున్నాడు. మరణము (రెండవ మరణము) రాగా తప్పించుటకును, కరువులో (శ్రమలలో) సజీవులుగా (నిత్యజీవంతో) కాపాడుటకు యెహోవా దృష్టించుచున్నాడు. ఏ రాజు (వ్యక్తి) కూడా సేవబలము (స్వంత క్రియలు) చేత రక్షింపబడడు. పరలోకం చేరలేడు. ఏ నరుడును అధిక బలము (యోగ్యత) చేత నరకము తప్పించుకోలేడు. ఆయనయందు భయభక్తులు కలిగి ఆయన కృప కొరకు కనిపెట్టుకొనువారి యందు ఆయన దృష్టి నిలుచుచున్నది. కృప చేత రక్షింపబడండి.

**20-22వ. యెహోవా మనకు సహాయము, కేడెము:** మనము యెహోవా నామమందు నమ్మిక యుంచియున్నాము. యేసు నామములో విశ్వాసముంచినప్పుడు దొరికే భాగ్యము ఎన్నోసార్లు వివరించబడినది. ప్రభువునందు విశ్వాసముంచిన వారి హృదయము సంతోషిస్తుంది. ప్రభువు కొరకు కనిపెట్టుకొనిన వాని ప్రాణమునకు సహాయము, కాపుదల ప్రభువే. కాబట్టి ప్రభువా, నీ కొరకు కనిపెట్టుచున్నాము. నీ కృప మా మీద ఉండును గాక అని ప్రార్థించుదుము గాక.

## 34వ కీర్తన (7+7+8 = 22 వ.)

**అంశం : నీతిమంతులకు కలుగు ఆపదలన్నిటిలో నుండి యెహోవా విడిపించును**

**పీఠిక:** దావీదు అబీమెలెకు (అకీషు) ఎదుట పిచ్చివానివలె ప్రవర్తించి అతనిచేత తోలివేయబడినప్పుడు వ్రాశాడని కీర్తనపై ఉన్నది (**1సమూ 21:10-15**). దావీదు ఆకీషు రాజు శరణు కోరివచ్చాడు. కాని ఆకీషు సేవకులు దావీదు పరాక్రమాన్ని పొగిడారు. అప్పుడు దావీదు భయపడి పిచ్చివానివలె ప్రవర్తించాడు. ఆకీషు రాజు తోలివేయగా ప్రాణాపాయము నుండి కాపాడబడిన సందర్భంలో వ్రాశాడు. తరువాత ఆకీషు రాజు దావీదును చేర్చుకున్నాడు (**1సమూ 27:3**). దావీదు జీవితములో ఎన్నో ఆపదలు ఎదుర్కొన్నాడు. అయితే అన్నిటినుండి యెహోవా విడిపించును అని తెలుసుకొని ఈ కీర్తన పాడి స్తుతిస్తున్నాడు.

**1-7వ. నీతిమంతుల మార్గము:** ఎల్లప్పుడు యెహోవాను సన్నుతించాలి. నిత్యమూ కీర్తించాలి. సాధ్యమా? సాధ్యమే. ఎక్కడ ఉన్న, ఏమి చేస్తున్నా ఆయన చేసిన మేలులు

గుర్తుకు తెచ్చుకుంటూ అంతరంగములో స్తుతిస్తూ ఉండాలి. మనము యెహోవానుబట్టి ఆతిశయించాలి. మన పక్షములో సమస్తము చేసినవాడు ఆయనే. సంతోషించాలి. యెహోవా నామమును ఘనపరచి గొప్పచేయాలి. ఎందుకంటే 'నీకు మొరపెట్టునప్పుడు ఉత్తరమిచ్చేవాడవు, నాకు కలిగిన భయములన్నిటి నుండి తప్పించినవాడవు' అని దావీదు అంటున్నాడు. ఆయన తట్టు చూడగా (మొరపెట్టగా) వెలుగు కలుగును. **MLA** దగ్గరకు వెళ్ళి ఉద్యోగము తెచ్చుకుంటే మన ముఖానికి వెలుగు ఉండదు. దేవుని ప్రార్థించి ఉద్యోగము తెచ్చుకుంటే ముఖము వెలుగుతుంది. సిగ్గు, అవమానము ఉండదు. మొర్రపెట్టితే ఆయన దూత కావలి ఉండి రక్షిస్తాడు. హిజ్కియా కాలంలో ఒక దూత లక్షా ఎనుబది అయిదు వేలమందిని హతమార్చాడు (**2రాజులు19:35**). అంత శక్తిగల దూత మనకు కావలి ఉంటాడు.

**8-14వ. భయభక్తులు కలిగి ఉండుట:** యెహోవా ఉత్తముడని దయాళుడని రుచి చూచి ఆయన దగ్గరకు వస్తే రుచి చూస్తావు. మన పాపములకు మనలను శిక్షించక ఆయన శిక్షించుకున్నాడు. ఈ రుచి ఎరిగితిరా ఆయనను ఆశ్రయించండి. భయభక్తులు ఉంచండి. సింహము గర్జిస్తే వాటి దగ్గరికి ఎరలు పరిగెత్తుకొని వస్తాయి. కొన్నిసార్లు అవి అయినా ఆకలిగొంటాయి. గాని ఆయనను ఆశ్రయించువారికి ఏమి కొదువ ఉండదు. అందుకే ఆయన నేర్పే భయభక్తులను నేర్చుకోవాలి. కీడు మానాలి, మేలు చేయాలి. అప్పుడు ఏమియు కొదువ ఉండదు.

**15-22వ. నీతిమంతులుగా నుండుట:** యెహోవా దృష్టి నీతిమంతుల మీద ఉన్నది. ఆయన చెవులు వారి ప్రార్థనవైపు ఉన్నది. దుష్క్రియలు చేయువారికి యెహోవా విరోధి. వారిని భూమి మీద నుండి కొట్టివేస్తాడు (**1పేతురు 3:10-12**). నీతిమంతులు మొర్రపెడితే అన్ని ఆపదలలో నుండి విడిపిస్తాడు. నలిగిన మనస్సు, విరిగిన హృదయము గలవారికి దగ్గరవుతాడు. మనస్సు విరిగితే ఎముకలు విరగవు. కాపాడుతాడు. చెడుతనము భక్తిహీనులను సంహరిస్తుంది. మొదట భక్తిలో తగ్గుదల ప్రారంభమవుతుంది. తుదకు మరణము సంభవిస్తుంది. భక్తిని పెంపొందించుకోవాలి. యెహోవా తన సేవకుల ప్రాణమును విమోచిస్తాడు. ఆయన శరణుజొస్తే నీతిమంతులమవుతాము. ఆయన సేవకులమవుతాము.

## 35వ కీర్తన (8+8+8+4 = 28 వ.)

**అంశం : అసమానమైన దేవుడు**

**పీఠిక:** ఈటె దూసి దావీదును సౌలు, అతని అనుచరులు తరుముతున్నారు. **1సమూ 19:1,10.** వారి చేతిలో నుండి తప్పించుమని ప్రార్థించాడు. దేవుడు దావీదును తప్పించాడు. అంతేకాదు, తన సేవకుని క్షేమము చూసి ఆనందించే దేవుడని ఆయనను స్తుతిస్తున్నాడు, ఘనపరుస్తున్నాడు.

**1-8వ. ప్రాణము తీయగోరు వారికొరకై ప్రార్థన:** నాతో వ్యాజ్యమాడువారు, పోరాడువారు ఈటె దూసి తరుమువారు ఉన్నారు. యెహోవా, నా దేవా, వారితో నీవే వ్యాజ్యమాడు, నీవే

పోరాడు. నీవే వారిని అడ్డగించుమని దావీదు ప్రార్థిస్తున్నాడు. మనము వ్యాజ్యమాడితే, పోరాడితే, అడ్డగించితే గెలువలేము. నిన్ను రక్షకునిగా నేను ఒప్పుకున్నాను. నేను నిన్ను నిరీక్షించితిని అని నాతో చెప్పుము అనాలి (**రోమా 12:9-21**). అప్పుడు మనకు నెమ్మది కలుగుతుంది. మన ప్రాణము తీయగోరువారు, కీడు చేయువారు సిగ్గుపడుదురు గాక. అంటే వారిని సిగ్గుపరుస్తానని నమ్ముచున్నాను దేవా అని మనము ప్రార్థన చేయునప్పుడు వేటిని అడుగుతామో అవి దొరికినవని నమ్మితే అవి మనకు లభిస్తాయి (**మత్తయి 21:22**). యెహోవా దూత (యేసుక్రీస్తు) తరుముతాడు. నిర్నిమిత్తముగా వలబట్టినారు, గుంట త్రవ్వారు. అందులోనే శత్రువుల వలన పడగొట్టబడతాడని దావీదు విశ్వసించి ప్రార్థన చేస్తున్నాడు.

**9-16వ. నిందించువారి కొరకు ప్రార్థన:** ప్రార్థనకు జవాబు వచ్చినప్పుడు సంతోషిస్తాను అంటున్నాడు. ఇప్పుడు యెహోవా నీవంటి వాడెవడు? నన్ను నీ బలము చేత విడిపించువాడవు నీవే అని చెప్పుకుంటాను. **మీకా 7:18** తన వారి దోషమును పరిహరించి క్షమించు దేవుడవైన నీతో సమానుడైన దేవుడు ఉన్నాడా? లేదు, లేదు. **కీర్తన 71:19** నీ నీతి మహాకాశముల కంటే ఉన్నతమైనది. నీతో సాటియైనవాడు ఎవడు? (**కీర్తన 113:8**). నీవంటి బలాఢ్యుడు ఎవడు? ఇటువంటి దేవుణ్ణి ఎరిగి ఉన్నామా? అబ్రాహాముతో సర్వశక్తి గల దేవుడను అన్నాడు. సర్వశక్తి ఆయనలోనే ఉంది. ఇంక ఎక్కడా లేదు. ఇటువంటి దేవుని దాసులమైన మనలను ఇటువంటి వారిగా చేయాలని దేవుని కోరిక. దావీదు కూడా అసమానమైన భక్తుడే. శత్రువులు వ్యాధితో ఉన్నప్పుడు ఉపవాసముండి ప్రార్థించాడు (**13**). తల్లి చనిపోయినప్పుడు బాధపడే శత్రువుల కొరకు దావీదు బాధపడ్డాడు (**14**). సౌలును గురించి ఎంత ప్రార్థన చేశాడో. సౌలు మాటిమాటికీ దావీదుకు కీడు చేస్తూ ఉన్నా దావీదు సౌలుకు మేలు చేస్తూనే ఉన్నాడు. సౌలు గౌరవం కాపాడుటకై గొల్యాతును జయించాడు. సౌలు వ్యాధి పోగొట్టుటకై ప్రాణాపాయముతోనే వీణ వాయించాడు. అయినా సౌలుకు ఆయన పనివారికి మార్పు రాలేదు. దావీదు దాగి ఉండగా చూచి సంతోషించారు. మానక నిందించారు, పండ్లు కొరికారు (**16**) అయినా వారి కొరకు ప్రార్థించాడు. యేసు ప్రభువు శత్రువుల కొరకు ప్రార్థన చేయండి చెప్పకముందే ప్రభువు హృదయము గల దావీదు వారి కొరకు ప్రార్థన చేశాడు.

**17-24వ. నీతిని న్యాయమునుబట్టి తీర్పు తీర్చుమని ప్రార్థన:** నిర్హేతుకముగా శత్రువులయ్యారు. నిర్నిమిత్తముగా ద్వేషించారు. దావీదు తప్పు చేసి ఉంటే చెప్పలేదు. యేసు ప్రభువును కూడా నిర్హేతుకముగానే దూషించారు. మనలను కూడా కారణము లేకుండానే దూషించవచ్చు. కాని దావీదు ప్రార్థిస్తున్నాడు (**మత్తయి 5:44**). నన్ను కాపాడు తండ్రీ, నా ప్రాణమును సింహముల నోట నుండి విడిపించుము (**17**). మహా సమాజములో నిన్ను స్తుతిస్తాను (**18**). వారికి (శత్రువులకు) సమాధానము లేదు. దూషిస్తారు. ప్రభువా అవి నీకే కనబడుచున్నాను గదా (**22**). ఊరకుండకుము. దూరముగా ఉండకుము. నీ నీతినిబట్టి నాకు న్యాయము తీర్చుము (**24**). నా నీతి కాదయ్యా, నీ నీతే నాకు ఆధారము.

నన్ను చుట్టువారు సంతోషింపకుండా చేయుమని దావీదు ప్రార్థిస్తున్నాడు. మన ప్రార్థన అదే.

**25-28వ. తన సేవకుని క్షేమము చూసి ఆనందించు యెహోవాను స్తుతించుట:** నా అపాయము చూచి సంతోషించువారు, నా మీద అతిశయపడువారు సిగ్గుపడుదురు గాక (**26**). నేను నిర్దోషిని అని ఎరిగినవారు సంతోషపడుదురు గాక. మన నిర్దోషత్వము రుజువు అయినప్పుడు మనమే కాదు మనము నిర్దోషులమని ఎరిగినవారు కూడా సంతోషపడతారు. తన సేవకుని క్షేమము చూచి యెహోవా (యేసయ్య) ఆనందిస్తాడు. అట్టి దేవుని ఘనపరచుదుము గాక అని నన్ను నిర్దోషి అని ఎరిగివారు చెప్పుదురు గాక. నేను (దావీదు) కూడా దినమెల్ల నీ కీర్తిని గూర్చి పాడుదును గాక. మనము ఆయన కీర్తిని దినమెల్ల గానము చేయుదుము గాక.

## 36వ కీర్తన (4+2+3+3 = 12 వ.)

**అంశం : దేవుడు - మానవుడు**

**పీఠిక :** భక్తిహీనుల ప్రస్తావన అంటే మానవుల లక్షణాలు వివరించబడ్డాయి.

**1-4వ. మానవుని స్వభావము:** భక్తిహీనుల లక్షణాలు వివరించబడ్డాయి. అంటే మానవుల లక్షణాలు చెప్పబడ్డాయి. మానవులందరూ భక్తిహీనులేనా? అవును, పుట్టుకతో మానవులందరు పాప స్వభావము గలవారు. పాప పరిష్కారము ప్రభువు ద్వారా పొందకపోతే వారి హృదయము ఈ వచనాలలో చెప్పినట్లు తయారవుతుంది. పాప విమోచన పొందారా? లేకుంటే మానవుని హృదయములో అతిక్రమము దేవోక్తివలె పలుకుతుంది. వాని దృష్టికి దేవుని భయము ఉండదు. వాని దోషము బయలుపడి అసహ్యముగా కనబడుతుంది. నోటిమాటలు పాపమునకు, కోపమునకు నిలయములు. బుద్ధి కలిగి ప్రవర్తింపలేడు. పాపపు యోచనలు ఉంటాయి, అట్టి నడతతో నడుస్తాడు. చెడుతనము అసహ్యము కాదు. ఇది రక్షించబడని వాని స్థితి. రక్షింపబడితే క్షమాపణ దొరుకుతుంది. అయితే పైవన్నీ విసర్జించాలి. విసర్జించకపోతే భక్తిహీనునికి విశ్వాసికి తేడా ఉండదు. పూర్వము క్రీస్తును నమ్మినవారిని క్రైస్తవులు అనేవాళ్ళు. తరువాత నామకార్థ క్రైస్తవులు అంటున్నారు. వారి నుండి విశ్వాసులు వేరు అనుకునేవారు. ఇప్పుడు నామాకార్థపు విశ్వాసులు అంటున్నారు. నామకార్థపు బ్రదర్స్ అనేమాట అంటున్నారు. పెద్దలకు లోబడాలి, లోబడ్డము అంటే అతిక్రమము. ఒక అక్క ఇంకో అక్కను, ఒక అన్న ఇంకో అన్నను ప్రేమించదు. ఒక సేవకునికి ఇంకో సేవకునికి సరిపోదు. పెద్దల మధ్య సఖ్యత లేదు. భక్తిహీనత పెరుగుతున్నది. పరీక్షించుకొని దిద్దుకుంటే మంచిది.

**5-6వ. దేవుని స్వభావము:** దేవుని లక్షణాలు వివరించబడ్డాయి. ఆయన కృప ఆకాశమునంటుచున్నది. ఆయన సత్యము అంతరిక్షము నంటుచున్నది. ఆయన నీతి, న్యాయము ఎంతో ఉన్నతమైనవి, ఎంతో లోతైనవి. సమస్తమును రక్షించువాడు. ఇంత

మహోన్నతమైన లక్షణాలలో కొద్దియైన కలిగి ఉన్నామా? ఒక అన్యుడు అప్పుడప్పుడు సంఘానికి వచ్చి, పెద్దలతో ప్రార్థన చేయించుకునేవాడు. వారి ప్రార్థన మీద నమ్మకము ఉంది. ఒకరోజు వారిని పిలవాలని వచ్చాడు. వారు వాదులాడుకుంటున్నారు. చక్కగా వెళ్ళిపోయాడు. మళ్ళీ రాలేదు. ఆకాశమంత కృపలో, అంతరిక్షమంత సత్యములు, పర్వతమంత నీతిలో కొంతైనా మనము కలిగి ఉన్నామా? పరీక్షించుకోవాలి.

**7-9వ. దేవుని ఆశ్రయించుట వలన కలుగు మేలు:** ఆయన కృపను బట్టి ఆయనను ఆశ్రయించగా ఆయన యొద్ద సమృద్ధి, సంతృప్తి, ఆనంద ప్రవాహము, జీవపు ఊట ఉన్నది. ఆయనను ఆశ్రయించువారికి ఇవన్నీ కలుగుతాయి. ఆయన వెలుగే మనకు వెలుగు, ఆయన వెలుగులో మనము నడవాలి.

**10-12వ. దేవునికి చేయు ప్రార్థన:** నాకే కాదు ప్రభువా, నన్ను ఎరిగిన వారందరి యెడల యథార్థ హృదయుల యెడల, నీ నీతిని, నీ కృపను నిలుపుము. గర్విష్ఠుల పాదమును, భక్తిహీనుల చేతిని నా మీదకు, నన్ను ఎరిగినవారి మీదకు రానివ్వకుము.. పాపము చేయువారు పడియున్నారు. లేవలేకుండా పడద్రోయబడియున్నారు. అంటే విశ్వాసుల మీదికి వచ్చు భక్తిహీనులను, తన ప్రజల ప్రార్థన విని దేవుడు పడద్రోశాడు కనుక భయపడనక్కర లేదు.

## 37వ కీర్తన (8+7+7+6+6+6 = 40 వ.)

**అంశం :** నీతిమంతునికి కలిగినది కొంచెమైనను బహుమంది భక్తిహీనులకున్న ధన సమృద్ధి కంటె శ్రేష్టము (16వ.) యూదులు బబులోను చెరలోనున్నారు. బబులోనులోని విగ్రహారాధికులకు గల ధనసమృద్ధిని చూచినపుడు యూదులు వ్యసనపడకుండునట్లు తాము నీతిమంతులుగా తీర్చబడినందుకు కలుగు నిత్య ఆశీర్వాద వివరములు చెప్పబడినవి.

**1-8వ. నీతిమంతులు యెహోవా కొరకు కనిపెట్టుకొని యుండుట: 1-2వ.** (1,2) చెడ్డవారైన బబులోనీయులను చూచి దానియేలు వంటి నీతిమంతులు వ్యసనపడకూడదని దుష్కార్యములు చేయువారిని చూచి మత్సరపడకూడదని చెప్పుచున్నాడు. వారు గడ్డివలె త్వరగా ఎండిపోవుదురు. పచ్చని కూరవలె వాడిపోవుదురు. ఈ దినములలో బబులోనీయులు కానివారి సామ్రాజ్యము కాని లేదు. **3-6వ.** (3) యెహోవాయందు నమ్మికయుంచుము, మేలు చేయుము, (4) దేశమందు నివసించి సత్యమును అనుసరించుము. (5) యెహోవాను బట్టి సంతోషించుము. ఆయన నీ హృదయ వాంఛలను తీర్చును, (6) నీ మార్గమును యెహోవాకు అప్పగింపుము. (7) నీవు ఆయనను నమ్ముకొనుము, (8) యెహోవా యెదుట మౌనముగా నుండి (9) ఆయన కొరకు కనిపెట్టుకొనుము. ఆయన నీ కార్యము నెరవేర్చును. ఆయన వెలుగు వలె నీ నీతిని, మధ్యాహ్నమువలె నీ నిర్దోషత్వమును వెల్లడిపరచును. **7-8వ.** (10) తన మార్గమున వర్ధిల్లువారిని చూచి వ్యసనపడకుము. (11) దురాలోచనలు నెరవేర్చుకొనువాని చూచి వ్యసనపడకుము, (12) కోపము మానుము, (13) ఆగ్రహము విడిచిపెట్టుము, (14) వ్యసనపడకుము, అది కీడుకే కారణము.

**9-15వ. భక్తిహీనుల ప్రవర్తన - ఫలము:** (1) భక్తిహీనులు నీతిమంతుల మీద దురాలోచన చేయుదురు, (2) వారిని చూచి పండ్లు కొరుకుదురు, (3,4) దీనులను దరిద్రులను పడద్రోయుటకై, యథార్థముగా ప్రవర్తించువారిని చంపుటకై భక్తిహీనులు కత్తిదూసియున్నారు. (5) విల్లెక్కుపెట్టి యున్నారు. 1. ఇక కొంతకాలమునకు భక్తిహీనులు లేకపోవుదురు. 2. వారి స్థలము జాగ్రత్తగా పరిశీలించినను వారు కనబడకపోదురు. 3. వారి కాలము వచ్చుచుండుట ప్రభువు చూచుచున్నాడు. 4. వారిని చూచి ఆయన నవ్వుచున్నాడు. 5. వారి కత్తి వారి హృదయములోనే దూరును. 6. వారి విండ్లు విరువబడును. 7. కీడుచేయువారు నిర్మూలమగుదురు. 8. పరిశీలించిన వారు కనబడకపోవుదురు, దీనులు భూమిని స్వతంత్రించుకొని బహు క్షేమము కలిగి సుఖించెదరు. యెహోవా కొరకు కనిపెట్టుకొనువారు దేశమును స్వతంత్రించుకొందురు.

**16-22వ. నీతిమంతులు, భక్తిహీనులు:** నీతిమంతునికి కలిగినది కొంచెమైనను బహుమంది భక్తిహీనులకున్న ధనసమృద్ధి కంటే శ్రేష్టము. (1) భక్తిహీనుల బాహువులు విరువబడును. (నీతిమంతులకు యెహోవాయే సంరక్షకుడు. నిర్దోషుల చర్యలను యెహోవా గుర్తించును. వారి స్వాస్థ్యముము సదాకాలము నిలుచును. ఆపత్కాలమందు వారు సిగ్గునొందుదురు. కరవు దినములలో వారు సంతృప్తి పొందురు). నీ మందిరము యొక్క సమృద్ధి వలన వారు సంతృప్తి నొందుచున్నారు. (2) భక్తిహీనులు నశించిపోవుదురు. (3) యెహోవా విరోధులు మేతభూముల సొగసును పోలియుందురు. అది కనబడకపోవునట్లు వారు పొగవలె కనబడకపోవుదురు. (4) భక్తిహీనులు అప్పుచేసి తీర్చకయుందురు (నీతిమంతులు దాక్షిణ్యము కలిగి ధర్మమిత్తురు. యెహోవా ఆశీర్వాదము నొందినవారు భూమిని స్వతంత్రించుకొందురు. (5) ఆయన శపించినవారు నిర్మూలమగుదురు.

**23-28వ. నీతిమంతుల ప్రవర్తన - ఫలము:** (1) ఒకని నడత యెహోవాచేత స్థిరపరచబడును. (2) వాని ప్రవర్తన చూచి ఆయన ఆనందించును. (3) యెహోవా అతని చెయ్యి పట్టుకొనియున్నాడు గనుక అతడు నేలను పడినను లేవలేకయుండడు. (నేను చిన్నవాడనై యుంటిని ఇప్పుడు ముసలివాడనైయున్నాను). (4) అయినను నీతిమంతులు విడువబడుట గాని వారి సంతానము భిక్షమెత్తుట గాని చూచియుండలేదు. (5) దినమెల్ల వారు దయాళులై అప్పు ఇచ్చుచుందురు. (6) వారి సంతానపువారు ఆశీర్వదింపబడుదురు. (7) కీడు చేయుట మాని మేలు చేయుము, అప్పుడు నీవు నిత్యము నిలుచుదువు. (8) ఏలయనగా యెహోవా న్యాయమును ప్రేమించువాడు, ఆయన తన భక్తులను విడువడు. (9) వారెన్నటికి కాపాడబడుదురు (కాని భక్తిహీనుల సంతానము నిర్మూలమగును).

**29-34వ. నీతిమంతుల ప్రవర్తన - పూర్ణ ఫలము:** (10) నీతిమంతులు భూమిని స్వతంత్రించుకొందురు. (11) వారు దానిలో నిత్యము నివసించెదరు. (12) నీతిమంతుల నోరు జ్ఞానమును గూర్చి వచించును. (13) వారి నాలుక న్యాయమును ప్రకటించును. (14) వారి దేవుని ధర్మశాస్త్రము వారి హృదయములో ఉన్నది, వారి అడుగులు జారవు,

భక్తిహీనులు నీతిమంతుల కొరకు పొంచియుండి వారిని చంపజూతురు. (15) వారి చేతికి యెహోవా నీతిమంతులను అప్పగింపడు. (16) వారు విమర్శకు వచ్చినప్పుడు ఆయన వారిని దోషులుగా ఎంచడు. (17) యెహోవా కొరకు కనిపెట్టుకొనియుండుము. (18) ఆయన మార్గము ననుసరించుము. (19) భూమి స్వతంత్రించుకొనునట్లు ఆయన నిన్ను హెచ్చించును. (20) భక్తిహీనులు నిర్మూలము కాగా నీవు చూచెదవు.

**35-40వ. నీతిమంతులు, భక్తిహీనులు (35-36), వారి అంతము (37-40)**

**35-36వ. భక్తిహీనుడు:** 1) భక్తిహీనుడు ఎంతో ప్రబలి యుండుట నేను చూచియుంటిని, 2) అది మొలచిన చోటనే విస్తరించిన చెట్టువలె వాడు వర్ధిల్లి యుండెను, 3) అయినను ఒకడు ఆ దారిని పోయి చూడగా వాడు లేకపోయెను, 4) నేను వెదకితిని గాని వాడు కనబడకపోయెను, 5) ఒకడైనను నిలువకుండ అపరాధులు నశించుదురు, 6) భక్తిహీనుల సంతతి నిర్మూలమగును.

**37-40వ. నీతిమంతులు:** నిర్దోషులను కనిపెట్టుము, యథార్థవంతులను చూడుము. 1) సమాధానపరచువారి సంతతి నిలుచును, 2) యెహోవాయే నీతిమంతులకు రక్షణాధారము, 3) వారు యెహోవా శరణుజొచ్చియున్నారు గనుక ఆయన భక్తిహీనుల చేతిలో నుండి వారిని విడిపించి రక్షించును.

## 38, 39 వ కీర్తనలు

**అంశం : దేవుడు పంపిన తెగులు తొలగింపుమని ప్రార్థన: (39:11వ. 39:10వ)**

**సందర్భము: 38:3-5వ.** నా పాపమునుబట్టి నా యెముకలలో స్వస్థత లేదు. నా దోషములు నా తల మీదుగా పొరిపోయినవి. నేను మోయలేని బరువు వలే అవి నామీద మోపబడియున్నవి. నా మూర్ఖత వలన కలిగిన నా గాయములు దుర్వాసన గలవై స్రవించుచున్నవి. నా స్నేహితులును నా చెలికాండ్రును నా తెగులు చూచి యెడముగా నిలుచున్నారు అన్నాడు. **39:10** లో, నీవు పంపిన తెగులు నా మీద నుండి తొలగింపుము. నీ చేతి దెబ్బల వలన నేను క్షీణించుచున్నాను అన్నందున **38,39** రెండు కీర్తనలు తెగులు వచ్చిన సందర్భముగా వ్రాయబడినవి. **1దిన21:1-2వ.** సాతాను ఇశ్రాయేలుకు విరోధముగా లేచి, ఇశ్రాయేలీయులను లెక్కించుటకు దావీదును ప్రేరేపింపగా యోవాబు జనులను లెక్కించుట జరిగిన యెడల ఇశ్రాయేలీయులకు శిక్ష కలుగును అని మనవి చేసెను. అయినను దావీదు జనుల లెక్క ఎక్కువగా ఐనదని అతిశయింపగోరినందున యోవాబు మాట చెల్లక జనసంఖ్యలు చేయబడగా దావీదు తన తప్పును గుర్తించాడు. విశ్వాసులు దేవునికి చెందినవారని గుర్తించాలి. నేను ఈ కార్యము చేసి అధిక పాపము తెచ్చుకొంటిని, నేను మిక్కిలి అవివేకముగా ప్రవర్తించితిని. ఇప్పుడు నీ దాసుని దోషము పరిహరించుమని దేవునితో మొఱ్ఱపెట్టాడు. దేవుడు మూడేండ్లపాటు కరువు కలుగుట, మూడు నెలలపాటు నీ శత్రువులు కత్తి యెదుట నిలువలేక నశించిపోవుట, మూడు

దినములపాటు యెహోవా కత్తి, అనగా తెగులుచే దేశమంతట నాశనము కలుగుట, అను వీటిలో ఒకదానిని నీవు కోరుకొనుమని యెహోవా సెలవిచ్చుచున్నాడు. దావీదు కోరుకొనినట్లు యెహోవా ఇశ్రాయేలీయుల మీదికి తెగులు పంపగా ఇశ్రాయేలీయులలో డెబ్బదివేలమంది చచ్చిరి. ఆ సందర్భముగా ఈ కీర్తనలు వ్రాసియుండవచ్చును. దేవుని ఇష్టానుసారుడైన దావీదు చివరి దినములలో వృద్ధాప్యములో అతిశయించి దేవుని శిక్షకు (క్రమశిక్ష) ఇశ్రాయేలీయులలో డెబ్బది వేలమంది చావుకు గురి అయ్యారు. మనము కూడా చివరి దినములలో సాతాను ద్వారా గర్వించి తోటి సహోదరులకు నష్టము కలిగించు స్థితికి రాగలమని గుర్తింతము. కనుక మనము పాపము చేసిన యెడల దావీదువలె ఒప్పుకొని ప్రార్థించి ఆశీర్వాదము పొందుదుము గాక. కీర్తన గ్రంథములోనే నీ శరణుజొచ్చియున్నానని చెప్పుటనుబట్టి మనము నిత్యము దేవుని శరణుజొచ్చాలని ప్రార్థించాలి. విచిత్రము ఏమిటంటే ఆ స్థలములోనే తనకొక బలిపీఠమును, తరువాత తన మందిరము కట్టించుకొన్నాడు. దేవుని నమ్మినవారికి కలుగు శిక్షలన్నియు క్రమశిక్షలని గుర్తించాలి. **1యోహాను 1:10** ప్రకారము మనము పాపము చేయలేదని చెప్పుకొనిన యెడల, ఆయనను అబద్ధికునిగా చేయువారమగుదుము కనుక ఆలాగు చెప్పక. పాపమును కప్పుకొనక ఒప్పుకొని దీవెన పొందుదుము గాక.

## 38వ కీర్తన (8+7+7 = 22 వ.)

**అంశం :** ఇది హెబ్రీ భాషలోని అక్షరముల వరుస వచనములు గల కీర్తనలలో మూడవది (25,34,38). మనకు కలిగిన (తెగులునుబట్టి) పాపుమను బట్టి శరీరములో ఆరోగ్యము లేదని గుర్తించి, మొరపెట్టి దేవుడు నిరీక్షణ కలిగియుండుట పాపమును ఒప్పుకొని యెహోవా కొరకు కనిపెట్టుకొని యుండుట.

**1-8వ. పాపమునుబట్టి శరీరములో ఆరోగ్యము లేదని గుర్తించుట: 1-2వ.** మన పాపమునుబట్టి యెహోవాకు కలిగిన కోపోద్రేము, ఉగ్రతచేత గద్దింపు, శిక్ష కలుగగలదు (క్రమశిక్ష). క్రమశిక్ష అను బాణములు గట్టిగా నాటబడి దేవుని చెయ్యి భారముగా నుండును. **3-5వ.** పాపము, దోషము, మూర్ఖత అట్టి యెముకలలో, నడుములో, మనసులో స్వస్థత లేక తలమీద మోయలేని భారముగా నుండి ఆరోగ్యము శరీరమును విడిచిపోయెనని చెప్పుచున్నాడు. **6-8వ.** శ్రమచేత మిక్కిలి కృంగి దినమెల్లను దుఃఖాక్రాంతుడై సంచరించుచున్నానని, సొమ్మసిల్లి బహుగా నలిగియున్నానని, మనోవేదనను బట్టి కేకలు వేయుచున్నానని చెప్పుచున్నాడు.

**9-15వ. యెహోవా కొరకు కనిపెట్టుకొనియుండుట: 9-10వ.** నిట్టూర్పుల చేత, గుండె కొట్టుకొనుచు, బలము విడిచిపోయి, కనుదృష్టి తప్పిపోయినదని చెప్పుచున్నాడు. **11-12వ.** నా స్నేహితులు, చెలికాండ్రు, బంధువులు తెగులు చూచి దూరముగా నిలుచున్నారు. హానికరమైన మాటలు పలుకుచు, కపటోపాయములు పన్నువారు, ప్రాణము

తీయజూచువారు, ఉరులు ఒడ్డుచు, కీడు చేయజూచుచున్నారని చెప్పుచున్నాడు. **13-15వ.** చెవిటివాడనైనట్టు, వినక, మూగవాడనైనట్టు నోరు తెరవక, వినలేనివాడనై ఎదురుమాట పలుకలేని వాడనైతినని అంటున్నాడు. కాలుజారిన యెడల శత్రువులుగా నున్నవారు అతిశయపడుదురని గుర్తించి యెహోవా కొరకే కనిపెట్టుకొని యున్నానని అనుకొనుచున్నాడు. మనకు కలుగు క్రమశిక్షలో మనము అలాగే ఉండాలి.

**16-22వ. దేవుడు ఉత్తరమిచ్చునని నిరీక్షణ కలిగియుండుట: 16-18వ.** మనము పడబోవునట్లు మనోదుఃఖములో మునిగిపోగలము. శత్రువులు చురుకైనవారు, బలవంతులునై నిర్హేతుకముగా ద్వేషించుచు, మేలునకు ప్రతిగా కీడు చేయుచుందురు. మనముమన పాపమును గూర్చి విచారపడి దోషమును ఒప్పుకొనిన ప్రభువైన దేవుడు ఉత్తరమిచ్చి శత్రువు సంతోషించకపోవునట్లు చేయును. **19-22వ.** మనము ఉత్తమమైన దానిననుసరించుచు యెహోవా నన్ను విడువకుము నా దేవా, నాకు దూరముగా నుండకుము, రక్షణకర్తవైన నా ప్రభువా, నా సహాయమునకు త్వరగా రమ్ము అని ప్రార్థించాలి. రక్షణకర్త అనగా ఆత్మ రక్షణ కాదు, అనుదినము సమస్యల నుండి రక్షణ అని గుర్తించాలి.

## 39వ కీర్తన (2+3+3+3+2 = 13 వ.)

**అంశం : నీవు పంపిన తెగులు తొలగింపుము అని ప్రార్థన (10వ.)**

**పీఠిక :** దోషములను బట్టి మనుష్యులను గద్దింపులతో శిక్షించునప్పుడు చిమ్మట కొట్టిన వస్త్రమువలెవారి అందము చెడగొట్టగా అతిక్రమము నుండి విడిపించుమని దావీదువలె ప్రార్థించాలి. దావీదు రాజైనను ప్రార్థించుట, మొరపెట్టుట, కన్నీరు కార్చుట చూడగా మన జీవితములో మనము పాఠము నేర్చుకోవాలి.

**1-2వ. మౌనముగా నుండుట:** దేవుడు పాపమును బట్టి మనలను శిక్షించునపుడు నాలుకతో పాపము చేయకుండునట్లు మన మార్గములను జాగ్రత్తగా చూచుకొనుచు ఏమియు మాటలాడక మౌనముగా నుండాలి. మనలో విచారము అధికమగును. భక్తిహీనులు మన యెదుట నున్నప్పుడు మన క్షేమమును గూర్చియైనను పలుకక దావీదు మౌనముగా నున్నట్లు నోటికి చిక్కము ఉంచుకోవాలి.

**3-5వ. తన స్థితిని గూర్చి ఆలోచించుట: 3-4వ**. దావీదు దేవుని గూర్చి ధ్యానించుచుండగా గుండెలో పుట్టిన మంటనుబట్టి తన స్థితిని గూర్చి ఆలోచించి యెహోవా, నా అంతము ఎట్లుండునది, నా దినముల ప్రమాణము ఎంతైనది, నా ఆయువు ఎంత అల్పమైనదో నాకు తెలుపుమని ప్రార్థించాడు. **5వ**. తన దినములు పరిమాణము బెత్తెడంత. దేవుని సన్నిధిని తన ఆయుష్కాలము లేనట్టే యున్నదని, ఎంత స్థిరులైనను ప్రతివాడును కేవలము వట్టి ఊపిరివలె ఉన్నాడని గుర్తించాడు. ఇక్కడ సెలా అనగా మనము ఆగి ఆలోచించిన మన స్థితియు అలాటిదని గుర్తించాలి.

**6-8వ. అతిక్రమము నుండి విడిపింపుమని ప్రార్థన: 6-7వ.** మనుష్యులు వట్టి నీడవంటివారని, తొందరపడుదురని చెప్పుచున్నాడు. వారు ధనము కూర్చుకొందురు గాని అది ఎవనికి చేజిక్కునో వారికి తెలియదు గనుక దేని కొరకు కనిపెట్టుకొనక దేవుణ్ణి నమ్ముకొని యుండాలని చెప్పుచున్నాడు. **8వ.** తన అతిక్రమములన్నిటి నుండి విడిపించుమని, నీచులకు నన్ను నిందాస్పదముగా చేయకుమని ప్రార్థించుచున్నాడు.

**9-11వ. మరింత ప్రార్థన: 9-10వ.** నోరు తెరవక నేను మౌనినైతి నీవు పంపిన తెలుగు నామీద నుండి తొలగింపుమని, నీ చేతిదెబ్బ వలన నేను క్షీణించుచున్నానని ప్రార్థించాడు. **11వ.** దోషములను బట్టి మనుష్యులను గద్దింపులతో శిక్షించి, చిమ్మట కొట్టిన వస్త్రమువలె వారి అందమును చెడగొట్టగా, నరులందరు వట్టి ఊపిరివంటివారుగా ఉందురని చెప్పుచున్నాడు.

**12-13వ. కొనసాగిన ప్రార్థన: 12వ.** యెహోవా, నా ప్రార్థన ఆలకింపుమని, నా మొఱ్ఱకు చెవియొగ్గుమని, కన్నీళ్లు చూచి మౌనముగా నుండుకుమని, నేను వెళ్ళిపోయి లేకపోక మునుపు తెప్పరిల్లునట్లు కోపముతో చూడకుమని చెప్పుచున్నాడు.

## 40వ కీర్తన (5+5+2+5 = 17 వ.)

**అంశం : పాపి కొరకు పాట్లుపడిన క్రీస్తు –** పాపి భాగము **1-5వ.** ప్రభువు భాగము **6-10వ.** పరిశుద్ధుల భాగము **11-17వ.**

**1-5వ.** లో పాపిగా దావీదు, **6-17వ.** లో విశ్వాసియైన దావీదు ప్రార్థించుట చూతుము.

**1-5వ. దావీదు యొక్క వ్యక్తిత్వము: 1-2వ.** పాపము నాశనకరమైన గుంట వంటిది. ఈ దినములలో యవనులు పాపములో సులభముగా పడిపోవుచున్నారు. పాపిగా దావీదు యెహోవా కొరకు నేను కనిపెట్టుకొనగా దేవుడు చెవియొగ్గి మొఱ్ఱ ఆలకించెను. యెహోవా కొరకు దావీదు సహనముతో కనిపెట్టుకొనగా దేవుడు చెవియొగ్గి నా మొఱ్ఱ ఆలకించెను. కాని దేవుడు పాపమగు జిగట గల దొంగ ఊబిలో నుండి దావీదును పైకెత్తాడు. దేవుడు పాదములు బండ మీద నిలిపి అడుగులు స్థిరపరచును. **3-4వ.** తనకు స్తోత్ర రూపమగు క్రొత్త గీతమును మన దేవుడు నా నోట నుంచెను. భయభక్తులు నిలుపగలరు. గర్విష్ఠులను, త్రోవ విడిచి అబద్ధముల తట్టు తిరుగువారిని లక్ష్యపెట్టక యెహోవాను నమ్ముకొనువాడు ధన్యుడు. **5వ.** యెహోవా, నా దేవా, నీవు మా యెడల జరిగించిన ఆశ్చర్య క్రియలను మా యెడల నీకున్న తలంపులు బహు విస్తారములు. వాటిని వివరించి చెప్పెదననుకొంటిని. అవి లెక్కకు మించియున్నవి. నీకు సాటియైన వాడొకడును లేడు. లెక్కకు తలవెంట్రుకలను మించిన పాపములను క్షమించి, మనపట్ల లెక్కలేనన్ని తలంపులు కలిగియుండుట ఎంత ఆశ్చర్యము.

**6-10వ. యేసుక్రీస్తు భాగము:** బలులనైనను, నైవేద్యములనైనను నీవు కోరుటలేదు. నీవు నాకు చెవులు నిర్మించియున్నావు. శరీరమును అమర్చితివి అన్నందున ఇది దేవుని

భాగము. గొర్రెవలె మారాడు. పాపక్షమాపణ కొరకు సిలువలో ప్రాణము పెట్టాడు. **ప్రకటన 22 అధ్యాయములో** కూడా గొర్రెలాగా ఉన్నాడు. కనుక శాశ్వతముగా గొర్రెవలెనే ఉండునని తలంచాలి. ప్రవక్తల గ్రంథములలో పుస్తకపు చుట్టలో వ్రాయబడిన ప్రకారము భూలోకమునకు వచ్చి దేవుని చిత్తమును సంతోషముగా నెరవేర్చాడు. యేసు జీవించిన కాలములో ధర్మశాస్త్రమును ఆంతర్యములో కలిగియుండి పెదవులు మూసికొనక మహా సమాజములో నీతిసువార్తను ప్రకటించియున్నాడు. దేవుని నీతిని కేవలము హృదయములోనే ఉంచుకొని ఊరకుండక సత్యమును, రక్షణను వెల్లడిచేసి, కృపను, సత్యమును మహా సమాజమనకు మరుగుచేయక తెలియజేశాడు.

**11-12వ. ఆపదలలో, అధైర్యపడి దేవుని కృపను ఆశ్రయించిన దావీదు (పశ్చాత్తాపపడుట):** అనుదిన జీవితములో లెక్కలేనన్ని అపాయములు చుట్టుకొని, దోషములు తరిమి పట్టుకొనగా దావీదు తలయెత్తి చూడలేకపోయాడు. లెక్కకు అవి తలవెండ్రుకలను మించినందున దావీదు హృదయము అధైర్యపడగా యెహోవా, తన వాత్సల్యమును దూరము చేయక, కృపా సత్యములనుబట్టి ఎల్లప్పుడు కాపాడాడు.

**13-17వ. ప్రార్థన, జవాబు: 13-15వ.** అనుదిన జీవితములో కీడు చేయగోరువారు, మన ప్రాణము తీయుటకై యత్నించువారుందురు. యెహోవా, దయచేసి నన్ను రక్షించుమని ప్రార్థించితే, యెహోవా మనకు కీడుచేయ గోరువారు, ఆహా ఆహా అని పలుకువారు తమకు కలుగు అవమానమును చూచి వెనుకకు మళ్ళింపబడి సిగ్గునొందునట్లు చేయును. **16-17వ.** శ్రమలపాలైన మనము దీనులముగా సహాయము చేయుమని ప్రార్థించిన రక్షణకర్త ఆలస్యము చేయక మనలను కాపాడును. మనలను వెదకువారందరు, రక్షణను ప్రేమించువారు సంతోషించి, యెహోవా మహిమపరచబడునని చెప్పుకొందురు. ఈ భాగము 70వ కీర్తన ఒక్కటే. ఈ భాగము యొక్క వివరమైన ధ్యానము 70వ కీర్తనలో చూడండి.

## 41వ కీర్తన (3+3+3+3+1 = 13 వ.)

**అంశం : కుదరని రోగముతో నున్నవాడు శత్రువు కొరకు ప్రార్థించుట – స్తుతించుట**

**సందర్భము:** దేవుని నమ్మినవారికి రోగములు రావు అనుకొంటున్నారు. **4వ.** యెహోవా నీ దృష్టి యెదుట నేను పాపము చేసియున్నాను అన్నందున పాపమునుబట్టి రావచ్చును, లేదా పరీక్షగా రావచ్చును. **5వ.** వాడు ఎప్పుడు చచ్చును? వాని పేరు ఎప్పుడు మాసిపోవును? అనుకొనేవారుందురు. **9వ.** నా యింట భోజనము చేసినవాడు నన్ను తన్నుటకై మడిమనెత్తెను అనగా మన సహోదరులు/విశ్వాసుల ద్వారా శ్రమలు రావచ్చును. దావీదు మీదకు లేచినవారిలో 1) కుమారుడైన అబ్షాలోము, 2) రాజుకు మంత్రియైన అహీతోపెలు (బత్షెబా తాత – **2సమూ 23:24వ.** పేరుకు బుద్ధిహీనునికి తమ్ముడు అని అర్థము). అబ్షాలోమును తండ్రి ఉపపత్నులతో శయనించునట్లు చేశాడు. తరువాత తన

ఆలోచన జరుగనందున ఉరివేసుకున్నాడు. నన్ను కరుణింపుము, నా ప్రాణమును స్వస్థపరచుమని దావీదు మనవిచేసి స్వస్థత పొందాడు. పాపము చేయని, యెరుగని యేసుప్రభువును తనతో భోజనము చేసిన యూదా ఒలీవల కొండపై అప్పగించిన సందర్భము కనుక ఇది మెస్సీయ కీర్తన.

**1-4వ. రోగము నుండి ప్రాణమును స్వస్థపరచుమని ప్రార్థించుట: 1-2వ.** బీదలను కటాక్షించువాడు ధన్యుడు. ఆపత్కాలమందు యెహోవా వానిని తప్పించును. యెహోవా వానిని కాపాడి బ్రతికించును. భూమి మీద వాడు ధన్యుడగును. వాని శత్రువుల యిచ్ఛకు నీవు వానిని అప్పగింపవు. దేవుడు దావీదును తన శత్రువుల చేతికి అప్పగింపలేదు. **3-4వ.** రోగశయ్య మీద యెహోవా విని ఆదరించును. రోగము కలుగగా నీవే వానిని స్వస్థపరచుదువు. **4వ.** యెహోవా నీ దృష్టి యెదుట నేను పాపము చేసియున్నాను. నన్ను కరుణింపుము, నా ప్రాణమును స్వస్థపరచుమని మనవి చేసియున్నాను. **కీర్తన 6:2-4వ.** యెహోవా, నేను కృశించియున్నాను. నన్ను కరుణించుము. యెహోవా, నా యెముకలు అదురుచున్నవి. నన్ను బాగుచేయుము. **3వ.** నా ప్రాణము బహుగా అదురుచున్నది. యెహోవా, నీవు ఎంతవరకు కరుణింపకయుందువు? **4వ.** యెహోవా, తిరిగి రమ్ము, నన్ను విడిపింపుము. నీ కృపనుబట్టి నన్ను రక్షించుము అని ప్రార్థించగా దేవుడు రక్షించాడు.

**5-8వ. శత్రువు దావీదు విషయమై పలుకుట: 5-6వ.** అయితే నా శత్రువులు నామీద చెడ్డమాటలు ఆడుచున్నారు. వాడు ఎప్పుడు చచ్చును? వాని పేరు ఎప్పుడు మాసిపోవును? అని చెప్పుకొనుచున్నారు. ఒకడు నన్ను చూడవచ్చిన యెడల వాడు అబద్ధమాడును. వాని హృదయము పాపమును పోగుచేసికొనుచున్నది. వాడు బయలువెళ్ళి వీధిలో దాని పలుకుచున్నాడు. **7-8వ.** నన్ను ద్వేషించువారందరు కూడి నా మీద గుసగుసలాడుచున్నారు. నశింపజేయ వలెనని వారు నాకు కీడుచేయ నాలోచించుచున్నారు. కుదరని రోగము వానికి సంభవించియున్నది. వాడు ఈ పడక విడిచి లేవడని చెప్పుకొనుచున్నారు. కాని దేవుడు ఆలాగు జరుగనివ్వలేదు.

**9-12వ. శత్రువు కొరకు ప్రార్థించుట: 9-10వ.** నేను నమ్ముకొనిన నా విహితుడు నా యింట భోజనము చేసినవాడు నన్ను తన్నుటకై మడిమనెత్తెను. యెహోవా, నన్ను కరుణించి లేవనెత్తుము. అప్పుడు నేను వారికి ప్రతికారము చేసెదను అనుట అపాయము కలుగచేయుటగా కాక, బుద్ధి చెప్పుటగా తలంచాలి. **11-12వ.** మన శత్రువు మనమీద ఉల్లసించినను యథార్థతనుబట్టి నీవు ఉద్ధరించుచున్నావు. నీ సన్నిధిని నిత్యము నన్ను నిలువబెట్టుదువు అని దావీదు వలె చెప్పగలగాలి.

**13వ. దేవుడైన యెహోవాకు శాశ్వత స్తుతి:** ఇశ్రాయేలు దేవుడైన యెహోవా శాశ్వత కాలము నుండి శాశ్వత కాలము వరకు స్తుతింపబడును గాక. ఆమేన్, ఆమేన్.

# కీర్తనల గ్రంథము - ద్వితీయ స్కంధ పరిచయము
# ద్వితీయ స్కంధము 42-72 కీర్తనలు

(దావీదు - 18+3 = 21, ఆసాపు - 1, కోరహు కుమారులు - 8, సొలొమోను-1)

**విభజన** - 3+6+5+17 = 31 కీర్తనలు

**అంశం :**

1. శ్రమనుబట్టి ఇశ్రాయేలు కృంగి దేవునికి మొరపెట్టుట - **42-44**
2. దేవుడు వారిని కరుణించి రక్షించుట - **45-50**
3. ఆత్మీయ జీవితములో వెనుకబడుట, శత్రువుతో పోరాటములో, ఓటమిని రుచించినను చివరకు జయమిచ్చిన దేవుని స్తుతించుట - **51-57**
4. దేవుడు విమోచన కార్యము సమాప్తి చేసి, ప్రసన్నతతో కూడిన పాలన చేయుట - **58-72**

**1దిన 16:37వ.** మందసము ముందర అనుదిన సేవ జరుపుటకై దావీదు యెహోవా నిబంధన మందసము మీద ఆసాపును, అతని సహోదరులను నియమించెను. **2దిన 29:30వ.** దావీదును, ఆసాపును రచించిన శ్లోకములను ఎత్తి యెహోవాను స్తుతించుడని రాజైన హిజ్కియా ఆజ్ఞాపింపగా వారు సంతోషముతో స్తోత్రములు పాడిరి. **కీర్తన 72:19వ.** యెష్షయి కుమారుడగు దావీదు ప్రార్థనలు ముగిసెను అన్నందున సమకూర్చినది దావీదు కావచ్చును. ద్వితీయ స్కంధమును ముఖ్యముగా సమకూర్చినవారు దావీదు, లేదా రాజైన హిజ్కియా కావచ్చును. కొన్ని కీర్తనలు తరువాత చేర్చబడియుండవచ్చును. కోరహు కుమారులు, ఆసాపు వ్రాసినవి అనగా వారు కానీ, లేదా వారి వంశము వారెవరైనా వ్రాసి యుండవచ్చును.

## 42-44 కీర్తనలు - కృంగియుండుట

**42:5వ.** నా ప్రాణమా, నీవు ఏల కృంగియున్నావు? **43:5వ.** నా ప్రాణమా నీవేల కృంగియున్నావు? **44:25వ.** మా ప్రాణము నేలకు కృంగియున్నది.

## 45-50 కీర్తనలు - దేవునికి స్తుతి

రారాజు (**45**), ఆశ్రయుడు (**46**), మహోన్నతుడగు (**47**), దేవునికి బహుగా స్తుతి (**48**)

**45వ కీర్తన** - రాజైన క్రీస్తును గూర్చిన దివ్యమైన సంగతి (**1వ.**)

**46వ కీర్తన** - మనకు ఆశ్రయుడైన దేవుడు (**1,7,11వ.**)

**47వ కీర్తన** - మహోన్నతుడైన దేవుడు (**2,10వ.**)

**48వ కీర్తన** - బహు కీర్తనీయుడు (**1వ.**)

**49వ కీర్తనలో** ప్రాణ విమోచన ధనము ఎంత గొప్పదో చెప్పబడినది.

**50వ కీర్తనలో** భూనివాసులతో దేవునికి ఇష్టమైన బలిని గూర్చి చెప్పాడు.

**51-57 కీర్తనలు - కీడు, బలత్కారము నుండి రక్షించిన దేవుని స్తుతించుట**

**51వ కీర్తనలో** పాపము చేసినవాడు ఒప్పుకొని సమర్పణతో స్తుతించుట

**52వ కీర్తన -** కీడుచేసిన వారిని దేవుడు నిర్మూలించుట - దావీదు దేవుని స్తుతించుట

**53వ కీర్తన -** చెడినవారి నుండి నీతిమంతులను కాపాడి సంతోషింపజేయు దేవుడు

**54వ కీర్తన -** సౌలు నుండి రక్షించి, ఆదరించిన దేవునికి స్తుతి

**55వ కీర్తన -** బలాత్కారుల నుండి విడిపించుమని ప్రార్థన, విడిపించాడని నిరీక్షించుట

**56వ కీర్తన -** శ్రమలలో దావీదును ఫిలిష్తీయుల నుండి కాపాడు ప్రభువునకు స్తుతి

**57వ కీర్తన -**. శరణుజొచ్చిన దావీదును విడిపించిన దేవునికి స్తుతి

**58-72 కీర్తనలు - కృంగియుండుట**

**58వ కీర్తన -** నీతిలేని న్యాయాధిపతులు, నీతిమంతులు - న్యాయము తీర్చు దేవుడు

**59వ కీర్తన -** దావీదును చంపుమని సౌలు పంపిన శత్రువులు ఇంటియొద్ద పొంచియున్నప్పుడు దావీదు చేసిన ప్రార్థన

**60వ కీర్తన -** దావీదు ఉప్పులోయలో సిరియనులగు పదునెనిమిది వేలమందిని హతము చేయగా అతని పేరు ప్రసిద్ధి చెందినందున దేవునికి స్తుతి

**61వ కీర్తన -** ఆత్మీయ జీవిత ఎదుగుదల / మేలులకై దేవునికి ప్రార్థన స్తుతి,

**62వ కీర్తన -** శత్రువుచే తరుమబడినపుడు దుర్గమైన దేవుని ఆశ్రయించి కృపను పొందుట

**63వ కీర్తన -** బలము, ప్రభావముగల ఉత్తముడగు దేవునికి స్తుతి

**64వ కీర్తన -** శత్రువు చేయు కీడు నుండి కాపాడుమని ప్రార్థించుట

**65వ కీర్తన -** జనములు చేసిన అల్లరిని దేవుడు అణచివేయగా దావీదు స్తుతించుట

**66వ కీర్తన -** ప్రార్థన ఆలకించినందున దేవునికి స్తుతి

**67వ కీర్తన -** దేవుని రక్షణ, తీర్పును బట్టి దేవునికి స్తుతి

**68వ కీర్తన -** మందసము సీయోనుకు తీసుకొని రాబడుట

**69వ కీర్తన -** క్రీస్తు శ్రమలు - పునరుత్థానము - పరలోక ప్రవేశము

**70,71వ కీర్తనలు -** దావీదు శరణుజొచ్చి ప్రార్థించగా సొలొమోను రాజగుట

**72వ కీర్తన -** రాజైన సొలొమోనుకు న్యాయవిధులు తెలియజేయవలెనని కోరుట.

# 42, 43, 44 కీర్తనలు

**42:5** నా ప్రాణమా, నీవు ఏల కృంగియున్నావు? **42:11** నా ప్రాణమా, నీవేల కృంగియున్నావు? **43:5** నా ప్రాణమా, నీవేల కృంగియున్నావు? **44:25** మా ప్రాణము నేలకు కృంగియున్నది. ఈ మూడు కీర్తనలు కోరహు కుమారులు వ్రాసినవి. కృంగిన సమయములో దేవునికి మొరపెట్టుటను గూర్చినవి. దేవుడు జవాబిచ్చునను విశ్వాసముతో దేవుని స్తుతించినవి. దేవుని హృదయానుసారుడు, అందరికంటే ఎక్కువ కీర్తనలు వ్రాసిన దావీదు కీర్తనలలో 11 పర్యాయములు కృంగినానని చెప్పుచున్నాడు. కోరహు కుమారులు 5 పర్యాయములు, ఆసాపు 2 పర్యాయములు కృంగినామని చెప్పుచున్నారు. విశ్వాసులు పరీక్షగా కాని, క్రమశిక్షగా కృంగిన స్థితికి రాగలరు. విశ్వాసముతో మొరపెట్టిన వాటిలో జయమును పొందగలమని నేర్చుకొందము.

### కృంగియుండుట - దావీదు వ్రాసినవి

1. **35:14** తల్లి మృతినొందినందున దుఃఖ వస్త్రములు ధరించువానివలె కృంగుట.
2. **38:6** నేను శ్రమచేత మిక్కిలి కృంగియున్నాను.
3. **57:6** నా ప్రాణము కృంగియున్నది. నా యెదుట గుంట త్రవ్వి దానిలో పడిరి.
4. **102:23** నేను ప్రయాణము చేయుచుండగా ఆయన నా బలము కృంగజేసెను. నా దినములు కొద్దిపరచెను.
5. **107:12** ఆయన ఆయాసముచేత కృంగజేసెను.
6. **116:6** నేను కృంగియుండగా ఆయన నన్ను రక్షించెను.
7. **142:3** నాలో నా ప్రాణము కృంగినప్పుడు నా మార్గము నీకు తెలియును.
8. **142:6** నేను చాలా కృంగియున్నాను, నా మొఱ్ఱకు చెవియొగ్గుము.
9. **143:4** కావున నా ఆత్మ నాలో కృంగియున్నది.
10. **145:14** యెహోవా, పడిపోవు వారినందరిని ఉద్ధరించువాడు కృంగిపోయిన వారినందరిని లేవనెత్తువాడు.
11. **146:8** యెహోవా గ్రుడ్డివారి కన్నులు తెరవజేయువాడు. యెహోవా కృంగినవారిని లేవనెత్తువాడు, యెహోవా నీతిమంతులను ప్రేమించువాడు.

### కృంగియుండుట - కోరహు కుమారులు వ్రాసినవి

1. **42:5** నా ప్రాణమా, నీవేల కృంగియున్నావు? నాలో నీవేల తొందర పడుచున్నావు? ఆయనే నా రక్షణకర్త . . . నేను ఆయనను స్తుతించెదను.
2. **42:6** నా దేవా, నా ప్రాణము నాలో కృంగియున్నది.
3. **42:11** నా ప్రాణమా, నీవేల కృంగియున్నావు?

4. **43:5** నా ప్రాణమా, నీవేల కృంగియున్నావు?

5. **44:25** మా ప్రాణము నేలకు కృంగియున్నది, మా శరీరము నేలను పట్టియున్నది.

**కృంగియుండుట - ఆసాపు వ్రాసినవి**

1. **77:3** నేను ధ్యానించునప్పుడు నా ఆత్మ కృంగిపోవుచున్నది.
2. **79:8** మేము బహుగా కృంగియున్నాము.

## 42వ కీర్తన (5+6 = 11 వ.)

**అంశం, సందర్భము :** బబులోను చెరలో శత్రుబాధచేత దుఃఖాక్రాంతుడగు కీర్తనకారుడు దేవుని సన్నిధికి యెరూషలేముకు రావలెనని తపించుట, ప్రార్థించుట (**9వ.**), స్తుతించుట (**5,11వ.**). ఇది ఇశ్రాయేలీయులందరి తపన, ప్రార్థన, స్తుతిగా తలంచాలి.

**1-5వ. 1-2వ.** దుప్పి నీటివాగుల కొరకు ఆశపడునట్లు దేవా, నీ కొరకు నా ప్రాణము ఆశపడుచున్నది. నా ప్రాణము దేవుని కొరకు తృష్ణగొనుచున్నది. జీవము గల దేవుని కొరకు తృష్ణగొనుచున్నది. దేవుని సన్నిధికి నేనెప్పుడు వచ్చెదను? ఆయన సన్నిదిని నేనెప్పుడు కనబడెదను? దుప్పి ప్రాణ అపాయములో నున్నపుడు నీటిలోనికి వెళ్ళి నది మధ్యలో శత్రువు నుండి కాపాడుకొనునట్లు ప్రాణ భయముతో బబులోనులో నున్నవారు దేవుని వేడుకొనుచున్నారు.

**3-4వ.** ఈ జీవితములో నెమ్మదిగానున్న బబులోనీయులు నీ దేవుడు ఏమాయెనని వారు (**9వ.** శత్రువు) నిత్యము నాతో అనుచుండగా ఆత్మీయుడు రాత్రింబగళ్లు కన్నీరే అన్నపానములుగా ప్రార్థించుచున్నాడు. జనసమూహముతో యెరూషలేములో పండుగ చేయుచున్న సమూహముతో తాను వెళ్ళిన సంగతి సంతోషము కలిగి స్తోత్రము చెల్లించుచు దేవుని మందిరమునకు ఇతరులను నడిపించిన సంగతిని జ్ఞాపకము చేసికొనగా తన ప్రాణము తనలో కరగిపోవుచున్నదని చెప్పుచున్నాడు.

**5వ.** నా ప్రాణమా, నీవు ఏల కృంగియున్నావు? నాలో నీవేల తొందరపడుచున్నావు? జీవితములో నెమ్మది లేదు, దేవాలయము పట్టణము పాడుగా నున్నవి. బబులోనీయులు హేళన చేయుట, వీటన్నిటి నుండి విడుదల రాకపోయినను ప్రాణములో కృంగకూడదని, తొందరపడకూడదని చెప్పుచున్నాడు. ఆయనే నా రక్షణకర్త అని నా దేవుడని చెప్పుకొనుచు, ఇంకను ఆయనను స్తుతించెదనని చెప్పుచున్నాడు. దేవుడు శక్తి గలవాడు కనుక చెర నుండి రక్షించునని నిరీక్షణతో దేవుని కొరకు కనిపెట్టుకొనియున్నాడు. ఇటువంటి పరిస్థితిలో దేవుడు నా దేవుడని చెప్పి ఆయనను స్తుతించుట సాధ్యమా?

**6-11వ. 6-7వ.** ప్రాణములో కృంగకూడదని, తొందరపడకూడదని చెప్పుచున్నను పరిస్థితుల ప్రభావమును బట్టి తన ప్రాణము తనలో కృంగియున్నదని దేవునితో చెప్పుచున్నాడు. యొర్దాను నది ఆ దేశమునకు ముఖ్యమైన నది. హెర్మోను పర్వతము

నిత్యము మంచుచేత కప్పబడి దేవుని వాక్యమునకు సాదృశ్యముగా నున్నది. నీ జల ప్రవాహ ధారల ధ్వని అనగా దేవుని వాక్యమును వినుట అలల వంటి పరీక్షలు తనమీద పొర్లి పారుచున్నవని చెప్పుచున్నాడు. **8వ.** అయినను పగటివేళ యెహోవా తన కృప కలుగునట్లు నాజ్ఞాపించుచున్నాడు. రాత్రివేళ ఆయనను గూర్చిన కీర్తనయు నా జీవదాతయైన దేవుని గూర్చిన ప్రార్థనయు నాకు తోడుగా ఉండును. పగలు రాత్రి దేవుడు మనలను కాపాడు విధము గొప్పది.

**9-10వ.** నీ దేవుడు ఏమాయెనని నా శత్రువులు దినమెల్ల అడుగుచున్నారు. వారు తమ దూషణల చేత నా యెముకలు విరుచుచున్నారు. కావున నీవేల నన్ను మరచియున్నావు? శత్రుబాధ చేత నేను దుఃఖాక్రాంతుడై సంచరించవలసి వచ్చెనేమి అని ఆశ్రయ దుర్గమైన దేవునితో మనవి చేయుచున్నాడు.

**11వ.** నా ప్రాణమా, నీవేల కృంగియున్నావు? నాలో నీవేల తొందరపడుచున్నావు? దేవునియందు నిరీక్షణ యుంచుము, ఆయనే నా రక్షణకర్త నా దేవుడు. ఇంకను నేనాయనను స్తుతించెదను. ముగింపులో ప్రాణములో కృంగకూడదని తొందరపడకూడదని చెప్పి ముగించుచున్నాడు.

## 43వ కీర్తన (2+2+1 = 5 వ.)

**అంశం :** కీర్తనకారుడు దేవుని సన్నిధికి యెరూషలేముకు వచ్చి, దేవుని బలిపీఠము యొద్ద ఆనందించవలెనని తలంచుట - ప్రార్థించుట **(3-4వ.)** స్తుతించుట **(5వ.).** ఇది ఇశ్రాయేలీయులందరి తపన, ప్రార్థన, స్తుతిగా తలంచాలి.

**1-2వ. భక్తి లేనివారి కొరకు ప్రార్థన: 1వ.** దేవా, నాకు న్యాయము తీర్చుము. భక్తిలేని జనముతో (బహుశా భక్తిలేని బబులోనీయులతో) నా పక్షమున వ్యాజ్యెమాడి కపటము కలిగి దౌర్జన్యము చేయువారి చేతిలోనుండి నీవు నన్ను విడిపించుదువు అను విశ్వాసము కలిగియున్నాడు. **2వ.** నీవు నాకు దుర్గమైన దేవుడవు. నన్ను త్రోసివేసితివేమి? నేను శత్రుబాధ చేత దుఃఖాక్రాంతుడనై సంచరింపనేల? ఇటువంటి కృంగిన స్థితిలో కూడా, శత్రుబాధ చేత దుఃఖాక్రాంతుడుగా నున్నను దేవుడు దుర్గమై కాపాడువాడని విశ్వసించ గలుగుచున్నాడు.

**3-4వ. మందిరములో సేవకై దారిచూపుటకు వెలుగు, సత్యము పంపుమని ప్రార్థన: 3వ.** నీ వెలుగును, నీ సత్యమును బయలుదేర జేయుము. అవి నాకు త్రోవచూపుచు నీ పరిశుద్ధ పర్వతము, నీ నివాస స్థలమైన యెరూషలేముకు నన్ను తోడుకొనివచ్చును. **4వ.** అప్పుడు నేను దేవుని బలిపీఠము నొద్ద సేవచేయుచు నాకు ఆనంద సంతోషములు కలుగజేయు దేవుని యొద్దకు చేరుదునను నిరీక్షణ కలిగియున్నాను. తన దేవునికి సితారా వాయించుచు కృతజ్ఞతాస్తుతులు చెల్లించెదనని చెప్పుచున్నాడు.

**5వ.** చివరిదిగా, నా ప్రాణమా, నీవేల కృంగియున్నావు? నాలో నీవేల తొందరపడుచున్నావు? దేవునియందు నిరీక్షణ యుంచుమని చెప్పుచున్నాడు. ముందుగా **42వ** కీర్తనలో రెండు పర్యాయములు చెప్పినట్లు ముగింపులో ప్రాణములో కృంగకూడదని, తొందరపడకూడదని చెప్పి, దేవుడు శక్తిగలవాడు కనుక సమస్యలన్నిటి నుండి, చెరనుండి రక్షించునని నిరీక్షణతో దేవుని కొరకు కనిపెట్టుకొనియున్నానని చెప్పుచున్నాడు.

## 44వ కీర్తన (3+5+3+5+5+5 = 26 వ.)

**అంశం : శత్రువు వలన ఆపదలో నుండి విడుదల కొరకై వేడుకొనుట, స్తుతించుట**

**సందర్భము : 44:17-19వ., 5వ.** ఇదంత మా మీదికి వచ్చినను మేము నిన్ను మరువలేదు. నీ నిబంధన మీరి ద్రోహులము కాలేదు. మా హృదయము వెనుకకు మరలిపోలేదు. మా అడుగులు నీ మార్గమును విడిచి తొలగిపోలేదు. నక్కలున్న చోట నీవు మమ్మును బహుగా నలిపియున్నావు. గాఢాంధకారము చేత మమ్మును కప్పియున్నావు. **44:5వ.** నీ వలన మా విరోధులను అణచివేయుదుము. బహుశా హిజ్కియా దినములలో సన్హెరీబు రాజు యూదాపైకి వచ్చుట కావచ్చును (**యెషయా 37అధ్యా.**). దావీదుగారి జీవిత అనుభవమైన కావచ్చును. కోరహు వంశీయులు ఎవరైనను హిజ్కియా రాజు కాలములో ఈ కీర్తన వ్రాయగా ద్వితీయ స్కంధములో చేర్చబడియుండవచ్చును.

**1-3వ. గతకాల స్థితి నుండి అనగా ఐగుప్తు నుండి విడిపించి కనానులో నాటిన దేవుడు: 1-2వ.** దేవా, పూర్వకాలమున పితరుల దినములలో నీవు చేసిన పనిని గూర్చి మేము చెవులార వినియున్నాము. మా పితరులు మాకు వివరించిరి. నీవు నీ భుజబలము చేత అన్యజనులను వెళ్ళగొట్టి, నిర్మూలము చేసి పితరులను వ్యాపింపజేసితివి. దేవుడు ఇశ్రాయేలీయులను ఐగుప్తు నుండి కనానుకు తీసుకొని వచ్చి యుద్ధము చేయకుండానే గిల్గాలులోను, యెరికోలోను ప్రవేశపెట్టాడు. **3వ.** వారు తమ ఖడ్గముచేత కాక దేవుడు తన కటాక్షము, దేవుని బాహువును బట్టియే వారికి విజయము కలుగజేశాడు.

**4-8వ. ప్రస్తుతమున్న స్థితిలో నుండి విడిపించమని వేడుకొనుట: 4-5వ.** రాజైన దావీదు తాను రాజైనను, దేవా, నీవే నా రాజువు అనుట గమనించాలి. రాజైన దావీదు చేయలేని పనులు ఎన్నో ఉన్నవి. కాని దేవుడు చేయలేనిది లేదని పూర్తిగా నమ్మాడు. యాకోబునకు అనగా ఇశ్రాయేలుకు అని భావము. పూర్ణ రక్షణ కలుగు నాజ్ఞాపించుము అని చెప్పుటలో దావీదు దేవునిపై గల విశ్వాసమునకు గురుతు. **6-8వ.** నేను నా విల్లు, నా కత్తి నన్ను రక్షింపదు, మా శత్రువుల చేతిలో నుండి మమ్మును రక్షించువాడవు నీవే అని దినమెల్ల మేము దేవుని యందు అతిశయపడుచున్నామని చెప్పుచున్నాడు. విశ్వాసముతో నీ నామమును బట్టి మేము నిత్యము కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నామని చెప్పుచున్నాడు.

**9-11,12-16వ. విడనాడి అవమాన పరచబడుచున్నామని దేవునికి చెప్పుట**

**9-11వ.** మమ్మును ద్వేషించువారు ఇష్టము వచ్చినట్లు మమ్మును దోచుకొనుచున్నారు.

అన్యజనులలోనికి మమ్మును చెదరగొట్టి, హేళనగా చేసియున్నావు అన్నాడు. **12-16వ.** నేను దినమెల్ల నా అవమానమును తలపోయుచున్నాను. సిగ్గు నా ముఖమును కమ్మియున్నదని దేవునికి మొరపెట్టుచున్నాడు.

**17-21వ. దేవుని మరువక ఆయన మార్గము నుండి తొలగకుండుట: 17-18వ.** ఇదంతయూ మా మీదికి వచ్చినను మేము నిన్ను మరువక, నీ నిబంధన మీరక, మా అడుగులు నీ మార్గమును విడిచి తొలగిపోలేదని ధైర్యముగా చెప్పుచున్నాడు.

**19-21వ.** నీవు మమ్మును బహుగా నలిపి, గాడాంధకారము చేత కప్పితివి అన్నాడు. **20-21వ.** మా దేవుని నామమును మేము మరవలేదని అన్యదేవతల తట్టు మా చేతులు చాపలేదని హృదయ రహస్యములు ఎరిగిన దేవునితో చెప్పుచున్నాడు.

**22-26వ. కృపనుబట్టి విమోచింపుమని వేడుకొనుట: 22-24వ.** నిన్నుబట్టి దినమెల్ల మేము వధింపబడుచు, వధకు సిద్ధమైన గొర్రెలమని మేము ఎంచబడుచున్నందున మేల్కొనుమని, నిత్యము మమ్మును విడనాడకుమని చెప్పుచున్నాడు.

**25-26వ.** మా ప్రాణము నేలకు కృంగియున్నది, మా శరీరము నేలను పట్టియున్నదని కృపనుబట్టి మమ్మును విమోచింపుమని మొరపెట్టుచున్నాడు.

## 45వ కీర్తన (2+3+3+1+2+3+3 = 17 వ.)

**అంశం :** ఇది రాజు, రాణుల సంబంధము. పీఠికలో ప్రేమను గూర్చిన గీతము అని ఉన్నందున ఇది వివాహమును గూర్చిన కీర్తన. 1) సొలొమోను రాజు వివాహముగాను, 2) భార్యాభర్తల మధ్య ఉండవలసిన ప్రేమను, 3) యేసు ఆయన సంఘము పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా కలిగి ఉండవలసిన లక్షణములను, 4) ఇశ్రాయేలీయులు యెహోవాకు ఉండవలసిన సంబంధమును సూచించును. మనము ఇక్కడ పెండ్లి కుమారుడైన యేసు గుణములను (**1-9వ**) పెండ్లి కుమార్తెగా ఆయన సంఘము కలిగి ఉండవలసిన లక్షణములను ( **9-17వ.**) ధ్యానించుచున్నాము.

**1-2వ. రాజు సౌందర్యము: 1వ.** రాజైన క్రీస్తును గూర్చిన దివ్యమైన సంగతి అని తన హృదయములో బహుగా ఉప్పొంగుచుండగా రాజైన క్రీస్తును గూర్చి రచించి పలుకుచున్నాడు. నాలుక త్వరగా వ్రాయువాని కలము అను మాటల భావము అదియే. **2వ.** నరుల కంటె నీవు అతి సుందరుడవై యున్నావు. కొన్ని క్రీస్తు సౌందర్యములు: 1) **1కొరింథీ 15:12** క్రీస్తు మృతులలో నుండి లేపబడియున్నాడు. 2) **యోహాను 7:1-18** ఆయనయందు ఏ దుర్నీతియు లేదు. (పరిశుద్ధతలో మహనీయుడు - **నిర్గమ 15:11**). 3) **యోహాను 10:18** ఎవడును నా ప్రాణము తీసికొనడు; నా అంతట నేను దాని పెట్టుచున్నాను; దాని పెట్టుటకు, దాని తిరిగి తీసుకొనుటకును నాకు అధికారము కలదు. 5) **ఎఫెసీ 5:26-27** క్రీస్తు కూడా సంఘమును ప్రేమించి . . . దానిని పవిత్రపరచి, పరిశుద్ధపరచుటకై దాని కొరకు తన్నుతాను అప్పగించుకొనెను. 6) **ఎఫెసీ 6:10** ప్రభువు మహా శక్తి

కలవాడు. ఆ శక్తినిబట్టి ఆయనయందు బలవంతులై యుండగలము. 7) **2కొరింథీ 3:7-11** నీతికి కారణమైన క్రీస్తు పరిచర్య ఎంతో అధికమైన మహిమ కలది. నీ పెదవుల మీద దయారసము పోయబడియున్నది. **1పేతురు 2:27** ఆయన పాపము చేయలేదు; ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు. అటువంటి పెదవుల నుండి దయారసము అనగా సువార్త, సువార్తమానము ద్వారా రక్షణ, కాపుదల విశ్వాసులపై పోయబడినవి. క్రీస్తు నిత్యుడు.

**3-5వ. రాజు మహిమ: 3వ.** క్రీస్తు శూరుడుగా, వాక్యమను తన కత్తి మొలను కట్టుకొని, వాక్యము యొక్క తేజస్సు (మహిమను) వాక్యము యొక్క శక్తిని ప్రభావముగా ధరించుకొన్నాడు. **4వ.** లోకములో సత్యము, వినయముతో కూడిన నీతిని స్థాపించుటకు వాక్య ప్రభావమును ధరించుకొని లోకమంతటికి వాక్యము ద్వారా బయలుదేరాడు. నీ దక్షిణ హస్తము అనగా బలముగల కుడిచెయ్యి భీకరమైన కార్యములు జరిగించుట నేర్చును. **5వ.** క్రీస్తు వాక్య బాణములు వాడిగలవైనందున ప్రజలు వాక్యమునకు లోబడి రక్షించబడుదురు. నీ బాణములు రాజు శత్రువుల గుండెలో చొచ్చుట యేసును నమ్మనివారికి కలుగు శిక్షయే.

**6-8వ. రాజు నిత్యత్వము: 6వ. ప్రకటన 22:1** లో క్రీస్తు తండ్రితో ఉన్నందున క్రీస్తు సింహాసనము నిరంతరము నిలుచునని చూచుచున్నాము. రారాజుగా న్యాయార్థమైన పాలన చేయును. **7వ.** క్రీస్తు నీతిని ప్రేమించి, భక్తిహీనతను ద్వేషించువాడు. కావున దేవుడు క్రీస్తును అందరికంటే హెచ్చుగునట్లుగా ఆనంద తైలముతో అభిషేకించియున్నాడు. **8వ.** క్రీస్తు వస్త్రములెల్ల (సాక్ష్యము - **ప్రకటన 19:8**) గోపరస వాసనే (పాపశిక్షను అనుభవించునపుడు చేదుగా ...) అగరు వాసనే (నీతిగల జీవితము జీవించినందున సువాసన కలిగినవాడుగా ...) లవంగిపట్టు వాసన (అందరిని ఆకర్షించిన తీపైన వ్యక్తిగా...) చూతుము. దంతముతో కట్టిన నగరులలో అనగా పరలోకములో తంతి వాద్యములు (స్తుతి గానములు ఆరాధన ...) క్రీస్తును సంతోషపెట్టుచున్నవి. క్రీస్తు దయనొందిన స్త్రీలు అనగా రక్షించబడినవారు రాజుల కుమార్తెలై ఉన్నారు.

**9-11వ. రాణి సౌందర్యము: 9వ.** రాణి సంఘమని తలంచుచున్నాము. సంఘము ఓఫీరు అపరంజి అనగా దైవత్వమగు బంగారము వంటి గుణములతో అలంకరించుకొని దేవుని కుడిపార్శ్వమున నిలుచు స్థితిని కలిగియుండాలి. **10వ.** రాజకుమారీ, ఆలకించి, ఆలోచించి, చెవియొగ్గి విధేయత కలిగియుండాలి. దేవుని కార్యముల విషయములో స్వజనమును నీ తండ్రి యింటిని మరువాలి. **మార్కు 10:19-30** లో యేసు - నా నిమిత్తమును సువార్త నిమిత్తమును ఇంటినైనను అన్నదమ్ములనైనను అక్కచెల్లెండ్రనైనను, తల్లిదండ్రులనైనను, పిల్లలనైనను, భూములనైనను విడిచినవాడు. . . (విడిచినవారికి దేవుడిచ్చు ఆశీర్వాదము) అటువంటి వారికి ఇప్పుడు ఇహమందు హింసలతోపాటు నూరంతలుగా ఇండ్లను, అన్నదమ్ములను, అక్కచెల్లెండ్రను, తల్లులను, పిల్లలను, భూములను, రాబోవు లోకమందు నిత్యజీవమును పొందునని అదే వచనములో ప్రభువు చెప్పాడు.

**11వ.** యేసురాజే మన జీవితమునకు ప్రభువు అని గుర్తించాలి. క్రీస్తు సౌందర్యము. **2వ.** లోని క్రీస్తు గుణములన్నిటిని మనము వ్యక్తిగతముగాను, సంఘముగాను కలిగియుండాలి. మనము క్రీస్తు ప్రభువుకు నమస్కరించాలి.

**12-14వ. రాణి మహిమ: 12వ.** తూరు కుమార్తె నైవేద్యము తీసికొనివచ్చుట, జనులలో ఐశ్వర్యవంతులు ఆయన దయను వెదకుట ఆయనను ఘనమైన రీతిగా ఆరాధించుటయే. **13వ.** అంతఃపురములో నుండు రాజు కుమార్తె కేవలము మహిమ గలది. సంఘమునకు పోలికగా నున్న యెరూషలేము దేవాలయ మహిమ 60 కి.మీ. దూరము కనిపించెడిది. సంఘము యొక్క మహిమ అనబడిన ప్రకారము అది సువార్త ప్రకటనయే గాని, ఆరాధనయే గాని అంత ఘనముగా ఉండాలి. ఆమె వస్త్రము బంగారు బుట్టాపని అనగా ఆమె బంగారువంటి సాక్ష్యము కలిగియుండాలి. **14.** రాజు నొద్దకు ఆమె తీసికొని రాబడుట **2కొరింథీ 5:10.** తీర్పు కొరకు ప్రభువు యొద్దకు వచ్చుటయే. ఆమె విచిత్రమైన పని గల వస్త్రములను అనగా ఆమె విచిత్రమైన జీవిత సాక్ష్యము తీర్పు తీర్చబడును.

**15-17వ. రాణి నిత్యత్వము: 15వ.** ఉత్సాహ సంతోష గానములతో రాజనగరు అనబడిన పరలోకములో ప్రవేశించుదురు. **16వ.** భూలోకములో ప్రభువు కొరకు మనము సంపాదించిన ఆత్మలు మన కుమారులు వేయి యేండ్ల పాలనలో భూమియందంతట వారు అధికారులుగా నుందురు. **17వ.** తరములన్నిటను సర్వకాలములో జనములు దేవుని నామము జ్ఞాపకము చేసికొని కృతజ్ఞతాస్తుతులు చెల్లించుట నిత్యకాలములో క్రీస్తు ఆరాధించబడుటను సూచించును.

## 46వ కీర్తన (2+2+2+3+2 = 11 వ.)

**అంశం, సందర్భము :** దేవునినే ఆశ్రయముగా కలిగియుండుట. కోరహు కుమారులు వ్రాసినది అనగా కోరహు వంశములోని వారెవరైనా వ్రాసియుండవచ్చును. యెహోవా నామమునకు చెందవలసిన ప్రభావము ఆయనకు ఆరోపించుచు ఆయన ఎదుట మన మందరము (ముఖ్యముగా ఇశ్రాయేలీయులు) సాగిలపడు నిమిత్తమై ఈ కీర్తన దేవుడు వ్రాయించాడు. ఆరాధన సమయములో దేవుని స్తుతించుటకు గతకాల సంగతులు, ప్రస్తుతకాల సంగతులను జ్ఞాపకము చేసి, భవిష్యత్కాలములోని వాటి కొరకై నిరీక్షణతో స్తుతించాలి.

**1-3వ. విశ్వాసుల ఆధిక్యత :** దేవుడు మనకు ఆశ్రయము, దుర్గము అంటున్నాడు. మనుష్యులను నమ్ముకొనుటకంటే యెహోవాను ఆశ్రయించుట మేలు (**కీర్తన 118:8,9**). మనుష్యులు నమ్మదగినవారు. రాజులైనను, వారికి అనుకూలముగా ఉన్నంతవరకే వారి ఆదరణ, లేకుంటే మరణశిక్ష విధించుదురు. కనుక ఏ స్థితిలోనైన యెహోవాను ఆశ్రయించిన మేలు. రాజులు కట్టిన దుర్గముల కంటే యెహోవాను దుర్గముగా చేసికొనుట సురక్షితము. రాజైన దావీదు యుద్ధశాలి, బహు ధైర్యవంతుడు. అయినను తాను కట్టుకొనిన దుర్గములను నమ్ముకొనక యెహోవానే దుర్గముగా చేసికొన్నాడు. యెహోవా ఆపత్కాలములో

నమ్ముకొనదగిన సహాయకుడు అని మనము గుర్తించవలెనంటే ముందుగా ఆపదలు రావాలి. చాలా ఆపదలు మన పాపమునుబట్టి రావచ్చును, లేదా పరీక్షగానైనను రావచ్చును. ఏది ఏమైనను ఆపదలు వచ్చినప్పుడు మనలను మనము పరీక్షించుకోవాలి. మనస్సాక్షి మన తప్పును చూపినపుడు దిద్దుకోవాలి. దావీదు బత్షెబా, ఊరియాల విషయములో మరణశిక్షకు తగిన పాపము చేసినను ఒప్పుకొనగా దేవుడు క్షమించి, శిక్షించక, ఇష్టానుసారుడైన వ్యక్తిగా చేసుకున్నాడు. **2-3వ.** కావున భూమి మార్పునొందినను నది సముద్రములో పర్వతములు మునిగినను వాటి జలములు ఘోషించుచు నురుగు కట్టినను ఆ పొంగునకు పర్వతములు కదలినను మనము భయపడము అని కీర్తనకారుడు చెప్పగలుగుచున్నాడు. రాజైన హిజ్కియా కాలములో ఆష్షూరు రాజైన సన్హెరీబు ద్వారా శ్రమలు రాగా హిజ్కియా దుర్గమైన దేవుని ఆశ్రయించాడు. దేవుడే శత్రురాజును చంపివేశాడు (**2దిన 32:20-21వ**). దేవుడు మనలను క్రమపరచుటకు శిక్షించినను అది క్రమశిక్షయే గాని మరణమునకు అప్పగింపడని గుర్తించాలి (**కీర్తన 118:17-18**). **4-7వ. శత్రువు వలన శ్రమ (ఏడేండ్ల శ్రమల కాలము): 4వ.** ఒక నది కలదు. దాని కాలువలు దేవుని పట్టణమగు సర్వోన్నతుని మందిరపు పరిశుద్ధ స్థలమును (సంఘమును) సంతోషపరచుచున్నవి. ఆ నది మన ప్రభువే. ఆ నది నీరు దేవుని వాక్యమే. ఆ నది కాలువలు బైబిలులోని 66 గ్రంథములు. వాక్యము ద్వారా సంఘమునకు సంతోషమే. **5-7వ.** దేవుడు ఆ పట్టణములో (సంఘములో) నున్నాడు. ప్రతి ఉదయమున దేవుడు సహాయము చేయుచున్నాడు కనుక సంఘమునకు చలనము లేదు. జనములు ఘోషించి, రాజ్యములు కదిలి, భూమి కరగిపోయినను స్థానిక సంఘములు ఒకవేళ దెబ్బ తినినను యెహోవా తోడై ఆశ్రయమైనందున సార్వత్రిక సంఘము ఎన్నటికిని నాశనము కాదు.

**8-11వ. చివరి ఆశీర్వాదము (వేయి యేండ్ల పాలనలో దీవెన): 8-9వ.** ఆయనే భూమి మీద నాశనములు కలుగజేయువాడు, భూదిగంతముల వరకు యుద్ధములు మాన్పువాడు ఆయనే. ఇది వేయి ఏండ్ల పాలనలో జరుగును. విల్లులు, బల్లెములు, యుద్ధ రథములు అనగా యుద్ధాయుధములు ఏమియు లేకుండా చేయును.

**10-11వ.** యెహోవా తనను నమ్మినవారికి తోడై, ఆశ్రయమై యుండును గనుక జనములు యెహోవా చేసిన కార్యములు చూచి, యెహోవాయే దేవుడని తెలిసికొందురు. ఇప్పుడు జనులు ఆయనను గ్రహించలేదు. అన్యజనులలో యెహోవా మహోన్నతుడు కనుక భూమి మీదకు అటువంటి మహోన్నతుని రాకడకై ఎదురుచూచుదుము గాక.

## 47వ కీర్తన (1+2+2+2+3 = 10 వ.)

**అంశం, సందర్భము :** మహోన్నతుడు, మహారాజైన దేవుడు. మహారాజు అనగా ఇతర రాజులకంటే బలవంతుడు. అందరి బారినుండి విడిపించువాడు అని అర్థము. ఇశ్రాయేలీయులను ఏదో ఒకసారి కాక అనేక పర్యాయములు శత్రువుల బారినుండి,

చెరల నుండి విడిపించాడు. మనలనైతే పాపుల చెరనుండి విడిపించాడు. జీవిత కాలములో అనేక సమస్యలనుండి పలుమారులు విడిపించాడు, కనుక విడుదల ఇచ్చిన మహారాజును జయధ్వనులతో కీర్తనలు పాడి, స్తుతించాలని గమనింతము.

**1వ. సర్వజనులు స్తుతించాలి:** సర్వజనులారా అనగా **4వ.** లో యూదులను, **5వ.** లో అన్యులు అనగా రక్షించబడి సంఘములో చేర్చబడిన అన్యులను చప్పట్లు కొట్టి జయధ్వనులతో దేవుని గూర్చి ఆర్భాటము చేయమని చెప్పుచున్నాడు.

**2-3వ. నీతిమంతుల మార్గము:** మన దేవుడు ఎంత గొప్పవాడో చూద్దాము. **2వ.** యెహోవా మహోన్నతుడు, సర్వభూమికి మహారాజు, **4వ.** లో మహాతిశయాస్పదము, **7వ. లో** సర్వభూమికి రాజు, **8వ.** లో మహోన్నతుడు. **3వ.** కనుక ఆయన ఔన్నత్యమును బట్టి జనములను మనకు లోపరచును అనుట ఐగుప్తు నుండి ఇశ్రాయేలీయులు వచ్చినపుడు కనానీయులను వారికి లోబరచాడు. మన పాదముల క్రింద ప్రజలను అణగద్రొక్కును అనుట ఐగుప్తీయుల సేనలను ఎఱ్ఱ సముద్రములో ముంచివేయుటయే. **కీర్తన 95:3వ.** ప్రకారము యెహోవా మహా దేవుడు దేవతలందరికి పైన మహాత్మ్యము గల మహారాజు కనుక ఐగుప్తు దేవతలందరికి తీర్పు తీర్చాడని **నిర్గమ 12:12.** లో (ఐగుప్తు దేవతలకందరికిని తీర్పు తీర్చెదను) చెప్పబడినది.

**4-5వ. దేవుని ఆరోహణము: 4వ.** తాను ప్రేమించిన యాకోబునకు మహాతిశయాస్పదముగా మన స్వాస్థ్యమును ఆయన మన కొరకు ఏర్పాటు చేసియున్నాడు. **ఎఫెసీ 1:11-12** క్రీస్తునందు మనలను ముందుగా నిర్ణయించి, ఆయనయందు మనకొక స్వాస్థ్యమును ఏర్పరచాడని **1పేతురు 1:5** లో విశ్వాసము ద్వారా దేవుని శక్తిచేత కాపాడబడు మీ కొరకు, ఆ స్వాస్థ్యము పరలోకమందు భద్రపరచబడియున్నదని చెప్పబడినది. దేవుడు ఆర్భాటముతో ఆరోహణమాయెను. బూరధ్వనితో యెహోవా ఆరోహణమైయెను అనగా **1దిన 13:5** లో మందసము కిర్యత్యారీము నుండి తీసికొని వచ్చునప్పుడు దావీదు ఇశ్రాయేలీయులనందరిని సమకూర్చి గొప్ప బూరల ధ్వనితో పైకెత్తినట్లు చూడగలము. ప్రవచనముగా సిలువలో క్రీస్తు పైకెత్తబడి చనిపోయి తిరిగిలేచి పరలోకమునకు ఆరోహణమైనట్లుగా కూడా తలంచగలము. **1థెస్స 4:16** మరల భూమి మీదకు దిగి వచ్చుదురని చెప్పబడినది.

**6-7వ. కీరించవలసిన మహారాజు:** దేవుని కీర్తించుడి, కీర్తించుడి. మన రాజును కీర్తించుడి, కీర్తించుడి. సర్వభూమికి రాజైయున్నాడని రమ్యముగా కీర్తనలు పాడుడి. ఈ భాగములో ఐదుసార్లు కీర్తించుడి అని చెప్పుట ద్వారా కీర్తించుట ఎంత ముఖ్యమో గమనించాలి.

**8-10వ. సింహాసనముపై ఆరోహణుడైన మహారాజు: 8వ. యోహాను 12:32-33** లో, భూమి నుండి పైకెత్తబడి అందరిని (యూదులను, అన్యులను) తన యొద్దకు ఆకర్షించుకొందునని (సంఘముగా) యేసు చెప్పెను. పరలోకమునకు ఆహారణుడైన దేవుడు

తన పరిశుద్ధ సింహాసనము మీద ఆసీనుడై అన్యజనులకు రాజైయున్నాడు. **9-10వ.** జనముల ప్రధానులు పండ్రెండు గోత్రముల ప్రధానులు అబ్రాహాము యొక్క దేవునికి జనులై కూడుకొనియుండుట, అన్యులగు భూనివాసులు కూడా క్రీస్తును కేడెములుగా ధరించుకొనియుండుట వేయి యేండ్ల కాలములో చూతము. అప్పుడు క్రీస్తు మహోన్నతు డగును.

## 48వ కీర్తన (3+3+2+3+3 = 14 వ.)

**అంశం : దేవుని పట్టణమగు సీయోను మహిమ - గొప్పవాడైన యెహోవాకు చెల్లించవలసిన గొప్ప స్తుతి**

**సందర్భము : 7వ.** లో తూర్పుగాలిని లేపి తర్షీషు ఓడలను నీవు పగులగొట్టుచున్నావు. అమెరికాను పతనము చేయుటకు ప్రపంచ వాణిజ్య సంస్థను (**WORLD TRADING CENTRE**) పడగొట్టిరి. **యోనా 1:2-3** లో అష్షూరు సామ్రాజ్యానికి ముఖ్య పట్టణమగు నీనెవే నుండి తర్షీషు వ్యాపార ఓడలు వెళ్లుచున్నవి. అష్షూరువారి గర్వమును బట్టి దేవుడు ఓడలను పగులగొట్టగా ఆ దేశ వ్యాపారము, ఆ రాజ్యము పతనమగును, **2దిన 32:1-21** లో ఇశ్రాయేలీయుల చెడుతనమును బట్టి దేవుడు అష్షూరు రాజు చేతికి పది గోత్రముల ఇశ్రాయేలువారిని అప్పగించాడు. కాని అష్షూరువారు గర్వించి తమ శక్తిచేతనే జయించితిమని విర్రవీగి యూదారాజగు హిజ్కియా పైకి దండెత్తి వెళ్ళిరి. రాజైన హిజ్కియా యెహోవాను ప్రార్థించగా దేవుడు ఒక దూతను పంపి అష్షూరు సైన్యములో ఒక లక్ష, ఎనుబది వేలమందిని హతము చేసెను. అష్షూరు రాజైన సన్హెరీబు సిగ్గుతో తన దేశమునకు వెళ్ళగా అతని కుమారులే అతని హత్యచేసిరి. **48:8-10** లో చెప్పబడినట్లు సైన్యముకలధిపతియగు యెహోవా తన పట్టణమగు యెరూషలేమును నిత్యముగా స్థిరపరచి యున్నందున, దేవా, మేము నీ ఆలయమునందు, నీ కృపను ధ్యానించి, నీ నామము ఎంత గొప్పదో కీర్తించితిమి అని చెప్పుచున్నాడు. అలాగే మనలను కూడా మన జీవిత కాలములోని అనేక సమస్యల నుండి విడిపించాడు కనుక విడుదల ఇచ్చిన మహారాజును జయధ్వనులతో కీర్తనలు పాడి, స్తుతించాలని గమనింతము. ఈ కీర్తనలో యెరూషలేము (సంఘము) యొక్క ఆధిక్యత, ఆలంకరణ **1-8వ.** లోను, దేవుని ప్రజల విధులు **9-14వ.** లోను చెప్పబడినవి.

**1-3వ. దేవుని గొప్పతనము - దేవుని పట్టణ గొప్పతనము: 1వ. నిర్గమ 15:11** లో చెప్పబడినట్లు దేవుడు పరిశుద్ధుడు. పరిశుద్ధతను బట్టి మహానీయుడు, స్తుతి కీర్తనలను బట్టి పూజ్యుడు, అద్భుతములు చేయువాడు, వేల్పులలో ఆయనవంటి వాడెవడును లేడని చెప్పబడినది. పరిశుద్ధ పర్వతముపై నివసించువాడు, గొప్పవాడు గనుక బహుగా కీర్తించదగినవాడు. **2వ.** ఉత్తర దిక్కున మహారాజు పట్టణమైన సీయోను పర్వతము అనగా

యెరూషలేము పట్టణము రమ్యమైన యెత్తుగల చోట నుంచబడి సర్వ భూమికి సంతోషకరముగా ఉన్నది. **విలాప 2:15వ.** వారు యెరూషలేము కుమారిని చూచి పరిపూర్ణ సౌందర్యము గల పట్టణమని సర్వభూనివాసులకు ఆనందకరమైన నగరియని ఈ పట్టణమును గూర్చి చెప్పుకొనువారు. **3వ.** దాని నగరులలో దేవుడు ఆశ్రయముగా (రక్షణ) ప్రత్యక్షమగుచున్నాడు. ఈ లోకములో ప్రత్యక్షమైన క్రీస్తు యెరూషలేములో ప్రాణము పెట్టి మరణించినందున జనులు ఆశ్రయించదగిన పట్టణముగా నేటికిని నున్నది.

**4-6వ., 7-8వ. రాజులు పట్టణ నిత్యమహిమను చూచి భ్రమపడుట:** రాజులు ఏకముగా కూడివచ్చి వారచ్చటనుండగా వణకును, ప్రసవించు స్త్రీ వేదనయు వారిని పట్టెను. రాజైన సన్హెరీబు బహుమంది సైన్యముతో వచ్చి యెరూషలేమును ముట్టడించాడు. ఒక దూత సైన్యమును హతము చేయుట చూచి ఆశ్చర్యపడి భ్రమసి త్వరగా తన దేశమునకు వెళ్ళి కుమారులచే చంపబడెను.

**9-11వ. దేవుని కృప, కీర్తి, నీతిన్యాయ విధులు: 9-10వ.** దేవుని ఆలయమునందు మనము 1) ఆయన కృప ఎంత గొప్పదో - **తీతు 2:11** లో సమస్త మనుష్యులకు దేవుని కృప రక్షణకరమైనదని చెప్పబడినది. 2) ఆయన నామ గొప్పతనమును - **అపొ.కా. 4:10** లో యేసుక్రీస్తు నామము సిలువ వేసినట్టి నామమని, మృతులలో నుండి లేచినట్టి నామమని, జనులకు స్వస్థతనిచ్చు నామమని చూడగలము. 3) ఆయన కీర్తి భూదిగంతముల వరకు ఎంత గొప్పదో, ఆయన ఒక్కడి కీర్తియే ప్రపంచమందలి అన్ని దేశములలో వ్యాపించి, అన్ని దేశములలో అనేకులు ఆయనను నమ్మి ఆరాధించుచున్నారు. 4) ఏ తప్పిదము చేయని ఆయన కుడిచేయి సకల మనుష్యులు చేసిన పాపములకై పొడవబడినది. కనుక నీతితో ఏ రీతిగా నిండినదో ధ్యానించాలి. **11వ.** ఆయన న్యాయవిధులను బట్టి సీయోను పర్వతము (సంఘము) సంతోషించుచున్నది. సంఘమే కాక ఇంచుమించుగా ప్రతి దేశము యొక్క న్యాయస్థానములు అనుసరించు న్యాయశాస్త్రమందలి పది ఆజ్ఞల ఆధారముగా ఏర్పరచబడినవి. వీటినిబట్టి యూదా కుమార్తెలు అనగా విశ్వాసులు, అంతేకాక లోకమంతయు ఆనందించుచున్నాడు.

**12-14వ. సీయోను నగరులో సంచరించి దాని బురుజు ప్రాకారములు లెక్కించుట: 12వ.** ముందు రాబోవు తరములకు దీని వివరము చెప్పు బాధ్యత మనపై ఉన్నందున సీయోను చుట్టు తిరుగుట, సంచరించుట అనగా సంఘమును గూర్చిన సంపూర్ణ జ్ఞానమును మనము కలిగియుండాలి. **13వ.** దాని బురుజులను (కట్టడము) లెక్కించి, దాని ప్రాకారములను (భద్రత) నిదానించి నేర్చుకోవాలి. దాని నగరులలో (వాగ్దానములు) పూర్తిగా ధ్యానించాలి. **14వ.** ఈ దేవుడు సదాకాలము మనకు దేవుడై యున్నాడు. మరణము వరకు ఆయన మనలను నడిపించును కనుక పైన చెప్పబడినవన్నియు అవసరములే!

# 49, 50, 51 కీర్తనలు

**49-50 వ** కీర్తనలలో లోక నివాసులందరిని రమ్మని ఆహ్వానించుచున్నాడు. **49** లో రక్షణ అవసరత ఎరుగుటకు, **50** లో దేవుడు ఎవరు? దేవునికి ఎటువంటి బలి అర్పించాలి? ఏ రీతిగా అర్పించాలి? అని ఎరుగుటకు రమ్మన్నాడు. **51వ** కీర్తనలో దేవునికి ఇష్టమైన బలిని అర్పించాలని, మనలో ఉన్న పాపమును గుర్తించి ఒప్పుకొని క్షమాపణ పొంది బలిని అర్పించటయే ఇష్టమైన బలి అని చెప్పుచున్నాడు.

**49వ.** కీర్తనలో ప్రాణ విమోచన ధనము ఎంత గొప్పదో చెప్పబడినది. **50వ** కీర్తనలో భూనివాసులను సమకూర్చి, **10-15వ.** లో దేవునికి ఇష్టమైన బలిని గూర్చి చెప్పి, **16-23వ.** లో దేవుని ఎరిగినవారి స్థితినిగూర్చి చెప్పాడు. **51వ** కీర్తనలో అనుదిన జీవితములో పాపము చేసినవారు, **1-4వ.** లో పాపమును గుర్తించుట, **5-9వ.** లో పాపమును ఒప్పుకొనుట, **10-14వ.** లో స్తుతికి సిద్ధపడుట, **15-19వ.** లో సమర్పణతో స్తుతించుటను గూర్చి చెప్పాడు.

## 49వ కీర్తన (3+3+3+3+2+3 = 20 వ.)

**అంశం : మరుగుగా నున్న మానవ స్థితిని గూర్చిన సంగతులు (3వ.)**

**అంశం : 7వ.** లో ఎవడును ఏ విధము చేతనైనను తన సహోదరుని విమోచింపలేడు. **నిర్గమ 6:16-33వ** లేవీ కుమారుల గెర్షోను, కహాతు, మరారి **18** కహాతు కుమారులు అమ్రామ, ఇస్హారు ... **20** అమ్రాము అహరోనును మోషేను కనెను. **21** ఇస్హారు కుమారుడు కోరహు. కనుక మోషే, కోరహులు సహోదరులు. **సంఖ్యా 16:1-6వ.** లేవికి మునిమనుమడును కహాతుకు మనుమడు ఇస్హారు కుమారుడునగు కోరహు సమాజ ప్రధానులునైన రెండు వందల యేబదిమందితో మోషేకు ఎదురుగా లేచి మీతో మాకిక పనిలేదు; ఈ సర్వసమాజమలో ప్రతివాడును పరిశుద్ధుడే. మిమ్మును మీరే హెచ్చించుకొను చున్నారనగా, మోషే సాగిలపడెను. అటు తరువాత అతడు కోరహుతో తనవాడు ఎవడో, పరిశుద్ధుడు ఎవడో రేపు యెహోవా తెలియజేసి వానిని తన సన్నిధికి రానిచ్చును. సేవ చేయునట్లు దేవుడు సమాజమలో నుండి మిమ్మును వేరుపరచగా మీరు యాజకత్వము కూడ కోరుచున్నారు. మీరు సణగనేల అనెను. **30** యెహోవా గొప్ప వింత పుట్టించుట వలన వారు ప్రాణములతో పాతాళములో కూలునట్లు భూమి తన నోరు తెరచి వారిని వారికి కలిగిన సమస్తమును మింగివేసిన యెడల వారు యెహోవాను అలక్ష్యము చేసిరని మీకు తెలియుననెను. **31** అతడు ఆ మాటలన్నియు చెప్పి చాలించిగానే వారి క్రింది నేల నెర విడిచెను. **32** వారును వారి సంబంధులందరును ప్రాణముతో పాతాళములో కూలిరి. భూమి వారిని మ్రింగివేసెను. వారు సమాజములో ఉండకుండ నశించిరి. మోషే, సహోదరుడైన కోరహును రక్షించుకొనలేకపోయెను కనుక కోరహు కుమారులు ఈ కీర్తనలో **7వ.** లో ఎవడును ఏ విధము చేతనైనను తన సహోదరుని విమోచింపలేడు అన్నాడు.

**1-3వ. సర్వజనులు ఆలకించవలసిన మరుగు మాటలు: 1-2వ.** సర్వజనులు ఏకముగా కూడి ఆలకించుడి అని ఈ కీర్తనలో ఏడు రకముల మనుష్యులను గూర్చి చెప్పుచున్నాడు. **A. 1వ.** సహోదరులు, **B. 2వ.** లోక నివాసులారా, సామాన్యులు, సామంతులు, ధనికులు, దరిద్రులు, **C. 10వ.** జ్ఞానులు, మూర్ఖులు, పశుప్రాయులు, **D. 12వ.** ఘనత వహించినవారు, నశించు మృగములను పోలినవారు, **E. 14వ.** యథార్థవంతులు, యథార్థత లేనివారు, **F. 16వ.** ధనసంపన్నులు, **I.** ధనము అను సంపదన లేనివారు), **G. 20వ.** ఘనత నొందినవాడు, బుద్ధిహీనుడు, నశించు జంతువును పోలినవాడు విజ్ఞాన విషయములను ధ్యానమును వినవలెనని చెప్పుచున్నాడు.

**4-6వ. ధన విస్తారతను బట్టి పొగడుకొనువారు:** ఆపత్కాలములో నేను భయపడను, తమ ఆస్తియే ప్రాపకమను నమ్మి తమ ధన విస్తారతను బట్టి పొగడుకొనువారికి నేను భయపడను అని చెప్పుచున్నాడు. కీర్తనకారుడు గూఢార్థము గల మరుగు మాటలను బయలుపరుచుచున్నాడు.

**7-9వ. మనుష్యుల ప్రాణ విమోచన ధనము : 7వ.** ఎవడును ఏ విధముచేతనైనను తన సహోదరుని విమోచింపలేడు. **8వ.** వాడు కుళ్ళుచూడక నిత్యము బ్రతుకునట్లు వాని నిమిత్తము దేవుని సన్నిధిని ప్రాయశ్చిత్తము చేయగలవాడు ఎవడును లేడు. **9వ.** వారి ప్రాణ విమోచన ధనము బహు గొప్పది. అది ఎన్నటికిని తీరక అట్లుండవలసినదే. **మత్తయి 20:28వ.** మనుష్యకుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచన క్రయవిధముగా తన ప్రాణము నిచ్చుటకును వచ్చెనని చెప్పెను. **లూకా 19:10వ.** నశించినదానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెను. **రోమా 3:24-26** నమ్మువారు ఆయన కృపచేతనే, యేసునందలి విమోచనము ద్వారా యేసు రక్తమునందలి విశ్వాసము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు. దేవుడిప్పటి కాలమందు తన నీతిని కనపరచు నిమిత్తము, తాను నీతిమంతుడును యేసునందు విశ్వాసము గలవానిని నీతిమంతునిగా తీర్చువాడు. **1పేతురు 1:19** అమూల్యమైన రక్తము చేత, అనగా నిర్దోషమును నిష్కళంకమునగు గొఱ్ఱెపిల్ల వంటి క్రీస్తు రక్తమే, మనలను విమోచించాడు.

**10-12వ. మనుష్యుల మరణము:** జ్ఞానులు తమ యిండ్లు, నివాసములు, భూములు తరతరములకు ఉండునని తమ భూములకు తన పేర్లు పెట్టుదురు. ఘనత వహించినవారు, జ్ఞానులు, మూర్ఖులు, పశుప్రాయులు ఏకముగా నశించినవారు తమ ఆస్తిని ఇతరులకు విడిచిపెట్టుదురు.

**13-15వ. మానవుల అంతము: 13-14వ.** పాపుల గతి స్వాతిశయ పూర్ణులగు మనుష్యులు పాతాళములో మందగా కూర్చబడుదురు. మరణము (రెండవ మరణము) వారికి కాపరియై వారి స్వరూపములు నివాసములు లేక పాతాళములో క్షయమైపోవును.

**మత్తయి 10:28వ.** మరియు ఆత్మను చంపనేరక దేహమునే చంపువారికి భయపడకుడి గాని, (ప్రాణమును **15వ.**) ఆత్మను, దేహమును కూడ నరకములో నశింపజేయ గలవానికి మిక్కిలి భయపడుడి. **15వ. నీతిమంతుల స్థితి:** దేవుడు నీతిమంతుల ప్రాణమును పాతాళ బలములో నుండి విమోచించి తన యొద్దకు చేర్చుకొనును. నరకములో నివాసములుండవు. **యోహాను 14:2** నా తండ్రి యింట అనేక నివాసములు కలవు. మీకు స్థలము సిద్ధపరచ వెళ్లుచున్నాను అను మాటను బట్టి పరలోకములో నివాసము లుండును.

**16-17వ., 18-29వ. ధనము, ఘనత కలిగి చనిపోయినప్పుడు ఏమియు కొనిపోకుండుట: 16-17వ.** ఒకడు ధన సంపన్నుడైనప్పుడు వాని యింటి ఘనత విస్తరించునప్పుడు భయపడకుము. వాడు చనిపోయినప్పుడు ఏమియు కొనిపోడు. వాని ఘనత వాని వెంట దిగదు. **18-19వ.** నీవు నీవే మేలు చేసికొంటివని మనుష్యులు నిన్ను స్తుతించినను తన జీవితకాలమున నొకడు తన్ను పొగడుకొనినను అతడు తన పితరుల యొద్దకు పరలోకమునకు చేరాలి, లేనియెడల వాడు మరి ఎన్నడును వెలుగు చూడలేడు. అనగా నరకము చీకటిమయము. **20వ.** ఘనతనొందియుండి బుద్ధిహీనులైనవారు నశించు జంతువులను పోలియున్నారు.

## 50వ కీర్తన (6+9+8 = 23 వ.)

**అంశం : దేవుడు - దేవునికి అర్పించవలసిన బలి**

**1-6వ. దేవుడు భూనివాసులను, తన ప్రజలను సమకూర్చుట: 1-3వ.** దేవుడు భూనివాసులను దిద్దుబాటు కొరకు, తన ప్రజలను న్యాయము తీర్చుట కొరకు సమకూర్చుట. దేవాదిదేవుడైన యెహోవా, బహు వచనములో దేవుడు అనుట ఆయన త్రిత్వమును సూచించును. ఆయన సర్వశక్తి, బలము గల దేవుడని, నిత్యుడగు దేవుడని, చిరంజీవి అని గమనించాలి. ఆయన పరిపూర్ణ సౌందర్యము గల సీయోనులో నుండి ప్రకాశించుచున్న దేవుడు. ఆయన ముందర అగ్ని మండుచుండి, ఆయన చుట్టు ప్రచండ వాయువు విసరుచుండగా దేవుడు వేంచేయుచున్నాడు. పరిపూర్ణ సౌందర్యము గల సీయోను . . . సీయోను అనగా సంఘమునకు గురుతు. సంఘములు పరిపూర్ణ సౌందర్యము కలిగినవిగా ఉండాలి. మండుచున్న అగ్ని అనగా పరిపూర్ణ పరిశుద్ధత గలవాడు. ప్రకాశించుచున్న దేవుడు అందులో నుండి బయటకు రావాలి అనగా సువార్త ప్రకాశము అందులో నుండి బయటికి వచ్చుచుండాలి. తూర్పు దిక్కు మొదలుకొని పడమటి దిక్కు వరకు భూనివాసులందరితో మాటలాడుటకు రమ్మని ఆయన పిలుచుట రక్షణ కొరకై ప్రజలందరికి ఆహ్వానముగా తలంచవచ్చును. నిజానికి పరిపూర్ణ సౌందర్యము గల సీయోను పరలోకమే అని గుర్తించాలి.

**4-6వ. దేవుడు తన ప్రజలను సమకూర్చుట:** ఆయన తన ప్రజలకు న్యాయము తీర్చుటకై బల్యర్పణ చేత నాతో నిబంధన చేసికొనిన నా భక్తులను నా యొద్దకు సమకూర్చుడని

నీమీద ఆకాశమును భూమిని పిలుచుట విశ్వాసుల తీర్పుగా తలంచాలి. ఈ కీర్తన ధ్యానించు నీవు దేవునితో నిబంధన చేసుకొంటివా? అనగా విశ్వాసముంచి రక్షించబడితివా లేదా? దేవుడు తానే న్యాయకర్తయై యున్నాడు. ఆకాశము ఆయన నీతిని తెలియజేయుచున్నది. దేవుడు మానవుల జీవితములను తీర్పు తీర్చువాడైయున్నాడు.

**7-15వ. ప్రీతికరమైన బలులను గూర్చి మాటలాడు దేవుడు: 7-8వ.** నా జనులారా, ఇశ్రాయేలూ, నీ బలులు, నీ దహనబలులు నిత్యము నా యెదుట కనబడుచున్నవి అనుట వారి అక్షరార్థమైన, ఆచార సంబంధమైన బలులు దేవునికి ఇష్టము లేదు. యింటనుండి కోడెలను, మందలోని పొట్టేళ్ళను నేను తీసికొనను అంటున్నాడు. బలి హృదయపూర్వకమైనదై **రోమా 12:1** ప్రకారము సజీవయాగమైన అర్పణగా ఉండాలి. **13-15వ.** వృషభముల మాంసము కాక, పొట్టేళ్ళ రక్తము కాక దేవుడు స్తుతిని కోరుచున్నాడు. **10-12వ.** అడవి మృగములను, వేయి కొండల మీద పశువులను, కొండలలోని పక్షులు, పొలములలోని పశ్వాదులు వాటి బలులు ఆయనకు ఇష్టము లేదు. దేవునికి స్తుతియాగము చేయుము. ఆపత్కాలమున నీవు నన్ను గూర్చి మొఱ్ఱపెట్టుము. నేను నిన్ను విడిపించెదను, నీవు నన్ను మహిమపరచెదవు. క్షేమకాలము, భోజన కాలము మనకు ఇష్టమైనవి. ఇష్టము కాని కాలములు - ఆపద కాలము, క్షామకాలము, కరువు కాలము. దేవునికి మహిమ కలుగుటకై ముందుగా ఆపదలు పంపి మనము మొరపెట్టగా ఆయన వాటినుండి విడిపించగా ఆయనను మనము స్తుతించగలము. మహోన్నతునికి నీ మ్రొక్కుబడులు చెల్లించుము.

**16-23వ. దేవుని ఎరిగినవారు - ఎరుగనివారు: 16-18వ.** భక్తిహీనులతో దేవుడు ఇట్లు సెలవిచ్చుచున్నాడు, అనగా భక్తిహీనులైన దేవుని నమ్మిన ఆత్మీయులే. 1) నీవు దొంగను చూచి వానితో ఏకీభవించుట, 2) వ్యభిచారులతో సాంగత్యము చేయుట, 3) కీడు చేయవలెనని నోరు తెరచుట (**యోబు 40:4-5**). 4) నాలుక కపటము కల్పించుట, 5) కూర్చుండి సహోదరుని మీద కొండెములు చెప్పుట, 6) తల్లి కుమారుని మీద అపనిందలు మోపుట మొదలగునవి భక్తిహీన క్రియలు, ఇట్టి పనులు చేసినను దేవుడు మౌనియై యున్నాడు. అయితే మన కన్నుల యెదుట ఈ సంగతులను వరుసగా ఉంచి **2కొరింథీ 5:10** లో చెప్పినట్లు విశ్వాసుల తీర్పులో గద్దించునని గుర్తించుదము. దిద్దుబాటు అందరికి సహోదరులకు, పరిచారకులకు, పెద్దలకు, సువార్తికులకు చివరకు ఈ వాక్యములు బోధించు బోధకులకు అసహ్యమే. దేవుని మాటలు వెనుకకు త్రోసివేసి, దేవుని కట్టడలు వివరించుటకు పూనుకొందురు. వాటితో నీకేమి పని? అని దేవుడు చెప్పుచున్నాడు. దేవుని మరచువారలారా! ... రక్షించబడని వారిని దేవుని మరచువారు అంటున్నారు. దీని యోచించుకొనుడి, లేనియెడల నేను మిమ్మును చీల్చివేయుదును. తప్పించువాడెవడును లేకపోవును అనుట అవిశ్వాసుల తీర్పును గురించిన భాగము. వారి చీల్చివేయబడుట నరక శిక్ష పొందుటయే. **23వ.** ముగింపులో స్తుతియాగము అర్పించుచు దేవుని మహిమపరచాలని చెప్పుచూ ముగించుచున్నాడు.

## 51వ కీర్తన (4+5+5+5 = 19 వ.)

**అంశం : భక్తులు పాపము దిద్దుకొనుట (1-9వ.) - దేవుని స్తుతించుట (10-19వ.)**

**సందర్భము: 2సమూ 12:9-12వ.** లో దేవుడు దావీదుతో నీవు యెహోవా మాటను తృణీకరించి ఆయన దృష్టికి చెడుతనము చేసితివేమి? అన్నాడు. హిత్తీయుడగు ఊరియాను కత్తిచేత చంపించి అతని భార్యను నీకు భార్యయగునట్లు నీవు పట్టుకొనియున్నావు. అమ్మోనీయులచేత నీవతని చంపించితివి గదా? నీవు నన్ను లక్ష్యము చేయక హిత్తీయుడగు ఊరియా భార్యను నీకు భార్య యగునట్లు తీసికొనినందున నీ యింటివారికి సదాకాలము యుద్ధము కలుగును. నీవు చూచుచుండగా నేను నీ భార్యలను తీసి నీ చేరువ వానికప్పగించెదను. **12** పగటియందు వాడు వారితో శయనించును. నీవు ఈ కార్యము రహస్యముగా చేసితివి గాని ఇశ్రాయేలీయులందరు చూచుచుండగా పగటియందే నేను చెప్పినదానిని చేయింతును అనెను. నేను పాపము చేసితినని దావీదు నాతానుతో అనగా నాతాను, నీవు చావకుండునట్లు యెహోవా నీ పాపమును పరిహరించెను. అయితే ఈ కార్యము వలన యెహోవాను దూషించుటకు ఆయనకు శత్రువులకు నీవు హేతువు కలుగజేసితివి. ఈ సందర్భమున **51 కీర్తన** వ్రాసియుండవచ్చును.

**విభజన: 1-9వ. పాపక్షమాపణ, 10-19వ. స్తుతి**

**1-4వ. పాపమును గుర్తించుట:** మనము ఎవరము? ప్రభువు ఎవరు? అను విషయాలు మనము గుర్తించాలి. **1వ.** దేవా, నీ కృపచొప్పున నన్ను కరుణింపుము. నీ వాత్సల్య బాహుళ్యము చొప్పున 1) నా అతిక్రమములను తుడిచివేయుము. **2వ.** 2) నా దోషము పోవునట్లు నన్ను బాగుగా కడుగుము. 3) నా పాపము పోవునట్లు నన్ను పవిత్రపరచుము. నీ దృష్టి యెదుట నేను 4) చెడుతనము చేసియున్నాను. ప్రభువు ఎవరు? కావున ఆజ్ఞ ఇచ్చునప్పుడు నీవు 1) నీతిమంతుడవుగా అగపడుదువు. తీర్పు తీర్చునపుడు 2) నిర్మలుడవుగా అగపడుదువు. మనము అతిక్రమము, దోషము, పాపము, చెడుతనము చేయువారమని గుర్తించాలి. ప్రభువు నీతిమంతుడు, నిర్మలుడు, కృప, వాత్సల్యములు కలవాడైనను పాపము కేవలము దేవునికి విరోధమైనదని గుర్తించాలి. **ఆది 39:7** లో అతని యజమానుడగు పోతీఫరు భార్య యోసేపు మీద కన్నువేసి తనతో శయనించుమని చెప్పెను. అయితే అతడు ఒప్పక నేనెట్లు ఇంత ఘోరమైన దుష్కార్యము చేసి దేవునికి విరోధముగా పాపము కట్టుకొందునని తన యజమానుని భార్యతో అన్నాడు. పాపము ఎంత ఘోరమైనదో గుర్తించుట అవసరము.

**5-9వ. పాపమును ఒప్పుకొనుట:** దావీదు ఒప్పుకొనిన విధానము చాలా గొప్పది. **5వ.** నేను పాపములో పుట్టినవాడను, పాపములో నా తల్లి నన్ను గర్భమున ధరించెను. **6వ.** నీవు అంతరంగములో సత్యము కోరుచున్నావు. ఆంతర్యమున నాకు జ్ఞానము తెలియజేయుదువు. **7వ.** నేను పవిత్రుడగునట్లు హిస్సోపుతో నా పాపము పరిహరింపుము. హిమము కంటెను నేను తెల్లగా నుండునట్లు నీవు నన్ను కడుగుము. **8వ.** ఉత్సాహ సంతోషములు నాకు వినిపింపుము. అప్పుడు నీవు విడిచిన యెముకలు హర్షించును.

**9వ.** నా పాపముకు విముఖుడవు కమ్ము. నా దోషములన్నిటిని తుడిచివేయుము. **1-2వ.** చెప్పినట్లు కృప చొప్పున వాత్సల్య బాహుళ్యము చొప్పున నా అతిక్రములను తుడిచి నా దోషము పోవునట్లు క్రీస్తు రక్తములో నన్ను బాగుగా కడిగి పాపము పోవునట్లు పవిత్రపరచుమని దావీదు వలె ప్రతి ఒక్కరు అడగాలి.

**10-14వ. స్తుతికి సిద్ధపడుట: 10-12వ.** స్తుతికి శుద్ధ హృదయము, సమ్మతి గల మనస్సు, అంతరంగములో స్థిరమైన మనస్సు అవసరము గనుక నూతనముగా పుట్టించుమని ప్రభువును అడగాలి. దేవుని సన్నిధిలో నిత్యము ఉండాలి. పాత నిబంధన కాలములో పరిశుద్ధాత్మ దేవునికి దూరమైనా వారియొద్ద నుండి వెళ్ళిపోవువాడు. కృపా కాలములో భక్తుల యొద్ద నుండి వెళ్ళిపోక దుఃఖపడుచు ఉండును. నీ రక్షణానందము నాకు మరల పుట్టించుము అనుట రక్షణ శాశ్వతమైనదని పాపము చేసినను రక్షణ పోదని మనము గుర్తించాలి. రక్షింపబడినపుడు పరిశుద్ధత ఆరోపించబడి **రోమా 3:25** ప్రకారము ఉచితముగా నీతిమంతులమని తీర్చబడ్డాము. ఆ స్థితి ఎన్నడు పోవునది కాదు. **ఎఫెసీ 13:14** అతిక్రమమును బట్టి పోగొట్టుకొనిన రక్షణ ఆనందమును మరల పొంది అతిక్రమము చేయువారికి దేవుని త్రోవలను బోధించెదను అంటున్నాడు. పాపులును నీ తట్టు తిరుగుదురు. నా రక్షణకర్తయగు దేవా రక్తాపరాధము నుండి నన్ను విడిపింపుము. అప్పుడు నా నాలుక నీ నీతిని గూర్చి ఉత్సాహ గానము చేయును అంటున్నాడు. కనుక చేసిన అపరాధములకు క్షమాపణ పొందినవారు దేవుని స్తుతించుట, మరియు అతిక్రమములో నున్నవారికి దేవుని త్రోవలను బోధించుచు వారిని దేవుని వైపునకు త్రిప్పువారుగా ఉండాలి.

**15-19వ. సమర్పణతో స్తుతించుట: 15-17వ.** దేవుడు అక్షరార్థమైన బలిని కోరువాడు కాదు. నీతి యుక్తములైన బలులను (నీతిగల జీవితము) దహనబలులు (సంపూర్ణ సమర్పణ) సర్వాంగ హోమములు (సజీవ యాగముగా అవయవములన్ని ఆయనకు సమర్పించుకొనుట) దేవునికి అంగీకృతము. విరిగిన మనస్సే దేవునికిష్టమైన బలి. విరిగి నలిగిన హృదయమును అలక్ష్యము చేయదు కనుక ఆయనకు అంగీకారమైన రీతిగా దేవుని స్తుతించుటకు నోరు తెరువబడాలని ప్రార్థించుచున్నాడు. **18-19వ.** దావీదువలె మనము సీయోనుకు మేలు కలిగి, యెరూషలేము యొక్క గోడలు కట్టించబడి అనగా నేటి కాలమున భూలోకములో దేవుని సంఘము చక్కగా కట్టబడి జనులు సరియైన రీతిగా ఆరాధన చేయవలెనని ఆశించాలి, ప్రార్థించాలి.

## 51 - 57 కీర్తనలు

**పాపము వలన కలుగు కీడు నుండి (51) కీడు చేయువారి (52-54), బలాత్కారము నుండి (55) శ్రమల నుండి (56) కాపాడి రక్షించిన దేవుని స్తుతించుట (57)**

## 52వ కీర్తన (1+2+2+2+2 = 9 వ.)

**అంశం : కీడు చేసి అతిశయపడువారిని దేవుడు నిర్మూలించుట – దావీదు దేవుని స్తుతించుట**

**సందర్భము : 1సమూ 22:12–13** లో సౌలు దావీదును చంప తలపెట్టాడు. యాజకుడైన అహీమెలెకు, దావీదుకు ఆహారము, ఖడ్గము ఇచ్చి అతని పక్షమున దేవుని యొద్ద విచారణ చేసిన విషయము, దోయగు రాజుకు తెలుపగా సౌలు రాజు అహీమెలెకును ఎనుబది యయిదు యాజకులను దోయేగుచేత చంపించగా దావీదు దోయేగు విషయమై వ్రాసిన కీర్తన.

**1వ. నీతిమంతులకు చేసిన కీడునుబట్టి అతిశయపడువాడు:** దోయేగు తాను శూరుడనని తలంచి, ఇతరులు యాజకులను చంపక యున్నప్పుడు సౌలుయొక్క మాట ప్రకారము యాజకులను చంపియు ఆ కీడును బట్టి చింతింపక అతిశయించినందున నీతిమంతులగు యాజకులను చంపియు నీవెందుకు అతిశయపడుచున్నావు? నీతిమంతుల మీద దేవుని కృప నిత్యముండునని దావీదు చెప్పుచున్నాడు. ఇందులో మనము నీతిమంతులకు కీడు చేయకుండా జాగ్రత్త పడవలెనని నేర్చుకోవాలి.

**2–3వ. నీతిమంతులకు కీడును తలపెట్టినవాడు:** నీతిమంతులగు యాజకుల మీద చాడీలు చెప్పుటను బట్టి దోయేగును మోసము చేయువాడు అని దావీదు పలుకుచున్నాడు. వాడిగల మంగల కత్తివలె దోయేగు నాలుక నాశనము చేయనుద్దేశించుచున్నదని మేలుకంటె కీడు చేయుట, నీతి పలుకుట కంటె అబద్ధము చెప్పుట దోయేగుకు ఇష్టమని చెప్పుచున్నాడు. సెలా అని ఉన్నందున అది మనము ఆలాగు చేయకూడదని ఆలోచించాలి. దోయేగు ఎదోమీయుడు. ఏశావు శరీరమునకు గుర్తు. కనుక శరీరము ఆత్మకు విరోధమగును. **గలతీ 5:17 వ.** ప్రకారము ఆత్మీయులగు యాజకులను చంపుటకు వెనుకాడలేదు.

**4–5వ. నీతిమంతులకు కీడును తలపెట్టిన వారిని దేవుడు నిర్మూలించుట:** కపటమైన నాలుక గలవాడగు దోయేగు, అధిక నాశనకరములైన మాటలే ఇష్టపూర్వకముగా పలికినందున దేవుడు సదాకాలము దోయేగును అణగగొట్టి, గుడారములో నుండి పెల్లగించునని సజీవుల దేశములో నుండి నిర్మూలము చేయునని చెప్పుచున్నాడు. దోయేగు ఆలాగు నశించి యుండవచ్చును.

**6–7వ. కీడు చేసినవారిని దేవుడు నిర్మూలించుట చూచి నీతిమంతులు నవ్వుట:** కీడు చేయువారిని దేవుడు నిర్మూలము చేయగా నీతిమంతులు చూచి భయభక్తులు కలిగి ఇదిగో దేవుని తనకు దుర్గముగా నుంచుకొనక తన ధనసమృద్ధి యందు నమ్మికయుంచితే తన చేటును బలపరచుకొనిన వారికి దేవుడు ఈలాగు చేయునని చెప్పుకొనుచు వానిని చూచినప్పుడు అను మాట ప్రకారము దోయేగుకు కలిగిన నాశనమును చూచి అనేకులు నవ్వియుందురు.

**8-9వ. తన విషయమై దావీదు దేవుని స్తుతించుట: 8వ.** నేనైతే దేవుని మందిరములో పచ్చని ఒలీవ చెట్టువలె నున్నాను అని దావీదు అంటున్నాడు. ఒలీవ చెట్టు యొక్క నూనె 200 ప్రయోజనములు కలది. నిత్యము దేవుని కృపయందు నమ్మికయుంచుచున్నాను అని అన్నట్లు నెమ్మదిగా ఉన్నాడు. **9వ.** నీవు దానిని నెరవేర్చితివి గనుక నేను నిత్యము నిన్ను స్తుతించెదను. నీ నామము నీ భక్తుల దృష్టికి ఉత్తమమైనది. నేను దాని విస్మరించి కనిపెట్టుచున్నానని చెప్పుచు ఒక కీర్తన వ్రాసి దేవుని స్తుతించుచున్నాడు.

**గమనిక :**

**53వ కీర్తన, 14వ కీర్తన ఒకేరీతిగా నున్నవి గనుక**
**53వ కీర్తన కొరకు 14వ కీర్తన చూడండి**

## 54వ కీర్తన (3+4 = 7 వ.)

**సందర్భము : 1సమూ 23:5-8వ.** దావీదును అతని జనులును కెయీలాకు వచ్చి ఫిలిష్తీయులతో యుద్ధము చేసి వారిని లెస్సగా హతముచేసి వారి పశువులను దోచుకొని వచ్చిరి. ఈలాగున దావీదు కెయీలా కాపురస్థులను రక్షించెను. దావీదు కెయీలాకు వచ్చిన సంగతి సౌలు విని దావీదు ద్వారములను, అడ్డుగోడను గల పట్టణములో ప్రవేశించి అందులో మూయబడియున్నాడు; దేవుడతనిని నా చేతికి అప్పగించెననుకొనెను. కాబట్టి సౌలు కెయీలాకు పోయి దావీదును, అతని జనులను ముట్టడింపవలెనని జనులందరిని యుద్ధమునకు పిలువనంపించెను. **14-17వ.** దావీదు, జీపు అను అరణ్యమున ఒక పర్వతమందును నివాసము చేయుచుండెను. సౌలు అనుదినము వెదకినను దేవుడు సౌలు చేతికి అతని నప్పగించలేదు. తన ప్రాణము తీయుటకై సౌలు బయలుదేరెనని తెలిసికొని దావీదు జీపు అరణ్యములో ఒక వనమున దిగెను. అప్పుడు సౌలు కుమారుడైన యోనాతాను లేచి, వనములోనున్న దావీదు నొద్దకు వచ్చి, నా తండ్రియైన సౌలు నిన్ను పట్టుకొనజాలడు. నీవు భయపడవద్దు, నీవు ఇశ్రాయేలీయులకు రాజువగుదవు అన్నాడు. కాని జీఫీయులు సౌలుకు దావీదును పట్టింతుమని చెప్పినపుడు దావీదు చేసిన ప్రార్థనయే ఈ కీర్తన.

**1-3వ. బలాఢ్యులు (సౌలు) మరియు అన్యజనుల నుండి రక్షించుమని ప్రార్థించుట: 1వ.** దేవా, నీ నామమును, పరాక్రమమునుబట్టి నాకు ప్రత్యర్థియగు సౌలు నుండి న్యాయము తీర్చుమని మొరపెట్టాడు. **2-3వ.** దేవా, నా ప్రార్థన ఆలకింపుము. నా నోటి మాటలు చెవినిబెట్టుము. అన్యులు నా మీదికి లేచియున్నారు. బలాఢ్యులు నా ప్రాణము తీయజూచుచున్నారు. జీఫీయులు బయలుదేరి గిబియాలోనున్న సౌలునొద్దకు వచ్చి హకీలా మన్యములోని అరణ్యమున కొండ స్థలములయందు మా మధ్య దావీదు దాగియున్నాడు, రాజా, నీ మనోభీష్టమంతటి చొప్పున దిగిరమ్ము. రాజువైన నీ చేతికి అతని అప్పగించుట మా పని అని **1సమూ 23:19-21** లో చెప్పిరి. అన్యులగు జీఫీయుల నుండి, బలాఢ్యుడగు సౌలు నుండి తప్పించుమని దావీదు దేవునికి చేసిన ప్రార్థనయే ఈ కీర్తన (సెలా).

**4-7వ. ఉత్తముడై ఆదరించిన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుట: 5వ. 1సమూ 23:26-28.** సౌలు పర్వతము ఈ తట్టునను దావీదును అతని జనులను పర్వతము ఆ తట్టునను పోవుచుండగా దావీదు సౌలు దగ్గర నుండి తప్పించుకొనిపోవలెనని త్వరపడుచుండెను. సౌలును, అతని జనులును దావీదును అతని జనులను పట్టుకొనవలెనని వారిని చుట్టుకొనుచుండిరి. ఇట్లుండగా దూత యొకడు సౌలునొద్దకు వచ్చి, నీవు త్వరగా రమ్ము, ఫిలిష్తీయులు దండెత్తి వచ్చి దేశములో చొరబడియున్నారని చెప్పగా సౌలు దావీదును తరుముట మాని ఫిలిష్తీయులను ఎదుర్కొనబోయెను. కాబట్టి సెలహమ్మలెకోతు అని ఆ స్థలమునకు పేరుపెట్టబడెను. ఇదిగో దేవుడు నాకు సహాయకుడు. ప్రభువే నా ప్రాణమును ఆదరించువాడు. నా శత్రువులు చేయు కీడు ఆయన వారిమీదికి రప్పించును అని, స్వేచ్ఛార్పణలైన బలులను నేను నీకర్పించెదనని ఈ కీర్తనలో చేర్చాడు. **6-7వ.** యెహోవా, నీ నామము ఉత్తమము. నేను దానికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను. ఆపదలన్నిటిలో నుండి ఆయన నన్ను విడిపించియున్నాడు. నా శత్రువుల గతిని చూచి నా కన్ను సంతోషించుచున్నదని ముగించాడు.

## 55వ కీర్తన (8+8+7 = 23 వ.)

**అంశం : బలాత్కారుల నుండి విడిపించుమని ప్రార్థన చేయుట - విడిపించాడని నిరీక్షించుట**

**సందర్భము: కీర్తన 55:13** ఈ పని చేసిన నీవు నా సహకారి, నా చెలికాడవు, నా పరిచయుడవు. **2సమూ 16:5-11-5వ.** రాజైన దావీదు అబ్షాలోముచే తరుమబడి బహూరీము వచ్చినప్పుడు సౌలు కుటుంబికుడగు షిమీ దావీదు మీదను అతని సేవకులందరి మీదను రాళ్లు రువ్వుచు వచ్చెను. ఈ షిమీ నరహంతకుడా, దుర్మార్గుడా, సౌలు ఇంటివారి హత్యను యెహోవా నీ మీదికి రప్పించి, నీ కుమారుడై అబ్షాలోము చేతికి రాజ్యమును అప్పగించియున్నాడు; నీవు నరహంతకుడవు గనుకనే నీ మోసములో నీవు చిక్కుబడియున్నావని చెప్పి రాజును శపింపగా దావీదు తన సేవకులందరితోను పలికినదేమనగా, నా కడుపును బుట్టిన నా కుమారుడే నా ప్రాణము తీయచూచుచుండగా ఈ బెన్యామీనాయుడు ఈ ప్రకారము చేయుట ఏమి ఆశ్చర్యము? వాని జోలి మానుడి, యెహోవా వానికి సెలవిచ్చియున్నాడు గనుక వానిని శపింపనియ్యుడి అని దేవునికి ఈ రీతిగా ప్రార్థించాడు. **2సమూ 15:30-31** దావీదు అతని యొద్దనున్న జనులందరు తలలు కప్పుకొని యేడ్చుచు ఒలీవ చెట్ల కొండ యెక్కిరి. **31వ.** అంతలో ఒకడు వచ్చి, అబ్షాలోము చేసిన కుట్రలో అహీతోపెలు చేరియున్నాడని దావీదునకు తెలియజేయగా దావీదు యెహోవా అహీతోపెలు యొక్క ఆలోచనలు చెడగొట్టుమని ప్రార్థన చేసెను.

**1-8వ. దుష్టులగు శత్రువుల, స్వజనుల బలాత్కారము నుండి విడిపించుమని ప్రార్థన:** **1-3వ.** దేవా, చెవియొగ్గి నా ప్రార్థన, నా విన్నపము, నా మనవి ఆలకించి నాకుత్తరమిమ్ము అని ప్రార్థించాడు. శత్రువులగు షిమి వంటివారిని బట్టి నేను చింతాక్రాంతుడై విశ్రాంతి లేక మూలుగుచున్నాను. వారు నామీద దోషము మోపుచున్నారు. ఆగ్రహము గలవారై నన్ను హింసించుచున్నారు. **4-7వ.** గుండెలో వేదన, దిగులు, వణకు కలిగి మహా భయముతో మునిగి దూరముగా పారిపోయి తప్పించుకొని అరణ్యములో నివసించాలని ఆశించాడు. ఇటువంటి సమస్యలు మనకు వచ్చినపుడు మనమే వారికి కీడు చేయాలని తలచక దేవునికి మాత్రమే మొరపెట్టాలి.

**9-16వ. పట్టణములో బలాత్కారము చేయు చెలికాండ్ల నుండి రక్షించుమని ప్రార్థన:** **9-12. 2సమూ 15:1-4వ.** లో అబ్షాలోము ఒక రథమును గుఱ్ఱములను సిద్ధపరచి తన యెదుట పరుగెత్తుటకై యేబదిమంది బంటులను ఏర్పరచుకొని పట్టణము యొక్క గుమ్మపు మార్గమందు ఒక తట్టున నిలిచి, రాజుచేత తీర్పు నొందుటకై వచ్చియుండగా కనిపెట్టి వారిని పిలిచి నేను ఈ దేశమునకు న్యాయాధిపతియై యుండిన వారికి న్యాయము సరిగా తీర్చుదునని చెప్పుచు తండ్రియైన దావీదు మీద కుట్ర పన్నెను. **2సమూ 16:21-22** లో అహీతోపెలు నీ తండ్రిచేత ఇంటికి కావలి యుంచబడిన ఉపపత్నుల యొద్దకు నీవు పోయిన యెడల నీవు నీ తండ్రికి అసహ్యుడవైతివని ఇశ్రాయేలీయులందరు తెలిసికొందురు. అప్పుడు నీ పక్షముననున్న వారందరు ధైర్యము తెచ్చుకొందురని చెప్పగా ఇశ్రాయేలీయుల కందరికి తెలియునట్లుగా అతడు తన తండ్రి ఉపపత్నులను కూడెను. **13-16వ.** ఈ పని చేసిన నీవు నా సహకారివి. నా చెలికాడవు, నా పరిచయుడవు. మనము కూడి మధురమైన గోష్ఠి చేసియున్నవారము. ఉత్సవమునకు వెళ్ళు సమూహముతో దేవుని మందిరమునకు పోయియున్నవారము అని అబ్షాలోము విషయము అన్నాడు. అహీతోపెలు వంటివారిలో చెడుతనము ఉన్నందున వారికి మరణము అకస్మాత్తుగా వచ్చునుగాక. అయితే నేను దేవునికి మొఱ్ఱపెట్టుకొందును. యెహోవా నన్ను రక్షించును అని విశ్వాసముతో ప్రార్థించాడే కాని ఎవరికీ కీడు చేయలేదు.

**17-23వ. అనేకులైన శత్రువుల నుండి ప్రాణమును విమోచించియున్నానని విశ్వాసము కలిగియుండుట: 17-19వ.** సాయంకాలము, ఉదయము, మధ్యాహ్నము నేను ధ్యానించుచు మొఱ్ఱపెట్టుకొందును. ఆయన నా ప్రార్థన నాలకించును. శత్రువులు అనేకులైనను వారు నా మీదికి రాకుండునట్లు సమాధానము కలుగజేసి ఆయన నా ప్రాణమును విమోచించి యున్నాడని విశ్వాసముతో అన్నాడు. **20-23వ.** తమతో సమాధానముగా నున్నవారికి శత్రువులైనవారు బలాత్కారము చేయుదురు. తాము చేసిన నిబంధన నతిక్రమింతురు. వారి నోటిమాటలు నునుపైనవి, వెన్న వంటివి, కాని వరదీసిన కత్తులు. వారి హృదయములో కలహమున్నది. యెహోవా మీద భారము మోపువారిని ఆయన ఆదుకొనును. నీతిమంతులను ఆయన ఎన్నడును కదలనీయడు అను విశ్వాసము కలిగియున్నాడు. రక్తాపరాధులును వంచకులును సగము కాలమైన బ్రదుకరు. దేవా,

నాశన కూపములో నీవు వారిని పడవేయుదువు అన్నాడు. కాని పడవేయుము అనలేదు. **2సమూ 17:1-23** లో అహీతోపెలు తాను చెప్పిన ఆలోచన జరుగకపోవుట చూచి, తన ఊరనున్న తన యింటికి పోయి తన యిల్లు చక్కబెట్టుకొని ఉరి పోసికొని చనిపోయెను; దావీదు దేవునియందు నమ్మికయుంచినందున దీవించబడ్డాడు.

## 56వ కీర్తన (2+2+2+1+2+2+2 = 13 వ.)

**అంశం : శ్రమలలో దావీదును శత్రువులగు ఫిలిష్తీయుల నుండి కాపాడు ప్రభువునకు స్తుతి**

**సందర్భము: 1సమూ 21:10-15వ.** లో దావీదు సౌలునకు భయపడి లేచి పారిపోయి గాతు రాజైన ఆకీషు నొద్దకు రాగా ఆకీషు సేవకులు ఈ దావీదు ఆ దేశపు రాజు కాడా? వారు నాట్యమాడుచు గాన ప్రతిగానములు చేయుచు సౌలు వేలకొలది, దావీదు పది వేలకొలది హతము చేసెననియు పాడిన పాటలు ఇతని గూర్చినవే గదా అని అతనిని పట్టుకొని రాజునొద్దకు తెచ్చిరి. దావీదు ఈ మాటలు తన మనస్సులో నుంచుకొని గాతు రాజైన ఆకీషునకు బహు భయపడి వారి యెదుట వెఱ్ఱివానివలె నటించుచు, ద్వారపు తలుపుల మీద గీతలు గీయుచు, ఉమ్మి తన గడ్డము మీదికి కారనిచ్చుచుండెను. విశ్వాసముతో మనసులో మౌనముగా దేవునికి కన్నీటితో మొరపెట్టుచుండెను. కావున ఆకీషురాజు మీరు చూచితిరి కదా? వానికి పిచ్చి పట్టినది, నా యొద్దకు వీనినెందుకు తీసికొని వచ్చితిరి? అని తన సేవకులతో అనెను. దావీదును చంపుటకు బదులు విడిచిపెట్టెను. అయినను **1-2వ.**లో నన్ను మింగవలెనని యున్నారు, నన్ను బాధించుచున్నారు, నాతో పోరాడుచున్నారు, నా కొరకు పొంచియున్నారు అన్నాడు. **5-6వ.**లో శత్రువులుగా నా మాటలు అపార్థము చేయుదురు, నాకు హాని చేయవలెనన్న తలంపులే వారికి పుట్టుచున్నవి. నా ప్రాణము తీయగోరువారు నా అడుగుజాడలు కనిపెట్టుదురు అన్నందున ఎంతటి ఆపదలో నున్నాడో తలంచగలము. **7-10వ.**లో కన్నీళ్ళతో మొఱ్ఱపెట్టుచు, దేవుడు తన పక్షమున నున్నాడని తాము చేయు దోష క్రియలచేత శత్రువులు తప్పించుకొనలేరని నిరీక్షణతో దేవునిబట్టి నేను ఆయన వాక్యమును కీర్తించెదను అన్నాడు. **12-13వ.**లో దేవుడు మరణములో నుండి తన ప్రాణమును తప్పించి, జీవపు వెలుగులో దేవుని సన్నిధిని సంచరించునట్లు పడకుండ పాదములను తప్పించినందున స్తుతి యాగముల నర్పించెదను అన్నాడు. యెసతేలెం రేహుకీమ్ రాగము అనగా 'పరాయి దేశములో మౌనముగా నున్న పావురము' అని అర్థము. దావీదు నిర్దోషముగా మౌనముగా నుండి ప్రభువుకు ప్రార్థించి విడుదల పొందినందున పరాయి దేశములో మౌనముగా నున్న పావురము అను రాగమగు యెసతేలెం రేహుకీమ్ అను రాగముపై ఈ కీర్తన వ్రాసెను.

**1-2వ. శ్రమలలో ప్రభువును ఆశ్రయించుట:** దేవా, నన్ను కరుణింపుము. మనుష్యులు నన్ను మ్రింగవలెనని యున్నారు. దినమెల్ల నా కొరకు పొంచియున్నవారు నన్ను మ్రింగవలెనని యున్నారు. దినమెల్ల వారు పోరాడుచు నన్ను బాధించుచున్నారు అన్నందున

దేవుడు కరుణ, కృప గలవాడని గుర్తించి ప్రార్థించుచున్నాడు. మనమును కృపచేతనే రక్షింపబడినందున కృప, కరుణను బట్టియే సహాయముకై మొరపెట్టాలి అనేకులు గర్వించి మనతో పోరాడుచున్నారు. దినమెల్ల నా కొరకు పొంచియున్నవారు నన్ను మ్రింగవలెనని యున్నారు అన్నందున నీతిమంతునకు కలుగు ఆపదలు అనేకములు అయినను దేవుడు వాటన్నిటి నుండి తప్పించునను విశ్వాసముతో నుండాలి.

**3-4వ. భయము సంభవించినపుడు విశ్వాసముతో దేవుణ్ణి ఆశ్రయించుట:** నాకు భయము సంభవించు దినమున నిన్ను ఆశ్రయించుచున్నాను అంటున్నాడు. **కీర్తన 34:4** లో మానవులను ఆశ్రయించక నేను యెహోవా యొద్ద విచారణ చేయగా ఆయన నాకుత్తరమిచ్చి, నాకు కలిగిన భయములన్నిటిలో నుండి ఆయన నన్ను తప్పించెను అన్నాడు. దావీదు విశ్వాసము గమనించతగినది. గనుక దేవునిబట్టి నేను ఆయన వాక్యమును కీర్తించి స్తుతించెదను అన్నాడు. దేవునియందు నమ్మికయుంచియున్నాను, నేను భయపడను. శరీరధారులు నన్నేమి చేయగలరని నిర్భయముగా నున్నాడు.

**5-6వ. శత్రువు, దోషము:** శత్రువులు దినమెల్ల మన మాటలు అపార్థము చేయుచు మనకు హాని చేయవలెనన్న తలంపులో కలిగి గుంపుకూడి పొంచియుండి, ప్రాణము తీయగోరుచు, మన అడుగుజాడలు కనిపెట్టుదురు అని చెప్పుచున్నాడు.

**7వ. శత్రువును, దోషమునుబట్టి శిక్షించు ప్రభువు:** తాము చేయు దోషక్రియల చేత వారు తప్పించుకొనక దేవుడు జనములను అణగగొట్టవలెనని ప్రార్థించుచున్నాడు.

**8-13వ.** శత్రువు మనపైకి లేచినపుడు దేవుడు మన పక్షమున నుండి తన కృప కనుపరచి శత్రువు నుండి తప్పించునని నిరీక్షించవలెనని చెప్పుచున్నాడు.

**8-9వ. శత్రువు మనపైకి లేచినపుడు దేవుడు మన పక్షముననున్నాడని గుర్తించుట:** నా సంచారములను నీవు లెక్కించియున్నావు అన్నందున మనమును మన దినములు దేవునిచే నిర్ణయింపబడి, తరిగిపోవుచున్నవని గుర్తించాలి. మన కన్నీళ్లు దేవుని యొద్ద బుడ్డిలోను, పుస్తకములోను దాచబడినందున మనము మొఱ్ఱపెట్టు దినమున శత్రువులు వెనుకకు తిరుగుదురని, దేవుడు మన పక్షమున నున్నాడని గుర్తించాలి.

**10-11వ. శత్రువు మనపైకి లేచినపుడు దేవుడు మన పక్షమున నున్నాడని గుర్తించి దేవుని స్తుతించుట:** ముందుగా నాల్గవ వచనములో దేవుని బట్టి నేను ఆయన వాక్యమును స్తుతితో కీర్తించెదను అని ముందుగా చెప్పి ఇప్పుడును యెహోవాను బట్టి ఆయన వాక్యమును కీర్తించెదను, నేను దేవుని యందు నమ్మికయుంచియున్నాను, నేను భయపడను అని విశ్వాసముతో చెప్పుచున్నాడు.

**12-13వ. తప్పించినందులకై దేవుని స్తుతించుట:** 1) దేవా నీవు మరణములో నుండి నా ప్రాణమును తప్పించియున్నావు. 2) నేను జీవపు వెలుగులో దేవుని సన్నిధిని సంచరించునట్లు 3) జారిపడకుండ నీవు నా పాదములను తప్పించియున్నావు. అందుకై నేను నీకు మ్రొక్కుకొని నేను నీకు స్తుతిని కేవలము ఒక మాటతో కాక యాగముగా ఒక పెద్ద కార్యముగా నర్పించెదను అంటున్నాడు.

## 57వ కీర్తన (3+2+1+3+2 = 11 వ.)

**సందర్భము : 1సమూ 23:13వ.** లో దావీదును ఆరువందలమందియైన అతని జనులును లేచి కెయీలాలో నుండి తరలి, ఎక్కడికి పోగలరో అక్కడకు వెళ్ళిరి. **1సమూ 24:1-22వ.** లో సౌలు ఇశ్రాయేలీయులందరిలో నుండి మూడు వేలమందిని ఏర్పరచుకొని రాగా, అక్కడ గుహ యొకటి కనబడెను. అందులో సౌలు శంకానివర్తికి పోగా దావీదు అతని జనులు ఆ గుహ లోపలి భాగములలో ఉండిరి. దావీదు జనులు అదిగో నీ దృష్టికి ఏది మంచిదో అది నీవు అతనికి చేయునట్లు నీ శత్రువుని నీ చేతికి అప్పగింతునని యెహోవా నీతో చెప్పిన దినము వచ్చెనని అతనితో అనగా, దావీదు లేచి వచ్చి సౌలునకు తెలియకుండ అతని పైవస్త్రపు చెంగును కోసి, తాను కోరినందుకు దావీదు మనసులో నొచ్చుకొని సౌలు గుహ నుండి బయటకు రాగా సౌలు ఎదుటికి వెళ్లి చంపక తాను గుహలో విడిచిపెట్టితినని చెప్పి సౌలును పంపించెను. గుహ లోపల నున్న ఆరువందలమంది సింహముల వలె దావీదు మీదకు లేవగా వారందరిని ఎంతో కష్టముతో సముదాయించెను. అప్పుడు సౌలు ఇంటికి వెళ్ళెను. అయితే దావీదును అతని జనులును సౌలు నుండి తప్పించుకొని తమ కొండ స్థలములకు వెళ్ళి దేవుడు చేసిన ఆశ్చర్య కార్యముల కొరకై దేవుని స్తుతించి ఈ కీర్తన వ్రాసెను.

**అంశం : కరుణ కొరకు శరణుజొచ్చిన దావీదును విడిపించిన దేవుడు - దేవుని స్తుతించిన దావీదు: 1-5వ. ప్రార్థన, 6వ. జవాబు, 7-11 స్తుతి**

**11వ.** లో, దేవా, ఆకాశములకంటె అత్యున్నతడవుగా నిన్ను కనుపరచుకొనుము, నీ ప్రభావము సర్వభూమి మీద కనబడనిమ్ము అన్నాడు. ఆకాశముల కంటె అత్యున్నతుడవు అనగా క్రిందనున్న 1) భూమండలము, 2) మేఘ మండలము, 3) నక్షత్ర మండలము, 4) పరదైసు అను మూడవ ఆకాశము, 5) పరలోకము, 6) మహాకాశములు, 7) అత్యున్నత సింహాసనము అని అర్థము. కీర్తన గ్రంథము నుండి వివిధ స్థలములలో ఉన్నవాటిని గమనిద్దాము.

**కీర్తన 71:19** దేవా, నీ నీతి మహాకాశమంత ఉన్నతమైనది. నీ కీర్తియు భూదిగంతముల వరకు అంత గొప్పది. **కీర్తన 57:9** నీ కృప ఆకాశము కంటె ఎత్తయినది. **కీర్తన 33:5** లోకము యెహోవా కృపతో నిండియున్నది. **కీర్తన 148:13** ఆయన ప్రభావము భూమ్యాకాశములకు పైగా ఉన్నది. **కీర్తన 57:11** నీ ప్రభావము సర్వ భూమి మీద కనబడనిమ్ము. **మార్కు 5:30** వెంటనే యేసు తనలో నుండి ప్రభావము బయలువెళ్లెనని తనలో తాను గ్రహించినందున భూమి మీద ఆయన ప్రభావము కనబడుచున్నది. **కీర్తన 113:4** ఆయన మహిమ ఆకాశ విశాలమున వ్యాపించియున్నది. **కీర్తన 8:1** ఆకాశములో నీ మహిమ కనపరచువాడా, **కీర్తన 19:1** ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి, భూమియందంతట నీ నామము ఎంత ప్రభావము గలది. **కీర్తన 57:9** నీ సత్యము మేఘమండలము వరకు వ్యాపించియున్నది. **కీర్తన 57:3** ఆకాశము నుండి

ఆజ్ఞ ఇచ్చి దేవుడు తన కృపా సత్యములను పంపును. నీ కృపను నీ సత్యమును మహా సమాజమునకు తెలుపక నేను వాటికి మరుగుచేయలేదు. **కీర్తన 48:10** దేవా, నీ నామము ఎంత గొప్పదో. **కీర్తన 148:13** అందరును యెహోవా నామమును స్తుతించుదురు గాక. ఆయన నామము మహోన్నతమైన నామము. నీవు అత్యున్నతుడవు. **అపొ.కా.4:10,** సిలువ వేసినట్టి, మృతులలో నుండి దేవుడు లేపినట్టి నజరేయుడైన యేసుక్రీస్తు నామముననే వీడు స్వస్థత పొంది మీ యెదుట నిలుచున్నాడు. మరి యెవని వలన రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము. **కీర్తన 71:19** గొప్ప కార్యములు చేసిన దేవా, నీతో సాటియై వాడెవడు? **కీర్తన 48:10** నీ కీర్తియు భూదిగంతముల వరకు అంత గొప్పది. **కీర్తన 57:11** దేవా, ఆకాశముల కంటె అత్యున్నతుడవుగా నిన్ను కనపరచుకొనుము.

**1-3వ. మహోన్నతుడైన దేవుని కరుణించుమని మొరపెట్టుట: 1వ.** నన్ను కరుణింపుము. దేవా నన్ను కరుణింపుము. నేను నీ శరణుజొచ్చియున్నాను. ఈ ఆపదలు తొలగిపోవు వరకు నీ రెక్కల నీడను శరణుజొచ్చియున్నాను అన్నాడు. **రూతు 2:12వ.** యెహోవా రెక్కల క్రింద సురక్షితము ఉండునని, ఆయన సంపూర్ణమైన బహుమానమిచ్చునని చెప్పబడినందున దావీదు ఆ నమ్మకము కలిగి స్తుతించుచున్నాడు. **2వ.** మహోన్నతుడైన దేవునికి నా కార్యము సఫలము చేయు దేవునికి నేను మొఱ్ఱపెట్టుచున్నాను. **3వ.** ఆయన ఆకాశముల నుండి ఆజ్ఞ ఇచ్చి నన్ను రక్షించును. నన్ను మ్రింగగోరువారు దూషణలు పలుకునప్పుడు దేవుడు తన కృపా సత్యములను పంపును. **కీర్తన 33:5** లోకము యెహోవా కృపతో, సత్యముతో నిండియున్నది. **కీర్తన 57:9** నీ కృప ఆకాశము కంటె ఎత్తయినది. నీ సత్యము మేఘమండలము వరకు వ్యాపించియున్నది. **కీర్తన 40:11** యెహోవా, నీవు నీ (వాత్సల్యమును) నాకు దూరము చేయవు. నీ కృపా సత్యమలు ఎప్పుడును నన్ను కాపాడును గాక. కృపచేత రక్షణ. **కీర్తన 40:10-11** నీ నీతిని నా హృదయములో నుంచుకొని నేను ఊరకుండలేను. నీ సత్యమును నీ రక్షణను నేను వెల్లడిచేసియున్నాను. నీ కృపను నీ సత్యమును మహా సమాజమునకు తెలుపక నేను వాటిని మరుగుచేయలేదు అన్నాడు.

**4-5వ. దావీదు తన స్థితిని చెప్పుకొనుట: 4వ.** నా ప్రాణము సింహముల మధ్య నున్నది. కోపోద్రేకుల మధ్యను నేను పండుకొనుచున్నాను. వారి దంతములు శూలములు అవి అంబులు. వారి నాలుక వాడిగల కత్తి. **5వ.** దేవా, ఆకాశముల కంటె అత్యున్నతుడవుగా నిన్ను కనుపరచుకొనుము. నీ ప్రభావము సర్వ భూమి మీద కనబడనిమ్మని గుహలోనున్న తన జనులను గూర్చి ప్రార్థించాడు. **కీర్తన 8:9** యెహోవా మా ప్రభువా భూమి యందంతట నీ నామము ఎంత ప్రభావము గలది! **కీర్తన 148:13** ఆయన ప్రభావము భూమ్యాకాశములకు పైగా నున్నది. **కీర్తన 57:11** దేవా, ఆకాశము కంటె అత్యున్నతుడవుగా

నీవు కనుపరచుకొనుము. యెహోవా నామమును స్తుతించుదురు గాక. ఆయన నామము మహోన్నతమైన నామము. **అపొ.కా. 4:10** సిలువ వేసినట్టి, మృతులలో నుండి దేవుడు లేపినట్టియు నజరేయుడైన యేసుక్రీస్తు నామముననే వీడు స్వస్థత పొంది మీ యెదుట నిలుచున్నాడు. **12.** మరి ఎవనివలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము అనెను.

**6వ. జవాబుగా శత్రువు తాను త్రవ్విన గుంటలో పడుట:** నా అడుగులను చిక్కించుకొనుటకై వలయొద్దగా దావీదు ప్రాణము కృంగియుండెను. దావీదు యెదుట సౌలును తాను త్రవ్విన గుంటలో తననే పడవేయగా దావీదుకు నెమ్మది దొరికెను.

**7-9వ. కృపాసత్యమును బట్టి దేవుని స్తుతించుట: 7-8వ.** దావీదు హృదయము నిబ్బరము కాగా దేవా, నా హృదయము నిబ్బరముగా నున్నది. నేను పాడుచు స్తుతి గానము చేసెదను అని నా ప్రాణమా, మేలుకొనుము, స్వరమండలమా, సితారా, మేలుకొనుడి. స్తుతించుటకై నేను వేకువనే లేచెదను అన్నాడు. **9వ.** నీ కృప ఆకాశము కంటె ఎత్తయినది. నీ సత్యము మేఘమండలము వరకు వ్యాపించియున్నదని దేవుని కృపను గూర్చి పలికాడు.

**10-11వ. సర్వభూమిలోనున్న దేవుని ప్రభావమునుబట్టి జనములలో అత్యున్నతుడైన ప్రభువును కీర్తించి, స్తుతించుట: 10వ.** ప్రభువా, జనములలో నీకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించెదను. ప్రజలలో నిన్ను కీర్తించెదను. **11వ.** దేవా, ఆకాశముల కంటె అత్యున్నతడువుగా నిన్ను కనుపరచుకొనుము. నీ ప్రభావము సర్వభూమి మీద కనబడనిమ్ము అన్నందున ఆకాశములో నున్న ఆయన నీతి, కీర్తి ఎంత గొప్పవో చూతము. **కీర్తన 71:19.** దేవా, నీ నీతి మహాకాశమంత ఉన్నతమైనది. **కీర్తన 89:5.** యెహోవా, ఆకాశ వైశాల్యము నీ ఆశ్చర్య కార్యములను స్తుతించుచున్నది. **కీర్తన 48:10.** దేవా, నీ నామము ఎంత గొప్పదో, నీ కీర్తియు భూదిగంతముల వరకు అంత గొప్పది. నీ కుడిచెయ్యి నీతితో నిండియున్నది. **కీర్తన 97:9.** ఏలయనగా యెహోవా, భూలోకమంతటికి పైగా నీవు మహోన్నతుడవై యున్నావు.. సమస్త దేవతలకు పైగా నీవు అత్యధికమైన ఔన్నత్యము పొందియున్నావు. **కీర్తన 89:5.** పరిశుద్ధ దూతల సమాజములో నీ విశ్వాస్యతనుబట్టి నీకు స్తుతులు కలుగుచున్నవి. **కీర్తన 8:1.** యెహోవా, మా ప్రభువా, ఆకాశములలో నీ మహిమను కనుపరచువాడా, భూమియందంతట నీ నామము ఎంత ప్రభావము గలది. **కీర్తన 113:4.** యెహోవా అన్యజనులందరి యెదుట మహోన్నతుడు, ఆయన మహిమ ఆకాశ విశాలమున వ్యాపించియున్నది.

## 58వ కీర్తన (2+3+4+2 = 11 వ.)

**అంశం : భక్తిహీనులగు నీతిలేని న్యాయాధిపతులు, న్యాయము తీర్చు దేవుడు - నీతిమంతులు, వారి ఫలము**

**సందర్భము :** దావీదు కాలములో నీతి లేని న్యాయాధిపతులు, భక్తిహీనులుగా నున్నవారు సౌలు మరియు అబ్షాలోము. **1దిన 18:14-17వ.** దావీదు ఇశ్రాయేలీయులందరి మీద రాజైయుండి తన జనులందరికిని నీతిన్యాయములను జరిగించుచుండగా దావీదు యొక్క కుమారులు రాజునకు సహాయులై యుండిరి. అనగా ఉపన్యాయాధిపతులుగా నుండిరి కాబోలు. **2సమూ 15:1-8వ.** అబ్షాలోము ఒక రథమును గుఱ్ఱములను సిద్ధపరిచి, తన యెదుట పరుగెత్తుటకై యేబదిమంది బంటులను ఏర్పరచుకొనెను. ఉదయమే లేచి బయలుదేరి పట్టణము యొక్క గుమ్మపు మార్గమందు ఒక తట్టున నిలిచి, రాజుచేత తీర్పునొందుటకై వ్యాజ్యెమాడువారెవరైన వచ్చియుండగా అబ్షాలోము నీ వ్యాజ్యెము సరిగా న్యాయముగా ఉన్నది గాని దాని విచారించుటకై రాజునొద్ద ఒకడును లేడని చెప్పి నేను ఈ దేశమునకు న్యాయాధిపతినై యుండిన సరిగా న్యాయము తీర్చుదునని చెప్పుచు వచ్చెను. తీర్పు నొందుటకై రాజునొద్దకు వచ్చిన ఇశ్రాయేలీయులకందరికి అబ్షాలోము ఈ ప్రకారము చేసి ఇశ్రాయేలీయుల నందరిని తన తట్టు త్రిప్పుకొనెను.

**కాలము:** అబ్షాలోము కాని, మరి ఏ ఇతర ఉప న్యాయాధిపతులు కాని సరిగా లేనప్పుడు వ్రాసియుండవచ్చును. ఎప్పుడు ఈ కీర్తన వ్రాయబడినదో ఖచ్చితముగా చెప్పలేము.

**1-2వ. అధిపతులు చెడుతనము:** అధిపతులారా, మీరు నీతిననుసరించి మాటలాడుదు రన్నది నిజమా? నరులారా . . . సౌలు కాని, అబ్షాలోము కాని తాము పాలించిన కాలములో నీతిని అనుసరించి తీర్పుతీర్చనవారు కారు. వారు హృదయ పూర్వకముగా చెడుతనము జరిగించుచు, దేశమందు బలాత్కారము జరిగించుచుండిరి.

**3-5వ. భక్తిహీనులు విపరీత బుద్ధి: 3వ.** వారు తల్లి కడుపున పుట్టినది మొదలుకొని భక్తిహీనులై విపరీత బుద్ధి కలిగియుందురని, పుట్టిన తోడనే అబద్ధములాడుచు తప్పిపోయిరని చెప్పుచున్నాడు. **సంఖ్యా 23:19; హెబ్రీ 6:18; తీతు 1:3** లలో దేవుడు అబద్ధమాడజాలని, అబద్ధమాడనేరనివాడని చెప్పబడినది. అలాగే **యెషయా 63:8** లో తన పిల్లలు అబద్ధమాడనేరనివారని చెప్పుచున్నాడు. **4-5వ.** దావీదు అబ్షాలోమును బాల్యమునుండి హెచ్చరించినను తనకు వినబడకుండునట్లు, చెవి మూసికొనునట్టి చెవిటి పాము, విషము గల నాగుపాము వలె అబ్షాలోము ఉండెనని తలంచగలము. పాము సాతానుకు సాదృశ్యము. కనుక **యోహాను 8:44** లో, మీరు మీ తండ్రియగు అపవాది సంబంధులు; మీ తండ్రి దురాశలు నెరవేర్చగోరుచున్నాడు. ఆది నుండి వాడు నరహంతకుడైయుండి సత్యమందు నిలిచినవాడు కాడు; వానియందు సత్యమే లేదు; వాడు అబద్ధమాడునప్పుడు తన స్వభావము అనుసరించియే మాటలాడును; వాడు అబద్ధికుడును అబద్ధమునకు జనకుడునై యున్నాడు. కనుక అబద్ధమాడువారు ఇంకను సాతాను వశమున ఉన్నారని గుర్తించాలి.

**6-9వ. భక్తిహీనులకు ప్రతిదండన: 6వ.** దేవా, వారి నోటిపండ్లను విరుగగొట్టుము. 1) యెహోవా కొదమ సింహముల కోరలను ఊడగొట్టుము అని దావీదు ఎవరి విషయమై ప్రార్థించెనో చెప్పలేము. అబ్షాలోము విషయమై అలాగు చేయలేదు. మనమైతే ఎవరి విషయమైనను ఆలాగు ప్రార్థించక నీతిగల న్యాయాధిపతియైన ప్రభువుకు సమస్తము అప్పగించవలెను. **7-8వ.** దేవుడే 2) పారు నీళ్లవలె, 3) కరిగిపోయిన నత్తవలె, 4) తునాతునకలైన బాణము వలె, 5) సూర్యుని చూడని గర్భస్రావమువలె, భక్తిహీనులగువారిని గతించిపోవునట్లు చేయును. **9వ.** 6) పోయిమీద కుండలకు సెగ తగలకుమునుపే పచ్చిదైన ఉడికినదైన ఆయన నెగరగొట్టినట్లు భక్తిహీనులను ఎగురకొట్టగలడు.

**10-11వ. న్యాయము తీర్చు దేవుడు నీతిమంతులకిచ్చు ఫలితము:** భక్తిహీనులకు ప్రతిదండన కలుగగా నీతిమంతులు చూచి సంతోషించుదురు. కావున నిశ్చయముగా నీతిమంతులకు ఫలము కలుగుననియు, నిశ్చయముగా న్యాయము తీర్చు దేవుడు లోకములో నున్నాడని మనుష్యులు ఒప్పుకొందురు.

## 59వ కీర్తన (5+4+4+4 = 17 వ.)

**అంశం : ఈ కీర్తన పీఠికలో ఉన్నట్లు దావీదును చంపుమని సౌలు పంపిన శత్రువులు ఇంటి యొద్ద పొంచియున్నప్పుడు దావీదు చేసిన ప్రార్థన**

**సందర్భము : 1సమూ 19:11-12.** ఉదయమున అతని చంపవలెనని పొంచియుండి దావీదును పట్టుకొనుటకై సౌలు అతని యింటికి దూతలను పంపగా దావీదు భార్యయైన మీకాలు ఆ రాత్రి నీ ప్రాణము నీవు దక్కించుకొంటివి గాని రేపు నీవు చంపబడుదువని చెప్పి కిటికీగుండ దావీదును (బహుశా రాత్రివేళ) దింపగా అతడు తప్పించుకొని పారిపోయెను. ఉదయమున వచ్చినవారు సాయంకాలమున మరల వచ్చి కుక్కలవలె మొరుగుదురని వారి బారినుండి తనను కాపాడుమని ప్రార్థించుచున్నాడు (**1-5వ.**) దేవుడు తనను కాపాడినాడని నిరీక్షణతో (**6-9వ.**) శత్రువులను నిర్మూలము చేయుమని ప్రార్థించాడు (**11-13వ.**) తనకు దేవుని కాపుదలను గూర్చి దేవుని కీర్తించుచున్నాడు (**14-17వ.**). సెలా అను పదములు 5వ. 13వ. తరువాత ఉన్నందున 5,8,4 వచనములుగా విడగొట్టవచ్చును. రెండవ భాగమును 4, 4 వచనములుగా విడగొట్టి ధ్యానించవచ్చును (5+4+4+4 = 17 వ.).

**1-5వ. శత్రువు ద్వారా ఆపదలో ప్రార్థన: 1-2వ.** బలవంతులగు శత్రువుల చేతిలో నుండి తప్పింపుమని ప్రార్థన - **1-2వ.** నా దేవా అనుట దేవునికి దావీదుకు గల సన్నిహిత సంబంధము. నా శత్రువుల చేతిలోనుండి నన్ను తప్పింపుమని తన మీద పడువారికి చిక్కకుండ నన్ను ఉద్ధరించుమని ప్రార్థించుచున్నాడు. **3-5వ.** దావీదునందు ఏ అక్రమమును లేకున్నను ప్రాణము తీయవలెనని పొంచియున్న శత్రువులు, పాపము చేయువారు ప్రాణము తీయవలెనని పొంచియున్నందున వారి చేతిలోనుండి, రక్తాపరాధుల

చేతిలో నుండి నన్ను రక్షింపుమని ప్రార్థించుచున్నాడు. యెహోవా దోషము బట్టి కాదు, నా పాపముబట్టి కాదు అనుటలో దావీదు సౌలు విషయములో ఏ పాపము చేయలేదు. ఈ విషయములో దావీదు మనకు ఎంతో మాదిరి. శత్రువగు సౌలు రాజు కనుక బలవంతుడే. ఊరకయే బలవంతుడగు సౌలు దావీదుపైని పోగుబడియున్నాడు. నాయందు ఏ అక్రమము లేకున్నను వారు పరుగులెత్తి సిద్ధపడుచున్నారు. నన్ను కలిసికొనుటకై మేల్కొనుము. యెహోవా సైన్యములకధిపతియని జ్ఞాపకము చేసికొనుచున్నాడు. కనుక అధిక ద్రోహులగు సౌలు వంటివారిని ఎవరిని కనికరింపక శిక్షించుటకై మేల్కొనుమని ప్రార్థించుచున్నాడు.

**6-9వ. దేవుడు తన కృపలో దావీదును కాపాడుట: 6-7వ.** కత్తులవంటి మాటలు వెళ్లగ్రక్కు శత్రువు. సాయంకాలమున వారు మరల వచ్చెదరు. కుక్కవలె మొరుగుచు పట్టణము చుట్టు తిరుగుదురు. వినువారెవరును లేరనుకొని వారు తమ నోట నుండి మాటలు వెళ్ళగ్రక్కుదురు. వారి పెదవులలో కత్తులున్నవి. **8-10వ.** దేవుడు తన కృపలో దావీదును కాపాడుట. యెహోవా, నీవు వారిని చూచి నవ్వుదువు. అన్యజనులందరిని నీవు అపహసించుదువు. నా బలమగు దేవా, నీ కొరకు నేను కనిపెట్టుకొనుచున్నాను అనగా దేవుడు తన ఉన్నతమైన దుర్గమై కాపాడునని నమ్మిక కలిగియున్నాడు. మన ఆపదలలో ఇటువంటి నమ్మకమే కలిగియుందుము గాక.

**10-13వ. శత్రువులను నిర్మూలము చేయుమని ప్రార్థన:10-11వ.** నా దేవుడు తన కృపలో నన్ను కలిసికొనెను అనగా జయమిచ్చాడు కనుక నా కొరకు పొంచియున్న వారికి సంభవించిన దానిని దేవుడు నాకు చూపించును. వారిని చంపకుము. ఏలయనగా నా ప్రజలు దానిని మరచిపోదురేమో. మా కేడెమైన ప్రభువా, నీ బలముచేత వారిని చెల్లాచెదురు చేసి అణగగొట్టుము. **12-13వ.** వారి పెదవుల మాటలను బట్టి వారి నోటి పాపమునుబట్టి వారు పలుకు శాపములను బట్టి అబద్ధములను బట్టి వారు తమ గర్వములో చిక్కబడుదురు. కోపము చేత వారిని నిర్మూలము చేయుము. వారు లేకపోవునట్లు వారిని నిర్మూలము చేయుము. దేవుడు యాకోబు వంశమును ఏలుచున్నాడని భూదింగతముల వరకు మనుష్యులు ఎరుగునట్లు చేయుము.

**14-17వ. కోటగా ఉండి కాపాడిన దేవుని బలమును గూర్చి, కృపను గూర్చి ఉత్సాహగానము చేయుట: 14-15వ.** సాయంకాలమున వారు మరల వచ్చెదరు. కుక్కవలె మొరుగుచు పట్టణము చుట్టు తిరుగుదురు. తిండి కొరకు వారు ఇటుఅటు తిరుగులాడుదురు. తృప్తి కలుగని యెడల రాత్రి అంతయు ఆగుదురు. **16-17వ.** నీవు ఎత్తయిన కోటగా ఉన్నావని, ఆపద్దినమున నాకు ఆశ్రయముగా ఉన్నావని, నీ బలమును గూర్చి ఉదయమున నీ కృపను గూర్చి ఉత్సాహ గానము చేసెదను అన్నాడు. దేవుడు ఎత్తయిన కోటగాను కృపగల దేవుడుగా ఉన్నాడని నిన్నే కీర్తించెదనని రెండవమారు పలుకుచున్నాడు.

## ౬౦వ కీర్తన (4+5+3 = 12 వ.)

**అంశం – సందర్భము: 8వ.** లో ఎదోము మీద నా చెప్పు విసరివేయుదును అన్నందున **2సమూ 8:12–14వ.** లో ఎదోముపై యుద్ధమునకు వెళ్లినపుడు రచించినది. దావీదు ఉప్పులోయలో సిరియనులగు పదునెనిమిది వేలమందిని హతము చేసి తిరిగి రాగా అతని పేరు ప్రసిద్ధమాయెను. (అతడు సిరియనులను, మోయాబీయులను, అమ్మోనీయులను, ఫిలిష్తీయులను, అమాలేకీయులను, హదదెజెరు అను సోబారాజును, పట్టుకొను సమయమున ఎదోమీయులు తిరుగబడిరి). కనుక ఎదోము దేశమందు అతడు దండునుంచెను. ఎదోమీయులు దావీదునకు దాసులు కాగా, దాసుడు యజమాని చెప్పులు విప్పాలి, పాదములు కడగాలి. ఆ సమయములో విప్పబడిన చెప్పులు యజమాని వేసిరివేయగా మరొక దాసుడు పట్టుకొని తుడిచి శుభ్రపరచి భద్రపరచాలి. కనుక **8వ.** ఎదోము మీద నా చెప్పు విసిరి వేయుదును అన్నందున **2సమూ 12–14** లో ఎదోముపై యుద్ధమునకు వెళ్ళునపుడు రచించినదని తలంచగలము.

**1–4వ. దేవుడు ఇశ్రాయేలును విడనాడి చెదరగొట్టగా బాగుచేయుమని ప్రార్థన.** **1వ.** దేవా, నీవు మమ్ము విడనాడియున్నావు. మమ్ము చెదరగొట్టియున్నావు. దావీదు ఉత్తర దేశములను జయించినపుడు ఎదోమీయులు తిరుగబటి ఇశ్రాయేలును చెదరగొట్టిరి. కనుక నీవు కోపపడితివి అని దావీదు అంటున్నాడు. **2–3వ.** నీవు దేశమును కంపింపజేసియున్నావు. దానిని బద్దలు చేసియున్నావు. అది వణకుచున్నది. అది పడిపోయిన చోటు బాగుచేయుము. నీ ప్రజలకు నీవు కఠిన కార్యములు చేసి, తూలునట్టుగా చేసితివి అంటున్నాడు. **కీర్తన 59:13** కోపముచేత వారిని నిర్మూలము చేయుము, వారు లేకపోవునట్లు వారిని నిర్మూలము చేయుము అన్నాడు. మమ్ము మరల బాగుచేయుము అనగా ఎదోమీయుల నుండి కాపాడుము అంటున్నాడు. దేవుడు కాపాడి జయమిచ్చాడు. అందుకే **4వ.** లో సత్యము నిమిత్తము  ఎత్తిపట్టుటకై నీయందు భయభక్తులు గల వారికి నీవొక ధ్వజము (జయ సంకేతము) నిచ్చియున్నావు అన్నాడు.

**5–9వ. పలు పట్టణములపై విజయమిచ్చు దేవునికి ప్రార్థన, స్తుతి: 5వ.** నీ ప్రియులు విమోచింపబడునట్లు నీ కుడిచేత నన్ను రక్షించి నాకుత్తరమిమ్ము. **6–7వ.** తన పరిశుద్ధత తోడని దేవుడు మాట యిచ్చియున్నాడు. నేను ప్రహర్షించెదను. షెకెమును, సుక్కోతును, గిలాదును, మనష్షేను, ఎఫ్రాయిమును దేవుడు స్థిరపరిచాడు. యూదాను రాజదండముగా అనగా పాలకులుగా చేశాడు. **8వ.** పరిచయములో చెప్పినట్లు దాసులైన మోయాబు కాళ్లు కడుగుకొని ఎదోము మీద నా చెప్పు విసరివేయుదును అనగా ఎదోమీయులు చెప్పులు తుడిచి భద్రపరచు దాసులైరి. చెప్పులు/జోడులు సువార్త ప్రకటనకు, సిద్ధమనస్సుకు గుర్తు. సాతానుకు సాదృశ్యమైన ఫిలిష్తీయులు కూడా దాసులైరి. **9వ.** కోట గల పట్టణమగు ఎదోములోనికి నన్నెవడు నడిపించును? తోడుకొనిపోవును? అన్నందున ఎదోమీయుల ముఖ్య పట్టణము కోట గోడలు గల పట్టణము. ఎదోము మీదకు యుద్ధమునకు బయలుదేరు

సందర్భము. ఎదోము అనగా ఏశావు ఆహారమును, శరీరమును ప్రేమించినందున శరీరమను శత్రువుకు గురుతు. మోయాబు లోకమును ప్రేమించిన లోతు సంతానము కనుక శత్రువులలో గర్వము ప్రవేశింపగలదు. శరీరము, లోకము అను శత్రువులను జయించి మనకు దాసులుగా ఉంచుకోవాలి. లేనియెడల మనము గర్వించి ఆత్మీయముగా పతనము కాగలము.

**10-12వ. దేవుని వలన జయింతుమన్న విశ్వాసముతో ప్రార్థన చేయుట:**

**10-11వ.** దేవా, నీవు మమ్ము విడనాడియున్నావు గదా? దేవా, మా సేనలతో కూడ నీవు బయలుదేరుట మానియున్నావు గదా? మనుష్యుల సహాయము వ్యర్థము. శత్రువులను జయించుటకు మాకు సహాయము చేయుము అని ప్రార్థించుచున్నాడు. **12వ.** దేవుని వలన మేము శూర కార్యములు జరిగించెదము, మా శత్రువులను అణగద్రొక్కువాడు ఆయనే అను విశ్వాసముతో యుద్ధమునకు వెళ్లి **2సమూ 8:14** లో జయించాడు.

## 61వ కీర్తన (2+2+1+2+1 = 8 వ.)

**అంశం :** ఆత్మీయ జీవిత ఎదుగుదల / మేలులకై దేవునికి ప్రార్థన, స్తుతి

**సందర్భము : 6వ.** లో రాజునకు దీర్ఘాయువు కలుగచేయుదువు గాక అన్నందున దావీదు తన వృద్ధాప్యములో దేవుని సహాయము కొరకు చేసిన ప్రార్థన.

**1-2వ. ఆత్మీయ ఎదుగుదల కొరకు ప్రార్థన: 1వ.** దేవా, నా మొఱ్ఱ ఆలకింపుము, నా ప్రార్థనకు చెవియొగ్గుము. నా ప్రాణము తల్లడిల్లగా భూదిగంతములనుండి నీకు మొఱ్ఱపెట్టుచున్నాను. నేను ఎక్కలేనంత ఎత్తయిన కొండపైకి నన్ను ఎక్కించుము. ఆయనతో సహవాసము చేయుటను గూర్చి దావీదుగారి హృదయ ఆశ ఎంతో గొప్పది. మనమందరము అటువంటి ఆశనే కలిగియుండాలి. దేవునికి మొరపెట్టాలి.

**3-4వ. గతకాలములో చేయబడిన మేలులనుబట్టి దేవుని రెక్కలచాటున ఉండకోరుట:**
**3వ.** నీవు నాకు ఆశ్రయముగా నుండివి, శత్రువుల యెదుట బలమైన కోటగా నుంటివి. దావీదు చేసిన యుద్ధములన్నిటిలో శత్రువుల నుండి బలమైన దేవుడు కోటగా ఉండి ఆశ్రయమిచ్చిన సంగతిని, కాపాడిన సంగతిని జ్ఞాపకము చేసికొనుచున్నాడు. **4వ.** లో అందులకై యుగయుగములు దేవుని గుడారములో నివసింపకోరుచున్నాడు. నీ రెక్కల చాటున దాగుకొందును అంటున్నాడు. దేవుని రెక్కల క్రింద నున్న భద్రతను గూర్చి **రూతు2:12** లో ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా రెక్కల క్రింద సురక్షితముగా నుండునట్లు నీవు వచ్చితివి; ఆయన నీకు సంపూర్ణమైన బహుమానమిచ్చునని చెప్పబడినది (సెలా).

**5వ. మ్రొక్కుబడుల నంగీకరించి స్వాస్థ్యము అనుగ్రహించిన దేవుడు: 5వ.** దేవా, నీవు నా మ్రొక్కుబడులనంగీకరించి యున్నావు. నీ నామమునందు భయభక్తులు గలవారి స్వాస్థ్యము నీవు నాకనుగ్రహించియున్నావు. **రోమా 8:17** లో మనము పిల్లలమైతే

వారసులమని, అనగా దేవుని వారసులమని, క్రీస్తుతోకూడ మహిమ పొందుటకు, క్రీస్తుతోడి వారసురమని చెప్పబడినది. క్రీస్తు కలిగిన వాటన్నిటిని మనకనుగ్రహించాడు.

**6-7వ. రాజు కొరకు ప్రార్థన: 6వ.** రాజునకు దీర్ఘాయువు కలుగజేయుదువు గాక. అతని సంవత్సరములు తరతరములు గడుచుగాక. ఇందులో దావీదు తన కొరకు మాత్రమే కాక, నిరంతరము అనగా క్రీస్తు యొక్క నిరంతర రాజ్యపాలనను గూర్చి చెప్పుచున్నాడు. కనుక ఇది మెస్సీయ కీర్తనగా కూడా తలంచవచ్చును. **7వ.** దేవుని సన్నిధిని అతడు నిరంతరము నివసించుటకు, కాపాడుటకు అవసరమైనదేవుని కృపాసత్యములు అనుగ్రహించుమని ప్రార్థించుచున్నాడు.

**8వ. దేవునికి నిత్య స్తుతి: 8వ.** పైన వివరించిన దేవుని గొప్పతనములను బట్టి దినదినము మ్రొక్కుబడులను చెల్లించి దేవుని నామము నిత్యము కీర్తించెదనని చెప్పుచున్నాడు.

## 62వ కీర్తన (4+4+4 = 12 వ.)

**అంశం :** శత్రువుచే తరుమబడినపుడు కోట, దుర్గమైన దేవుని ఆశ్రయించి కృపను పొందుట.

**సందర్భము :** అపాయములో నున్నపుడు ఘనులయందు, బలత్కారులగు మనుష్యుల యందు, ధనమునందు నమ్మికయుంచి (**9,10వ.**) సహాయమునకు వారిని ఆశ్రయించ గలము. అది వ్యర్థమని, దుర్గము, కోటయైన దేవునినే ఆశ్రయించవలెనని (**5-8వ.**) ఈ కీర్తన సారాంశము. **4వ.లో** మీరందరు ఎన్నాళ్ళు ఒకని పడద్రోయ చూచుదురు? అతని ఔన్నత్యము నుండి అతని పడద్రోయుటకే వారు ఆలోచించుదురు అన్నందున సౌలు అతని వెంబడి మూడు వేలమంది దావీదును తరిమినపపుడు **1సమూ 27 అధ్యా.** లో సౌలు నుండి తప్పించబడిన సందర్భము, లేదా షిమీచే కాని, దోయేగుచే కాని, అబ్షాలోముచే తరుమబడిన సందర్భము కావచ్చును.

**1-2వ. దేవుని ఆశ్రయదుర్గముగా గలవాడు కదిలింపబడకుండుట: 1వ.** నా ప్రాణము దేవుని నమ్ముకొని మౌనముగా ఉన్నది. ఆయన వలన నాకు రక్షణ కలుగును. ఆయనే నా ఆశ్రయదుర్గము. ఆయనే నా రక్షణకర్త అన్నందున ఈ దేవుడు తనను నమ్మిన వారి ప్రాణాత్మ, దేహములను ముందుగా రక్షించువాడు. **రోమా 3:23** ప్రకారము, ఏ భేదము లేదు; అందరును పాపముచేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు. కాబట్టి నమ్మువారు ఆయన కృపచేతనే, క్రీస్తుయేసునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు. **2వ.** ఎత్తయిన నా కోట ఆయనే, నేను అంతగా కదలింపబడను. ఎన్నాళ్లు మీకు ఒకనిపైబడుదురు? అన్నందున ఆయన ఎత్తయిన కోట గనుక ఎట్టి శత్రువు నుండియైనను రక్షించుటకు సమర్థుడు.

**3-4వ. ఉన్నతమందున్న వారిని పడద్రోయుటకై ప్రయత్నించుట:** ఒరుగుచున్న గోడను పడబోవు కంచెను ఒకడు పడద్రోయునట్లు మీరందరు ఎన్నాళ్ళు ఒకని పడద్రోయ

చూచుదురు? అతని ఔన్నత్యము నుండి అతని పడ(ద్రోయుటకే వారు ఆలోచించుదురు. అబద్ధమాడుట వారికి సంతోషము. దావీదును రాజుగా దేవుడు అభిషేకించగా సౌలు అబద్ధపు మాటలతో ప్రజలను తనవైపు త్రిప్పుకొని మూడు వేలమందితో దావీదును తరుముచుండియు **1సమూ 24:20-22** లో సౌలు దావీదా నాయనా, నీవు ఆశీర్వాదము పొందుదువు గాక. నీవు ఘనకార్యములను పూనుకొని విజయము నొందుదువు గాక అని దావీదుతో అనెను. అప్పుడు దావీదు తన మార్గమున వెళ్లిపోయెను. సౌలును తన స్థలమునకు తిరిగి వచ్చెను. సౌలు నోటితో ఈ శుభ వచనములు పలికినను అంతరంగములో ద్వేషించి తరుముట మానలేదు.

**5-6వ. దేవునియందు నిరీక్షణయుంచుట: 5వ.** నా ప్రాణమా, దేవుని నమ్ముకొని మౌనముగా నుండుము. ఆయన వలననే నాకు నిరీక్షణ కలుగుచున్నదని మొదటి వచనములో పలికిన మాటనే మరొకసారి స్థిరపరచుట గమనించగలము. ఈసారి రక్షణతో కూడా నిరీక్షణ కలుగుచున్నదని చెప్పుచున్నాడు. **6వ.** ఆయనే నా ఆశ్రయదుర్గము, నా రక్షణాధారము, నా ఎత్తయిన కోట ఆయనే, నేను కదలింపబడను అనగా ఏ మాత్రము కదలింపబడనని చెప్పుచున్నాడు.

**7-8వ. రక్షణకు, మహిమకు బలమైన ఆశ్రయమగు దేవుని యందే నమ్మికయుంచవలెనని చెప్పుట: 7వ.** ఈసారి నా రక్షణకు నా నిరీక్షణకు మాత్రమే కాక, నా మహిమకు దేవుడే ఆధారమని చెప్పుచున్నాడు. రక్షణ గతకాలములో జరిగినది, నిరీక్షణ ప్రస్తుత కాలములోకలిగియున్నాము. **రోమా 3:23** లో పాపమునుబట్టి పోగొట్టుకొనిన దేవుని మహిమను అంత్యకాలములో పొందుదుమని చెప్పుచున్నాడు. ఆ నిరీక్షణను బట్టియే నా బలమైన ఆశ్రయ దుర్గము నా ఆశ్రయము దేవునియందే యున్నదని చెప్పుచున్నాడు. **8వ.** ప్రకారము, జనులారా, యెల్లప్పుడు ఆయనయందు నమ్మికయుంచుడి, ఆయన సన్నిధిని మీ హృదయములు కుమ్మరించుడి అనగా ప్రార్థించుడి అని చెప్పుచున్నాడు. దేవుడు మనకు ఆశ్రయము అని ఖచ్చితముగా చెప్పుచున్నాడు.

**9-10వ. ఘనులు, బలాత్కారులయందు నమ్మికయుంచక, దోచుకొనుటయందు, ధనము హెచ్చుగుటయందు లక్ష్యపెట్టకుండుట:**

అల్పులు, ఘనులైనవారు బలాత్కారులైనవారు, ధనము హెచ్చినవారు, ధనమును దోచుకొనువారు అందరు మాయస్వరూపులు. త్రాసులో వారందరు తేలిపోవు వట్టి ఊపిరికన్న ఆలకనగా ఉన్నారు. కనుక వారియందు నమ్మికయుంచకూడదని చెప్పుచున్నాడు.

**11-12వ. బలముగల దేవుడు కృపచూపు దేవునియందు నిరీక్షణ కలిగియుండుట:** బలము తనదని ఒకమారు దేవుడు సెలవిచ్చెను. రెండు మారులు ఆ మాట నాకు వినబడెను. **ఆది 17:1వ.** అబ్రాము తొంబదివ తొమ్మిది యేండ్ల వాడైనప్పుడు యెహోవా అతనికి ప్రత్యక్షమై, నేను సర్వశక్తిగల దేవుడను; నా సన్నిధిలో నడుచుచు నిందారహితుడవై యుండుము. **12వ.** ప్రభువా, మనుష్యులకందరికి వారి వారి క్రియల చొప్పున నీవే

ప్రతిఫలమిచ్చుచున్నావు. కాగా కృప చూపుటయు నీది. **2కొరింథీ 5:10వ.** ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున, అవి మంచివైనను సరే, చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మనమందరమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్ష్యము కావలయును. **ప్రకటన 20:11-12వ.** మరియు ధవళమైన మహా సింహాసనము దానియందు ఆసీనుడైయున్న యొకనిని చూచితిని; భూమ్యాకాశములు ఆయన సముఖము నుండి పారిపోయెను; వాటికి నిలువ చోటు కనబడకపోయెను. **12వ.** మరియు గొప్పవారేమి కొద్దివారేమి మృతులైనవారందరు ఆ సింహాసనము ఎదుట నిలువబడియుండుట చూచితిని. అప్పుడు గ్రంథములు విప్పబడెను; మరియు జీవగ్రంథమను వేరొక గ్రంథము విప్పబడెను; ఆ గ్రంథములయందు వ్రాయబడియున్న వాటినిబట్టి తమ క్రియల చొప్పున మృతులు తీర్పు పొందిరి. చివరలో కృప చూపుటయు నీది అన్నందున దేవుని కృపచేతనే రక్షణ, నిరీక్షణ, మహిమ, శత్రువు నుండి కాపాడబడుట అని గుర్తింతము.

## 63వ కీర్తన (2+3+3+3 = 11 వ.)

**అంశం :** బలము, ప్రభావము గల ఉత్తముడగు దేవుని స్తుతించుట

**సందర్భము : 9వ.** నా ప్రాణమును నశింపజేయవలెనని వారు దాని వెదకుచున్నారు, రాజు దేవుని బట్టి సంతోషించును అన్నందున రాజయిన దావీదు అపాయములో నున్నాడు. **2వ.** నీళ్లు లేక యెండియున్న దేశమందు నా ప్రాణము నీ కొరకు తృష్ణకొనియున్నది. నీ మీది ఆశచేత నిన్ను చూడవలెనని నా శరీరము కృశించుచున్నది అన్నందున అరణ్యములో పరుగెత్తి, పరుగెత్తి అలసిపోయి దప్పిక, ఆకలిగొన్నాడు. సౌలుచే, అబ్షాలోముచే తరుమబడి ప్రాణాపాయములో నుండినను ఇప్పుడు రాజుగా నున్నందున అబ్షాలోముచే తరుమబడిన సందర్భమున ఈ కీర్తన వ్రాసి యుండవచ్చును. ఆకలిని, దప్పికని తీర్చుట **2సమూ 16:2** రాజు ఇవి ఎందుకు తెచ్చితివని సీబాను అడుగగా సీబా గాడిదలు రాజు ఇంటివారు ఎక్కుటకును, రొట్టెలును, అంజూరపు అడలును పనివారు తినుటకును, ద్రాక్షారసము అరణ్యమందు అలసట నొందినవారు త్రాగుటకును తెచ్చితిననగా ... **2సమూ 17:28-29** అరణ్యమందు జనులు అలసినవారై ఆకలి, దప్పిగొని యుందురని తలంచి, పరపులు, పాత్రలు, కుండలు, గోధుమలు, యవలు పిండి వేచిన గోధుమల కాయ ధాన్యములు చిక్కుడుకాయలు పేలాలు తేనె వెన్న గొఱ్ఱలు, జున్ను ముద్దలు దావీదును అతని యొద్దనున్న జనులును భోజనము చేయుటకై తీసికొనివచ్చిరి.

**1-2వ. దేవుని బలమును, ప్రభావము చూడవలెనని ఆశతో కనిపెట్టియుండుట:** దేవా, నా దేవుడవు (**Elohim, Eli**) నీవే, వేకువనే నిన్ను వెదకుదును. నీ బలమును నీ ప్రభావమును చూడవలెనని పరిశుద్ధాలయమందు నేనెంతో ఆశతో నీ తట్టు కనిపెట్టి యున్నాను, నీళ్లులేక యెండియున్న దేశమందు నా ప్రాణము నీ కొరకు తృష్ణగొని యున్నది.

నీ మీద ఆశచేత నిన్ను చూడవలెనని నా శరీరము కృశించుచున్నది. వేకువనే రాత్రిజాముల యందు, నా జీవిత కాలమంతయు ధ్యానించుటకు, ధ్వనిచేయుటకు, ఉత్సహించు పెదవులతో నోరుతో దేవుని గూర్చిన గానము చేయుటకు, స్తుతించుటకు, చేతులెత్తుటకు, శరీరము ప్రాణము సిద్ధముగా నున్నవాడుగా దావీదును చూచుచున్నాము. ప్రాణమును నశింపజేయవలెనని ఆయనను అబ్షాలోము వంటివారు వెదకుచున్నను ఆయన మనసు పరిశుద్ధుడైన దేవుని ప్రభావమును చూడవలెనని ఆశించుట గమనించతగినది. పరిశుద్ధుడైన దేవుని బలము ద్వారా ఈ ప్రాణాపాయము నుండి తప్పించబడ ఆశించు చున్నాడు.

**3-5వ. ఉత్తముడగు దేవుని ఉత్సహించు పెదవులతో స్తుతించుట: 3-4వ.** నీ కృప జీవముకంటె ఉత్తమము, నా పెదవులు నిన్ను స్తుతించును. దావీదుగారి జీవము అపాయములో నున్నది. తన జీవము / ప్రాణము విషయమై చింతించక దేవుని కృప విషయమై ఆలోచించుచున్నాడు. కృపచేత కలిగిన ఆత్మ రక్షణ, శరీర రక్షణను గూర్చి తన మంచము మీద జ్ఞాపకము చేసికొని రాత్రిజాముల యందు దేవుని ధ్యానించుచు క్రొవ్వు మెదడు దొరికినట్లుగా తన శరీర, ప్రాణములో తృప్తిపొందుట గమనించతగినది. **5వ.** అలాగే మనమును ఉత్సహించు పెదవులతో, నోటితో ఉత్తముడైన దేవుని గూర్చి గానము చేయవలెనని నేర్చుకొందము.

**6-8వ. సహాయకుడై రెక్కల చాటున ఆదుకొని దేవునికి జీవితకాలమంత స్తుతించుట: 6వ.** కాగా నా జీవిత కాలమంతయు నేనీలాగున నిన్ను స్తుతించెదను. నీ నామమునుబట్టి నా చేతులెత్తెదను. **7వ.** నీవు నాకు సహాయకుడవై యుంటివి. నీ రెక్కల చాటున శరణుజొచ్చి ఉత్సాహధ్వని చేసెదను. **8వ.** నా ప్రాణము నిన్ను అంటి వెంబడించుచున్నది. కుడిచేయి నన్ను ఆదుకొనుచున్నది. **రూతు 2:12** లో ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా రెక్కల క్రింద సురక్షితముగా నుండునట్లు నీవు వచ్చితివి; ఆయన నీకు సంపూర్ణమైన బహుమానమిచ్చునని చెప్పబడినందున దావీదు తన తల్లుల్లో ఒకరితో ప్రభువు చెప్పినట్లు దేవుని అంటి వెంబడించుచు, రెక్కల క్రిందకు వచ్చుట గమనించదగినది. అందులకే తన జీవిత కాలములో వచ్చిన అపదలన్నిటిలో నుండి తప్పించబడి బహుమానము పొంద దేవుని సన్నిధికి వెళ్ళెను.

**9-11వ. రాజును నశింపజేయ కోరువారి దుస్థితి: 9-10వ.** నా ప్రాణమును నశింపజేయవలెనని వారు దాని వెదకుచున్నారు. వారు భూమి క్రిందిచోట్లకు దిగిపోవుదురు. బలమైన ఖడ్గమునకు అప్పగింపబడుదురు. నక్కల పాలగుదురు. అలాగే సౌలు బలమైన తన కత్తిమీద తానే పడి చనిపోయాడు. అబ్షాలోము బలమైన యోవాబు బాణమునకు అప్పగింపబడ్డాడు. **11వ.** దావీదురాజు దేవుని బట్టియే తన జీవిత కాలములో అతిశయించి, సంతోషించగలిగాడు.

## 64వ కీర్తన (2+2+2+2+2 = 10 వ.)

**అంశం - సందర్భము: 3-4వ.** లో ఒకడు కత్తికి పదునుపెట్టునట్లు వారు తమ నాలుకలకు పదునుపెట్టుదురు. యథార్థవంతులను కొట్టవలెనని చాటైన స్థలములలో చేదుమాటలను బాణములుగా సంధించుదురు. వారు భయమేమియు లేక అకస్మాత్తుగా వారిని కొట్టెదరు అన్నందున **1సమూ 22 అధ్యా.** లో దోయేగు దావీదు రాజు కాకమునుపు విమర్శించిన మాటలైనను కావచ్చును. **2సమూ 15-17 అధ్యా.** అహితోపెలు దావీదును గూర్చి అబ్షాలోముకు చెప్పిన చెడు మాటల సందర్భమైనను కావచ్చును. లేదా **2సమూ 16 అధ్యా.** లో షిమి దావీదుకు శత్రువై మాటలతో దావీదును దూషించి కీడుచేసిన సందర్భముగా తలంచవచ్చును.

**1-2వ. శత్రువు చేయ కీడునుండి కాపాడుమని ప్రార్థించుట: 1వ.** దేవా, నేను మొఱ్ఱపెట్టగా నా మనవి ఆలకింపుము. శత్రుభయము నుండి నా ప్రాణమును కాపాడుము. రాజు మీద ప్రజలు అల్లరి పలుకులు పలుకుట ఎంత ఘోరము. అటువంటి సందర్భము లందు మనమును ఎలుగెత్తి మొరపెట్టవలెనని నేర్చుకొందము. **2వ.** కీడు చేయువారి కుట్ర నుండి, దుష్టక్రియలు చేయువారి అల్లరి నుండి నన్ను దాచుమని చెప్పుట దేవుడే దాచాలని కోరాడు కాని తాను కీడు చేయ తలంచలేదు. దేవుని నమ్ముకొనిన మనమును ఎల్లప్పుడు దేవుని మీదనే ఆధారపడాలి.

**3-4వ. భయమేమియు లేక మాటలతో గాయపరచినవారు: 3వ.** ఒకడు కత్తికి పదునుపెట్టునట్లు నాలుకలకు పదును పెట్టుదురు. షిమి దోయేగు వంటివారు నేరుగా మాటలతో దావీదును గాయపరచిరి. **4వ.** యథార్థవంతులను కొట్టవలెనని చాటైన స్థలములలో చేదు మాటలను బాణములుగా సంధించుదురు. వారు భయమేమియు లేక అకస్మాత్తుగా వారిని కొట్టెదరు. అహితోపెలు వంటివారు రహస్యముగా అబ్షాలోముకు సలహా ఇచ్చారు.

**5-6వ. దురాలోచనలు యోచించుకొనుట: 5వ.** వారు చాటుగా దురాలోచన యోచించి దృఢపరచుకొని మనలను ఎవరు చూచెదరని చెప్పుకొందురు. **6వ.** వారు దుష్టక్రియలను తెలిసికొనుటకు ప్రయత్నింతురు. వెదకి వెదకి ఉపాయము సిద్ధపర్చుకొందురు. ప్రతివాని హృదయాంతరంగము అగాథము.

**7-8వ. వారి నాలుకను బట్టి దేవుడు వారిని కూల్చుట: 7వ.** దావీదును బాధించినవారిని దేవుడు బాణములతో కొట్టగా వారు ఆకస్మికముగా గాయపరచబడి కూలెదరని విశ్వసించాడు. కాని తాను గాయపరచవలెనని తలంచలేదు. వారు కూలుటకు వారి నలుకే కారణమని గుర్తింతము.

**9-10వ. యథార్థ హృదయులందరు అతిశయిల్లి సంతోషింతురు: 9వ.** మనుష్యులందరు భయముతో దేవుని కార్యములను తెలియజేయుదురు. ఆయన కార్యములు చక్కగా యోచించుకొందురు. **10వ.** నీతిమంతులు యెహోవాను బట్టి సంతోషించుదురు, ఆయన శరణుజొచ్చి అతిశయిల్లుదురు.

## **65వ కీర్తన** (4+4+2+3 = 13 వ.)

**అంశం – సంధర్భము:** ఇది దావీదు వ్రాసిన కీర్తన. **7–8వ.** లో జనముల అల్లరిని చల్లార్చువాడు, నీ సూచక క్రియలను చూచి దిగంత నివాసులు భయపడుదురు అన్నందున రాజైన దావీదునకు రాజ్యములో జనములు తిరుగబడి అల్లరిచేసిరి కాబోలు. దావీదు విషయము జనములు భరింపరాని దోషములు మోపి చేసిన అల్లరిని దేవుడు అణచివేయగా దావీదు స్తుతించి మ్రొక్కుబడి చెల్లించాడు. భూమిని వర్షమును గూర్చి పలుకుచున్నందున పాపమునుబట్టి దేవుడు వర్షమును పంపక కరువు కలిగి దావీదు ప్రార్థించగా భూమి మీద వర్షము కురిసి భూమి ఫలించగా దేవుని స్తుతించాడని తలంచవచ్చును. ఇది అబ్షాలోము తిరుగుబాటు చేసిన సందర్భము కావచ్చును. ఆశ్రయమైనవాడా అని **5వ.** లో సముద్రము ఘోషను వాటి తరంగముల ఘోషను అణచువాడు అని, జనముల అల్లరిని చల్లార్చువాడు అని అన్నందున రాజ్యములో చెలరేగిన జనముల అల్లరిని అణచుట అని దేవుడు చేసిన సూచక క్రియ కొరకు **5–8వ.** లో స్తుతించాడు. దేవుడు భూమిని దర్శించి వర్షము ద్వారా **9–12వ.** నీలో ఆశీర్వదించినందున రక్షణకర్తయైన దేవుని స్తుతించుట.

**1–4వ. భరింపరాని దోషములు మోపగా మౌనముగా ఉండి ప్రార్థించి, పాపక్షమాపణ పొంది దేవుని స్తుతించుట:** నామీద మోపబడిన దోషములు భరింపజాలనివి. మా అతిక్రమముల నిమిత్తము నీవే ప్రాయశ్చిత్తము చేయుదువు అని **3వ.** లోను, ఈ దేవుడు రక్షణకర్తయైన దేవుడు అని **5వ.** లో అన్నందున మానవులు పాపక్షమాపణ కొరకు ప్రార్థించి, రక్షించబడాలని తలంచవచ్చును. దావీదు రాజైనను, రాజనగరులో నివసించుట ధన్యత అనక నీ మందిర ఆవరణములలో నివసించునట్లు నీవు ఏర్పరచుకొని చేర్చుకొనువాడు ధన్యుడు అని మందిర ఆవరణములోని మేలుచేత మేము తృప్తి పొందెదము అని **4వ.** లో అన్నందున మందిర ప్రాముఖ్యతను దావీదువలె మనము గుర్తించాలని తలంచాలి. నీ ఆవరణములలో నివసించునట్లు నీవు ఏర్పరచుకొని చేర్చుకొనువాడు ధన్యుడు అన్నందున అటువంటి ఏర్పాటును కోరుకున్నాడని తలంచవచ్చును. దేవా, సీయోనులో మౌనముగా నుండుట నీకు స్తుతి చెల్లించుటే. నీకు మ్రొక్కుబడి చెల్లింపవలసియున్నది అన్నందున దావీదుకు దేవుడు చేసిన మేలులనుబట్టి మ్రొక్కుబడి, చెల్లింపులకు పాత్రుడని గుర్తించాడు. **2వ.** ప్రార్థన ఆలకించువాడా, అన్నందున చెవులుండి ప్రార్థనలను వినలేని విగ్రహములవలె కాక ఈ దేవుడు తన ప్రార్థన విని జవాబిచ్చాడని సర్వ శరీరులు ఆయన యొద్దకు వచ్చెదరని చెప్పుచున్నాడు. నీవు ఏర్పరచుకొని చేర్చుకొనువాడు ధన్యుడు అన్నందున దేవుని ఏర్పాటు ఎంత గొప్పదో దావీదు గుర్తించాడు.

**5–8వ. భీకర క్రియలచేత ఉత్తరమిచ్చి, సూచక క్రియలు చేసి జనముల అల్లరిని చల్లార్చు దేవుడు:** మాకు రక్షణకరమైన దేవా, భూదిగంతముల నివాసులకందరికిని, దూర సముద్రము మీదనున్న వారికిని ఆశ్రయమైనవాడు కనుక ఆయన (సర్వాంతర్యామియై మన సమస్యలను తీర్చువాడని **omni-present**) తెలిసికొనుచున్నాము. **6వ.** లో బలమునే

నడికట్టుగా కట్టుకొనినవాడై తన శక్తిచేత పర్వతములులను స్థిరపరచుననుట ఆయన శక్తిని చూపుచున్నది. (సర్వశక్తిమంతుడు – **omni-potent**) **7వ.** ఆయనే సముద్రముల మీదను వాటి తరంగముల ఘోషను అణచువాడు. జనముల అల్లరిని చల్లార్చువాడు (సర్వజ్ఞుడు – **omnitiant**) రాజ్యములో చెలరేగిన అల్లరిని చల్లార్చినవాడని చెప్పుచున్నాడు. **8వ.** నీ సూచక క్రియలను చూచి దిగంత నివాసులును భయపడుదురు. ప్రతి క్రియ దేవుడు మన జీవితములో దేనినో సూచించు క్రియ అని ఉదయ సాయంత్రముల ఉత్పత్తుల ద్వారా అనగా మన జీవితములో జరుగు ప్రతి కార్యముల ద్వారా దేవుడు సంతోషభరితులనుగా చేయుచున్నాడు.

**9–10వ.** భూమిని దర్శించి విస్తారమైన నీళ్లతో తడిపి చదునుచేసి నాశీర్వదించు దేవుడు ముందుగా తలంచినట్లు వర్షలేమి ద్వారా కరువు కలిగి ప్రార్థించగా దేవుడు వర్షమిచ్చాడని తలంచగలము. వానజల్లుల చేత దానిని చదునుచేసి భూమిని దర్శించి తడిపి దేవుడు దానికి మహదైశ్వర్యము కలుగజేశాడని చెప్పుచున్నాడు. దేవుని నది నీళ్ళతో నిండియున్నది అనుట దేవుడు మేఘములను నీళ్లతో నింపుటను సూచించును. ప్రవచనముగా ఈ వచనమును సంఘములు వాక్యమును నీటిచే నింపబడాలని గుర్తింతము.

**11–13వ. అడవిబీడులు, కొండలు, లోయలు సస్యములతో కప్పబడి సంతోష గానము చేయుట:** సంవత్సరము నీ దయా కిరీటము ధరింపజేసియున్నావు. నీ జాడలు సారము వెదజల్లుచున్నవి అన్నందున దేవుడే వర్షమిచ్చి **12–13వ.** చెప్పబడినట్లు అడవి బీడులను, కొండలను పచ్చికతో నింపి ఆనందింపచేయునని చెప్పుచున్నాడు. లోయలు సస్యములతో కప్పబడి యున్నందున అన్నియు సంతోష గానము చేయుచున్నవి, అనగా దేవుని స్తుతించుచున్నవని చెప్పుచున్నాడు.

## ౬౬వ కీర్తన (4+3+4+4+5 = 20 వ.)

**1–12 మేము; 13–20 నేను, నా గమనించాలి.**

**అంశం : ప్రార్థన ఆలకించి, విమోచించి, నడిపించినందున దేవునికి స్తుతి**

**సందర్భము: 11వ.** లో నీవు బందీగృహములో మమ్ము ఉంచితివి, మా నడుముల మీద గొప్ప భారము పెట్టితివి. నరులు మా నెత్తిమీద ఎక్కునట్లు చేసితివి. మేము నిప్పులలోను నీళ్ళలోను పడితిమి అన్నందున ఐగుప్తు చెరలో నున్న సందర్భము కావచ్చును.

**8–9వ. పాపులను పరిశుద్ధులుగా మార్చిన దేవునికి స్తుతి:** జనములారా, మా దేవుని సన్నుతించుడి, గొప్ప స్వరముతో ఆయన కీర్తని వినిపించుడి. జీవప్రావులనుగా మమ్మును కలుగజేయువాడు ఆయనే. మన పాదములు కదలనియ్యడు. **కీర్తన 144:15, కీర్తన 33:12.** యెహోవా తమకు దేవుడుగా గల జనులు ధన్యులు. ఆయన తమకు స్వాస్థ్యముగా ఏర్పరచుకొనిన జనులు ధన్యులు. పాపములచేత, అపరాధములచేత చచ్చిన మనలను క్రీస్తుతో కూడ జీవింపజేశాడు. ఇదియే ధన్యత.

**1-4వ. నామము, ప్రభావము, కార్యము, బలమునుబట్టి దేవునికి స్తుతి: 1వ.** సర్వలోక నివాసులారా, సంతోషగీతము పాడుడి. ఆయన నామ ప్రభావము కీర్తించుడి. **అపొ.కా. 4:12** ప్రకారము ఈ నామముననే మనము రక్షణ పొందవలెను. **మార్కు 5:29-30** ప్రకారము యేసు తనలోనుండి ప్రభావము బయలువెళ్ళి ఆమె రక్తధార కట్టెనని గ్రహించెను. **కీర్తన 7:11** లో భూమిమీద ఆయన ప్రభావము కనిపించునని ఉన్నది. **2వ.** అట్టి ప్రభావము ఆరోపించి ఆయనను స్తోత్రించాలి. **3వ.** ఆలాగు దేవునికి స్తోత్రము చెల్లించుడి అనగా దేవునికి స్తోత్రము చెల్లించు విధము చెప్పబడినది. నీ బలాతిశయము బట్టి నీ శత్రువులు లొంగి నీ యొద్దకు వచ్చెదరు. **4వ.** సర్వలోకము నీకు నమస్కరించి నిన్ను కీర్తించును, నీ నామమునుబట్టి నిన్ను కీర్తించును. కనుక 1) నామము, 2) ప్రభావము, 3) బలాతిశయము, 4) కార్యములు స్తుతిలో ముఖ్య అంశములు.

**5-7వ. సముద్రమును ఎండిన భూమిగా చేసి జనులను చాటించిన ఆశ్చర్య కార్యను బట్టి మనలను ఏలుటను బట్టి దేవునికి స్తుతి:**

**5వ.** దేవుని ఆశ్చర్య కార్యములను చూడరండి. పాపాత్ములైన నరుల యెడల ఆయన జరిగించిన రక్షణ కార్యమును చూడగా ఆయన ఆశ్చర్యకరుడై (భీకరుడై) యున్నాడు. **6వ.** ఆయన ఎర్రసముద్రము ఎండిన భూమిగా చేసెను. జనులు కాలినడకనే దాటిరి. **నిర్గమ 14:21-23వ.** యెహోవా ఆ రాత్రి అంతయు తూర్పు గాలిచేత సముద్రమును ఆరిన నేలగా చేసి నీళ్ళను విభజించగా ఇశ్రాయేలీయులు సముద్రము మధ్యను ఆరిన నేలమీద నడిచిపోయిరి. ఐగుప్తీయులు యెహోవా వారి పక్షమున యుద్ధము చేయుచున్నాడని చెప్పుకొని పారిపోయిరి. **1కొరింథీ 10:4** లో ఎర్ర సముద్రము దాటుట బాప్తీస్మమునకు పోల్చబడినది. అక్కడ ఆయన యందు మేము సంతోషించితిమి. **అపొ.కా. 8:9** నపుంసకుడు బాప్తీస్మము పొంది నీళ్లలోనుండి వెడలివచ్చి సంతోషించుచు వెళ్లెనని చెప్పబడినది. బాప్తీస్మము ద్వారా సంతోషము కలుగును. **7వ.** ఆయన తన పరాక్రమము వలన నిత్యము ఏలుచు, అన్యజనుల మీద ఆయన తన దృష్టి యుంచునని చెప్పబడినది. ద్రోహులగు (**నిర్గమ 5:2** ప్రకారము ద్రోహి ఫరోయే) ఫరో, అతని సైన్యము తమ్మును తాము హెచ్చించుకొనన తగదని చెప్పబడినది.

**8-11వ. వెండివంటి విమోచనను నిర్మలము చేసి, పరిశుద్ధపరచినందుకు దేవునికి స్తుతి: 8-9వ.** జనములారా, మా దేవుని సన్నుతించుడి. గొప్ప స్వరముతో ఆయన కీర్తి వినిపించుడి. రక్షించి, పాదములు జారక కాపాడినాడు. **10వ.** దేవా, నీవు మమ్మును పరిశీలించి వెండిని నిర్మలము చేయు రీతి మమ్మును నిర్మలులను చేసియున్నావు. **11వ.** నీవు బందీ గృహములో మమ్ము ఉంచితివి. మా నడుముల మీద గొప్ప భారము పెట్టితివి. నరులు మా నెత్తిమీద ఎక్కునట్లు చేసితివి. మేము నిప్పులలోను నీళ్లలోను పడితిమి. **సామెతలు 17:3; 25:4** హృదయ పరిశోధకుడు యెహోవా వెండివలె మన విశ్వాసములో నున్న మస్టు తీసివేసి **యెషయా 48:10; జెకర్యా 13:9** ప్రకారము పుటము వేయుటకు ఇబ్బంది కొలిమిలో మనలను పరీక్షించును, శోధించును. ఆలాగు చేసి దేవునికి మొఱ్ఱపెట్టగా

ఆలకింతునని యెహోవా చెప్పుచున్నాడు. **మలాకీ 3:3** లో వెండిని శోధించి నిర్మలము చేయువాని వలె లేవీయులు నీతిని అనుసరించి యెహోవాకు నైవేద్యములు చేయునట్లు ఆయన నిర్మలులను చేయును. **కీర్తన 12:6** ప్రకారము యెహోవా మాటలు పవిత్రమైనవి. యెహోవా పవిత్రుడు, ఆయన సేవకులు పవిత్రులైయుండాలి. **నిర్గమ 5:4-9వ.** లో ఫరోవారిచే ఇటుకల బరువులు మోయించాడు. ఇటుకలు చేయునపుడు నీళ్లలో పడిరి. ఇటుకలు కాల్చునపుడు నిప్పులో పడిరి. **నిర్గమ 6:6-7వ.** లో నేను యెహోవాను; నేను ఐగుప్తీయుల బరువుల క్రింద నుండి మిమ్మును వెలుపలికి రప్పించి, వారి దాసత్వములో నుండి మిమ్మును విడిపించి, నా బాహువు చాపి గొప్ప తీర్పు తీర్చి మిమ్ములను విడిపించి, మిమ్మును నాకు ప్రజలుగా చేర్చుకొని మీకు దేవుడనైయుందునని దేవుడు చెప్పాడు.

**12-15వ. సమృద్ధి గల చోటుకు నడిపించినందుకు మ్రొక్కుబడులను చెల్లించుట:** **11-13వ.** దేవుడు సమృద్ధిగల చోటికి మనలను రప్పించినందున బలులను తీసికొని మందిరము లోనికి నేను వ్యక్తిగతముగా వచ్చెదని అంటున్నాడు. **14-15వ.** నాకు శ్రమ కలిగినప్పుడు నా పెదవులు పలికిన మ్రొక్కుబడులను నేను మీకు చెల్లించెదను. పొట్టేళ్ళను, ధూపమును, క్రొవ్విన గొఱ్ఱెలను, ఎద్దులను, మేకపోతులను నీకు దహనబలిగా సంపూర్ణ సమర్పణగా అర్పించెదను అంటున్నాడు కనుక 1) మందిరమునకు రావాలి, 2) మ్రొక్కుబడులు చెల్లించాలి, 3) సంపూర్తిగా సమర్పించుకోవాలి.

**16-20వ. ప్రార్థన ఆలకించువాడైనందున దేవునికి స్తుతి: 16వ.** దేవునియందు భయభక్తులు గలవారలారా, మీరందరు వచ్చి ఆలకించుడి. ఆయన నా కొరకు చేసిన కార్యములను నేను వివరించెదను. **17-18వ.** ఆయనకు నేను మొఱ్ఱపెట్టితిని, అప్పుడే నా నోట శ్రేష్టమైన కీర్తన యుండెను. నా హృదయములో నేను పాపమును లక్ష్యము చేసిన యెడల ప్రభువు నా మనవి వినకపోవును. **యెషయా 59:2; సామెతలు 28:9,13,** మీ పాపము ఆయన ముఖము మీద మరుగుపరచెను; ఆయన ఆలకింపకున్నాడు. **1యోహాను 3:20** ప్రియులారా, మన హృదయము మనయందు దోషారోపణ చేయనియెడల దేవుని యెదుట ధైర్యము గల వారమగుదుము. **18-29వ.** నిశ్చయముగా దేవుడు నా మనవి అంగీకరించియున్నాడు, ఆయన నా విజ్ఞాపన ఆలకించియున్నాడు. దేవుడు నా ప్రార్థనను త్రోసివేయలేదు. నా యొద్దనుండి తన కృపను తొలగింపలేదు (కృప ద్వారా కలిగిన రక్షణ తొలగిపోదు). ఆయన నామము సన్నుతింపబడును గాకని స్తుతితో ముగించుచున్నాడు. **2తిమోతి 2:21** తన్నుతాను పవిత్రపరచుకొనిన యెడల వాడు పరిశుద్ధపరచబడి, యజమానుడు వాడుకొనుటకు అర్హమై ప్రతి సత్కార్యమునకు సిద్ధపరచబడి, ఘనత నిమిత్తమైన పాత్రయై యుండును. మనమందరము ఈ రీతిగా పరిశుద్ధ పరచబడి యజమానునిచే వాడబడు పాత్రలముగా ఉందుము గాక.

## 67వ కీర్తన (2+2+2+1 = 7 వ.)

**అంశం : దేవుని రక్షణ, తీర్పునుబట్టి, ఆశీర్వాదమునుబట్టి ప్రజలు సంతోషించుచు ఉత్సాహధ్వనితో దేవుని స్తుతించుట**

**సందర్భము :** ఈ కీర్తన ఎవరు వ్రాసిరో స్పష్టముగా చెప్పలేము. **3వ.** లో ప్రజలను గూర్చిన ప్రస్తావన ఉన్నందున బహుశా దావీదు రాజు తన చివరి దినములలో నెమ్మది కాలములో వ్రాసి యుండవచ్చును.

**1-2వ. అన్యజనులందరికి దేవుని రక్షణ తెలియబడుట (ప్రస్తుతము):** 1) అన్యజనులందరిలో నీ రక్షణ తెలియబడునట్లు అనగా భూమి మీద దేవుని మార్గము తెలుపు బాధ్యత మన మీద నున్నదని గమనించాలి. 2) దేవుడు మమ్మును కరుణించి, మమ్మును ఆశీర్వదించును గాక, 3) ఆయన తన ముఖకాంతి మా మీద ప్రకాశింపజేయును గాక. రక్షణ కార్యము దేవుని కృప, కరుణ ద్వారా మాత్రమే జరుగును. రక్షణ కొనసాగింపుగా దేవుని ఆశీర్వాదము కలుగును. మనలో జరిగిన రక్షణ క్రియ ఫలితముగా దేవుని ముఖ కాంతి మనపై ప్రకాశించుచుండును (సెలా).

**3-4వ. న్యాయమునుబట్టి తీర్పు, దేవుని ప్రజలందరు స్తుతించుట (వేయి ఏండ్ల పాలన): 3వ.** దేవా, ప్రజలు నిన్ను స్తుతించుదురు గాక. ప్రజలందరు నిన్ను స్తుతించుదురు గాక. న్యాయమునుబట్టి నీవు జనములకు తీర్పు తీర్చుదువు. భూమి మీదనున్న జనములను ఏలెదవు. **4వ.** జనములు సంతోషించుచు, ఉత్సాహ ధ్వని చేయును గాక. ప్రజలందరు సంతోషించుచు, దేవునికి ఉత్సాహ ధ్వని చేయుచు, స్తుతించుట ప్రస్తుత కాలములో మనము చూడము. కాని వేయి ఏండ్ల పాలనలో దేవుని న్యాయమైన తీర్పును ప్రజలు గమనించి ఇశ్రాయేలు దేవుని ఉత్సాహ ధ్వని చేయుచు స్తుతింతురు. కనుక ఈ వచనములు వేయి ఏండ్ల పాలన కాలమునకు చెందినవి (సెలా).

**5-6వ. భూమిని ప్రజలను దేవుడు ఆశీర్వదించుట (యుగాంతమందు): 5వ.** దేవా, ప్రజలు నిన్ను స్తుతించుదురు గాక. ప్రజలందరు నిన్ను స్తుతించుదురు గాక. **6వ.** అప్పుడు భూమి దాని ఫలములిచ్చును. దేవుడు మా దేవుడు మమ్మును ఆశీర్వదించును. **ఆది 3:17-18వ.** ప్రకారము ఆయన ఆదాముతో, నీవు నీ భార్య మాట విని తినవద్దని నేను నీకాజ్ఞాపించిన వృక్షఫలములు తింటివి గనుక నీ నిమిత్తము నేల శపించబడియున్నది; అది ముండ్ల తుప్పలను గచ్చపొదలను నీకు మొలిపించును. భూమి యొక్క శాపము తీసివేయబడి భూమి నూర్చబడినప్పుడు దాని ఫలమిచ్చును. కనుక ఈ వచనములు యుగాంత కాలమును సూచించునవి.

**7వ. దేవుడు భూమిని దీవించి ఆశీర్వదించగా భూదిగంత నివాసులు దేవునియందు భయభక్తులు నిలుపుట:** దేవుడు మమ్మును దీవించును. దేవుడు మమ్మును దీవించును. భూదిగంత నివాసులందరు ఆయనయందు భయభక్తులు నిలుపుదురు. **ప్రకటన 21 అధ్యా.** లో చెప్పబడినట్టు, భూమి, ఆకాశములు మార్చబడి మనము నూతన

యెరూషలేములో నున్నప్పుడు అదియే సంపూర్ణ ఆశీర్వాద కాలము. అప్పుడు భూదిగంత నివాసులందరు ఆయనయందు భయభక్తులు నిలుపుదురు.

## ౬౮వ కీర్తన (3+3+4+4+4+5+4+4+4 = 35 వ.)

**అంశం, సందర్భము:** మందసము ఒబెదెదోము ఇంటినుండి సీయోనుకు తీసుకొని రాబడిన సమయమున (2సమూ 6అధ్యా.) వ్రాయబడినది. క్రీస్తు మరణము, పునరుత్థానము, ఆరోహణము, రెండవ రాకడ ద్వారా సంఘ విజయము, ఆధిక్యతను చూపు మెస్సీయ కీర్తనగా చూడవచ్చును.

**1-3వ. నీతిమంతులను సంతోషింపజేసి, శత్రువులను చెదరగొట్టు క్రీస్తు: 1-2వ.** దేవుడు లేచుట, ఆయన శత్రువులు ఆయనను ద్వేషించువారు ఆయన సన్నిధి నుండి పారిపోయి, చెదరగొట్టబడి, మైనము కలుగునట్లు భక్తిహీనులు దేవుని సన్నిధికి తిరిగి కరగి నశించుట రెండవ రాకడలో అవిశ్వాసుల తీర్పుగా చూడగలము. **3వ.** నీతిమంతులు సంతోషించుట దేవుని సన్నిధిని ఉల్లసించి, మహదానందము పొందుట విశ్వాసుల తీర్పుగా తలంచగలము.

**4-6వ. దేవుని గొప్పతనమును, న్యాయమునుబట్టి పాడి స్తుతించుట: 4వ.** ఆయన సన్నిధిని ప్రహర్షించుడి, స్తోత్రగానము చేయుడి. 1) వానరమెక్కి అరణ్యములలో ప్రయాణము చేయు దేవుడు, తన ప్రజలను మేఘములలో అనగా మేఘవాహనములో నడిపించిన దేవుడు కనుక ఆయన సన్నిధిని ప్రహర్షించుడి, స్తోత్రగానము చేయుడి. 2,3) యెహోవా అను ఆయన నామము గల దేవుడు. ఆయన నామము రక్షణార్థమైనది (**అపొ.కా. 4:10**), ఆయన నామము పరిశుద్ధమైనది, పూజింపదగినది (**కీర్తన 111:9**). ఆయన నామమే వీనిని బలపరచెను, పూర్ణ స్వస్థత కలుగజేసెను (**అపొ.కా. 3:16**). కనుక ఆయన నామమును బట్టి స్తోత్రగానము చేయాలి. 4,5) ఆయన రాజుగానున్న దేవుడు, పరిశుద్ధాలయమందుండు దేవుడు కనుక ఆయన సన్నిధిని ప్రహర్షించి, స్తోత్రగానము చేయవలెను. **5వ.** 6) తండ్రి లేనివారికి, విధవరాండ్రకు, న్యాయకర్తయైన దేవుడు తండ్రులు ఉన్నంత కాలము కుమారులు, భర్తలు ఉన్నంతకాలము భార్యలు వారిపై పూర్తిగా ఆధారపడుదురు. వారు లేని లోటును తరువాత గుర్తించుదురు. ఈ దేవుడు అలాంటివారికి న్యాయకర్తగా నుండువాడు. **6వ.** 7) ఏకాంగులను సంసారులుగా చేయు దేవుడు. వివాహ విషయమై ఎదురుచూచు వారికి ఈ మాట ఎంతో ధైర్యము, నిరీక్షణ నిచ్చును. 8) బంధింపబడిన వారిని విడిపించి వర్ధిల్లజేయు దేవుడు. ఆత్మీయముగా మనము పాప, సాతాను బంధకములలో నుండగా విడిపించిన గొప్ప దేవుడు. శారీరకముగా ఇశ్రాయేలీయుల వలె ఐగుప్తును పోలిన లోకములో సమస్యలలో బంధకములలో మనముండగా వారిని విడిపించి కనానుకు నడిపించినట్లు మనలను అన్ని సమస్యల నుండి విడిపించిన దేవుడు.

**7-10వ. ప్రజలు విమోచనకై అరణ్య ప్రయాణములో ముందర నడచిన క్రీస్తు: 7-8వ.** దేవా, నీవు నీ ప్రజల ముందర బయలుదేరినప్పుడు అనగా ఐగుప్తు అరణ్యములో నీవు ప్రయాణము చేసినప్పుడు మేఘములో చల్లదనములో, రాత్రి అగ్నిలోను వేడినిచ్చి నడిపించిన దేవుడు. ఇశ్రాయేలుకు విజయమిచ్చుటకై **న్యాయాధి 5:4** భూమి వణకెను. దేవుని సన్నిధిని అంతరిక్షము దిగజారెను. అనగా వర్షించునట్లు చేశాడు. ఇశ్రాయేలు దేవుని సన్నిధి ఆవలి సీనాయి కంపించెను. **9-10వ.** దేవా, నీ స్వాస్థ్యము మీద నీవు వర్షము సమృద్ధిగా కురిపించితివి. ఆది అలసియుండగా నీవు దానిని బలపరచితివి. (**న్యాయాధి 5:4-5** - యెహోవాను కీర్తించెదను. యెహోవా, నీవు శేయీరు నుండి బయలుదేరినప్పుడు ఎదోము పొలము నుండి బయలుదేరినప్పుడు భూమి వణకెను, ఆకాశము నీళ్ళను కురిపించెను).

**11-14వ. మార్గములో శత్రు రాజులు ఓడిపోవుట - సిలువపైనున్న క్రీస్తు శత్రువగు సాతానును ఓడించుట: 11-12వ.** దానిని ప్రకటించు స్త్రీలు (సంఘము) గొప్ప సైన్యముగా ఉన్నారు. సేనల రాజులు పారిపోయెదరు. ఇంట నిలిచినది దోపుడు సొమ్ము పంచుకొనును. **13-14వ.** గొఱ్ఱెల దొడ్ల మధ్యను మీరు పండుకొనగా అనగా సమృద్ధిలో నున్నప్పుడు సర్వశక్తుడు అక్కడ రాజులను చెదరగొట్టినపుడు సల్మోను మీద హిమము కురిసినట్టాయెను. **న్యాయాధి 9:45-48** లో అబీమెలెకు ఆ పట్టణస్థులతో యుద్ధము చేసి పట్టణమును చుట్టుకొని అందులోనున్న జనులను చంపి పట్టణమును పడగొట్టి దాని స్థలమున ఉప్పు జల్లెను. షెకెము గోపుర యజమానులందరు ఏల్‌బెరీతు గుడి యొక్క కోటలోనికి జొరబడిరి. షెకెము గోపుర యజమానులు కూడియున్న సంగతి అబీమెలెకునకు తెలుపబడినప్పుడు అబీమెలెకు అతనితోనున్న జనులందరును సల్మోను కొండనెక్కి అబీమెలెకు గొడ్డలిని చేతపట్టుకొని కొమ్మను నరకగా జనులందరిలో ప్రతివాడు ఒక కొమ్మను నరికి అబీమెలెకును వెంబడించి ఆ కోట దగ్గర వాటిని పెట్టి వాటివలన ఆ కోటను అగ్నిచేత కాల్చగా షెకెము గోపుర యజమానులు వెయ్యిమంది చచ్చిరి. అలాగే ప్రభువు సాతానును, వాని దూతలను సంహరింతురు.

**15-18వ. మరణించి, పునరుత్థానుడై ఆరోహణుడైన క్రీస్తు: 15-17వ.** బాషాను పర్వతము, దేవ పర్వతము దేవుడు నివాసముగా కోరుకున్న కొండ. అనగా సీయోను పర్వతమని తలంచాలి. యెహోవా నిత్యనివాసము కనుక చిన్నచూపు చూడకూడదు. దేవుని రథములు సహస్రములు, సహస్ర సహస్రములు. ప్రభువు వాటిలోనున్నాడు. రథములు అనగా ప్రయాణ సాధనములు. రెండవ రాకడలో దేవునితో మనము ఆరోహణము కావాలి. కనుక వేవేల రథములు అవసరము. రథములు దేవదూతలకు సాదృశ్యము. కనుక దేవుని దూతలు అసంఖ్యాకములు అని అర్థము. సీనాయి పరిశుద్ధమైనట్టు ఆ కొండ పరిశుద్ధమాయెను. **18వ.** నీవు ఆరోహణమైనతి. పట్టబడినవారిని చెరపట్టుకొనిపోతివి. ప్రభువు మరణించి, పునరుత్థానుడై పాతాళ పరదైసులో నున్న పరిశుద్ధులను అనగా **లూకా 15 అధ్యా.** లో నున్న అబ్రాహాము, లాజరు వంటివారిని చెరగా అనగా తన వశములోనికి

తీసికొని ఆకాశమండలమునకు ఆరోహణుడాయెను. యెహోవా అను దేవుడు అక్కడ నివసించుచుండగా విశ్వాసఘాతకులగు మనుష్యుల చేత నీవు కానుకలు తీసికొనియున్నావు. ఈ విశ్వాసఘాతకులు ఎవరు? ఇశ్రాయేలీయులకు దేవుడు వేయి తరముల వరకు వాగ్దానము చేశాడు. తరమొకటి 25 సంII అనుకొనిన 25,000. ఇశ్రాయేలీయులు 4,000 సంII నాటివారే. కనుక 25,000 సంIIల దీర్ఘకాలము భూమి మీద వారుందురు. రక్షించబడినవారు మహిమ దేహులుగా నుండగా శరీరములు ధరించుకొనిన వీరు కలసి నివసించుట ఎలాగు సాధ్యమో మనమెరుగము. కాని ప్రవచన నెరవేర్పుగా ఇది జరుగును.

**19-23వ. దేవుడు తన ప్రజలను రక్షించుట - శత్రువును శిక్షించుట:** దేవుడు తన ప్రజలను రక్షించు వివరము **18-20** లోను, శత్రువును శిక్షించు వివరము **21-23వ.** లోను చెప్పబడినది. **18-20వ.** అనుదినము ఆయన మా భారము భరించుచున్నాడు. దేవుడే మాకు రక్షణకర్తయై యున్నాడు. మరణము తప్పించుట ప్రభువైన యెహోవా వశము. **21-23వ.** దేవుడు నిశ్చయముగా తన శత్రువు తల పగులగొట్టగా ఆ రక్తములో నీవు నీ పాదము ముంచుదువు.

**24-27వ. మందిర ప్రవేశములో స్తుతి:** రెండవ రాకడలో సంఘము ప్రభువును వెంబడించు వివరము **24-25వ.** లోను, ఇశ్రాయేలీయులు ప్రభువును వెంబడించుట **26-27వ.** లోను చెప్పబడినది. **24-25వ.** దేవా, నీ గమనమును పరిశుద్ధ స్థలమునకు పోవు నా రాజగు దేవుని గమనమును వారు చూచియున్నారు. కీర్తనలు పాడువారు ముందర నడువగా, వాద్యములు వాయించువారు వెనకు వచ్చెదరు. **26-27వ.** ఇశ్రాయేలీయులు అన్ని గోత్రములవారు సమాజములలో దేవుని స్తుతించెదరు.

**28-31వ. యెరూషలేము దేవాలయములో ఆశీనుడైన క్రీస్తు ఆరాధన: 28-29వ.** నీ దేవుడు నీకు బలము కలుగ నియమించియున్నాడు. దేవా, నీవు మా కొరకు చేసిన దానికి బలపరచుము. యెరూషలేములోని నీ ఆలయమునుబట్టి రాజులు నీ యొద్దకు కానుకలు తెచ్చెదరు. **ప్రకటన21:24,26వ.** జనములు దాని వెలుగునందు సంచరించుదురు. భూరాజులు తమ మహిమను దానిలోనికి తీసికొని వత్తురు. జనములు తమ మహిమను ఘనతను దానిలోనికి తీసికొనివచ్చెదరు.

**32-35వ. ముగింపులో దేవుని గొప్పతనమునుబట్టి స్తుతి: 32-33వ.** భూరాజ్యములారా, దేవునిగూర్చి పాడి, ప్రభువును కీర్తించవలెనని చెప్పుచున్నాడు. **34-35వ.** దేవునికి బలాతిశయము నారోపించుచు మహిమోన్నతుడు భీకరుడుగా ఇశ్రాయేలు మీద ఏలుచు తన ప్రజలకు బలపరాక్రమములను అనుగ్రహించుచున్నందున దేవుని స్తుతించి ఆరాధించాలి.

## 69వ కీర్తన (4+4+4+3+3+3+3+4+4+4 = 36 వ.)

**అంశం : క్రీస్తు శ్రమలు, పునరుత్థానము, పరలోక ప్రవేశము**

దావీదు వ్రాసిన మెస్సీయ కీర్తన, దావీదు దుఃఖ సమయములో వ్రాసినది. సందర్భము ఎప్పుడో ఖచ్చితముగా చెప్పలేము.

**1-12వ. అపరాధములను భరించి అపహాస్యము చేయబడిన క్రీస్తు**

**1-4వ. వరదవంటి అధిక దుఃఖములలోనున్న క్రీస్తు: 1-2వ.** జలములు అనగా దుఃఖములు. నా ప్రాణము మీద పొర్లుచున్నవి నన్ను రక్షింపుము. అగాధజలములలో, వరదలో అనగా అధిక దుఃఖములో నిలువయియ్యని అగాధమైన దొంగ ఊబిలో నేను దిగబడి ముంచివేయబడుచున్నాను అంటున్నాడు. మన పాపములను బట్టియే క్రీస్తు మరణమగునంతగా నా ప్రాణము బహు దుఃఖములో మునిగియున్నదని **మత్తయి 26:38** లో అన్నాడు. **3-4వ.** మొఱ్ఱపెట్టుటచేత అలసిపోగా గొంతుక యెండిపోయి, కన్నులు క్షీణించినవి. నిర్నిమిత్తముగా అబద్ధమును బట్టి శత్రువులైనవారు, సంహరింపగోరువారు, పగపట్టువారు తలవెంట్రుకల కంటె ఎక్కువమంది క్రీస్తు చేయని తప్పులు మోపగా తాను చేయని పాపములకు ఇచ్చుకొనవలసి వచ్చినది.

**5-8వ. మన అపరాధములను, అవమానమును భరించిన క్రీస్తు 5-6వ.** మన అపరాధములు, బుద్ధిహీనత తనదిగా గైకొన్నాడు. యెహోవా, నీ కొరకు కనిపెట్టుకొనువారికి సిగ్గు, అవమానము కలుగకూడదని ప్రార్థించాడు. **7-8వ.** తన స్వంత జనులు (తల్లి కుమారులు) అన్యుడుగా తలంచి శిక్షించిరి.

**9-12వ. అపహాస్యము చేయబడిన క్రీస్తు:** దేవుని యింటిని గూర్చిన ఆసక్తి భక్షించగా దావీదు మందసమును తెచ్చునపుడు గోనెపట్ట కట్టుకొని నాట్యమాడినాడు. మీకాలు నిందించినది. క్రీస్తు కూడా వస్త్రహీనుడై సిలువలో అవమానము భరించాడు. ఉపవాసముండి నేను కన్నీరు విడువగా అది నిందాస్పదమాయెను. క్రీస్తును రాణువవారు, యూదులు, త్రాగుబోతుల వలె అవమానపరచి సంతోషించిరని చెప్పుచున్నాడు.

**13-21వ. శ్రమలలో, దుఃఖములలో ప్రార్థించిన క్రీస్తు**

**13-15వ. అధిక దుఃఖములో ప్రార్థించిన క్రీస్తు: 13వ.** యెహోవా, అనుకూల సమయమున నేను నిన్ను ప్రార్థించుచున్నాను. గేత్సెమనే వనములో, సిలువలో ప్రార్థించాడు. దేవా, నీ కృపా బాహుళ్యమునుబట్టి నీ రక్షణ సత్యమునుబట్టి నాకుత్తరమిమ్ము. **14-15వ.** నేను దిగిపోకుండ ఊబిలోనుండి నన్ను తప్పించుము. నా పగవారి చేతిలోనుండి అగాధ జలములలో నుండి నన్ను తప్పించుము. **15వ.** నీటి వరదలు నన్ను ముంచనియ్యకుము. అగాధ సముద్రము నన్ను మింగనియ్యకుము. గుంట నన్ను మింగనియ్యకుము.

**16-18వ. కృపనుబట్టి ఉత్తరమిమ్మని ప్రార్థించుట:** యెహోవా, కృప ఉత్తమత్వమునుబట్టి, వాత్సల్య బాహుళ్యతనుబట్టి నీ సేవకునికి విముఖుడవై యుండక తన తట్టు తిరుగుమని

చెప్పుచున్నాడు. తాను ఇబ్బందిలోనున్నందున త్వరగా సమీపించి విమోచించి శత్రువులను చూచి విడిపించుమని చెప్పుచున్నాడు.

**19-21వ. మానవుడుగా శ్రమలు పొందిన క్రీస్తు:** ఇందులో క్రీస్తు సిలువలో పొందిన శ్రమలు కనిపించును. నిందయు సిగ్గును అవమానమును కలుగగా, నిందకు హృదయము బద్దలై, యేసు బహుగా కృషించాడు. కరుణించువారు, ఓదార్చువారి కొరకు కనిపెట్టుకొనగా ఎవరును లేకపోయిరి. యేసుకు వారు చేదును ఆహారముగా పెట్టి దప్పియైనప్పుడు చిరకను త్రాగనిచ్చిరి.

**22-24. శత్రువులపై దేవుని తీర్పు: 22-24వ.** శత్రువులు దేవుని నమ్మనివారు కనుక వారిపై ఉగ్రత కుమ్మరించబడుట వారు నరకమునకు వెళ్లుటయేనని, చీకటి కమ్ముట, వారి నడుములకు ఎడతెగని వణుకు పుట్టుట నరకములోనని గుర్తింతము.

**25-28వ. శత్రువులపై మరికొంత దేవుని తీర్పు:** వారు మొత్తబడి, వేదనపడి తరుమబడుదురు. వారి పాళెము పాడై, వారి గుడారములలో ఎవడును ఉండకపోవుట ఇస్కరియోతు యూదాను గూర్చిన ప్రవచనము. దోషము మీద దోషము తగులుటనుబట్టి జీవగ్రంథములో నుండి వారి పేరు తుడుపుపెట్టబడి నీతిమంతుల పట్టీలో వారి పేరులు వ్రాయబడవు.

**29-36వ. మొర ఆలకించు యెహోవాకు స్తుతి: 29-32వ.** దరిద్రుల మొఱ్ఱ ఆలకించు యెహోవాకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుట. దేవుడిచ్చిన రక్షణనుబట్టి ఎద్దు కోడెల బల్యర్పణ కంటే స్తుతి యెహోవా ప్రీతికరము కనుక కీర్తనలలో దేవుని నామమును స్తుతించి కృతజ్ఞతా స్తుతులతో ఘనపరచాలి. దేవుని వెదకువారలారా, మీ ప్రాణము తెప్పరిల్లును గాక. **33-36వ.** రక్షించి పరలోక ప్రవేశమిచ్చి భూమ్యాకాశముల స్తుతి, పాపమునుబట్టి ఖైదులోనుండిన తనవారిని ఆయన తృణీకరించువాడు కాదు. యెహోవా దరిద్రుల మొఱ్ఱ ఆలకించువాడు. దేవుడు సీయోనును రక్షించి, యూదా పట్టణములను కట్టించగా జనులు అక్కడ నివసించి దానిని స్వతంత్రించుకొందురు. ఆయన నామమను ప్రేమించువారు అందులో నివసించెదరు. భూమ్యాకాశములు, సముద్రములు వాటియందు సంచరించు సమస్తము ఆయనను స్తుతించును.

## 70,71,72 కీర్తనల పరిచయము

కీర్తన **70:1** లో దేవా, నన్ను విడిపించుటకు, నా సహాయమునకు త్వరగా రమ్ము. నా ప్రాణము తీయగోరువారు, కీడు చేయగోరువారు వెనుకకు మళ్లింపబడి సిగ్గునొందెదరు గాక అన్నాడు. **71:9** లో శరణుజొచ్చి వృద్ధాప్యమందు నా బలము క్షీణించినప్పుడు నన్ను విడువకుమని ప్రార్థించాడు. **18వ.**లో దేవా, వచ్చు తరమునకు నీ బాహుబలము గూర్చియు, పుట్టబోవువారికందరికి నీ శౌర్యమును గూర్చియు నేను తెలియజెప్పునట్లు తల నెరసి వృద్ధుడనైయుండు వరకు నన్ను విడువకుము. **కీర్తన 72:1** లో దేవా, రాజునకు నీ

న్యాయవిధులను రాజకుమారునికి (సొలొమోను) నీ నీతిని తెలియజేయుము అన్నాడు. సొలొమోనుకు న్యాయవిధులు తెలియజేయుట అనగా సొలొమోను రాజైన సందర్భముగా తలంచాలి. **1రాజులు 1:5** హగ్గీతు కుమారుడైన అదోనియా (అబ్షాలోము తరువాత పుట్టినవాడు) అబ్షాలోము **2సమూ 18:17** లో మరణించాడు. కనుక గర్వించినవాడై నేను రాజునగుదునని అనుకొని, రథములను గుఱ్ఱపు రౌతులను తనకు ముందుగా పరెగెత్తుటకు ఏబదిమంది మనుష్యులను ఏర్పరచుకొని, సెరూయా కుమారుడైన సైన్యాధిపతియగు యోవాబుతోను, యాజకుడైన అబ్యాతారుతోను ఆలోచన చేయగా వారు ఆదోనియా పక్షము వహించి అతనికి సహాయము చేసిరి. సైన్యాధిపతి రాజ్యబలము గలవాడు, అభిషేకించువాడగు యాజకుడు ఏకమై సహాయము చేయుట వలన సులభముగా రాజు కాగలననుకొన్నాడు. ఇటువంటి సందర్భములలో సైన్యాధిపతి రాజగు దావీదును గృహ నిర్బంధము చేసి, కీడు చేయుటకు వెనుకాడకపోవచ్చును. **2సమూ 3:2-4వ.-** హెబ్రోనులో దావీదునకు పుట్టిన కుమారులెవరనగా, అమ్నోను అను అతని జ్యేష్ఠపుత్రుడు, కిల్యాబు అను రెండవవాడు, మూడవవాడైన అబ్షాలోము, నాలుగవవాడైన అదోనియా . . . అమ్నోను, అబ్షాలోము మరణించినందున అదోనియా ఆలాగు తలంచుట సమంజసముగా కనబడవచ్చును. దేవుని చిత్తమును గాని తండ్రి సెలవును అడుగకయే గర్వముతో ఆలాగు చేశాడు. ఈ రోజులలో కూడా కొద్దిమంది మనుష్యులను గుంపు చేసికొని గర్వముతో సంఘములలో ఈ రీతిగా ప్రవర్తించుచున్నారు. **71:5వ.** లో చెప్పినట్లు వృద్ధాప్యములోనున్న దావీదుకు అపాయముతో కూడిన సమస్యయే. **70** వ కీర్తనలోని వచనములన్ని **40** వ కీర్తనలోనివైనను ఈ సందర్భమునుబట్టి దావీదు మరలా జ్ఞాపకము చేసికొని ప్రార్థించుచున్నాడు. **70,71** లలో దావీదు శరణుజొచ్చి ప్రార్థించగా **1రాజులు 1:43** లో సొలొమోను రాజ్యాసనము మీద ఆశీనుడయ్యాడు. **72 లో** రాజైన సొలొమోనుకు దేవుడు న్యాయ విధులు తెలియచేయవలెనని చెప్పుచున్నాడు. కీర్తన గ్రంథ పరిచయములో ద్వితీయ స్కంథము రాజైన దావీదు కాని, హిజ్కియా కాని సమకూర్చాడని వ్రాయబడినది. కనుక 72వ కీర్తన దావీదుగారు వ్రాసినను సొలొమోను (కొరకు వ్రాయబడినది) కీర్తన అని తలంచాలి.

## 70వ కీర్తన (3+2 = 5 వ.)

**అంశం : ఇది శ్రమలలో ప్రార్థనా కీర్తన. ప్రాణము తీయగోరు శత్రువులకు అవమానము - దేవుని జనులకు రక్షణ**

**1-3వ. విడుదల కొరకైన మొర:** దేవా, నన్ను విడిపించుటకు నా సహాయముకు త్వరగా రమ్ము. **1,5వ.** లలో మూడు పర్యాయములు త్వరగా అని, ఆలస్యము చేయకుమీ అని ఒక పర్యాయము అన్నందున మనము కూడా త్వరగా శ్రమల నుండి విడిపించుమని అడుగ (జ్ఞాపకము) వచ్చును. **యెషయా 43:26.** నాకు జ్ఞాపకము చేయుము, మనము కూడి వాదింతము. నీవు నీతిమంతుడవుగా తీర్చబడునట్లు నీ వ్యాజ్యెము వివరించుము

అని దేవుడు చెప్పుచున్నాడు. రాజు అందరిని శ్రమల నుండి విడిపించి, రక్షించాలి. రాజులకు కూడా శ్రమలు రాగలవు. అందరిని శ్రమల నుండి విడిపించువాడు దేవుడే అని గుర్తింతము.

**2-3వ. ప్రాణము తీయగోరు శత్రువులకు సిగ్గు, విస్మయము:** నా ప్రాణము తీయగోరువారు సిగ్గుపడి అవమానమొందుదురు గాక. నాకు కీడుచేయగోరువారు వెనుకకు మళ్ళింపబడి సిగ్గునొందుదురు గాక. ఆహా ఆహా అని పలుకువారు తమకు కలిగిన అవమానము చూచి విస్మయమొందుదురుగాక. **యెషయా 37:4-6వ.** హిజ్కియా మీదికి అష్షూరు రాజు సేవకులు దండెత్తివచ్చి రాజైన హిజ్కియాను దూషింపగా హిజ్కియా ప్రార్థించాడు. దేవుడు అష్షూరు రాజులో ఒక ఆత్మను పుట్టించగా వదంతి విని ఆ రాజు పట్టణములోనికి రాక, తన దేశమునకు వెళ్ళిపోగా, అతని దేశమందు అతని కుమారులు ఖడ్గముచేత అతనిని చంపారు.

**4-5వ. రక్షణకర్తయగు దేవుని వెదకువారందరు ఉత్సహించి సంతోషింతురు:** నిన్ను వెదకువారందరు నిన్ను గూర్చి ఉత్సహించి సంతోషించుదురు గాక. నీ రక్షణను ప్రేమించువారందరు దేవుడు మహిమపరచబడును గాక అని నిత్యము చెప్పుకొందురుగాక. **యెషయా 37:35-37వ.** నా నిమిత్తము నా సేవకుడైన దావీదు నిమిత్తమును నేను ఈ పట్టణమును కాపాడి రక్షించుదునని దేవుడు వాగ్దానము చేశాడు. అంతట యెహోవా దూత బయలుదేరి అష్షూరువారి దండుపేటలో లక్ష యెనుబదియైదు వేలమందిని మొత్తెను, ఉదయమున జనులు లేవగా వారందరును మృత కళేబరములుగా ఉండిరి. అష్షూరు రాజైన సన్హెరీబు తిరిగిపోయి నీనెవె పట్టణమునకు వచ్చి, నివసించిన తరువాత అతడు నిస్రోకు అను తన దేవత మందిరమందు మ్రొక్కుచుండగా అతని కుమారులు ఖడ్గముతో అతని చంపిరి. **5వ. శ్రమలలో విడుదల కొరకైన మొర:** నేను శ్రమలపాలై దీనుడనైతిని. దేవా, నన్ను రక్షించుటకు త్వరపడి రమ్ము. నాకు సహాయము నీవే. నా రక్షణకర్తవు నీవు. యెహోవా, ఆలస్యము చేయకుమీ. ఇది ఆత్మ రక్షణ కాదు. అనుదిన జీవితములో కలుగు శ్రమల నుండి రక్షించు దేవుని ఎదుట దీనులమై మొరపెట్టాలి. అతిశయించక దీనులముగా ఉండుట ప్రాముఖ్యమని గుర్తించాలి.

## 71వ కీర్తన (3+3+3+3+3+3+3+3 = 24 వ.)

**అంశం :** శరణుజొచ్చినవారిని విమోచించి వృద్ధాప్యము వరకు దేవుడు కాపాడువాడైనందున వాయిద్యములతో స్తుతించుట. **17వ.** బాల్యము నుండి నీవు నాకు బోధించుచు వచ్చితివి. ఇంతవరకు నీ ఆశ్చర్యకార్యములు నేను తెలుపుచు వచ్చితిని అన్నట్లు బాల్యములోనే నమ్ముకొని ప్రభువుకు సాక్షిగా నుండెను. **9వ.** వృద్ధాప్యమందు, నా బలము క్షీణించినప్పుడు నన్ను విడువకుము. కనుక పరిచయములో చెప్పినట్లు దేవుని శరణుజొచ్చి ప్రార్థించుచున్నాడు. దేవుడు జవాబివ్వగా దేవుని స్తుతించాడు.

**1-3వ. శరణుజొచ్చిన నన్ను నీ నీతినిబట్టి తప్పింపుమని ప్రార్థించుట: 1వ.** యెహోవా, నేను నీ శరణుజొచ్చియున్నాను. నన్నెన్నడును సిగ్గుపడనియ్యకుము. **2వ.** నీ నీతినిబట్టి నన్ను తప్పింపుము, నన్ను విడిపింపుము, నన్ను రక్షింపుము. నాకు ఆశ్రయదుర్గముగా ఉండుము. నా శైలము, నా దుర్గము నీవే. నీవు నన్ను రక్షింప నిశ్చయించియున్నావు. **3వ.** తన నీతినిబట్టి కాక దేవుని నీతినిబట్టి తప్పింపుము అంటున్నాడు.

**4-6వ. బాల్యము నుండి ఆశ్రయమైన దేవుడు: 4వ.** దేవా, భక్తిహీనుల చేతిలో నుండి నన్ను రక్షింపుము. కీడుచేయువారి పట్టులోనుండి, బలాత్కారులని పట్టులోనుండి నన్ను విడిపింపుము అంటున్నాడు. గర్భవాసినైనది మొదలు, తల్లి గర్భము నుండి ఉద్భవింపజేసిన వాడని బాల్యము నుండి దేవుని మీదనే నిరీక్షణ కలిగి ఆశ్రయించాడు. దేవుని మీద నిరీక్షణ కలిగినందున బాల్యము, యవ్వనము, వృద్ధాప్యములో అన్ని సమస్యలలో దేవుడు కాపాడాడు. జీవితకాలమంత నిత్యము స్తుతిగానము చేశాడు.

**7-9వ. వృద్ధాప్యమందు ఆశ్రయముగా ఉండవలెనని కోరుట: 7వ.** దేవుడు తనకు బలమైన ఆశ్రయమైనందున దావీదు అనేకులకు ఒక వింతగా ఉన్నాడు. **8వ.** దేవుడు దావీదు జీవితములో తన ప్రభావము కనపరచు కార్యములు చేశాడు. నీ కీర్తితోను, నీ ప్రభావ వర్ణణతోను దినమంతయు తన నోరు నిండియున్నది. **9వ.** ఇప్పుడు వృద్ధాప్యమందు నా బలము క్షీణించినప్పుడు నన్ను విడువకుము అంటున్నాడు.

**10-12వ. శత్రువులు పొంచియున్నప్పుడు ఆశ్రయముగా ఉండవలెనని కోరుట: 10వ.** శత్రువులగు యోవాబు, అబ్యాతారు, అదోనియాతో మాటలాడుచున్నారు. **12వ.** దేవా, నా సహాయమునకు త్వరపడి రమ్మని చెప్పుచున్నాడు.

**13-15వ. ప్రాణ విరోధుల ఎదుట దేవుడు ఆశ్రయముగా ఉండునని నిరీక్షణ: 13వ.** ప్రాణ విరోధులైన యోవాబు, అబ్యాతారు, అదోనియా సిగ్గుపడి నశించి నిందలలో పాలుపొందుదురు గాక. **14-15వ.** నీతిని, నిరీక్షణను నా నోరు దినమెల్ల వివరించి, ఎల్లప్పుడు నిరీక్షణతో మరి యెక్కువగా నిన్ను కీర్తింతునని అంటున్నాడు.

**16-18వ. దేవుని బలమైన కార్యములను వర్ణింపవలెనని ఆశించుట:** బాల్యము నుండి నీవు నాకు బోధించగా దేవుడు జరిగించిన ఆశ్చర్యకార్యములు తెలుపుచునే ఉన్నాడు. ఇంకను వర్ణింతును అన్నాడు. నేను నీ శౌర్యమును గూర్చి నేను తెలియజెప్పినట్టు తల నెరసి వృద్ధుడనై యుండువరకు నన్ను విడువకుము అన్నాడు.

**19-21వ. అనేకమైన కఠిన బాధల నుండి నెమ్మది కలుగజేయుమని ప్రార్థన:** దేవుని నీతి మహాకాశమంత ఉన్నతమైనది. గొప్ప కార్యములు చేయుటలో, దేవునితో సాటియైన వాడెవడును లేడు. నీవు మమ్మును బ్రదికించి, లేవనెత్తమని చెప్పుచున్నాడు.

**22-24వ. దేవుడు విమోచించిన ప్రాణము పెదవులతో ఉత్సాహధ్వని చేయుట:** నాకు కీడు చేయజూచువారు సిగ్గుపడియున్నారు కనుక నా దేవా, నేను కూడ నీ సత్యమును బట్టి స్వరమండల వాద్యముతో, సితారాతో, పెదవులతో, నాలుకతో, విమోచించిన ప్రాణముతో, నీ నీతిని వర్ణించుచు నిన్ను గూర్చి ఉత్సాహధ్వని చేయుదును అంటున్నాడు.

## 72వ కీర్తన (4+3+4+4+4 = 19 వ.)

**అంశం : 1వ.** లో, దేవా, రాజునకు నీ న్యాయవిధులను రాజకుమారునికి నీ నీతిని తెలియజేయుము అన్నందున రాజకుమారుడగు సొలొమోను రాజైన సందర్భమున దావీదు చేసిన ప్రార్థన. **7వ.** అతని దినములలో . . . చంద్రుడు లేకపోవు వరకు క్షేమాభివృద్ధి కలుగును అన్నందున ఇది వేయి ఏండ్లకాల విషయములను చూపు కీర్తన. **8వ.** లో భూదిగంతముల వరకు అతడు రాజ్యము చేయును అన్నందున వేయి ఏండ్ల పాలనను గూర్చిన కీర్తన. **19వ.** లో ఆయన మహిమగల నామము నిత్యము స్తుతింపబడును గాక అన్నందున ఇది స్తుతి కీర్తన. కనుక ఇది 1) ప్రార్థన కీర్తన, 2) స్తుతి కీర్తన, 3) మెస్సీయ కీర్తన, సొలొమోను రాజ్యపాలన – క్రీస్తు వేయి ఏండ్ల పాలన, విస్తరణ వివరములు ఇందులో కలవు.

**1-4వ. (క్రీస్తు) రాజ్యము:** రాజగు సొలమోను న్యాయవిధులను దేవుని యొద్ద తెలిసికొని నీతిని బట్టి ప్రజలకు శ్రమనొందిన వారికి న్యాయము తీర్చునట్లు ప్రార్థించుచున్నాడు. బీదలపిల్లలను రక్షించి బాధపెట్టువారిని నలగగొట్టునట్లు చేయుమని ప్రార్థించుచున్నాడు. **3వ.** నీతినిబట్టి పర్వతములు (గవర్నరులు) చిన్న కొండలును (చిన్న న్యాయాధిపతులు) అనగా మానవులందరూ (రాళ్ళు అన్నియు మంటితో చేయబడిన మానవులను సూచించును) ప్రజలకు నెమ్మది పుట్టించువారుగా నుందురు.

**5-7వ. రాజ్య కాలపరిమితి:** సూర్యుడు నిలుచునంతకాలము చంద్రుడు నిలుచునంత కాలము తరములన్నిటను జనులు దేవుని యందు భయభక్తులు కలిగియుండుట క్రీస్తు పాలనను గూర్చిన ప్రవచనము. అతని దినములలో నీతిమంతులు వర్థిల్లుదురు. చంద్రుడు లేకపోవు వరకు క్షేమాభివృద్ధి, విజయము కలుగునని చెప్పుచున్నాడు. **ప్రకటన 21:23.** ఆ పట్టణములో ప్రకాశించుటకై సూర్యుడైనను చంద్రుడైనను దానికక్కరలేదు; దేవుని మహిమయే దానిలో ప్రకాశించుచున్నది. గొఱెపిల్లయే దానికి దీపము.

**8-11వ. వేయి ఏండ్ల రాజ్య విస్తరణ:** సముద్రము నుండి సముద్రము వరకు భూదిగంతముల వరకు అతడు రాజ్యము చేయుట అరణ్యవాసులు అతనికి లోబడుట అతని శత్రువులు మన్ను నాకుట క్రీస్తు పాలనయే. ఏలయనగా సొలొమోను కాలమున లోబడనివారు, శత్రువులు ఉండిరి. రాజులందరు అతనికి నమస్కారము చేసెదరు. అన్యజనులందరు అతని సేవించెదరు. **ప్రకటన 21:24.** ఆ జనములు దాని వెలుగునందు సంచరింతురు. భూరాజులు తమ మహిమను దానిలోనికి తీసికొనివత్తురని చెప్పబడినందున ఇది క్రీస్తు యొక్క నిత్యపాలన.

**12-15వ. వేయి ఏండ్ల రాజ్యపాలన విధము:** దరిద్రులు, నిరాధారులు, బీదలు మొఱ్ఱపెట్టగా అతడు విడిపించును. నిరుపేదలయందు బీదలయందును అతడు కనికరించును. బీదల ప్రాణములను అతడు రక్షించును. సొలొమోను కాలమున ఈలాగు జరిగెను. ప్రభువు కాలమున కూడా జరుగును.

**15వ.** సొలమోను చిరంజీవి కాదు, క్రీస్తు చిరంజీవి యగును. షేబ బంగారము అతనికి ఇయ్యబడును. సొలొమోనుకు ఇవ్వబడినది అతని క్షేమమునకై జనులు ప్రార్థన చేయుదురు. దినమంతయు అతని పొగడుదురు.

**16-19వ. ప్రకృతిలో మార్పు - రాజ్య మహిమ: 16-17వ.** దేశములోను పర్వత శిఖరముల మీదను సస్య సమృద్ధి, లెబానోను వృక్షముల వలె తాండవమాడుచుండును. నేలమీది పచ్చిక వలె పట్టణస్థులు తేజరిల్లుదురు. సమృద్ధియైన ఆహార పదార్థములు అన్యజనులందరును అతడు ధన్యుడని చెప్పుకొందురు.

**18-19వ.** దేవుడైన యెహోవా ఇశ్రాయేలు యొక్క దేవుడు స్తుతింపబడును గాక. ఆయన మాత్రమే ఆశ్చర్య కార్యములు చేయువాడు. ఆయన మహిమగల నామము నిత్యము స్తుతింపబడును గాక. సర్వ భూమియు ఆయన మహిమతో నిండియుండును గాక. ఆమేన్, ఆమేన్. యెష్షయి కుమారుడగు దావీదు ప్రార్థనలు ముగిసెను.

❁ ❁ ❁ ❁ ❁

## మా ప్రచురణలు

**1.** సువార్తల గ్రంథముల పరిచయము
**2.** సౌలు పత్రికల పరిచయము (అపొ.కా. నుండి హెబ్రీ)
**3.** సార్వత్రిక పత్రికల పరిచయము (యాకోబు నుండి యూదా)
**4.** ప్రకటన గ్రంథ పరిచయము

పాత నిబంధన గ్రంథములు

**5.** రూతు గ్రంథ పరిచయము
**6.** కీర్తనల గ్రంథ పరిచయము (మొదటి భాగము)
**7.** ప్రసంగి గ్రంథ పరిచయము
**8.** పరమగీత గ్రంథ పరిచయము
**9.** యెషయా గ్రంథ పరిచయము
**10.** యిర్మీయా గ్రంథ పరిచయము
**11.** యెహెజ్కేలు గ్రంథ పరిచయము
**12.** దానియేలు గ్రంథ పరిచయము
**13.** ప్రవక్తల చిన్న గ్రంథముల పరిచయము
**14.** పాత నిబంధన గ్రంథముల పరిచయము
**15.** సంఘ చరిత్ర
**16.** ఇశ్రాయేలు దేశము
**17.** విశ్వాసపరులగు సైలస్ ఫాక్స్, జార్జి ముల్లర్, హన్లిబర్డ్, అగ్రిప్ప
**18.** క్రొత్త నిబంధన యందలి పత్రికలలో పరిశుద్ధాత్మని ప్రస్తావన
**19.** గాస్పల్ అసెంబ్లీ, అనంతపూర్ సంఘ చరిత్ర
**20.** రూతు గ్రంథ ధ్యానము (కెజియా కుమారి)
**21.** ఎస్తేర గ్రంథ ధ్యానము (కెజియా కుమారి)
**22.** ప్రభువు – పరిశుద్ధ స్త్రీలు (కెజియా కుమారి)
**23.** ప్రభువు – పరిశుద్ధ స్త్రీలు – రెండవభాగము (కెజియా కుమారి)

గమనిక : మా web site: www.telugubiblestudy.in